కేన్వా టు కేన్వా


ఆరి సీతారామయ్య

కథలు



కేన్యా టు కేన్యా

ఆరి సీతారామయ్య కథలు



రచయిత పరిచయం

ఆరి సీతారామయ్య ప్రకాశం జిల్లా తిమ్మనపాలెంలో జన్మించారు.


ఒంగోలు శర్మా కాలేజి, చీరాల విఆర్ఎస్ & వైఆర్ఎన్ కాలేజీల్లో చదువుకున్నారు.

లక్నో యూనివర్సిటీలో పిహెచ్.డి. చేశారు.

అనంతరం జర్మనీలో, ఫ్రాన్స్‌లో, అమెరికాలో ఉన్నతవిద్య నభ్యసించారు.

ప్రస్తుతం మిషిగన్ రాష్ట్రంలో ఓక్‌లాండ్ యూనివర్సిటీలో బయో మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

2005లో 'గట్టు తెగిన చెరువు' కథాసంకలనం, ఇప్పుడు (2015) 'కేన్యా టు కేన్యా' కథాసంకలనం వెలువరించారు. ఓల్గాగారి నవల స్వేచ్ఛ, కథాసంకలనం 'రాజకీయ కథలు', చంద్రలతగారి కథ 'ఆవర్జా' ఆంగ్లంలోకి అనువదించారు.



కేన్వ్యా టు కేన్వ్యా

ఆరి సీతారామయ్య

కథలు

KENYA TO KENYA

Short Stories by
ARI SITARAMAYYA

© *The Author*

First Publication: August, 2015

Cover Painting
K. Prakash

Cover Designing
Sita, Akshara Creators

Published by
Detroit Telugu Literary Club
Maddipati Krishnarao (kmaddipati@gmail.com)
Ari Sitaramayya (ari.sitaramayya@gmail.com)
and

Varadhi Rachayitala Sahakaara Vedika
Sunkoji Devendra Chari - 9949118082
G. Venkata Krishna - 8985034894
Manchikanti - 9949535695

Copies available at
Visalandhra Publishing House, Vijayawada and its Branches in Andhra Pradesh; **Navachetana Publishing House,** Hyderabad and its Branches in Telangana; **Navodaya Publishers,** Eluru Road, Vijayawada; **Navodaya Book House,** Kachiguda, Hyderabad; **Prajashakti Book House,** Hyderabad and its branches in Andhra Pradesh and Telangana; **Prabhava,** Pogathota, Nellore.

e-book: **www.kinige.com**

Composed & Designed at **Akshara Creators**
Mathrusri Apts., Hyderguda, Hyderabad-500029. India
email: sakshara@gmail.com Ph.: 040-2324 4088.

Printed at **Charita Impressions**
Azamabad Industrial Area, Hyderabad, India.
email: charitahyd@yahoo.co.in Ph.: 040-2766 78411

Library of Congress Control Number: 2015942891
ISBN 978-0-9766514-6-8

₹ 75 $ 6.95

శరత్‌చంద్రగారి అమ్మాయి
శేషప్రశ్న నివాసి
కమలకు

కమల

పదేళ్ళక్రితం, అప్పటివరకూ రాసిన కథలను ఒక పుస్తకంగా తీసుకురావాలనే ప్రయత్నంలో, ఆ కథలన్నీ మిత్రులు రెంటాల కల్పనగారికి పంపించాను. చదివి, పుస్తకానికి ఏం పేరు పెడితే బాగుంటుందో తన అభిప్రాయం చెప్పమని అడిగాను. *గట్టు తెగిన చెరువు* (ఒక కథ శీర్షిక) అని పెడితే బాగుంటుందన్నారు కల్పనగారు.

అయితే ఒక ప్రశ్న కూడా అడిగారు. చాలా కథల్లో కథానాయకి పేరు కమల అనివుంది. ఆ కథలన్నీ ఒకే మనిషి గురించా? లేక ఈ కమలలు వేరు వేరు మనుషులా? ఇదీ కల్పనగారి ప్రశ్న. అప్పటిదాకా నేను ఆ విషయం గమనించలేదు. వెంటనే కథలన్నీ చదివి ఒక్క కథలో తప్ప మిగతా వాటిల్లో అన్నిట్లో కథానాయకి పేరు మార్చేశాను.

మరి నా ప్రయత్నం లేకుండానే నేను గమనించకుండానే కమల పేరు ఆ కథలన్నిట్లోకి ఎలా వచ్చింది?

నేను కమల గురించి మొదటిసారి విన్నది 1960-62 ప్రాంతంలో. మా మామయ్య బి.సి. నారాయణరావుగారు ఆమె గురించి చెప్తుండేవాడు. బురదనీళ్ళల్లో పుట్టినా తల పైకెత్తి ఆకాశం వైపు చూసి నవ్వే పువ్వు కమల. ధైర్యానికీ, ఆత్మ గౌరవానికీ మరో పేరు కమల. మూఢనమ్మకాల బురద కొంచెం కూడా అంటని మనిషి కమల. ఇంకా ఏంటేంటో చెప్పేవాడు ఆయన. అంతా అర్థం కాకపోయినా వింటూ ఉండేవాడిని నేను.

తర్వాత కాలేజీలో డిగ్రీ చదువుతున్న రోజుల్లో నాకు కమలతో పరిచయం అయ్యింది. మా మామయ్యగారు చెప్పింది అక్షరాలా నిజం. ఆమె గురించి ఎలా చెప్పటం. ఎంత చెప్పినా తక్కువే. ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. అందంగా ఉండటమేకాదు, ఆమె ఆలోచనలూ, అభిప్రాయాలూ, ఎంత కష్టంలో ఉన్నా తలెత్తుకు తిరగ్గలిగే ధైర్యం, స్థైర్యం... అలాంటి మనిషిని ఎక్కడా చూడలేదు అనిపించింది.

కాలేజీ... ఉద్యోగం... జీవితం... కమల ఎక్కడ పరిచయం అయిందో గుర్తులేకుండా పోయింది. కమల గురించి మర్చిపోయాను. మర్చిపోయాను అని అనుకున్నాను. కల్పనగారు నా కథల్లో కమలల గురించి చెప్పిందాకా మళ్ళా కమల గురించి ఆలోచించలేదు. అప్పుడు కల్పనగారే చెప్పారు నేను మొట్టమొదట కమలను ఎక్కడ చూశానో.

ఆ తర్వాత కమలను మళ్ళా చాలాసార్లు కలిశాను, కలుస్తూ ఉంటాను. ఆమె అప్పటిలాగే ఉంది. అప్పుడెంత అందంగా, స్వేచ్ఛగా, ధైర్యంగా, నవ్వుతూ ఉండేదో ఇప్పుడూ అలాగే ఉంది. అప్పుడున్న అభిప్రాయాలు ఇప్పుడూ ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని ఇక్కడ చెప్తాను.

కమలను ఒకతను మోసం చేశాడు. శివాలయంలో దండలు మార్చుకుని పెళ్ళిచేసుకున్నాడు. కొన్నాళ్ళ తర్వాత వదిలేసి వెళ్ళిపోయాడు. అతను దుర్మార్గుడు, నిన్ను దుఃఖంలో వదిలేశాడు, క్షణికానందం కోసం నువ్వు మోసపోయావు అని ఎవరైనా అంటే కమల ఒప్పుకోదు. వెళ్ళి పోయిన భర్తను ఒక్క మాట కూడా అనదు. సుఖమూ, దుఃఖమూ రెండూ స్థిరమైనవి కాదు, వాటి చంచల క్షణాలే సత్యం అంటుంది. కొన్ని పువ్వులు చాలారోజులు ఉంటాయి, కొన్ని తొందరలోనే వాడిపోతాయి. తొందరలో పోయినవి పూలు కాకుండాపోవుకదా అంటుంది? ఆయుఃప్రమాణమే జీవితంలో మహత్తర సత్యం కాదంటుంది.

భార్య పోయిన భర్త ఆమె జ్ఞాపకాన్ని పోషించుకుంటూ వర్తమానం కన్నా గతమే స్థిరం అనుకొని జీవితం గడపటంలో పెద్ద ఆదర్శం ఏదీ లేదంటుంది. అలాగే వితంతువుల జీవితాల్లో పవిత్రత ఏమీ లేదంటుంది. భర్త చనిపోయిన తర్వాత అతని స్మృతిలోనే విధవ జీవితం పవిత్రం అవుతుందనే అభిప్రాయాన్ని తీసిపారేస్తుంది కమల. పెద్ద పేరు పెట్టినంత మాత్రానా, పవిత్రత ఆపాదించినంత మాత్రానా లోకంలో ఏదీ మహత్తరం కాదు అంటుంది.

మన ఆచారాలు చాలా ప్రాచీనమైనవి, వాటిని అవమానించటం మంచిదికాదు అన్న వాదనకు సమాధానంగా, ప్రాచీనమైనంత మాత్రాన ప్రతిదీ పూజనీయం కాదు, ప్రాచీనమైనదంతా స్వతఃసిద్ధంగా మంచిదీ కాదు అంటుంది కమల.

కమల గురించి ఇంకా చాలా చెప్పాలనిపిస్తుంది. కాని నా చాలీచాలని మాటల్లో ఎందుకూ చెప్పటం. మీరే ఒకసారి ఆమెను కలవండి. ఆమెతో మాట్లాడండి. శరత్‌చంద్ర గారి అమ్మాయి. శేషప్రశ్నలో ఉంటుంది. ఏ పుస్తకాల షాపులోనైనా కనపడుతుంది.

–ఆరి సీతారామయ్య

8 జులై 2015

ఈ కథలను మొదట ప్రచురించిన వివిధ పత్రికల సంపాదకులకు ధన్యవాదాలు.

"ఈయన ఆరి సీతారామయ్య, ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథలు రాస్తుంటాడే," అని ఒకసారి నన్ను పరిచయం చేశాడో మిత్రుడు ఒంగోల్లో. నిజానికి ఈ సంకలనంలో ఉన్న కథల్లో ఎక్కువభాగం మొదట్లో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చినవే. సహృదయంతో నాకు ఎంతో ప్రోత్సాహం అందించిన ఆ పత్రిక సంపాదకులు
వేమన వసంతలక్ష్మి గారికి
నేను ఎంతగానో రుణపడి ఉన్నాను.

ఈ కథలకు పుస్తకరూపం కల్పించిన
అక్షర సీత గారికీ
వాసిరెడ్డి నవీన్ గారికీ
హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ కథలు పత్రికల్లో వచ్చినప్పుడు వాటిని చదివి, స్పందించి, ఉత్తరాలు రాసిన సహృదయులందరికీ వందనాలు.

ఆరి సీతారామయ్య

కథాక్రమం

సుచిత్రాచంద్ర

కారు పార్క్ చేసి గుడివైపుకు నడిచింది సుచిత్ర. పార్కింగ్ లాట్‌లో ఇంకొక్క కారు మాత్రమే ఉంది. అది చంద్రది కాదు. బహుశా పూజారిదై ఉండొచ్చు. గడియారం చూసుకుంది. ఇంకా పదిన్నరకు ఐదు నిముషాలుంది.



గుడి చుట్టూ చాలా ఖాళీస్థలం ఉంది. పార్కింగ్ లాట్ నుంచి గుడికి వెళ్ళే దారికి రెండువైపులా బంతిమొక్కలూ, ఐరిస్లూ, మందారాలూ, ఇంకా ఎన్నో రక రకాల పూలమొక్కలు వేశారు. గుడి కూడా చాలా విశాలంగా, శుభ్రంగా, అందంగా వుంది. లోపలికెళ్ళి విగ్రహాలున్న పెద్ద హాల్లోకి తొంగిచూసింది సుచిత్ర. పూజారి విగ్రహాలను అలంకరిస్తున్నాడులాగుంది. చందూకి ఈరోజు దేవుడి మీద ఎందుకు గుబులు మళ్ళింది? మామూలుగా అయితే అపార్టుమెంటుకొచ్చేవాడు, లేకపోతే ఏదన్నా రెస్టారెంట్ దగ్గర కలుద్దాం అనేవాడు.

పూజారిని గమనిస్తూ అలాగే తలుపు దగ్గర నిలబడింది సుచిత్ర. కొంచెం సేపట్లో చంద్ర వచ్చాడు. ఆలస్యంగా వచ్చినందుకు క్షమాపణలు చెప్పుకున్నాడు. ఇద్దరూ వేదికవైపు నడిచారు. అన్ని విగ్రహాలనూ పరామర్శించినట్లు చూసి, నమస్క రించి, తలవంచి, కళ్లు మూసుకుని అలాగే నిలబడ్డాడు చంద్ర. సుచిత్ర కూడా నమస్కారం చేసి, చంద్రను చూస్తూ నిలబడింది. రెండు మూడు నిముషాల తర్వాత చంద్ర ప్రార్థన పూర్తయింది. ఇద్దరూ గుడిలోంచి బయటకొచ్చేశారు.

‘‘ఎందుకూ నీకీరోజు దేవుడి మీద ఇంత భక్తి?’’

‘‘ఏమో. కాస్త పైవాడి హెల్ప్ ఉంటే బావుంటుందనిపించింది. అంతే.’’

‘‘పైవాడి హెల్ప్ కావాల్సినంత అవసరమేమొచ్చింది? మీ వూళ్ళో అంతా బాగున్నారా?’’

‘‘ఊళ్ళో అందరూ బాగానే ఉన్నారు.’’

‘‘మరి?’’

‘‘చెప్తానుగా రా. నువ్వెప్పుడూ ఈ గుడికి రాలేదు కదూ?’’

‘‘లేదు.’’

‘రెండు మూడేళ్ళ క్రితం నేనొకసారొచ్చాను. గుడికి ఆ వైపుగా ఒక చిన్న వాగుంది. దాని దగ్గరకు దిగిపోవటానికి దోవుంది, అక్కడక్కడా చెక్క మెట్లున్నాయి. చాలా బాగుంటుంది. అటువైపు వెళ్ళి కూర్చుందాం రా.’’

ఇద్దరూ అటు నడిచారు. వాగు దగ్గరకు చేరేసరికి దాదాపు పది నిముషాలు పట్టింది. వాగు చిన్నదే. ఎత్తు పల్లాల ప్రదేశం కాబట్టి దూకుతున్న నీళ్ళ శబ్దంతో, చుట్టుపక్కలున్న రకరకాల అడవిపూలతో ఆ ప్రదేశమంతా చాలా అందంగా వుంది.

నీళ్ళకు కొంచెం దూరంగా చెక్కమెట్ల మీద కూర్చున్నారిద్దరూ. కింది మెట్టు మీద కూర్చుని ఆమె వైపే చూస్తూ, ‘‘సుచీ, నువ్వు చాలా అందంగా ఉన్నావు,’’ అన్నాడు చంద్రా.

"బాగానే ఉంది. ఈ మాట చెప్పటానికేనా నన్నింత దూరం తీసుకొచ్చావు?"

"నిజంగా సుచీ, తెల్లటి కాటన్ చీర కట్టుకుని, తల విరబోసుకుని నువ్విలా కూర్చుంటే, అచ్చం ఏదో దేవకన్యను చూస్తున్నట్లుంది."

"ఆహా! ఏంటీ సంగతీ? పొద్దుటే బటర్ రాసేస్తున్నావు. తొందరగా విషయం ఏంటో చెప్పు. చంపెయ్యకు."

చంద్ర లేచి అటూ ఇటూ చూసి, వెళ్ళి రెండు గడ్డిపూలు తెంచుకొచ్చాడు. సుచిత్ర ముందు ఒక మోకాలి మీద వంగి నిలబడి, పూలు ఆమె చేతికిచ్చాడు. సూటిగా కళ్ళలోకి చూశాడు.

"ఏంటీ, నేన్నీకు ఇంత చీప్‌గా కనిపిస్తున్నానా? రెండు గడ్డిపూలకే లొంగిపోతాననుకున్నావా?"

"కాదులే సుచీ, ఎక్కడో ఒకచోట మొదలుపెట్టాలి కదా? ఇవి పని చెయ్యక పోతే నా దగ్గిర ఇంకా పెద్ద మంత్రాలున్నాయ్."

"నిజంగానా! నాకేం అర్థంకావటం లేదు. కొత్తగా ఈ దేవుడికి నమస్కారాలు చెయ్యటం ఏంటీ? ఈ గడ్డిపూల పూజలేంటీ? అసలు విషయం ఏంటీ? ఏమడిగావు దేవుణ్ణి? చాలాసేపు మాట్లాడినట్లున్నావ్?"

"అరే దేవుడా, ఈరోజు నేను సుచీని ఏమడిగినా వెంటనే ఒప్పుకునేటట్లు చెయ్యరా బాబూ అని అడిగాను."

"ఏం కావాలి నీకీరోజు? ఏమడుగుతావు?" తన మోకాళ్ళ మీద తల ఆనించి కూర్చుని తనవైపే చూస్తున్న చంద్రాని దగ్గరకు తీసుకుని ముద్దుగా జుట్టు చెరిపేసింది సుచిత్ర.

జేబులోంచి భద్రంగా దాచిన ఎర్రగులాబీని తీసి సుచిత్ర చేతికిచ్చాడు చంద్ర.

"సుచీ, నువ్వంటే నాకు చాలా ఇష్టం."

చంద్రాకు నుదిటిమీద ముద్దుపెట్టింది సుచిత్ర. "తెలుసు. నువ్వూ నాకిష్టమే. ఏమయింది నీకీరోజు? సాయంత్రం వాడే మంత్రాలన్నీ పొద్దుటే వాడేస్తున్నావు?"

"సుచీ," ఆమె ఒడిలో తలపెట్టుకుని నేరుగా కళ్ళలోకి చూస్తూ అడిగాడు చంద్రా, "మనం పెళ్ళి చేసుకుందాం."

"ఇప్పుడెందుకూ మనకు పెళ్ళి? పెళ్ళి చేసుకుంటే నీకేం ఒరుగుతుందీ?"

"ఇద్దరం ఒకే అపార్టుమెంట్లో ఉండొచ్చుగదా?"

"అంటే, నన్ను సాయంత్రం చూట్టం చాలటం లేదన్నమాట. ఉదయం స్నానం చెయ్యకముందు నేను భయంకర స్వరూపంలో ఉంటానే, అప్పుడు కూడా చూడాలనిపిస్తుందన్నమాట?"

"ఎన్నిసార్లు చూడ్లేదూ నిన్ను పొద్దుటే? నువ్వెప్పుడూ అందంగానే ఉంటావు."

"నిజమంటనా! నీ అబద్ధాలంటే నాకెంతిష్టమో!" అని ముక్కు పట్టుకుని ఆడించి, లేతగా పెదాల మీద ముద్దుపెట్టుకుంది సుచిత్ర.

ఒక్కక్షణం ఆగి, "ఏమంటావు మరి?" అడిగాడు చంద్ర.

"ఏమనాలి?"

"నిన్ను చేసుకుంటాను, నువ్వు లేకుండా బతకలేను, అను."

"మరీ అంత ఆశా? ఈ డైలాగులెక్కడ నేర్చుకున్నావు? ఈమధ్య వీడియోలు చూడటం ఎక్కువయిందా బుజ్జీ," అంది సుచిత్ర అతని బుగ్గలు సాగదీస్తూ.

"నీకంతా తమాషానే. రెండు నిముషాలసేపైనా సీరియస్‌గా మాట్లాళ్ళేవా?"

"సరే ఉండు. సీరియస్‌గా అయిపోతాను. ఓకే. రెడీ. ఇప్పుడు అడుగు. ఏంటీ కథ?"

"నిన్ను చేసుకుంటాను, నువ్వు లేకుండా బతక లేను, అను."

"అబద్ధాలు చెప్పటం నాకిష్టం లేదు. నీకు తెలుసుకదా?"

"ఏదీ అబద్ధం?"

"నువ్వు లేకుండా బతకలేకపోవటం. శుభ్రంగా బతగ్గలను. తిండి లేకుండా బతకలేను గాని, నువ్వు లేకపోతే ఏం?"

"అంటే? నేను లేకపోతే నీకేం అనిపించదా?"

"ఎందుకనిపించదూ? నువ్వు లేకపోతే సాయంత్రాలెలా గడుస్తాయి నాకు? బాల్కనీలో చేరి, నా ఒళ్ళో తలపెట్టుకోని, నక్షత్రాలు లెక్కపెడుతూ, గంటల తరబడి అర్థం పర్థం లేని పిచ్చికబుర్లు చెప్పేవాళ్ళింకెవరున్నారు నాకు?" అంది సుచిత్ర అతని పెదాల మీద వేలితో రాస్తూ.

"మరి చెప్పరాదూ చేసుకుంటానని?"

"సరే. చేసుకుంటాను. కానీ ఇప్పుడేం తొందరొచ్చింది నీకూ? అసలు విషయం ఏంటో చెప్పరాదూ?"

"పోయిన వారం చెప్పాను గదా, మా పెద్దక్కయ్యగారి అమ్మాయికి పెళ్ళి సంబంధం కుదిరింది. నేను పెళ్ళికెళ్ళాలి. మా అమ్మతో మాట్లాడాను మొన్న. నాక్కూడా సంబంధాలు చూస్తున్నారట. పాతిక లక్షలిస్తామని వస్తున్నారట. ఏమంటావు? చేసుకోమంటావా?"

“ఇక్కడ నన్ను చేసుకోమని బతిమాలుతూ, అక్కడింకొకమ్మాయితో బేరం చేస్తున్నావా? స్కౌండ్రల్!” ఒడిలోంచి అతని తలను నెట్టేసింది సుచిత్ర.

“లేదులేమ్మా. నీతోటే వేగలేకపోతుంటే ఇంకొకామెతో ఎక్కడ చస్తాను! నువ్వు ఊ అంటే అక్కడ వాళ్ళ బాధ తప్పుతుంది.”

“ఏం చెప్తావు వాళ్ళకి?”

“ఇక్కడొకమ్మాయుంది. ఆ అమ్మాయినే చేసుకుంటాను. మీరు సంబంధాలు చూడనవసరం లేదు, అని చెప్తాను.”

“ఆ మాట ఇప్పుడు కూడా చెప్పొచ్చుగా?”

“చివరకు నువ్వు కాదంటే?”

“ఎందుక్కాదంటాను?”

“అంటే! ఒప్పుకున్నట్టేనా! నిజంగా?” ఆశగా కళ్ళల్లోకి చూశాడు చంద్ర.

తలూపింది సుచిత్ర.

“ఎప్పుడు చేసుకుందాం?”

“ఇప్పుడెందుకంట అంత తొందర?”

“మా తమ్ముడిక్కూడా సంబంధాలొస్తున్నాయట. వాడికి వెంటనే చేసుకోవాలని ఉందిట. నాకు ముందు అయితేగదా వాడికి సంబంధం నిర్ణయించటం? అందువల్ల వాళ్ళు తొందరపడుతున్నారు.”

దూరంగా చూస్తూ మౌనంగా ఉండిపోయింది సుచిత్ర.

“సుచీ, నేనంటే నిజంగా ఇష్టంలేదా? లేక నామీద నమ్మకం లేదా?” మరెలా అడగాలో తెలియలేదు చంద్రానికి.

“నువ్వంటే చాలా ఇష్టం చందూ. నమ్మకం గురించి నేను ఆలోచించను. నాకు ఈ రోజంటేనే ఇష్టం. రేపటి గురించి నమ్మకం ఉంటే ఎంత లేకపోతే ఎంత? రేపేం జరుగుతుందో ఎవరికి తెలుసు?”

“నాకు నమ్మకం ఉంది సుచీ. మనిద్దరం ఎప్పుడూ ఇలాగే కలిసుంటాం.”

“నిజమంటనా?” అతని నుదిటి మీద ముద్దుపెట్టింది సుచిత్ర.

“అవును.” జేబులోంచి ఒక చిన్న బులుగురంగు డబ్బా తీశాడు చంద్ర. దాన్ని తెరిచి, అందులోంచి ఒక సన్నటి బంగారు ఉంగరాన్ని మునివేళ్ళతో పైకి తీసి సుచిత్ర ఎడంచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. మృదువుగా ఆమె రెండో వేలికి ఉంగరం తొడిగాడు. చూస్తూ ఉండిపోయింది సుచిత్ర.

ఉంగరాన్ని తిప్పుతూ, అతణ్ణి దగ్గిరకు తీసుకుని పెదాల మీద ముద్దు పెట్టింది.

"మా కుటుంబం గురించి నీకు నేను ఎక్కువగా చెప్పలేదు. ఇప్పుడు చెప్తే వింటావా?" అడిగింది ఆమె.

"చెప్పు."

"నాకు ఇద్దరు అక్కలు, అందరికంటే పెద్దవాడు అన్నయ్య. మా అమ్మా నాన్నా ఇద్దరూ రిటైరయ్యారు. ఇప్పుడు ఫ్లోరిడాలో ఉంటున్నారని నీకు చాలాసార్లు చెప్పాను."

"అవును."

"నేను మా అమ్మానాన్నలకు ఆలస్యంగా పుట్టాను. నేను పుట్టేసరికే మా చిన్నక్కకు పదిహేనేళ్ళు. నేను ఏక్సిడెంటునని అమ్మానాన్నా అనేవాళ్ళు. అయినా ఇంట్లో అందరికంటే చిన్నదాన్ని కావటం వల్ల అందరూ నన్ను చాలా గారాబంగా పెంచారు.

"మంచి ఉద్యోగం వదిలేసి అమెరికా వచ్చే అవకాశం దొరికిందని నాన్న మమ్మల్నందర్నీ ఇక్కడకు తీసుకొచ్చాడు. అమ్మానాన్నా చాలా కష్టాలు పడ్డారు. ఇప్పుడు రిటైరయి ఫ్లోరిడాలో ఉంటున్నారుగాని అమ్మ ఇంకా ఏదో చిన్న ఉద్యోగం చేస్తూనే ఉంటుంది, డబ్బుకోసం. నాన్న ఆరోగ్యం అంతంత మాత్రమే. ఆయన గుండెజబ్బు మనిషి. వింటున్నావా?"

"వింటున్నాను. చెప్పు."

"అమ్మానాన్నల బాధ్యత నాది. ఈ వయసులో వాళ్ళు ఇక్కడ చలి ప్రాంతంలో నాతో ఉండలేరు. అవసరం అయినరోజు నేనే వాళ్ళ దగ్గరకు పోవాల్సొస్తుంది."

"అంటే?"

"అంటే, వాళ్ళను దగ్గరుండి చూసుకోవాల్సిన సమయం వచ్చినప్పుడు నాకు ఇక్కడ నుంచి పోవాల్సొస్తుంది."

"ఇలా వయసు మళ్లిన వాళ్ళను చూసుకోవటానికి రిటైరుమెంట్ హోమ్స్ వున్నయ్యిగదా? వాటిలో ఉండొచ్చు కదా?"

"వాళ్ళనలా ఉంచటం నాకిష్టం లేదు."

"మరి మీ అన్నయ్య ఫ్లోరిడాలోనే ఉంటాడని నువ్వు చెప్పినట్లు గుర్తు. అతను చూసుకోలేడా?"

"మా అన్నయ్య ఒక తెల్లమ్మాయిని చేసుకున్నాడు. అప్పుడు అమ్మానాన్నా పెళ్ళికి వ్యతిరేకించారు. అన్నయ్యకు ఆ అమ్మాయంటే చాలా ఇష్టం, చేసుకున్నాడు. అప్పటినుంచీ వాడికీ అమ్మానాన్నలకూ సంబంధం లేదు."

"మరి నువ్వు మాట్లాడుతూనే ఉంటావుగా?"

“అవును. అన్నయ్యకీ వదినకీ నేనంటే ఇష్టమే.”

“మరి మీ అక్కయ్యలూ?”

“పెద్దక్కయ్య కూడా ఒక అమెరికన్నే చేసుకుంది. దానికొక కొడుకు. పదేళ్ళ వాడు. బావ కార్ యాక్సిడెంట్లో చనిపోయాడు. అక్కకు పెద్ద చదువూ లేదూ, మనఃస్థిమితమూ లేదు. దాన్ని కూడా ఏదోవిధంగా నేనే సపోర్ట్ చెయ్యాలి.”

చంద్ర మౌనంగా ఉండిపోయాడు.

“మా చిన్నక్క గురించి చెప్పనా?”

“చెప్పు.”

“చిన్నక్క క్రైస్లర్ కంపెనీలో పనిచేసే ఒక తెలుగతన్నే చేసుకుంది. అతను చాలా మంచివాడు. వాళ్ళిద్దరూ సుఖంగానే ఉంటున్నారు. కొన్నాళ్ళు జర్మనీలో కొన్నాళ్ళు ఇక్కడ డిట్రాయట్‌లో ఉంటారు. అక్కకు అమ్మానాన్నలను చూసుకోవటం వీలుకాదు. అవసరం అయితే ఆర్థికంగా సహాయం చెయ్యగలదు.”

దూరంగా వాగువంక చుస్తూ ఉండిపోయాడు చంద్రా. సుచిత్ర కూడా అలాగే చాలాసేపు మౌనంగా ఉండిపోయింది.

“చందూ, ఏంటీ ఆలోచిస్తున్నావు? ఉంగరం తీసి ఇవ్వనా? నేనేం అనుకోన్లే.”

ఆమెవైపు తిరిగి ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు చంద్రా. “నీకు స్వయంగా ఏమీ కోరికల్లేవా? నీ బాధ్యతలెటు తీసుకెళ్తే అటు వెళ్ళటమేగాని, నాకు చందూ కావాలి, అతనికోసం నేను ఇది చెయ్యగలను, అది వదిలెయ్యగలను అని అనుకోవా?”

“అమ్మానాన్నలను వదిలెయ్యమంటావా? నీకోసం?”

“అంటే? నాకంటే మంచివాడికోసం అయితే వదిలేస్తావా?”

“ఛా! అలా కాదు చందూ,” అతని చేతులు తన చేతుల్లోకి తీసుకుంది సుచిత్ర. “నా ఉద్దేశం అదికాదు. నీకంటే మంచి వాడెక్కడుంటాడు? నువ్వంటే నాకెంతిష్టమో నీకు తెలియదా? కానీ బాధ్యతల్నేంచెయ్యమంటావు? అందుకే నాకు పెళ్ళి చేసుకోవటం అంటే అంత ఇష్టం లేదు.”

చంద్ర తల వంచుకుని ఆలోచిస్తూ ఉండిపోయాడు.

“చందూ, ఓ మాట అడగనా?”

“అడుగు.”

“ఈ బాధ్యతలు నీవైతే వీటి గురించి నువ్వు నాకు చెప్పేవాడివా? అసలు చెప్పాల్సిన అవసరం ఉందని నీకు అనిపించేదా?”

"చెప్పేవాడిని కాదేమో? మగవాళ్ళకి బాధ్యతలుండటం సహజమేగా?" అన్నాడు చంద్ర సాలోచనగా.

"ఓ పని చెయ్యి చందూ. మీ ఊరెళ్ళి ఓ మంచి అమ్మాయిని పెళ్ళిచేసుకుని తీసుకొచ్చుకో. ఆమె నిన్ను బాగా చూసుకుంటుంది. నీకు వండి పెడుతుంది. ఇల్లు చూసుకుంటుంది. పిల్లల్ని కంటుంది. నిన్ను సుఖపెడుతుంది. పైగా పాతిక లక్షలు కూడా తెస్తుంది. నాతో ఇబ్బందిపడటం ఎందుకూ? నేను నీకు ఏమీ ఇచ్చుకోలేను. మహా అయితే ఎప్పుడన్నా ఒక సినిమా టిక్కెట్టు కొనిపెడతానేమో!"

"అలా అనకు సుచీ. నన్నంత తొందరగా వదిలించుకోవటానికి ప్రయత్నం చెయ్యొద్దు. పెళ్ళయింతర్వాత కూడా ఆడవాళ్ళు పుట్టింటి బాధ్యతలు తీసుకోవడం నాకు కొత్తగా ఉన్నమాట నిజమే. నీ పరిస్థితి అర్థం చేసుకోవడానికే ప్రయత్నం చేస్తున్నాను... నాకు నువ్వు కావాలి. నువ్వు కావాలిగానీ నీ బాధ్యతల్తో నాకేం సంబంధం లేదు అనేటంత మూర్ఖుణ్ణి కాను. నువ్వు లేని జీవితం నేనసలు ఊహించుకోలేను. నన్ను నీతోనే ఉండనివ్వు."

చంద్ర నుదిటి మీద ముద్దుపెట్టింది సుచిత్ర. అతన్ని దగ్గిరకు తీసుకుంది.

"సుచీ, ఏం చేసినా కలిసేచేద్దాం. అవసరం అయినరోజు ఇద్దరం ఫ్లోరిడా వెళ్దాం."

"సరేకానీ చందూ, నువ్వు నాకోసం ఎప్పుడూ ఎలాంటి త్యాగాలూ చెయ్యాల్సిన అవసరం రాదు. నాతో ఉండటం కష్టం అనిపించిన రోజు... నీ దోవన నువ్వు పోవచ్చు." సుచిత్ర గొంతు వొణికింది. "నేనేమీ బలవంతం చెయ్యను."

ఆమె మోకాళ్ళ మీద తల ఆనించి కళ్ళలోకి దీర్ఘంగా చూశాడు చంద్ర. ఇంత నిర్మలమైన మనిషిని పోగొట్టుకుంటాడా? పైకి ఇంత చలాకీగా హుషారుగా ఉంటూ, నవ్వుతూ నవ్విస్తూ ఉండే మనిషిలో ఎంత ఒంటరితనం! తను అర్థం చేసుకుంటాడో లేదోనన్న భయం, బాధ. కానీ ఆ బాధను వెలిబుచ్చటానికి అడ్డొచ్చే ఆత్మ గౌరవం.

జేబులోంచి మరో బులుగురంగు డబ్బా తీసి, సుచిత్రకిచ్చి, తన ఎడంచేతిని ఆమె చేతిలో ఉంచాడు చంద్ర.

2

గంట మోగింది. తలుపు తీశాడు చంద్ర.

ముఖం నిండా నవ్వుతో, చేతిలో పూలతో ప్రత్యక్షమయింది సుచిత్ర.

"వారంరోజుల తర్వాత జ్ఞాపకమొచ్చానన్నమాట," అడిగాడు చంద్ర కోపం నటిస్తూ.

"సారీ చందూ," అని ఏదో బుజ్జగిస్తూ చెప్పబోయి, "లోపలికి రా, కూర్చో, మంచినీళ్ళు ఇవ్వనా? కాఫీ తాగుతావా? ఇలాంటి మర్యాదలేవీ నేర్పలేదా నీకు మీ వూళ్ళో? ఎలా బతుకుతానో ఏమో ఈ మోటుమనిషితో! ఏ వూరన్నావు మీది? కోతిపాలెమా? తిమ్మనపాలెమా?" అంది సుచిత్ర గడ్డం మీద వేలు పెట్టుకొని, ఆలోచిస్తున్నట్లు నటిస్తూ.

"లోపలికి దయచెయ్, మర్యాదలన్నీ చేస్తాను," అని తలుపు పూర్తిగా తెరిచి, చెయ్యిచాచి లోపలికి దారి చూపించాడు చంద్ర.

లోపలికొచ్చింది సుచిత్ర. చేతిలో పూలు చంద్రకిచ్చింది. అతడు వాటిని డైనింగ్ టేబుల్ మీద పెట్టి, క్లోజెట్లోంచి ఒక వేజ్ తీసి, సింక్ దగ్గరకెళ్ళి దాంట్లో నీళ్ళు నింపుతుండగా వెనగ్గా వెళ్ళి అతని చుట్టూ చేతులు బిగించి వీపుమీద తల ఆనించి, "సారీ చందూ, ఈ వారం అంతా ఎంత బిజీగా ఉందో చెప్తే నువ్వు నమ్మవు. మిడ్‌టర్మ్స్ కదా, రెండు క్లాసులకు పరీక్షలు పెట్టటం, పేపర్లు దిద్దటం, అస్సలు ఒక్క నిముషం కూడా తీరిక లేకుండా ఉండింది. నాకు మాత్రం నిన్ను చూడాలని లేదా? కానీ అస్సలు వీలుకాలేదు. సారీ చందూ," అంది సుచిత్ర దీనంగా.

"సరేలే," అన్నాడు చంద్ర సమాధానం అంగీకరిస్తున్నట్లుగా.

పూలు వేజ్‌లో సర్ది టేబుల్ మీద పెట్టాడు. "థాంక్స్. చాలా బాగున్నయ్."

చంద్ర ముందుకొచ్చి నిలబడి అతని చేతులు తన చుట్టూ తీసుకుంది సుచిత్ర, పూలు చూస్తూ.

"నిజంగా కాఫీ తాగుతావా ఇప్పుడు? డిన్నర్‌కు ముందు కాఫీ తాగితే మళ్ళా తినటం కష్టం గదా?"

"డిన్నర్ కెళ్ళటానికి కనీసం అరగంట పడుతుంది గదా? నాకు మధ్యాన్నం నుంచి తలనొప్పిగా ఉంది చందూ. కాఫీ తాగితే కాస్త తగ్గుతుందేమోనని."

"తలనొప్పి కాదేమో, ఆకలేమో? మధ్యాన్నం ఏమన్నా తిన్నావా? ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్‌లా పస్తున్నావా?"

చంద్ర వైపు తిరిగింది సుచిత్ర. "చందూ, నువ్వు నమ్మవుగాని, ఆ పేపర్లు కరెక్ట్ చేస్తూ ఈరోజు నిజంగానే తినటం మర్చిపోయాను. నువ్వు త్వరగా రెడీగా, మనం రెస్టారెంట్ కెళ్దాం."

"మనం బయటికెళ్ళటం లేదు. నేను కొంచెం పెందలాడే వచ్చాను, వంట చేశాను. ఇక్కడే తిందాం."

“నిజంగా! అంటే బెండకాయ వేపుడు చేసుంటావు! నువ్వెంత మంచివాడివో చందూ,” అంటూ వంట గదిలో గిన్నెల మూతలు తీసి చూసి, “గ్రేట్! బెండకాయ వేపుడూ, స్పినేచ్ పప్పు, ఫాంటాస్టిక్!” అని, చంద్రకి నాలుగు ముద్దులు పెట్టింది సుచిత్ర.

“చాల్లే. అమ్మాయికి బుర్ర ఎప్పుడూ పొట్టలోనే ఉంటుంది! టేబుల్ సెట్ చెయ్యి. తిందాం.”

సుచిత్ర రెండు ప్లేట్లు టేబుల్ మీద పెట్టి, రెండు గ్లాసుల్లో మంచినీళ్ళు పోసి, స్పూన్లూ, నేప్కిన్లూ అరేంజ్ చేసింది. చంద్ర అన్నం, బెండకాయ కూరా, పప్పు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. రిఫ్రెజిరేటర్లోంచి పెరుగు తీసుకొచ్చాడు.

ఓమారు అన్నంతో బెండకాయ కలుపుకుని తిన్నారిద్దరూ. స్పినేచ్ పప్పు బాగుంది అంది సుచిత్ర. మళ్ళీ బెండకాయ కూర వేసుకోబోతుంటే, “అంతా ఒకేసారి తిన్నావంటే తలనొప్పిపోయి కడుపునొప్పి వస్తుంది. మిగిలిందంతా ఒక ప్లాస్టిక్ డబ్బాలో వేసి నీకే ఇస్తాలే, తీసుకుపోదుగానివి,” అన్నాడు చంద్ర నవ్వుతూ. వేసుకోబోతున్న కూరను మళ్ళా గిన్నెలో వేసి, ఈసారి స్పూన్‌తో కొంచెం తీసుకుంటూ, “ఇంత వేసుకుంటే ఫరవాలేదా? ప్లీజ్,” అంది సుచిత్ర.

ఖర్మ అన్నట్లు చూశాడు చంద్ర.

“వండేవాళ్ళకు తినేవాళ్ళను చూస్తే సంతోషం అంటారు. నువ్వేమో నేను తింటున్నప్పుడల్లా తిడతావు,” అంది సుచిత్ర, అలక అభినయిస్తూ.

భోజనం అయింతర్వాత సుచిత్ర ప్లేట్లూ, గిన్నెలూ కడిగింది. చంద్ర టేబుల్ శుభ్రం చేశాడు. ఇద్దరూ లివింగ్ రూంలో కౌచ్ మీద చేరారు. దిండ్లు ఎత్తుగా అమర్చి వాటి మీద చంద్ర వాలితే, చంద్ర మీద వీపు ఆనించి కాళ్ళు చాచుకుని పడుకుంది సుచిత్ర. కొంచెంసేపు టీవీ పెట్టి ఒక్కో చానెల్ మార్చి చూశారు. తర్వాత టీవీని ఏదో చానెల్ మీద వదిలేసి, కబుర్లలోకి దిగారు. కబుర్లలో కాలగమనం మర్చిపోయారు. ఒక ఆవలింత రావటంతో చేతిగడియారం చూసుకుంది సుచిత్ర. పదకొండు గంటలు కావొస్తుంది.

“సుచీ, నువ్విప్పుడు పోవాల్నా? ఈ రోజుండిపోగూడదూ?”

“సారీ చందూ, రేపుదయం ఎనిమిదిన్నరకు ఫేకల్టీ మీటింగుంది. ఇక్కడ నుంచి అపార్ట్‌మెంట్‌కి వెళ్ళి, డ్రెస్ చేసుకోని, అక్కడ నుంచి యూనివర్సిటీకెళ్ళేసరికి ఆలస్యమవుతుంది.”

“ఇక్కడే డ్రెస్ చేసుకొని నేరుగా యూనివర్సిటీకెళ్ళొచ్చుగా? నా క్లోసెట్లో ఒక వైపంతా నీ బట్టలే. ప్లీజ్, ఉండు సుచీ,” సాగదీశాడు చంద్ర.

"ఉండనా?"
"ఊ."
"బతిమాలుతున్నావా?"
"ఊ."
"బతిమాలుతున్నట్టుగా వినపట్టంలేదే నాకు."
"ప్లీజ్ ప్లీజ్ ప్లీజ్ సుచీ, నువ్వు ఎంత మంచిదానివో!"
"సరే అయితే." లేచి, చంద్ర వైపు తిరిగి, అతని కౌగిల్లో ఒదిగిపోయింది సుచిత్ర.

★ ★ ★

నాలుగు నెలల తర్వాత ఓరోజు గంట మోగితే, తలుపు కొంచెం తీసి చూసింది సుచిత్ర.

పెద్ద నవ్వుతో, చేతిలో ఎర్రగులాబీలతో ప్రత్యక్షమయ్యాడు చంద్ర.

ఒక సారి అతన్ని చూసి, వెంటనే కళ్ళు దించేసింది సుచిత్ర. తలుపు పూర్తిగా తెరిచి పక్కకు నిలబడింది.

"ఏమయింది సుచీ? ఎందుకూ అలా ఉన్నావు?" అడిగాడు చంద్ర, లోపలి కొస్తూ.

"ఏమీ కాలేదు."

"మరెందుకలావున్నావు?"

"ఎలా వున్నానూ?"

"ఎప్పుడూ నవ్వుతూ ఉండేదానివి, ఇప్పుడు ముఖం నల్లగా పెట్టుకో నున్నావు. కళ్ళు మెరుస్తూ ఉండేవి, ఇప్పుడేమో ఎర్రగా గాయాల్లాగా ఉన్నయ్. ఏమయింది నీకు? మీ అమ్మానాన్నా."

"బాగానే ఉన్నారు."

"మరేమయిందీ?"

"ఏమీ కాలేదు."

"ఏమీ కాకపోతే నువ్విలా ఎందుకున్నావు?"

"... ... ..."

"చెప్పు సుచీ, చెప్పకపోతే నాకెలా తెలుస్తుందీ?"

"... ... ..."

"నాతో మాట్లాడవా? నావైపు కూడా చూడవా? అసలు కోపం నామీదేనా?"

"... ... ..."

క్లోజెట్‌లోంచి ఒక వేజ్ తీసి, తనే దాంట్లో నీళ్ళు పోసి, రోజాపూలను అందులో అమర్చాడు చంద్ర. టేబుల్ మీద పెట్టాడు.

"ఆరోగ్యం బాగాలేదా సుచీ?"

"బాగానే ఉంది."

"మరేమయింది? ఎందుకిలా ఉన్నావు?"

"నీలాగా దాచిపెట్టటం చేతగాక."

"వావ్! అంటే కోపం నామీదనేనన్నమాట! నేనేం చేశాను? ఏం దాచి పెట్టాను?"

"... ... ..."

"చెప్పకపోతే నాకెలా తెలుస్తుందీ?"

"... ... ..."

"సుచీ, అసలేం జరిగిందీ? నావైపు కూడా చూడవా?"

"... ... ..."

"నేనేం చేసానో చెప్పు."

"... ... ..."

"సరే, నాతో మాట్లాడవు, నా వైపు కూడా చూడవు, నిన్ను ఇబ్బందిపెట్టటం ఎందుకులే, నేను వెళ్తాను మరి."

"... ... ..."

"ప్లీజ్ సుచీ. చెప్పవా?"

"నా విషయాలు నేను చూసుకోగలను. ఈ రోజుండి రేపు పోయేవాడికి నీకు చెప్పటమెందుకూ?"

"అదేంటీ? నేనెక్కడకు పోతున్నాను రేపు?"

"ఏమో. ఎక్కడకుపోతావో నాకేం తెలుసు? పోయిన చోటుకల్లా చెప్పే పోతున్నావా?"

"అదేంటి సుచీ, నాకర్థం కావటంలేదు. నీకు చెప్పకుండా నేనెక్కడికైనా వెళ్ళానా?"

"చికాగోలో ఉద్యోగం చూసుకోవటం లేదా? ఇంటర్వ్యూకెళ్ళలేదా?"

"ఓ..., అదా సంగతి! ఇంటర్వ్యూకెళ్ళాను, నిజమే. కాని వాళ్ళు ఉద్యోగం ఇస్తామని పిలిస్తే మాత్రం నీకు చెప్పకుండా ఏమీ చెయ్యను." సుచిత్ర దగ్గరకొచ్చి, జంకుతూ, ఆమె భుజాల మీద చేతులు వేశాడు.

"... ... ..."

“నిజం సుచీ. చికాగోకైనా, మరోచోటికైనా ఇద్దరం కలిసిపోదాం అంటేనే పోదాం. వాళ్ళెంత మంచి ఉద్యోగం ఇస్తానన్నా నువ్వు లేకుండా నేనెక్కడికీ పోను. ప్రామిస్.”

“మరి చెప్పకుండా అప్లికేషన్ పెట్టటం, దొంగచాటుగా ఇంటర్వ్యూకెళ్ళటం ఎందుకూ?”

ఈ సారి ఆమెను ధైర్యంగా దగ్గిరకు తీసుకుని వీపు నిమిరాడు చంద్ర. “నీకు చాలాసార్లు చెప్పాను సుచీ, మా కంపెనీని జియం వాళ్ళు కొనబోతున్నారని ఒక పుకారుంది. జియం వాళ్ళు కాకపోతే ఇంకొకరు. ఎవరు కొన్నా తప్పకుండా కొన్ని ఉద్యోగాలు పోతాయి. ఎవరివి పోతాయో ఎవ్వరికీ తెలియదు. పోయిందాకా వుండి తర్వాత ఉద్యోగం చూసుకోవచ్చు, లేక ముందే మరోచోట ప్రయత్నం చెయ్యొచ్చు. నేనిక్కడ డిట్రాయిట్లోనేగాదు, ఇంకా చాలాచోట్ల అప్లికేషన్లు పెట్టాను. చికాగో ఇంటర్వ్యూకెళ్ళాను. అలా చెయ్యొద్దు, నాకు ఈ వూళ్ళోనే బాగుంది, ఇక్కడే చూసుకోమంటే అలాగే చేస్తాను. బయట వూళ్ళలో ఎక్కడా అప్లై చెయ్యను.”

“... ... ...”

“నేను ప్రమోషన్ల కోసం, ఎక్కువ డబ్బులకోసం నిన్నొదిలిపెట్టి ఎక్కడకూ వెళ్ళను సుచీ. కానీ ఉద్యోగం పోతే? మరెక్కడికీ వెళ్ళకూడదంటే ఎలా? బతుకు తెరువెలా? నువ్వు తిండి పెడతావా నాకు?”

అవునన్నట్లు పైకీ కిందికీ తల వూపింది సుచిత్ర.

“నీతో ఉండనిస్తావా?”

మొదటిసారిగా తలెత్తి అతని వైపు చూసి, “ఊఁ,” అంది ఆమె.

“అలా అయితే వెంటనే ఉద్యోగం వూడే ప్రయత్నం చేస్తాను,” అన్నాడు చంద్ర నవ్వుతూ.

“ఫ్రీగా ఉండనిస్తానా?” ఆమె ముఖంలో మొదటిసారిగా కొంచెం వెలుతురు కనిపించింది.

“మరి?”

“రోజూ బెండకాయ వేపుడు చేసిపెట్టాలి,” సుచిత్ర కళ్ళల్లో మెరుపు.

“అలాగా!”

“రోజూ సాయంత్రం నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని రెండుగంటలసేపు కబుర్లు చెప్పాలి.”

“అమ్మాయిగారి కోరికలు పెరిగిపోతున్నట్లున్నయ్!”

"మరి నా ఉద్యోగం పోతే నీ అపార్ట్‌మెంట్లో ఉండనిస్తావా?" ఇప్పుడు కొంచెం చిలిపితనం జోడయ్యింది.

"ఫ్రీగానా?" అడిగాడు చంద్రా.

"లేదులే, నేను కూడా పన్లు చేస్తాను."

"ఏం చేస్తావు?"

"బెండకాయ కూర చాలా బాగుంది అంటాను. మీ వూరు కోతిపాలెం అని, అదే, తిమ్మనపాలెం అని, రోజూ గుర్తు చేస్తాను."

"చెయ్యగలవు, నువ్వు చెయ్యలేని పనేముందీ," నెత్తిమీద మొట్టికాయలు వేస్తున్నట్లు నటించాడు చంద్ర. భయపడ్డట్లు అభినయించింది సుచిత్ర. "ఉద్యోగం పోవటమే గాదు, కాళ్ళా వేళ్ళా పడి బతిమాలినాగాని నిన్ను నా అపార్ట్‌మెంట్ వైపు కూడా రానివ్వను. నిన్ను రానిస్తే మొగుణ్ణి కొనక్కొచ్చుకున్నట్లే."

"నిజంగా! నేనంత చెడ్డదాన్నా? మరి ఆరోజు నన్ను పెళ్ళిచేసుకో, ఇద్దరం ఒకే అపార్ట్‌మెంట్లో ఉందాం అని అంతగా బతిమాలావు, ఈ ఉంగరం నా వేలికి తొడిగావు, గుర్తుందా?"

"తప్పయిపోయింది అమ్మాయిగారూ, అప్పుడు బుద్ధిలేక అలా అన్నాను," సుచిత్ర ముక్కుతో ఆడాడు చంద్ర.

మనసారా నవ్విందామె.

"అసలింతకీ నాకు చెప్పకుండా ఇంటర్వ్యూకెందుకెళ్ళావు?"

"చెప్తే ప్రయోజనమేంటి సుచీ? రేపు క్లీవ్‌లాండులో ఇంటర్వ్యూ ఉందని చెప్పాననుకో. అక్కడ నీకవకాశాలుంటయ్యో ఉండవో అని ఆలోచిస్తూ కూర్చుంటావు. వాషింగ్టన్‌లో ఇంటర్వ్యూ అంటే అక్కడి గురించి ఆలోచిస్తావు. ఎందుకొచ్చిన గొడవిదంతా? ఎక్కడన్నా ఉద్యోగం వస్తే, అప్పుడా వూరి గురించి ఆలోచిద్దాం. అప్పటిదాకా నీకీ ఆరాటం ఎందుకులే అని నీకు చెప్పలేదు."

"ఏమో. నువ్వట్లంటున్నావుగాని, నాకు చెప్పకుండా నువ్వు చికాగో ఇంటర్వ్యూ కెళ్ళావని తెలిసినప్పుడు ఎంత బాధేసిందో."

"సారీ సుచీ," ఆమె నుదిటి మీద ముద్దుపెట్టాడు చంద్ర.

"నీకు చెప్పకుండా నేనింకొకూరు ఇంటర్వ్యూకెళ్తే నీకెలా అనిపించేదీ?"

"తన్నాలనిపించేది," అన్నాడు చంద్ర, కోపం నటిస్తూ.

"ఇప్పుడు నాకూ అలాగే అనిపిస్తుంది."

"సరే, ఏం తెచ్చివ్వమంటావూ? పొడుగాటి గరిటె తెచ్చివ్వనా?"

"నువ్వు చేసిన పనికి గరిటెపూజ చాలదు. బడితెపూజ చెయ్యాలి."

"ఓ మైగాడ్!" అన్నాడు చంద్ర, భయం నటిస్తూ.

అతని చొక్కాలో ముఖం దాచేసుకుంది సుచిత్ర.

3

"హలో."

"చందూ."

"హాయ్ సుచీ! ఎంత అదృష్టం ఈరోజు!"

"ఏం? ఏమయింది?"

"అమ్మగారికి నేను పొద్దుటే గుర్తుకొచ్చాను. ఇంతకంటే అదృష్టం ఏముంటుంది?"

"అలాగా. ఫరవాలేదే. మాటలు బాగానే నేర్చావే!"

"మరి నీ ప్రియశిష్యుణ్ణి కదా. ఆమాత్రం నేర్చుకోకపోతే గురువుకు చెడ్డ పేరు రాదూ?"

"హూ. అయితే అంత బాగా మాటలు నేర్పిన గురువుకు ఏదైనా గురుదక్షిణ ఇచ్చుకున్నావా?"

"ఏమీ ఇచ్చినట్టు లేదు. సాయంత్రం తీరిగ్గా ఉంటే చెప్పు, డిన్నర్‌కి తీసుకెళ్తాను, సినిమా చూపిస్తాను."

"సాయంత్రందాకా ఎందుకూ. నేనీరోజు డిపార్ట్‌మెంట్ కెళ్ళలేదు. ఒక పేపర్ మీద పనిచేద్దామని ఇంట్లోనే ఉన్నాను. కానీ బండి ముందుకు సాగటంలేదు. రెండు గంటలు కూర్చొని ఒక్క పేజీ మాత్రం రాశాను. నువ్వొస్తావేమో చూద్దామని ఫోన్ చేశాను."

"సారీ సుచీ, ఈరోజు చాలా పనుంది. ఓ పని చెయ్యరాదూ? ఇప్పుడు పన్నెండవుతుంది. ఒంటి గంట ప్రాంతంలో నువ్విక్కడకురా. లంచ్‌కెళ్దాం. ఆ తర్వాత వెళ్ళి నువ్వు నీ పేపర్ మీద పని చేసుకోవచ్చు."

"నువ్వే రారాదూ? నేనేదన్నా చేస్తాను. ఇక్కడే తిందాం."

"సరే. మళ్ళా నువ్వు పని మానుకుని వంట చెయ్యటం ఎందుకులే, నేనే దోవలో ఎక్కడన్నా ఆగి రెండు శాండ్‌విచ్‌లు తీసుకొస్తాను."

"వొద్దులే, నువ్వు రా."

"సరే. ఓ... సుచీ, మర్చిపోయాను. మా ఆఫీసులో కొలీగ్ ఒకతను ఈమధ్య ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకొనొచ్చాడు. ఆ అమ్మాయి ఇప్పుడు వచ్చిందట. పార్టీ ఇస్తున్నాడు. ఆదివారం. రమ్మని పిల్చాడు. వెళ్దామా?"

"వెళ్ళాల్నా?"

''నీకు తీరిగ్గా ఉంటే ఇద్దరం వెళ్దాం, లేకపోతే నేనే కొంచెంసేపు వెళ్ళొస్తాను.''

''మనకి కలిసుండటానికి వీలయ్యేదే ఆ ఒక్క ఆదివారం. ఆరోజు కూడా నువ్వక్కడికీ ఇక్కడికీ వెళ్తానంటావూ,'' విసుగ్గా ఫోన్ పెట్టేసింది సుచిత్ర.

నవ్వుకుంటూ ఒంటిగంటకు పోదామనుకున్న లంచ్‌కి వెంటనే బయల్దేరాడు చంద్రా.

★ ★ ★

ఆదివారం నాడు పార్టీనుంచి తిరిగొస్తున్నారు సుచిత్ర, చంద్ర. సుచిత్ర కారు నడుపుతుంది.

''సుచీ, వాళ్ళ లివింగ్ రూంలో నువ్వొక చిన్న పాపతో ఆడుతుంటే చూశాను.''

''చాలా ముద్దుగా ఉందికదూ పాప!''

''అవును. సుచీ... మనక్కూడా ఒక పాపుంటే బాగుంటుంది కదూ?''

ఒక్క క్షణం రోడ్డు మీద నుంచి చూపు చంద్ర వైపు తిప్పింది సుచిత్ర. ''నేను అనుకుంటున్న మాటే చెప్పావు! ఆ పాపను చూసినప్పటినుంచీ నేనూ అదే ఆలోచిస్తున్నాను. కానీ... చందూ, ఇప్పుడెలా వీలవుతుందీ? ఈ రెండు సంవత్సరాలూ అసలు తీరికుండదు. పేపర్లు రాయాలి. ఆ పుస్తకం కనీసం పబ్లిషర్‌తో కాంట్రాక్ట్ మీద సంతకాలు చేసేవరకైనా రావాలి. లేకపోతే టెన్యూర్ రావటం కష్టం. ఈ నాలుగైదు సంవత్సరాలూ ఇంత కష్టపడి చివర్న అంతా వృథా అయితే ఎట్లా?''

''అవును.''

''పాప కావాలంటే దాన్ని సంతోషంగా పెంచగలిగినప్పుడే కనాలిగాని వీలు కానప్పుడు అయిష్టంగా పెంచటం నాకిష్టం లేదు.''

''నేనున్నాగా సుచీ. బాధ్యతంతా నీమేదే ఎందుకుంటుందీ? నీ పనికి ఎలాంటి ఆటంకం రాకుండా నేను చూసుకుంటాగా.''

''నువ్వు చూసుకుంటావు చందూ, నాకు తెలుసు. అయినా కనేది నేను కదా. పాపను నీకొదిలేసి నేను దూరంగా పన్లు చేసుకుంటూ ఉండలేను కదా? నువ్వెంత సాయం చేసినా ప్రస్తుతం మనం ఓ పాపను పెంచలేం. నాకు వీలయ్యే పనికాదు.''

''నిజమే. టెన్యూర్ వస్తే సరే. మరి రాకపోతేనో?''

''రాదనే భయం నాకు లేదు. తప్పకుండా వస్తుంది, కానీ బాగా కృషి చేస్తేనే గాని రాదు.''

''అంతా సరిగ్గానే చేసినా రాకపోతే?''

“అలా జరిగితే ఉద్యోగం పోతుంది. ఆ తర్వాత నాకే స్థిరత్వం ఉండదు, ఇక పిల్లల్ని కనటం, పెంచటం గురించి ఆలోచించటం ఎందుకూ?”

“మరి నాకు పాప కావాలనిపిస్తే?” సుచిత్ర వైపు చూశాడు చంద్ర.

సుచిత్ర రోడ్డు వైపే చూస్తూ ఉండిపోయింది.

“ఏం చెప్పమంటావూ? నీ అంత మంచివాడు నాకు దొరకటం కష్టంగాని, నాకంటే మంచమ్మాయిలు నీకెంతోమంది దొరుకుతారు. ముద్దు పెట్టుకుని లాక్కెళ్తారు నిన్ను!” అంది సుచిత్ర, ఓ క్షణం చంద్రా వైపు చూస్తూ.

“చెత్త వాగుడు వాగుతావెందుకూ? సీరియస్‌గా మాట్లాడు.”

“సీరియస్‌గానే మాట్లాడుతున్నానోయ్, బుద్ధూ! నిన్ను పొగిడేస్తున్నాను. నువ్వేమో నాతో తగువు పెట్టుకోవాలని చూస్తున్నావూ.”

“నీకు వీలయితే సరే, లేకపోతే మనకొక పాప పుట్టే ప్రసక్తే లేదంటావు.”

“నువ్వలా అడిగితే నేనెంత చెడ్డదాన్నో అనిపిస్తుంది నాకే! కానీ నిజం అదే చందూ. నా కాళ్ళ మీద నేను నిలబడగలిగినప్పుడే మనకు పిల్లలు. నీమీద పూర్తిగా ఆధారపడి తల్లిని కావటం నేను చెయ్యలేని పని. అలా జరగదు.”

“నామీద నీకు నమ్మకం లేదు కదూ?”

“అదేంకాదు. నువ్వంటే నాకు ప్రాణం. నీ అంత మంచివాడు మరొకడుండడు. నీ మంచితనం, సంస్కారం నా అదృష్టం. కానీ రేపేమవుతుందో ఎవరు చూసొచ్చారూ?”

“అంటే... నేను రేపు...”

“చందూ, నువ్వు లేకుండా నేను బతకలేను అని ఒకరికొకరు చెప్పుకున్న వాళ్ళు ఎంతోమంది విడాకులిచ్చుకున్నారు. నీకు నాకంటే ఎక్కువగా ఇష్టమయ్యే అమ్మాయి ఎవరన్నా పరిచయం కావచ్చు. ఏదో ఏక్సిడెంట్ జరగొచ్చు. ఇలాంటివేం జరిగినా పాపను నేను స్వయంగా ఏ లోపం లేకుండా పెంచగలిగిన నాడే నాకు తల్లిని కావటం ఇష్టం.”

“నాతో ఏమీ సంబంధం లేదన్న మాట.”

“ఎందుకూ అలా మాట్లాడతావూ? మనిద్దరికీ ఇష్టం అయితేనేగదా మనకు పిల్లలు పుట్టేదీ?”

“నీ మాటలు వింటుంటే నేను నీకు ఎంత దగ్గిర కావాలని చూసినా, నువ్వు నన్ను కొంచెం దూరంగానే, వేరుగానే ఉంచుతావనిపిస్తుంది.”

“అదేంకాదు. నేను ఉన్నది ఉన్నట్టు చెప్పాను. అది నీకు కష్టం అయింది. అందుకే లేనిపోని అర్థాలు తీస్తున్నావు. నువ్వలా అనుకుంటే నాకు బాధేస్తుంది.

కాని అబద్ధాలు చెప్పటం నాకిష్టం లేదు. నువ్వంటే నాకు చెప్పలేనంత ఇష్టం. గుడ్డిగా నీమీద ఆధారపడి దాన్ని నాశనం చెయ్యను.''

''పూర్తిగా ఆధారపడటం వేరూ, ఏదైనా అవసరం వచ్చినప్పుడు ఒకరికొకరం అండగా ఉండటం వేరూ. నా మీద ఆధారపడి ఉండమని నేనడిగానా?''

''సరే, నీకర్థమయ్యేలా చెప్తాను. మా పెద్దక్క భర్త స్టీవ్ బతికున్న రోజుల్లో వాళ్ళిద్దర్నీ చూట్టానికి రెండు కళ్ళూ చాలవనిపించేది. ఎప్పుడూ ఒకరికొకరు కరుచుకు తిరుగుతుండేవాళ్ళు. అతను ఏక్సిడెంట్లో పోయాడు. దాన్నీ, బాబునీ వదిలేసి పోయాడు. ఇప్పుడు దాని పరిస్థితి ఎలా వుందీ? నా మాటలు నీకెంత కష్టంగా వున్నా, ఏ కారణంగానైనా సరే, అలాంటి పరిస్థితి నాకు రానివ్వను.''

''... ... ...''

''చందూ!''

''ఊఁ...''

''నాకు తెలుసు నీకు కోపంగా ఉందని. రెండు మూడురోజులు ఇలాగే మూతి ముడుచుక్కూర్చుంటావు. నన్నసలు పిలవ్వు. బుధవారం, గురువారం నాటికి నన్ను చూడకుండా ఉండలేవని తెలిసొస్తుంది. అప్పుడు బజారుకెళ్ళి లేత బెండకాయలు కొనుక్కొస్తావు. సుచీ, ఈ రోజేం కూర చేశానో చెప్పుకో, అంటూ ఫోన్ చేస్తావు. అవునా?''

చంద్రని నవ్వించాలనే ప్రయత్నం చేసింది సుచిత్ర.

కిటికీలోంచి దూరంగా చూస్తూ ఉండిపోయాడు చంద్ర.

4

''సుచీ... సుచీ...'' కౌచ్ మీద పడుకుని ఉన్న సుచిత్రను మెల్లిగా భుజం తట్టాడు చంద్ర.

''ఊఁ...''

''ఎనిమిదవుతుంది, నేనాఫీసుకెళ్తున్నాను.''

''ఊఁ...''

''నువ్వు లేచి కూర్చో. మళ్ళా నిద్ర పోయి నేనసలు లేపలేదంటావు.''

సుచిత్ర బద్ధకంగా ఇటు తిరిగి, కళ్ళు తెరుచుకుని, ''గుడ్ మోర్నింగ్!'' అంది.

''గుడ్ మోర్నింగ్! ఎందుకూ ఇక్కడ పడుకున్నావూ? నేను పక్కమీద చోటివ్వ లేదా?'' అడిగాడు చంద్రా.

''అడ్డంగా పడుకున్నావు.''

“సారీ.” సిగ్గుపడ్డాడు చంద్ర.

“ఫరవాలేదులే. అప్పుడప్పుడూ టివీ చూస్తూ ఇక్కడే పడుకుంటాను. నువ్వేంటీ, ఏమన్నా బ్రేక్‌ఫాస్ట్ చేశావా? ఏదన్నా చేసిపెట్టనా?”

“లేదు, తిన్నాను. నువ్వు చాలా అలసిపోయినట్లున్నావు. రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదా?” అడిగాడు చంద్ర.

“బాగానే నిద్రపోయానే.”

“మరెందుకూ అలా వున్నావూ? బాగాలేదా?”

“అబ్బే, అదేంలేదు. బాగానే ఉంది.”

“అయితే రాత్రి చదువుతూ కూర్చునుంటావు మళ్ళా?”

చూపు పక్కకు తిప్పేసింది సుచిత్ర.

“ఎప్పుడు పడుకున్నావూ?”

“నాలుగు నాలుగున్నరయింది,“ అంది సుచిత్ర మెల్లగా, పోయిన వారం ఇలాగే ఆలశ్యంగా నిద్రపోయినందుకు పెట్టిన చివాట్లు గుర్తొచ్చి.

“మరెందుకూ ఇంత పెందలాడే లేపమన్నావూ? ఇంకొంచెంసేపు పడుకో కూడదూ?”

“నువ్వాఫీసుకెళ్ళింతర్వాత మళ్ళా నిద్రపోతాన్లే,” చివాట్లు తప్పినందుకు సంతోషిస్తూ, “నువ్వేంటీ, ప్రతి శనివారం ఆఫీసుకెళ్ళాల్నా?” అడిగింది సుచిత్ర.

“లేదులే, ఇంకా నాలుగైదు వారాలు ఇలాగే ఉంటుంది. తర్వాత అవసరం ఉండదు.”

“సాయంత్రం ఎన్ని గంటలకొస్తావూ?” అడిగింది సుచిత్ర ఆవులిస్తూ.

“నేనీరోజు రాను.”

“ఏం? లేటుగా పనిచెయ్యాల్నా?”

“లేదు.”

“ఎక్కడికైనా వెళ్ళాల్నా?”

“ఉహూ”

“మరి? అమ్మాయెవరన్నా రమ్మని పిలిచిందా?“ సాగదీసింది సుచిత్ర, కొంటెగా.

“అవును. రమ్మని పిలిచింది. రానని చెప్తుంటే బుర్రకెక్కుతున్నట్లు లేదు,” విసుగు ప్రదర్శించటానికి ప్రయత్నించాడు చంద్ర.

“సరే నీ ఇష్టం. రావాలనుంటే రా, ఇష్టం లేకపోతే రాకు,” అటు తిరిగి పడుకుంది సుచిత్ర.

ఆమె పక్కనే కౌచ్ మీద కూర్చుని, భుజం మీద చెయ్యి వేసి, “సుచీ, ఒక మాట చెప్పనా?” అడిగాడు చంద్రా.

“నువ్విలా మొదలు పెట్టినప్పుడల్లా ఒక లెక్చరిస్తావు. నాకిప్పుడు నిద్రొస్తుంది. సాయంత్రం మాట్లాడుకోవచ్చుగా?”

“సాయంత్రం నేను రానని చెప్తున్నా. నువ్వు వినిపించుకోవటంలా.”

“... ... ...”

“సుచీ, ఇటు చూడు.”

ఆతని వైపుకు తిరిగిందామె.

“మనం వేరు వేరు అపార్ట్‌మెంటుల్లో ఎందుకుంటున్నాం?”

“డబ్బులెక్కువగా ఉండీ.”

“ఒక్క నిముషం సీరియస్‌గా మాట్లాడు సుచీ.”

“సరే, ఏంటీ నువ్వడిగేదీ?”

“మనమెందుకు కలిసుండటం లేదు?”

“రోజంతా నిన్ను చూట్టం నాకిష్టంలేక.”

విసుగ్గా కౌచ్‌మీద నుంచి లేవబోయాడు చంద్ర. “ఒద్దులే కూర్చో,” అని అతని చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టింది సుచిత్ర.

“ఎందుకంటే, ఒకే ఇంట్లో ఉంటే అలవాటుపడి మొగుడూపెళ్ళాల్లా మనం ఒకర్నొకరం నిర్లక్ష్యం చేస్తాం. పట్టించు కోవటం మానేస్తాం. నాకది ఇష్టం ఉండదు. నువ్వొచ్చినప్పుడల్లా నాకోసం రావాలి, ఆకలయ్యో, అలసిపోయో కాదు. ఎలా వుంది సమాధానం? పాసయ్యానా ఫెయిలయ్యానా?” అడిగింది సుచిత్ర, నవ్వులాటగా.

“బాగుంది. కాని పోయిన సంవత్సరం మనం కలిసుందామా అని నేనడిగి నప్పుడు నువ్వింకొక మాటగూడా చెప్పావు. గుర్తుందా?”

“ఇప్పుడింత సీరియస్ డిస్కషనెందుకు చందూ? నాకు నిద్రొస్తుంది, ప్లీజ్.”

“పోనీ, నేను గుర్తు చెయ్యనా? ఈ రెండు సంవత్సరాలూ చాలా బిజీగా వుంటాను. కలిసుంటే ఒకరి పనికి ఒకరం అడ్డం వస్తుంటాం. ప్రస్తుతం మనం వేరుగా ఉండటమే మంచిది అన్నావు. అవునా కాదా?”

“అవును.”

“మరి నన్నెందుకు పిల్చావు నిన్న?”

“ఎందుకేముందీ, చూడాలనిపించింది, రమ్మన్నాను.”

“నువ్వు పిల్చావు, నేనొచ్చాను. పదకొండుగంటల్దాకా మనం కబుర్లు చెప్పు కుంటూ కూర్చున్నాము. తర్వాత నేను సుఖంగా నిద్రపోయాను. నువ్వు రాత్రంతా

పని చేసుకుంటూ కూర్చున్నావు. నేను రాకపోతే నువ్వు పెందలాడే నీ పని చేసుకునే దానివి. బాగా నిద్రపోయేదానివి. అవునా?''

''... ... ...''

''తీరిగ్గా ఉన్నప్పుడు నువ్వు రా, లేకపోతే నన్ను పిలువు. బాగానే వుంటుంది. నీకింత పనున్నప్పుడు మొక్కుబడిలాగా మనం ప్రతి వీకెండూ కలిసుండాలని ఎక్కడుందీ?''

''... ... ...''

''ఇకముందు నీకు తీరిగ్గా ఉంటేనే నన్ను పిలువు. నేనున్నానుగదా అని సమయం అంతా నాతో గడిపి, నేను నిద్రపోయింతర్వాత నువ్వు తెల్లవార్లూ పని చేసుకునేటట్లయితే నాకు రావటం ఇష్టం లేదు.''

''అయిందా నీ లెక్చరూ? ఇంకా వుందా? ఎందుకు దీన్నింత పెద్ద విషయం చేస్తున్నావు చందూ? ఇప్పుడు నాకేమయిందనీ? బాగానే ఉన్నానుగా? ఒక్క రాత్రి మేలుకుంటే ఏమన్నా అరిగిపోతానా?''

''నువ్వు విచిత్రంగా మాట్లాడతావు సుచీ. ఒక్కొక్కసారేమో ఆ ఫెమినిస్టుల్లా మాట్లాడతావూ, మరోసారేమో.''

''ఓయ్ ఓయ్, ఆగు ఆగు, అక్కడే ఆగు,'' లేచి కూర్చుంది సుచిత్ర. ''ఫెమి నిస్టులాగా అంటున్నావేంటీ? ఫెమినిస్టునే. మెంబర్షిప్ కార్డు చూపించమంటావా?'' బుకాయించింది సుచిత్ర.

''ఒద్దులే.''

''నీకేం తెలుసు ఫెమినిస్టుల గురించి? ఎట్లా మాట్లాడతారు ఫెమిని స్టులూ?'' తగాదాకి తయారుగా ఉన్నానంది సుచిత్ర.

''నాకు ఫెమినిస్టులతో ఏమీ విరోధం లేదు సుచీ, ఊరికే, ఫెమినిస్టులంటే గట్టిగా మాట్లాడతారనీ, వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటుంటారేగాని, వాళ్ళకు మగవాళ్ళంటే, సంబంధాలంటే అంత ఇష్టం ఉండదని,'' నీళ్ళు నమిలాడు చంద్ర.

''ఎక్కడ నేర్చుకున్నావీ చెత్త సిద్ధాంతాలూ? ఫెమినిస్టులైనా ఇంకొకరైనా ఇష్టమైన వాడితో ఉండాలనే అనుకుంటారు. దానికోసం చెయ్యగల ప్రయత్నాలన్నీ చేస్తారు. మగవాళ్ళు కూడా అంతేగదా? నేను పిల్చినప్పుడు నువ్వు ఎన్ని పన్లున్నా వదిలేసి రావటం లేదా? నాకు తెలియదనుకుంటున్నావా?''

''... ... ...''

''ఒక్కొక్కసారి నాకు ఒంటరిగా ఉండాలనిపిస్తుంది. నాకిష్టమైన పాటలు వింటూ పని చేసుకోవాలనిపిస్తుంది. ఒక్కొక్కసారి ఎంత పనున్నా తోడుగా

నువ్వుంటే హాయిగా ఉంటుంది. నా పక్కనే ఉండకపోయినా నువ్వు పక్క గదిలో పడుకుని నిద్రపోతున్నా సుఖంగా ఉంటుంది. మీ సిద్ధాంతం ప్రకారం నేను ఫెమినిస్టునా కాదా చంద్రాగారూ?''

''ఇప్పుడదంతా ఎందుకులే సుచీ, నేనేదో ఆలోచించకుండా అనేశాను. నాకు సిద్ధాంతాలూ రాద్ధాంతాలూ తెలవ్వు. నావల్ల నువ్వు రాత్రంతా మేలుకుని ఆరోగ్యం చెడగొట్టుకోవటం నాకిష్టం లేదు. అంతే. ఒక్కసారైతే సరే. రెండు మూడు నెల్ల నుంచీ చూస్తున్నాను కదా. అసలు పోయిన సెమిస్టర్ తర్వాత నువ్వు కొంచెం తీరిగ్గా వుంటావనుకున్నాను. కానీ మే నుంచి నువ్వు ఇంకా ఎక్కువగా పని చేస్తు న్నావు. పోయిన వీకెండు కూడా ఇలాగే జరిగింది కదా? శుక్రవారం, శనివారం రెండు రోజులూ నువ్వు రాత్రంతా చదువుతూనే ఉన్నావు.''

''చందూ, నిజం చెప్పనా. నిన్న నాకంత పనిలేదు. నువ్వు నిద్ర పోయిం తర్వాత కొంచెంసేపు చదువుకుందామని కూర్చున్నాను. ఈ-మెయిల్ చెక్ చేశాను. దురదృష్ట వశాత్తూ నా పేపర్- నీకు గుర్తుందా? రెండు నెల్ల క్రితం ఏసా (అమెరికన్ సోషియలాజికల్ సొసైటీ) జర్నల్‌కి ఒక పేపర్ పంపించానే? అదీ, దాని మీద రివ్యూస్ వచ్చాయి. పేపర్ వాళ్ళు తీసుకోలేదు. అలాగని రిజెక్ట్ చెయ్యలేదు. మార్పులు చెయ్యాలన్నారు. ఈ పేపర్ తొందరగా జర్నల్లో వస్తే తర్వాత పని సుళు వుగా వుంటుం దనుకున్నాను. రివ్యూస్ చూసింతర్వాత నిద్రపట్టలేదు. చదువుతూ కూర్చున్నాను. జరిగింది అదీ. ఉదయం లేచింతర్వాత నిదానంగా నీతో చెబ్దాంలే అనుకున్నాను. నువ్వేమో నిద్రలేస్తూనే నాతో తగువు పెట్టుకోవాలనుకున్నావు లాగుంది.''

''అవును. నీతో తగువు పెట్టుకోవటం నాకిష్టంగదా!'' సుచిత్ర నుదిటి మీద ముద్దుపెట్టాడు చంద్ర. ''ఎలాంటి మార్పులు చెయ్యాలి పేపర్లో? ఇంకా ఫీల్డ్‌వర్క్ చెయ్యాలా? లేక రివైజ్ చేస్తే సరిపోతుందా?''

''ఫీల్డ్‌వర్క్‌తో, డేటా ఎనాలిసిస్‌తో ఏమీ ప్రాబ్లెంలేదు. వాళ్ళకి ఇంటర్ప్రెటేషన్ ఇంకా కావాలట. నాకు డేటాని విపరీతంగా ఇంటర్ప్రెట్ చెయ్యటం ఇష్టం ఉండదు. కొందరు రివ్యూవర్స్‌కి డేటా ఎంతగా ఇంటర్ప్రెట్ చేస్తే అంత బాగుంటుంది. మొత్తానికి ఫరవాలేదులే. ఇంకో నెల ఆలశ్యం అయినా రివైజ్ చేసి పంపిస్తాను. వాళ్ళకి పేపర్ నచ్చింది. ఏమీ ప్రాబ్లెం ఉండదు.''

''గుడ్. మరి నీకీరోజు చాలా పనుంటుందిగా?''

''లేదు చందూ. ఈ రెండు రోజులూ నేనా పేపర్ జోలికి పోను. ఐ వాంట్ టు రిలాక్స్. నువ్వు సాయంత్రం వస్తానంటే లసాన్యా చేస్తాను. తిన్న తర్వాత మనం కొంచెంసేపు బయటికెళ్ళొద్దాం. ఏమంటావు? వస్తావా?'' అడిగింది సుచిత్ర.

5

"చందూ, వచ్చే నెల నాకొక సోషియాలజీ కాన్ఫరెన్స్ ఉంది శాన్‌ఫ్రాన్సిస్కోలో. నాలుగు రోజులు. నేను మంగళవారం సాయంత్రం వెళ్ళి శనివారం రాత్రికి తిరిగొస్తాను. నువ్వుకూడా వచ్చేటట్లయితే మనం వీకెండంతా శాన్‌ఫ్రాన్సిస్కోలో వుండి ఆదివారం రాత్రికి తిరిగి రావచ్చు. ఏమంటావు? వస్తావా?" అడిగింది సుచిత్ర, ఎదురుగ్గా కూర్చోని ఉన్న చంద్రాని. ఇద్దరూ యూనివర్సిటీకి దగ్గర్లో వున్న మెక్సికన్ రెస్టారెంట్లో భోజనం చేస్తున్నారు.

"నేనెందుకు సుచీ, కాన్ఫరెన్స్ అంటే నీకు రోజంతా ఏవో మీటింగులుంటాయ్. నేను హోటల్లో కూర్చోనేంచేస్తాను? బోర్ కొడుతుంది," అన్నాడు చంద్ర.

"హోటల్లో కూర్చోటం ఎందుకూ? నిన్ను కూడా రెజిస్టర్ చేస్తాను. అన్ని మీటింగ్‌లకూ ఇద్దరం వెళ్ళొచ్చు. పోయిన చోటల్లా నిన్ను నా పక్కనే కూర్చోనిస్తాను కూడా!" అంది సుచిత్ర, చిలిపిగా నవ్వుతూ.

"నాలుగురోజులు నీ పక్కన కూర్చుంటే నాకు బోర్ కొడుతుందోయ్!" అన్నాడు చంద్ర, ఉడికించే ప్రయత్నంలో.

"అలాగా! అయితే ఓ పని చెయ్. నాతో మీటింగుకి రా. అక్కడ నాకు ఐదారు కుర్చీల దూరంగా కూర్చో. నా పక్కనొచ్చి కూర్చోని నాతో మాట్లాట్టానికి ప్రయత్నం చేస్తుంటారే అబ్బాయిలు, నువ్వు వాళ్ళను చూస్తూ ఏడుపు ముఖం పెట్టుకుని కూర్చోవొచ్చు. అప్పుడు నీకసలు బోరుకొట్టదు."

"అమ్మగారి పక్కన కూర్చోటానికి అంత పెద్ద డిమాండుందా?" నమ్మకం లేదన్నట్లు అడిగాడు చంద్రా.

"మరేమనుకుంటున్నావ్? ఆ లాటిన్ అమెరికన్ కుర్రాళ్ళుంటారే, నేను లాటిన్ అమ్మాయిననుకోని నా పక్కనొచ్చి కూర్చుంటారు. ఎంత అందంగా, చూడ ముచ్చటగా ఉంటారో! వాళ్ళు నాపక్కన కూర్చోని నాతో మాట్లాడుతుంటే నువ్వు వెనకనుంచి కుళ్ళు చూపులు చూస్తూ కూచుందుగానివి. ఏమంటావు? వస్తావా?" ఉడికించింది సుచిత్ర.

"చూద్దాంలే."

"చూద్దామా? అంటే? లాటిన్ అబ్బాయిల గురించి చెప్పాల్సింది ఇంకా చాలా ఉంది. చెప్పనా?"

"ఒద్దులే. చెప్పింది చాల్లే."

"అంటే? వస్తావా మరి?"

"నువ్వు మరీ ఇలాంటి కబుర్లు చెప్తుంటే రాక తప్పుతుందా!" మెత్తబడినట్లు నటించాడు చంద్ర.

"గుడ్ చందూ! నువ్వొస్తే నాకెంత బాగుంటుందో! ప్లీజ్, తప్పకుండా వస్తావు గదూ?" ఆశగా అడిగింది సుచిత్ర.

"ఓ పని చేద్దాం. నువ్వు ముందెళ్ళు. శుక్రవారం రాత్రికి నేను శాన్‌ఫ్రాన్సిస్కో వస్తాను. మనం వీకెండ్ అక్కడ గడిపి ఆదివారం రాత్రికి తిరిగొద్దాం."

"నీ ఐడియా బాగానే ఉందిగాని నువ్వు నాతో మంగళవారంనాడే వస్తే నాకింకా సంతోషంగా ఉంటుంది. ప్లీజ్ చందూ! నీ ఫ్లైటూ, హోటలూ, రెజిస్ట్రేషనూ అన్నీ నేను చూసుకుంటాను. ఊ అను."

"బతిమాలుతున్నావా?" కొంచెం బెట్టు చేశాడు చంద్ర.

"అఫ్‌కోర్స్, బతిమాలుతున్నాను. నువ్వొస్తే మనం హాయిగా శాన్‌ఫ్రాన్సిస్కో చూడొచ్చు. నా సోషియాలజీ ఫ్రండ్సందర్నీ నీకు పరిచయం చేస్తాను. ప్లీజ్ చందూ!"

"అందర్నీ అంటే మీ లాటిన్ అబ్బాయిల్ని కూడానా?"

"అవును, వాళ్ళని కూడా."

"సరే. రావటానికి గట్టిగా ప్రయత్నం చేస్తాను. ఆఫీసులో పనెట్లా ఉంటుందో చూసి చెప్తాను. కాన్ఫరెన్సెప్పుడన్నావు?" అడిగాడు చంద్ర.

వివరాలు చెప్పింది సుచిత్రా.

★ ★ ★

మంగళవారం సాయంత్రానికి శాన్‌ఫ్రాన్సిస్కో చేరారు సుచిత్ర, చంద్ర. లగేజీ హోటెల్‌రూంలో పడేసి, ఓ కప్పు కాఫీ తాగి, మాస్కోనీ కన్వెన్షన్ సెంటర్‌కి వెళ్ళారిద్దరూ రెజిస్ట్రేషన్లు చేసుకోవటానికి. పని తొందరగానే జరిగిపోయింది. ఇద్దరికీ బేడ్జీలూ, కాన్ఫరెన్స్ ప్రోగ్రాం పుస్తకాలూ ఇచ్చారు. చంద్రని అటూ ఇటూ తిప్పి కాన్ఫరెన్సు సెంటరంతా చూపించింది సుచిత్ర. ఆమె ఇంతకుముందొకసారి ఏదో కాన్ఫరెన్సుకి ఇక్కడకొచ్చిందట.

అక్కడ పని ముగించుకుని బయటకొస్తుంటే సుచిత్రను గుర్తుపట్టి హలో చెప్పారు ఇద్దరు ముగ్గురు. ఒక్కొక్కరిని పరామర్శించి, రిసర్చి ఎలా సాగుతుందని అడిగి, చంద్రని వారికి పరిచయం చేసింది సుచిత్ర. దాదాపు ఎనిమిది గంటలకు అక్కడనుంచి బయటపడి కన్వెన్షన్ సెంటర్‌కి, వాళ్ళ హోటల్‌కి దగ్గరగా ఉన్న ఒక ఇటాలియన్ రెస్తొరెంటుకి చేరారిద్దరు.

భోజనం అయింతర్వాత హోటల్‌కి చేరి బట్టలు మార్చుకుని బెడ్ మీదికి చేరారు. చందూ టీవీ పెట్టాడు వార్తలు వినటానికి. కాన్ఫరెన్స్ ప్రోగ్రాం పుస్తకం

తీసింది సుచిత్ర. మరుసటిరోజు జరగబోతున్న సమావేశాల పట్టిక చూసింది. ఒకేసారి రకరకాల అంశాలమీద వేరేవేరే గదుల్లో సభలు జరుగుతాయి. ఒక ప్రసంగం వినటానికి ఒక గదికి వెళ్ళి, అక్కడ నుండి మరొకటి వినటానికి ఇంకొక చోటికి వెళ్ళాల్సి ఉంటుంది. తను వినదల్చుకున్న ప్రసంగాలకన్నింటికీ పుస్తకంలో గుర్తులు పెట్టి పేజీలు మడిచింది సుచిత్ర. అప్పటికే వార్తలు వింటూ నిద్ర పోయాడు చంద్ర.

మరుసటిరోజు తొమ్మిది గంటలకు కాన్ఫరెన్స్ సెంటర్ చేరారు. అక్కడ బాగా సందడిగా ఉంది. గుంపులు గుంపులుగా నుంచోని మాట్లాడుకుంటున్నారు ఎంతో మంది. కాన్ఫరెన్స్‌కి దాదాపు పదివేలమంది వస్తారని చెప్పింది సుచిత్ర. ప్రోగ్రాం పుస్తకం చూసి తను పోదల్చుకున్న గదికి చంద్రని లాక్కెళ్ళింది. దాదాపు రెండొందలమంది ఉన్నారా గదిలో. లోపలికెళ్ళి నిశ్శబ్దంగా వెనక కుర్చీల్లో కూర్చున్నారిద్దరూ. ఐదారు నిముషాల తర్వాత జరుగుతున్న ప్రసంగం అయిపో యింది. మాట్లాడినతన్ని ఏవో ప్రశ్నలడిగారు ఇద్దరు ముగ్గురు. తర్వాతది సుచిత్ర వినటానికొచ్చిన ప్రసంగం. శ్రద్ధగా వింది సుచిత్ర. ఆ తర్వాత పుస్తకంలో చూసి మరొక రూముకి లాక్కెళ్ళింది చంద్రని. అలా ఉదయం అంతా అక్కడికీ ఇక్కడికీ తిప్పింది. పదకొండు గంటలప్పుడు నేనొకచోట కూర్చుంటాను, నువ్వు వినదల్చు కున్న ప్రసంగాలన్నీ విని రారాదూ? అని ప్రార్ధనాపూర్వకంగా అడిగాడు చంద్ర. పాపం బోర్ కొట్టింది కాబోలని, పది నిముషాల్లో భోజనాని కెళ్దాం అంది సుచిత్ర.

హాల్లోంచి బయటికొస్తుంటే ఒకతనెవరో సుచిత్రని వెనకనుంచి పిల్చాడు. అతన్ని గుర్తుపట్టి హలో రొబెర్తో అని పలకరించింది సుచిత్ర. అతను ఆప్యాయంగా వచ్చి సుచిత్రకి రెండు చెంపల మీదా ముద్దు పెట్టాడు. సుచిత్ర కూడా అతనికి రెండు చెంపల మీదా ముద్దుపెట్టింది. రొబెర్తోకి చంద్రని పరిచయం చేసింది సుచిత్ర. అతను వెంటనే చంద్రకి రెండు చెంపలమీదా ముద్దు పెట్టాడు. ఏం చెయ్యాలో తెలియక అలాగే నిలబడిపోయాడు చంద్ర. ఉభయకుశలోపరి తర్వాత, నీతో కొంచెంసేపు మాట్లాడాలన్నాడు రొబెర్తో. ఇప్పుడు వేరే పనిమీద బయటికెళు తున్నాము, మధ్యాన్నం మళ్ళీ ఇక్కడే కలుద్దాం, అప్పుడు మాట్లాడుకోవచ్చు అంది సుచిత్ర. కొంచెం ఇబ్బందిగా చూశాడు రొబెర్తో. ఏమీ ఫరవాలేదు, అంతా బాగానే జరుగుతుంది, నువ్వేమీ విచారించకు, అంత నర్వస్‌గా ఉండాల్సిన అవసరం లేదు అని అతనితో అంది సుచిత్ర. అతను నవ్వుతూ, నామీద నీకున్న నమ్మకానికి థాంక్స్ అన్నాడు. చంద్ర, సుచిత్ర బయటికి నడిచారు. దగ్గర్లోనే రోడ్డు పక్కనున్న రెస్టా ంటుకి చేరారు. రొబెర్తో గురించి చెప్పింది సుచిత్ర. అతను సాపాలో యూని

వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా పని చేస్తున్నాడు. రేపు తను అధ్యక్షురాలుగా ఉండి నడిపే సభలో మాట్లాడే ఆరుగురిలో అతనొకడు. బ్రెజిల్లో ఇండియన్స్ గురించి మాట్లాడ బోతున్నాడు. అది కొంచెం వివాదాస్పదమైన విషయం కాబట్టి అతను కొంచెం నర్వస్‌గా ఉన్నట్లున్నాడంది సుచిత్ర. అంతవరకూ సుచిత్ర ఒక సభ నడపబోతుందని చంద్రకి తెలియదు. మరి పాపం అతన్ని కూడా మనతో లంచికి రమ్మంటే బాగుండేదిగా? మనతో కూర్చుని ఆ అడగదల్చుకున్నదేదో అడిగే వాడు కదా అన్నాడు చంద్ర. ఫరవాలేదులే, మనకంటూ కొంచెం సమయమన్నా ఉండాలి కదా అంది సుచిత్ర.

శాండ్విచ్‌లు తిని కాఫీ తాగి హోటల్‌కి చేరారిద్దరూ. మళ్ళా సాయంత్రం సభల పట్టిక చదివి పుస్తకంలో గుర్తులు పెట్టుకుంది సుచిత్ర. "నీకు చాలామంది తెలుసులాగుంది సుచీ, ఎక్కడ కలిశావు వీళ్ళందరినీ? ఎలా గుర్తుంటాయి నీకు ఇంతమంది పేర్లు?" అని ఆశ్చర్యంగా అడిగాడు చంద్ర.

"ఏడెనిమిది సంవత్సరాలుగా సోషియాలజీ కాంఫరెన్సులకెళ్తున్నానుగా, అందువల్ల నాకు ఇష్టమైన విషయాల మీద రిసర్చి చేస్తున్న వాళ్ళు చాలామంది నాకు తెలుసు. ఇలాగే మీటింగుల కొచ్చినప్పుడల్లా వాళ్ళతో మాట్లాడుతుంటాను. అందువల్ల వాళ్ళను కలిసేది సంవత్సరాని కొకసారేనయినా అందరూ బాగా తెలిసిన స్నేహితుల్లాగానే మాట్లాడుతుంటారు," అంది సుచిత్రా, చిరునవ్వుతో.

మూడుగంటలకు మళ్ళా కన్వెన్షన్ హాలుకెళ్ళారిద్దరూ. మళ్ళా ఆ రూముకీ ఈ రూముకీ లాక్కెళ్ళింది సుచిత్రా. మధ్య మధ్యలో కోరిడార్లలో కనపడ్డ పరిచయ స్తులను పలకరించి మాట్లాడింది. సాయంత్రం కొందరం కలిసి భోజనానికెళ్తున్నాం, మాతో వస్తావా? అని ఒకరిద్దరడిగారు. లేదు, నాకు వేరే కమిట్‌మెంట్సు ఉన్నా యంది సుచిత్ర. ఆరాత్రి భోజనాలు చేస్తున్నప్పుడు, "నేను రాకపోయుంటే నువ్వు ఎవరితోనైనా భోజనానికి వెళ్ళి వాళ్ళతో మీ రిసర్చి గురించి మాట్లాడేదానివి కదూ?" అని అన్నాడు చంద్ర.

"అవును. అయితే ఏం? తర్వాత ఫోన్లో మాట్లాడతాను. ఫరవాలేదులే, నువ్వేం విచారించకు, నాకు నీతో తిరగటమే ఇష్టం," అంది సుచిత్ర, అతని చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కుతూ. చంద్ర కళ్ళు మెరిశాయి.

మరుసటిరోజు ఉదయం మామూలుగానే కాజువల్‌గా డ్రెస్ చేసుకుంది సుచిత్రా.

"అదేంటీ? నువ్వీరోజు అధ్యక్షురాలివికదా? ప్రొఫెషనల్‌గా డ్రెస్ చేసుకో కూడదూ?" అన్నాడు చంద్ర.

''ఏం? ప్రొఫెషనల్‌గా డ్రెస్ చేసుకుంటే ఎలావుంటానో చూడాలని పిస్తుందా?'' అడిగింది సుచిత్ర.

''లేదులే సుచీ, నువ్వు మరీ ఎప్పుడూ గ్రేడ్యుయేట్ స్టూడెంట్‌లాగా డ్రెస్ చేసుకుంటావు, ప్రొఫెసర్‌లాగా డ్రెస్ చేసుకోవచ్చుగా! ఒక సభకు అధ్యక్షురాలిగా ఉండబోతున్నావు. ఈ రోజైనా కాస్త తగినట్లుగా డ్రెస్ చేసుకోవాలిగదా?'' పంతంగా అడిగాడు చంద్ర. నేనేం ప్రొఫెషనల్‌గా ఉండే బట్టలు తెచ్చుకోలేదంది సుచిత్ర. అప్పుడు బయటికెళ్ళి కొనుక్కొచ్చుకునేటంత టైం లేదు. కాఫీ తాగి బయల్దేరారిద్దరూ. ఇంకా అసమ్మతిగానే గొణుక్కుంటూ వచ్చాడు చంద్ర.

తన సభ జరగబోతున్న గదికి వచ్చారిద్దరూ. అప్పటికి ఇంకా పదినిముషాల టైం ఉంది. దాదాపు నలభై యాభైమంది అప్పటికే కూర్చొనున్నారు. నేను వెనక కూర్చుంటాను, నువ్వు నన్ను పట్టించుకోవద్దని వేదికకు దూరంగా ఒక కుర్చీలో చేరాడు చంద్ర. సుచిత్ర వేదిక వైపు నడిచింది. ఆమెను గుర్తుపట్టి నలుగురైదుగురు ఆమె వైపు నడిచారు. చేతులు కలిపారు. నవ్వుతూ మాట్లాడారు. తొమ్మిది కాగానే, సుచిత్ర మైక్రోఫోను తీసుకుని అందరినీ సభకు ఆహ్వానించింది. ఈరోజు ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఆదివాసుల గురించీ, వారి జీవితాల్లో ఈమధ్య వస్తున్న మార్పుల గురించీ ఈ సభ జరుగుతుంది. నా పేరు సుచిత్ర. ఈ సభలో మొత్తం ఆరుగురు మాట్లాడతారు. మొదట సౌపౌలో యూనివర్సిటీ నుంచి రొబెర్తో ఆల్వరేజ్ ఎమజాన్ బేసిన్‌లోని ఇండియన్ల గురించి మాట్లాడతారు, అని రొబెర్తోని ఆహ్వానించింది సుచిత్ర. నిన్న స్టూడెంట్‌లాగా కనిపించిన రొబెర్తో ఈరోజు జాకెట్, టైలతో వచ్చాడు. అతని మెడ చుట్టూ మైక్రోఫోను కట్టింది సుచిత్ర. రొబెర్తో బాగా మాట్లాడాడు. ఇండియన్ల ఫొటోలు కొన్ని చూపించాడు. వాళ్ళు నదిమీద ఆధారపడి బతికేవారు, ఇప్పుడు ఆ ప్రాంతంలో కలప వ్యాపారం చేస్తున్న పెద్దపెద్ద కంపెనీల ప్రభావం వల్ల వారి జీవితాల్లో వచ్చిన మార్పుల గురించి మాట్లాడాడు. అతని తర్వాత మరో ఐదుగురు బొలీవియాలో, కెనడాలో, అమెరికాలో ఆదిమవాసుల జీవితాల్లో వస్తున్న మార్పుల గురించి మాట్లాడారు. పదిన్నరకు కార్యక్రమం ముగిసింది. సభలో మాట్లాడిన వారికీ, సభకు వచ్చిన వారికీ, ప్రశ్నలడిగిన వారికీ అందరికీ ధన్యవాదాలు చెప్తూ సభను ముగించింది సుచిత్ర.

చంద్ర చాలా గర్వించాడు. తనకు తెలిసిన సుచిత్రకి ఎంత పలుకుబడి! ఇంతమందికి ఆమెతో పరిచయం! ఆమెతో మాట్లాడాలని ఎంతమంది ముందుకొస్తుంటారు! సభ ఎంత చక్కగా జరిపింది!

సభ ముగిసింది. కాని చాలామంది వాళ్ల కుర్చీల్లోంచి లేచి వేదిక వైపు వెళ్ళారు. ప్రసంగించిన వారితోనూ, సుచిత్రతోనూ మాట్లాడుతూ గుంపులు గుంపులుగా నిలబడ్డారు. దాదాపు ఇరవై నిముషాల తర్వాత అందరిదగ్గరా సెలవు తీసుకోని చంద్ర దగ్గరకొచ్చింది సుచిత్ర. ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు చంద్ర కళ్ళతోనే తన సంతోషాన్ని వ్యక్తపరుస్తూ. ఇద్దరూ బయటికి నడిచారు.

మధ్యాన్నం కూడా సభలు ముమ్మరంగా సాగాయి. ఏవేవో ప్రసంగాలు వినటానికి ఆగదికీ ఈగదికీ పరిగెత్తింది సుచిత్ర. తనొక చోట కూర్చుంటానని చంద్ర అంటే ఒప్పుకోలేదు. మొత్తానికి చంద్రకి కూడా ఈ రెండు రోజుల్లో సోషియాలజీ వాళ్ళు ఎలాంటి పరిశోధనలు చేస్తున్నారో అర్థం అయిందనిపించింది.

ఆ రాత్రి భోజనం అయింతర్వాత హోటల్లో పడుకుని టీవీ చూస్తుండగా చంద్ర, "సుచీ, నిన్నొక మాట అడగనా?" అన్నాడు.

"అదేంటీ! ఇప్పుడు నేనేం తప్పు చేశాను? ఇలా మొదలుపెట్టినప్పుడల్లా నువ్వేదో లెక్చరిస్తావే! ఇప్పుడు నేనేం తప్పు చేశాను నేస్తం?" అడిగింది సుచిత్ర, కళ్లు పెద్దవి చేస్తూ.

"నువ్వేం తప్పు చెయ్యలేదులే సుచీ. రెండు రోజులనుంచి చూస్తున్నాను గదా, నీకు ఎంతోమంది తెలివిగలవాళ్ళు తెలుసు. నువ్వంటే ఎంతోమందికి ఇష్టం, వీళ్ళల్లో ఎంతోమంది యూనివర్సిటీల్లో పెద్ద పెద్దవాళ్ళు, మంచి ఉద్యోగాలున్న వాళ్ళు. నేనెందుకు సుచీ నీకూ?" అన్నాడు చంద్ర, ఆమె కళ్ళలోకి చూస్తూ, చాలా సీరియస్‌గా.

చంద్రని కౌగిల్లోకి తీసుకోని, జుట్టు చెరిపేస్తూ నవ్వింది సుచిత్ర. "బుద్ధూ, నువ్వంటే నాకిష్టం. డబ్బు కోసమో, పేరు కోసమో, హోదా కోసమో ఎవడితోనన్నా ఉండటం వ్యాపారమో, వ్యభిచారమో, లేక సంసారమో అవుతుంది. అలాంటి సంబంధం అంటేనే పరమ అసహ్యం నాకు. నాక్కావాల్సింది ఇష్టమైనవాడు. ఇష్టమైన వాడితో ఉండటాన్ని ఏమంటారో చెప్పు?" అడిగింది సుచిత్ర, మురిపెంగా అతని బుగ్గలు సాగదీస్తూ.

చిరునవ్వు నవ్వుతూ, "సుచీ, నీకు పాఠాలు చెప్పటం బాగా అలవాటయ్యింది!" అన్నాడు చంద్ర.

సిగ్గుపడింది సుచిత్ర. వెంటనే తమాయించుకుని, "ఏయ్, తప్పించుకోటానికి ప్రయత్నం చెయ్యకు. చెప్పు, ఇష్టమైన వాడితో ఉండటాన్ని ఏమంటారు?"

"ఏమో. నాకేం తెలుసు. సోషియాలజిస్టువి నువ్వుకదా. నువ్వే చెప్పు ఏమంటారో."

''ఇష్టమైనవాడితో ఉండటాన్ని సావాసం అంటారు. సావాసానికి డబ్బు, హోదా, ఉద్యోగం అవసరం లేదు. సంస్కారం ఉంటే చాలు. డబ్బు, హోదా, ఉద్యోగం అన్నీ పోవచ్చు, సంస్కారం పోదు. ఏమన్నా అర్థం అవుతుందా బుజ్జీ?'' చంద్ర ముక్కు పట్టుకుని ఆడింది సుచిత్ర.

''యస్ మేం,'' అన్నాడు చంద్ర బుద్ధిగా.

''గుడ్. అందుకే నువ్వంటే నాకు అంత ఇష్టం,'' అని, మాట మారుస్తూ, ''సరేలే, ఇక మనం తొందరగా పడుకుందాం. రేపు పెందలాడే లేవాలి.''

''ఎనిమిది గంటలకు లేస్తే సరిపోతుందిగదా. మీటింగు మొదలయ్యేది తొమ్మిది గంటలకేగదా?'' అడిగాడు చంద్ర.

''లేదు. ఏడూ ఏడున్నరప్పుడు, సూర్యకిరణాలు ఏటవాలుగా పడుతున్నప్పుడు బొటానికల్ గార్డెన్లో తిరగటం అంటే నాకు మహా ఇష్టం. ఆరు గంటలకు లేస్తే ఏడుగంటలకు అక్కడికి చేరతాం.''

''అంటే రేపు మీటింగు లేదా?''

''ఉంది. మనం ఎగ్గొడుతున్నాం. చెప్పానుగదా, శ్రీ చంద్రగారు దయచేసి నాతో మీటింగుకొచ్చేటట్లయితే శనివారం ఆదివారం మనవేనని. ఇప్పటికే పదకొండవుతుంది. ఇక పడుకుందాం. లేకపోతే ఆరుగంటలకు లేవటం కష్టం.''

చంద్రను ముద్దుగా దిండుమీదికి నెట్టేసి, లైటు ఆర్పేసింది సుచిత్ర.

6

దాదాపు నాలుగ్గంటలప్పుడు పిల్చాడు చంద్ర. ''ఏంటీ, నిన్నీరోజు పెందలాడే ఇంటికి పోనిచ్చిందే మీ యూనివర్సిటీ!''

''అవును, కానీ మళ్ళా వెళ్ళాలీరోజు.''

''ఎందుకూ? శుక్రవారం కదా, నీకీరోజు క్లాసులేదుగా?''

''క్లాసు లేదు. ఆస్టిన్ నుంచి ఒకతనొచ్చాడు సెమినార్ ఇవ్వటానికి. అతన్ని సాయంత్రం డిపార్ట్‌మెంట్ వాళ్ళం కొందరం భోజనానికి తీసుకెళ్తున్నాం.''

''భోజనానికా! డిపార్ట్‌మెంట్‌వాళ్ళతోనా! ఇదెప్పటినుంచీ! ఇలాంటివన్నీ ఎగ్గొడుతుంటావుగా నువ్వు?''

''ఈరోజు ఎగ్గొట్టటం కుదరదు. అతను నాకు తెలిసినవాడు. పోకపోతే బాగుండదు.''

''సరే అయితే. రేపు కలుద్దాం మరి,'' అన్నాడు చంద్ర నీరసంగా.

''ఏయ్. ఉండుండు, నీ ఫోన్ మెసేజ్ విన్నాను. ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలన్నావ్. ఏంటో చెప్పు.''

“అది అంత అర్జంటైన విషయం కాదులే సుచీ, రేపు మాట్లాడుకుందాంలే.”

“అదేం కుదరదు. ఇప్పుడు చెప్పటానికేంటీ ప్రాబ్లెం?”

“రేపు మాట్లాడుకుందాం అన్నాను కదా?”

“నేను డిన్నర్‌కి వెళ్ళటానికి ఇంకా రెండుగంటల టైముంది. ఇప్పుడు రారాదూ, ప్లీజ్?”

“ఇప్పుడు వీలుకాదు సుచీ. నేను ఆఫీసులో ఉన్నాను. చెప్పాను కదా అంత అర్జంటైన విషయం కాదని.”

“డిన్నర్ నుంచి నేను తొమ్మిదిగంటలకొస్తాను. నేనొచ్చేసరికి నువ్వు రారాదూ?”

“అంత పరిగెత్తాల్సిన అవసరం ఏముంది? రేపు ఉదయం వస్తాన్లే సుచీ.”

“అదేం కుదరదు, తొమ్మిది గంటలకు నువ్వొస్తున్నావు.”

“సరే, కానీ నీకు ఒకవేళ రావటం ఆలస్యం అయితే నాకు బోరు కొడుతుంది. డిన్నరయింతర్వాత నువ్వే నా అపార్ట్‌మెంట్‌కి రారాదూ. అప్పుడు మాట్లాడుకుందాం.”

“సరే అయితే. నేనొచ్చేటప్పుడు రెస్టారెంటు నుంచి నీకేమైనా తీసుకురానా?”

“ఒద్దొద్దు, నాకు రిఫ్రెజిరేటర్లో చాలా ఉన్నాయి. నువ్వు రా. తొందరేమీలేదు. డిన్నరయింతర్వాతే రా.”

★ ★ ★

తొమ్మిదిన్నర ప్రాంతంలో సుచిత్ర, చంద్ర అపార్ట్‌మెంట్‌కి చేరింది. లోపలికొస్తూనే హాండ్‌బేగ్ కౌచ్‌మీదికి గిరాటేసి ఒక దిండుమీద కూలబడింది. “మా డిపార్ట్‌మెంట్ వాళ్ళతో పార్టీలకీ, భోజనాలకీ వెళ్ళటం ఒక పెద్ద శిక్షే అనుకో. నాకు ఎడంపక్కన కూర్చున్నతను సాయంత్రం అంతా వాళ్ళ ఇంటి గురించి మాట్లాడాడు. కుడిపక్కన కూర్చున్నతను వాళ్ళ వెకేషన్ గురించి చెప్పాడు. ఇద్దరూ కలిసి నా తల తినేశారనుకో!”

చంద్ర నాలిక్కరుచుకున్నాడు.

“ఓకే. నీ ముఖ్యమైన విషయం ఏంటో చెప్తావా? ఇంకా సస్పెన్సులో వుంచుతావా?” అడిగింది సుచిత్ర.

డైనింగ్‌టేబుల్ దగ్గర్నుంచి ఒక కుర్చీ తెచ్చుకుని కౌచ్ ముందు సుచిత్రకెదురుగ్గా వేసుక్కూర్చున్నాడు చంద్ర.

“నేను చెప్పేది సీరియస్‌గా, పూర్తిగా విను. మధ్యలోనే కొట్టెయ్యొద్దు. ఎగతాళి చెయ్యటం, జోకులెయ్యటం అలాంటివేమీ పనికిరావు.”

“ఓకే. చాలా సీరియస్‌గా వింటాను. మొదలుపెట్టు.”

“నాకొక ఆలోచనొచ్చింది.”

“అయితే డాక్టర్‌కి చూయించుకో?” అని చాలా సీరియస్‌గా ముఖం పెట్టింది సుచిత్ర, నవ్వకుండా ఉండటానికి ప్రయత్నం చేస్తూ.

“నేనేం చెప్పాను ముందే?” విసుగ్గా అన్నాడు చంద్ర.

“ఓకే ఓకే. సారీ. నీకో ఆలోచనొచ్చింది. తర్వాతేమయింది?” ఈసారి నవ్వాపుకోవటం కుదర్లేదు సుచిత్రకి.

“ఒద్దులే నీకు చెప్పటం అనవసరం,” ముఖం ముడుచుకుని లేచిపోబోయాడు చంద్ర.

“సారీ చందూ,” చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టింది సుచిత్ర. “నువ్వు నా మంచి చంద్రుడివికదూ! ఇప్పుడు చెప్పు. ఈసారి నేను నోరెత్తితే అప్పుడడుగు. ప్లీజ్.” కుదురుగా బుద్ధిమంతురాలిగా కూర్చుంది సుచిత్ర.

“నా కొలీగొకతను బర్మింగ్‌హామ్‌లో ఒక ప్లాట్ కొన్నాడు. అక్కడ ఇంకా ప్లాట్లున్నాయట. నాలుగురకాల మోడల్సున్నాయట. ఒక ప్లాటు కొనుక్కోని, ఒక మోడల్ సెలెక్ట్ చేసుకుంటే ఆరునెలల్లో ఇల్లు కట్టిస్తారట. ఇప్పుడు మనిద్దరం వేరువేరుగా కడుతున్న అద్దెకంటే తక్కువ డబ్బుల్తో మనం ఒక నాలుగు బెడ్రూముల ఇల్లు కొనుక్కోవచ్చు.”

“అంటే బుజ్జికి కలిసుండాలని ఉబలాటంగా ఉందామ్మా!” ముందుకు వంగి చంద్ర బుగ్గల్ని వొత్తేసింది సుచిత్ర.

“నీకు టెన్యూరొచ్చిందాకా వేరువేరుగా ఉందామన్నావు. ఇప్పుడిక ఆ టెన్యూరు రావటంలో ఏమీ అనుమానం లేదు. టెన్యూర్ వొచ్చింతర్వాత కూడా నీ పనికి నేను అడ్డం వస్తానని నీకు భయంగా ఉంటే, ఎటూ నాలుగు బెడ్రూములుంటాయి, మనం వేరు వేరు బెడ్రూముల్లో ఉండొచ్చు. ఇంకొక బెడ్రూముని నువ్వు ఆఫీసుగా వాడుకోవచ్చు.”

“బావుంది.”

“మరి వెళ్ళి చూద్దామా?”

“ఇద్దరు మనుషులకు నాలుగు బెడ్రూముల ఇల్లెందుకంటా?”

చంద్ర కొంచెంసేపు తలదించుకుని మౌనంగా ఉండిపోయాడు. తలెత్తి నిదానంగా మాట్లాడుతూ, “సుచీ, టెన్యూరొచ్చింతర్వాత పాప గురించి ఆలోచిద్దాం అన్నావుకదూ? ఇంకా రెండుమూడు నెలల్లో టెన్యూరు గురించి అఫీషియల్‌గా

తెలుస్తుంది. పాప పుట్టకముందే మనకొక ఇల్లుంటే, దానికొక రూము రెడీ చేసి పెడితే బాగుంటుంది కదూ?"

ఈసారి సుచిత్ర మౌనంగా ఉండిపోయింది. కళ్ళు దించేసి కాళ్ళ వైపు చూస్తూ కూర్చుంది.

"మనసు మార్చుకుంటే చెప్పేసెయ్ సుచీ. అసలు ఇష్టం లేదా? లేక ఇంకా కొన్నాళ్ళు ఆగుదామనా?"

తలెత్తి చంద్రవైపు చూసి మళ్ళా తల దించుకుంది సుచిత్ర. రెండు క్షణా లాగి, "చందూ, నాక్కూడా పాప కావాలి. దాని గురించే నేనూ ఆలోచిస్తూ వున్నాను. వచ్చే సంవత్సరం ఫాల్ సెమెస్టర్లో మెటర్నిటీ లీవ్ తీసుకునేటట్లు ప్లాన్ చేద్దామా అని నిన్ను అడుగుదామనుకున్నాను. కాని చందూ, రెండు రోజుల క్రితం నాకో ఫోనొచ్చింది. నీకు చెప్పాలంటేనే భయంగా ఉంది నాకు."

దగ్గరకొచ్చి ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు చంద్ర. "ఏమ యింది సుచీ, మీ అమ్మానాన్నా బాగున్నారా?"

"వాళ్ళు బాగానే ఉన్నారు. ఇది న్యూయార్కులో యు.ఎన్. నుంచి. ఒక్క సంవత్సరం యు.ఎన్.తో పనిచెయ్యమని అడుగుతున్నారు."

"న్యూయార్కులోనా? టెంపరరీగానా?"

"ఊఁ."

"ఇందులో అంతగా ఆలోచించాల్సిందేముంది సుచీ? ఆరు సంవత్సరాలు ఇంత కష్టపడి యూనివర్సిటీలో టెన్యూరు సంపాయించుకున్నావు. ఇప్పుడు దాన్ని వదిలేసి ఒక్క సంవత్సరం టెంపరరీ ఉద్యోగం కోసం న్యూయార్క్ వెళతావా?"

"ఉద్యోగం వదిలేసి కాదు, ఒక సంవత్సరం సెలవు పెట్టి రమ్మంటున్నారు."

"సెలవిస్తారా మీవాళ్ళు?"

"కెవిన్‌తో మాట్లాడాను. ఇలాంటి ఆఫర్ డిపార్ట్‌మెంట్లో ఇంతకుముందు ఎవ్వరికీ రాలేదట. సెలవిప్పిస్తాను. నీ క్లాసులకు పాఠాలు చెప్పటానికి ఒక పార్ట్‌టైం లెక్చరర్ని అపాయింట్ చేస్తాను అన్నాడు."

"నిజంగా! మీ కెవిన్ ఇంత ఉదారస్వభావుడనుకోలేదే నేను! ఇంతకీ ఈ ఉద్యోగం నువ్వు తీసుకుంటే న్యూయార్క్ ఎప్పుడెళ్ళాలి?"

"రెండు నెలల్లో. జనవరి మధ్యలో రమ్మని అడుగుతున్నారు."

"మరి టెన్యూరు గురించి అఫీషియల్‌గా తెలియకముందే నువ్వెళ్ళిపోతే ఏమీ ఇబ్బందుండదా?"

''కెవిన్‌కి ఇది చాలా గర్వంగా ఉంది చందూ. యు.ఎన్. వాళ్ళు ఇలా పిలవటం డిపార్ట్‌మెంట్‌కే గౌరవం, యూనివర్సిటీకే గౌరవం అంటున్నాడు. టెన్యూర్ ఏం ఖర్మ, దీనివల్ల నీకు ఈసారి ప్రమోషన్ కూడా తొందరగా వస్తుందంటున్నాడు. కనపడ్డవాళ్ళందరికీ మా సుచిత్రని యు.ఎన్. వాళ్ళు సహాయం చెయ్యమని అడుగుతున్నారని చెప్తున్నాడు.''

''అసలేంటీ ఈ ఉద్యోగం? సహాయం చెయ్యటం ఏంటీ?''

''బొలీవియాలో యు.ఎన్. వాళ్ళ కార్యక్రమాల మీద ఒక స్వతంత్రాభిప్రాయం కావాలట. ఆ బాధ్యత నన్ను తీసుకోమంటున్నారు. నేనొప్పుకుంటే, మొదట న్యూయార్క్ వెళ్ళి రెండుమూడు నెల్లు అక్కడుండాలి. బొలీవియాలో వాళ్ళు చేస్తున్న పనుల వెనకాల ఉన్న ఉద్దేశం ఏంటో ముందు అర్థం చేసుకోవాలి. తర్వాత ఏడెనిమిది నెల్లు బొలీవియాలో ఉండి, అక్కడ జరుగుతున్న పనులు ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిమీద ఒక సమగ్రమైన సమీక్ష రాసి, నా సొంత అభిప్రాయలతో పాటు వాళ్ళకివ్వాలి. అదీ పని. మొత్తం ఒక్క సంవత్సరం పాటు కాంట్రాక్టు.''

''సుచీ, ఇదేదో చాలా ముఖ్యమైన పనిలాగుంది. నువ్వు తొందరపడి కాదనకు.''

''నిజంగా! ఒక్క సంవత్సరం పాటు వెళ్ళిపోవాల్సుంటుంది. నువ్వు తెలిసే మాట్లాడుతున్నావా చందూ!''

''నిజమే సుచీ. ఒక సంవత్సరం పాటు దూరంగా ఉండటం కష్టమే. అయినా ఇది చాలా మంచి అవకాశంలాగా ఉంది. న్యూయార్క్ అంత దూరమేమీ కాదు కదా? ఒక వీకెండు నువ్విక్కడకు రావొచ్చు. తర్వాత వీకెండుకి నేను న్యూయార్క్ వస్తాను.''

''న్యూయార్కులో ఉండేది రెండుమూడు నెల్లే. దాదాపు తొమ్మిది నెల్లు బొలీవియాలో ఉండాలి.''

''నాకు మూడువారాల సెలవుంది. నీకూ ఎంతో కొంత సెలవుంటుంది. కొన్నాళ్ళక్కడా, కొన్నాళ్ళిక్కడా కలుద్దాం. అయినా ఈ బొలీవియాతో నీకేంటీ సంబంధం సుచీ?''

''ఏమీలేదు. ఆగస్ట్‌లో మనం శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళామే సోషియాలజీ కాన్ఫరెన్సుకి. అక్కడ నేను నడిపిన సెషన్ చూశాడట ఎవరో యు.ఎన్. అధికారి. ఈ బొలీవియా బాధ్యత నాకివ్వమని అతను రెకమండ్ చేశాడట.''

“వావ్! ఇది చాలా బాగుంది సుచీ. నువ్వంటే నాకెంతో గర్వంగా ఉంది. తప్పకుండా ఒప్పుకో. మరి బొలీవియాలో నీకు ఉండటానికీ...”

“అవన్నీ యు.ఎన్. వాళ్ళే చూసుకుంటారట. న్యూయార్కులో, బొలీవియా లో ఏర్పాట్లన్నీ వాళ్ళే చేస్తారట.”

“బాగుంది. ఇంత మంచి విషయం చెప్పటానికి భయమేంటి సుచీ!”

“నువ్వేమంటావో అనుకున్నాను. ఇన్నాళ్ళూ టెన్యూర్ వచ్చిందాకా వేరుగా ఉందాం అంటే ఒప్పుకున్నావు. పాప విషయంలో కూడా నామాట విన్నావు. ఇప్పుడు మళ్ళా ఇంకో కారణంగా కొన్నాళ్ళు ఆగాలంటే నువ్వేం అంటావో అని భయం వేసింది.“

“ఫరవాలేదు. నువ్వు బొలీవియా నుంచి తిరిగొచ్చాక వస్తుంది పాప. నీతోనే వస్తుందేమో!” హాయిగా, ఆశగా నవ్వాడు చంద్ర.

“మరి మనకు నిజంగా మొదట పాపే పుడితే బొలీవియా అని పేరు పెట్టు కుందామా?” అడిగింది సుచిత్ర.

“ఇంకా నయం, ఏకంగా సోషియాలజీ అని పెట్టుకుందాం అన్నావుకాదు!”

మనసారా తెరలు తెరలుగా నవ్వింది సుచిత్ర.

ఆదివారం ఆంధ్రజ్యోతి
26 మార్చి 2006

ఉదార స్వభావం

"ఒరేయ్! ఎందుకురా పనికిరాని మాటలు చెప్తావ్. ఊళ్ళో మనవాళ్ళు గనక నీలాగా మాట్లాడుంటే మనకసలు చదు వొచ్చేదా? మనమసలు బడికి పోయే వాళ్ళమా? రోజంతా చింత తోపులో గోలీలాడేవాళ్ళం. నువ్వు గెలుస్తూ వుండేవాడివి, నేను



మోచేత్తో దోకుతూ ఉండేవాణ్ణి.'' ఎదురుగా సోఫామీద కూర్చున్న శేఖర్‌ని మంద లించాడు వెంకట్.

శేఖర్ తలవంచుకుని వింటూ కూర్చున్నాడు. ఆదివారాలు గుళ్ళో పిల్లలకి తెలుగు నేర్పుతున్నారు. వినయ్‌కి తెలుగొస్తే బాగుంటుందని తనకూ ఉండింది. కాని వాడు గుడికి తీసుకెళ్తానంటే ఏడ్చేవాడు. రెండుమూడుసార్లు ఏడిస్తే ఏడ్చాళ్ళే అని తీసుకెళ్ళాడు. కానీ ప్రతి ఆదివారమూ వాణ్ణి ఏడిపించటం తనకూ కష్టంగానే ఉండింది. రాధ కూడా అంత బలవంతం ఎందుకులే వదిలేద్దాం అంది. సరే అన్నాడు తను.

''ఏమండోయ్ రాధగారూ,'' కొంచెం దూరంగా విమలతో కూర్చోని కూర గాయలు తరుగుతున్న రాధ వైపు మళ్ళాడు వెంకట్. ''మీకు చెప్పాడో లేదో మావాడు, వీడు గోలీలాటలో మావూరికి చాంపియన్. ఒలింపిక్స్‌లో గనక గోలీ లాటుంటే వీడు గోల్డ్ మెడల్ కొట్టేసుండేవాడు. ఒకరోజేమయిందంటే...''

ఇది ఇరవైయ్యేళ్ళ నాటి మాట. రాధ, శేఖర్, కొడుకు వినయ్ డిట్రాయట్ వచ్చి అప్పటికింకా ఆరునెల్లు కాలేదు. మెడికల్ కాలేజీ తర్వాత దోవలు వేరైన శేఖర్, వెంకట్‌లు మళ్ళా దగ్గిరయ్యారు. ఇలా ఆదివారం నాడు కలిసినప్పుడల్లా, ఎంత ముఖ్యమైన సంగతి గురించి మాట్లాడుతున్నా, సంభాషణ చాలా సులభంగా దారితప్పి చింతతోపు, చెరువుకట్టా, పంటపొలాలూ, బడీ, కోతికొమ్మచ్చుల వైపు పోయేది. అన్నీ అయింతర్వాత తిరిగి విషయం మీదికొచ్చేది. అదీ జ్ఞాపకమొస్తే.

''అదిగాదురా, పిల్లల్ని వాళ్ళిష్టమొచ్చినట్లు చెయ్యనిస్తే ఇక మనమెందు కురా? వాళ్ళకి మంచీచెడ్డా తెలిసేదాకా మంచిదోవన నడిపించటం మన బాధ్యతరా.'' మళ్ళా మొదటికొచ్చాడు వెంకట్.

''నిజమేరా, నేను కాదనటం లేదు. కానీ వాడు స్కూలుకు పోననటం లేదుగా, ఆదివారం పొద్దున గుడికెళ్దామంటే ఇష్టం లేదన్నాడు. వాడికి పక్కింటి పిల్లల్తో ఆడుకోవటం అలవాటయింది. అయినా ఒకటి రెండుసార్లు బలవంతంగానే తీసుకుపోయాం. కానీ వాడు దోవంతా ఏడుస్తుంటే ఇక వద్దులే అని వదిలేశాం.''

''కవిత కూడా అలాగే ఏడ్చేదిరా. నాలుగైదు వారాలు పోయింతర్వాత గుళ్ళో పిల్లల్తో స్నేహం కుదిరింది. ఆ తర్వాత బలవంతం చెయ్యాల్సిన అవసరమే రాలేదు. ఆదివారం ఎప్పుడొస్తుందా అని చూస్తుంటుంది.''

ఉదయం పదిగంటలప్పుడు కవితను గుళ్ళో వదిలేసి పన్నెండు గంటలకెళ్ళి తీసుకొచ్చేవాడు వెంకట్. అప్పుడప్పుడూ విమల, వెంకట్‌లు గుడి నుంచి నేరుగా రాధ, శేఖర్ల ఇంటికి భోజనానికొచ్చేవారు. శేఖర్ కొడుకు వినయ్ కవిత కంటే రెండేళ్ళు చిన్నవాడు. వయసులో తేడా ఉండటం వల్ల పిల్లలిద్దరికీ స్నేహం కుదర లేదు. అయినా కవిత వస్తుందంటే ఎక్కడ ఆడుకుంటున్నా ఆ సమయానికి ఇంటికొచ్చేవాడు వినయ్. పెద్దవాళ్ళు లివింగ్‌రూంలో కూర్చొని మాట్లాడు కుంటుంటే పిల్లలిద్దరూ వినయ్ రూంలో కార్టూన్లు చూస్తూ గడిపేవారు.

2

‘‘ఒరేయ్, ఇంకా తెలియకపోవటమేంట్రా. ఇంట్లో ఇద్దరు డాక్టర్లు ఉంటూ వాడికి ఏం చదవాలో తెలియకపోవటమేంట్రా? నువ్వెప్పుడన్నా అడిగావా వాణ్ణి అసలు? తల్లిదండ్రుల వృత్తే పిల్లలు మామూలుగా ఇష్టపడతార్రా. లేక మీరే డాక్టర్లు పడే అగచాట్ల గురించి వాడి ముందే మాట్లాడుకుంటూంటారా?’’ అడిగాడు వెంకట్.

‘‘లేదులేరా. మాక్కూడా వాడు మెడిసిన్ చెయ్యటమే ఇష్టం. వాడికీ మెడిసిన్ అంటేనే ఇష్టం అనుకుంటాను. కానీ అప్పుడే అంత ఖచ్చితంగా ఎలా తెలుస్తుం దిరా? హైస్కూలు ఇంకా రెండు సంవత్సరాలుందిగా,’’ సమర్థించుకున్నాడు శేఖర్.

ఇది పదేళ్ళ నాటి సంభాషణ. అప్పటికి కవిత హైస్కూలు ముగించి యంగ్ స్టన్ యూనివర్సిటీలో మెడికల్ కాలేజీలో చేరింది. వినయ్ పదకొండో తరగతిలో కొచ్చాడు.

‘‘ఉందనుకో. అయినా పిల్లలకు సరైన మార్గం చూపించటం మన బాధ్యతరా. బలవంతంగా కాదు, రోల్ మోడల్స్‌గా. నేనెప్పుడూ కవితను మెడిసిన్ చదవమని చెప్పలేదు. కానీ హాస్పిటల్లో నేనెంతమందికి సహాయం చేస్తున్నానో, ఎంతమంది నాకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారో దానికి బాగా తెలుసు. మేము సుఖంగా బ్రతుకుతున్నామంటే దానికి కారణం నేను డాక్టర్ని కావటం అని కూడా తెలుసు. ఇక దానంతట అదే మెడిసిన్ చదవాలని నిర్ణయించుకుంది. అదీ పదకొండో తరగతిలో కాదు. చిన్నపట్నుంచీ డాక్టర్నవుతాననేది.’’

తల వంచుకుని వింటూ కూర్చున్నాడు శేఖర్. కవిత తెలివిగల అమ్మాయి. బాగా శ్రద్ధగా చదువుతుంది. వినయ్ కూడా తెలివిగలవాడే. నిజానికి ఆ వయసులో

తనకంటే వాడే తెలివైనవాడని అనుకున్నాడు శేఖర్ చాలాసార్లు. కానీ, వాడికింకా ఏ సబ్జెక్ట్ మీదా ప్రత్యేకమైన ఇష్టం ఉన్నట్టులేదు. బయాలజీ అంటే చాలా ఇష్టం అన్నాడు కొన్నాళ్ళు. క్లాసులో ఇన్సులిన్ గురించి నేర్చుకున్న రోజు ఎంతో ఉత్సాహంగా మాట్లాడాడు. అంతకుముందు వాళ్ళమ్మ ఎంత బతిమాలినా ఉదయం ఏమీ తినకుండా బడికెళ్ళేవాడు బుద్ధిగా సీరియల్ తిని వెళ్ళటం మొదలెట్టాడు. కాని, ఆ బుద్ధి నెలరోజులు కూడా నిలవలేదు. తర్వాత చరిత్ర గురించి గొప్పగా మాట్లాడే వాడు. గ్రీకుల గురించీ వాళ్ళ దేవుళ్ళ గురించీ తెలుసుకున్నవన్నీ చాలా కూల్ అనేవాడు. ప్రాచీన సాహిత్యాల క్లాసులో 'రామయాన' 'మహాబరాటా'ల గురించి చదివిన రోజుల్లో వాటి గురించి చాలా ఉత్సాహంగా మాట్లాడేవాడు. కొత్త విషయాలు తెలుసుకోవటంలో ఎంతో చురుకుదనం చూపిస్తున్నా, ఏదో ఒక సబ్జెక్టు మీదో ఒక వృత్తి వైపో ఇంతవరకూ మొగ్గుచూపలేదు.

3

హైస్కూల్ అయింతర్వాత వినయ్ యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్‌లో చేరాడు. మెడిసిన్ చదవాలనే ఉద్దేశంతో తగిన కోర్సులు తీసుకున్నాడు. బాగా చదివాడు. మొదటి సెమిస్టర్ సులభంగానే సాగిపోయింది. రెండో సెమిస్టర్‌లో ఆర్గానిక్ కెమిస్ట్రీకి వినయ్‌కీ పొంతన కుదరలేదు. ప్రీ మెడ్‌లో చేరిన వారిలో దాదాపు సగం మంది ఆర్గానిక్ కెమిస్ట్రీ తర్వాత మెడిసిన్ వదిలేసి మరో మేజర్ తీసుకుంటారని ప్రతీతి. అది వినయ్ విషయంలో నిజమయింది. సెమిస్టర్ మధ్యలోనే వదిలేస్తానన్నాడు.

"అదేంటి నాన్నా, యూనివర్సిటీలో చదువు చెప్పాలి, ఆలోచించేట్టు చెయ్యాలిగాని, ఈ ఫార్ములాలు బట్టీబెట్టటం, స్ట్రక్చర్లు గుర్తుంచుకోవటం, ఇదంతా అర్థంలేని చదువులాగుంది నాకు. వైద్యానికీ దీనికీ ఏంటీ సంబంధం?" తల్లిదండ్రుల అనుమతితోనే మానేద్దామని శేఖర్‌నడిగాడు వినయ్.

"మెడిసిన్ చదివింతర్వాత కొందరు రిసర్చ్ చేస్తార్రా. అప్పుడు ఈ కెమిస్ట్రీ బాగా ఉపయోగపడుతుందంటారు."

"మరి ఆ కొద్దిమంది కోసం దాన్ని అందరి మీదా రుద్దటం ఎందుకూ?"

ఇష్టం అయినా కాకపోయినా ఓ పని మొదలుపెట్టిన తర్వాత దాన్ని సాధ్యమైనంతవరకూ పూర్తిచెయ్యాలనీ, అలా చెయ్యటమే ఉత్తమ లక్షణమనీ వాదించారు

రాధా శేఖర్లు. ఇష్టంకాని సబ్జెక్టుతో కాలయాపనం చెయ్యటంకంటే తనకు ఆసక్తి కలిగించే సబ్జెక్టు ఏంటో తెలుసుకోవటం ముఖ్యమనీ, దానికి కాలేజీలో మంచి అవకాశాలున్నాయనీ వాదించాడు వినయ్. కాని, చివరకు తల్లిదండ్రులను కాదన లేక ఆ సెమిస్టర్ చివరిదాకా ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివాడు. రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్లో సైకాలజీ, ఆఫ్రికా పరిచయం, లాటిన్ తీసుకున్నాడు.

ఇష్టంలేని చదువు చదవమని వినయ్‌ని బలవంతం చెయ్యటం రాధా శేఖర్ల క్కూడా ఇష్టం లేకపోయినా, వాడికి దేనిమీదా ఫోకస్ లేకపోవటం ఇద్దరికీ విచారం కలిగించింది. అదీగాక ఎవరింటికైనా పార్టీకి వెళ్ళినప్పుడు ప్రతివాడూ కాలేజీలో మీవాడేం చదువుతున్నాడు? అని అడుగుతాడు. వాళ్ళ పిల్లలు ప్రీమెడ్‌లోనో, ఇంజి నీరింగ్‌లోనో, బిజినెస్‌లోనో ఉంటారు. వినయ్ ఇంకా మేజర్ గురించి ఆలోచించ లేదనో, లేక సైకాలజీ చదువుతున్నాడనో చెప్పటం ఎలా? ఒకవేళ చెప్తే ముఖం మీద ఏమీ అనకపోయినా చాటుగానైనా వినయ్ పనికిమాలినవాడనో, తల్లిదండ్రు లకు పిల్లల్ని పెంచటం చాతగాదనో అనుకుంటారు. మిగతా వాళ్ళదాకా ఎందుకూ, వెంకటే అంటాడు.

"ఒరేయ్, నీకేమన్నా మతిపోయిందా ఏంట్రా? సైకాలజీ ఎందుకూ పనికి రానివాళ్ళు తీసుకునే సబ్జెక్టురా. వాడి ప్రీమెడ్ ఏమైంది? సైకాలజీలోకెందుకొచ్చి నట్లు?" కొంచెం విసుగ్గానే అడిగాడు వెంకట్.

"వాడికి కెమిస్ట్రీ అంటే ఇష్టం ఉన్నట్లు లేదురా. కొంచెం కష్టం అనిగూడా అన్నాడు. ప్రీమెడ్ చెయ్యాలంటే కెమిస్ట్రీలో మంచిగ్రేడ్ రావాలిగదా."

"మరి సైకాలజీ చదివి ఏం చేస్తాడంట?"

చదవటం గురించేగాని ఆ చదువుకి ఉద్యోగావకాశాలెలా వుంటాయో వినయ్‌తో మాట్లాడలేదు శేఖర్. సైకాలజిస్టులున్నారని తనకు తెలుసు. యూని వర్సిటీల్లో సైకాలజీ డిపార్ట్‌మెంట్లు ఉన్నాయ్.

"డబ్బులున్నవాళ్ళ పిల్లలూ, బాధ్యత లేకుండా పెరిగే పిల్లలూ చదువుతార్రా సైకాలజీ. వాళ్ళకు కాలేజీ తర్వాత ఎలా బతుకుతామా అన్న భయం ఉండదుగా, అందుకని." ఆలోచిస్తున్న శేఖర్‌కి తనకు తెలిసిన నిజమేదో చెప్పాడు వెంకట్.

"సైకాలజీ చదివింతర్వాత కూడా మెడిసిన్ చెయ్యొచ్చండీ," అని అందు కుంది రాధ.

శేఖర్ని వెంకట్ కించపరుస్తున్నట్లు మాట్లాడటం మొదట్నుంచీ రాధకి ఇబ్బందిగానే ఉండేది. కానీ ఒకే వూళ్ళో పుట్టిపెరిగి చిన్నప్పట్నుంచీ స్నేహితులుగా ఉన్న వారి మధ్య జోక్యం చేసుకోవటం ఇష్టం లేక వాళ్ళ సంభాషణలకు తనెప్పుడూ దూరంగానే ఉండేది. బెల్లం కొట్టిన రాయిలా ఊరక వింటూ కూర్చుంటాడేగాని గట్టిగా జవాబుచెప్పి అతని నోరు మూయించడేం అని శేఖర్ మీద కోపం వచ్చేది కూడా. అప్పుడప్పుడూ శేఖర్ని సమర్థించాలని గట్టిగా అనిపించినా నిగ్రహించుకునేది.

"అది నిజమేననుకోండి. అయినా అటూ ఇటూ తిరిగి మెడిసిన్‌కి రావటం కంటే నేరుగా పోతే బాగుంటుందిగదా అని అంటున్నాను. అంతే," అన్నాడు వెంకట్. పది సంవత్సరాల పరిచయం ఉన్నా రాధతో అంత చనువులేదు వెంకట్‌కి. ఆమెతో వాదించేంత సాహసం కూడా లేదు.

4

నాలుగు సెమిస్టర్లు చదివిం తర్వాత, సైకాలజీ, ఫిలాసఫీ కోర్సులు తీసుకున్న తర్వాత, ఒకరోజు యూనివర్సిటీ వదిలేస్తానన్నాడు వినయ్. రాధాశేఖర్లకు షాక్ కొట్టినట్లయింది. వీడికి నిజంగా మనస్థిమితం లేదేమోనని భయపడ్డారు. కాని, యూనివర్సిటీ వదిలేసి కాలేజ్ ఫర్ క్రియేటివ్ స్టడీస్‌లో చేరతానన్నాడు వినయ్. ఆ కాలేజీ గురించీ దాదాపు సంవత్సరంగా విషయసేకరణ చేశాననీ, అక్కడ ఒక కౌన్సిలర్‌తో మాట్లాడాననీ, యానిమేషన్ అండ్ డిజిటల్ ఆర్ట్స్ మేజర్‌గా తీసుకుని అక్కడ చదవాలని నిశ్చయించుకున్నాననీ చెప్పాడు వినయ్.

అసలు చదువే మానేస్తాడేమోనని భయపడిన రాధాశేఖర్లు కొంత ఊరట పడ్డారు. యానిమేషన్ గురించీ, దానికున్న అవకాశాల గురించీ అడిగారు. వినయ్ కాలేజీ నుంచి తెచ్చిన బ్రోషర్లు చూపించాడు. ఇదివరలో యానిమేషన్ మేజర్‌తో పాసైన వాళ్ళు మంచి ఉద్యోగాలు సంపాదించారు. ముఖ్యంగా వీడియో ఆటలు, సినిమా పరిశ్రమల్లో పనిచేస్తున్నారు.

వినయ్ పెద్ద యూనివర్సిటీ నుంచి చిన్న కాలేజీకి మారటం కొంత ఇబ్బంది గానే అనిపించినా చివరకి రాధాశేఖర్లు సరేనన్నారు.

"యానిమేషనా, అంటే వీడియో గేంలూ, డిస్నీ సినిమాల్లో లాగానా? నువ్వే మన్నావు? సరేనన్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు వెంకట్.

“అనటానికేముందిరా. వాడికి బాగా ఇష్టమయిన సబ్జెక్టుని కాదనటం ఎలాగా? నీకు తెలుసుగదా, వాడికి చిన్నప్పట్నుంచీ కార్టూన్లూ, యానిమేషన్ వీడియోలంటే చాలా ఇష్టం. పైగా సైకాలజీకంటే ఇది నయమేకదా అనిపిస్తుంది.” నేలచూపు చూస్తూ మెత్తగా అన్నాడు శేఖర్.

వెంకట్‌కి విసుగూ కోపం ఒకేసారి పొంగుకొచ్చాయి. చిన్నతనంలో కార్టూన్లు అంటే ఇష్టం లేందెవరికీ? అలా అని పెద్దయింతర్వాతగూడా కార్టూన్లు చూస్తూ కూర్చుంటామా యేంటి? వెంకట్‌కి వినయ్ అంటే చిన్నప్పట్నుంచీ చాలా ఇష్టం. వాణ్ణి తల్లిదండ్రులే క్రమశిక్షణ లేకుండా చెడగొట్టారని అతని నమ్మకం. బయట కెప్పుడూ చెప్పకపోయినా కవితకీ వినయ్‌కీ పెళ్ళి చేస్తే బాగుంటుందని అనుకున్న క్షణాలు లేకపోలేదు. కానీ రానురానూ వినయ్ పనికిమాలినవాడుగా తయారవు తున్నాడన్న ఆలోచన బలపడుతూ వచ్చింది.

5

కవిత మెడిసిన్ అయ్యింతర్వాత ఇంటర్నల్ మెడిసిన్‌లో రెసిడెన్సీ చెయ్య టానికి తిరిగి డిట్రాయట్ వచ్చేసింది. తల్లిదండ్రుల ఇష్టప్రకారం ఇక్కడే ప్రాక్టీస్ చేస్తున్న ఒక తెలుగు డాక్టర్ని పెళ్ళి చేసుకుంది.

వినయ్ ఉద్యోగాన్వేషణలో లాస్ ఏంజెలీస్ వెళ్ళాడు.

“లాస్ ఏంజలీస్ వెళ్ళటం ఏంటిరా? ఉద్యోగం వస్తే వెళ్ళటంలో అర్థ ముంది. అక్కడికెళ్ళి ఉద్యోగం చూసుకోవటం ఏంటిరా?” అడిగాడు వెంకట్.

“ఎల్లేలో యానిమేషన్ సినిమాలు తీస్తున్న స్టుడియోలు చాలా ఉన్నాయి కదా. అక్కడెవరో స్నేహితుడున్నాడట. అతనితో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తా ననిపోయాడు.”

“బాగా ఉందిరా. ఏదో సినిమా స్టుడియోలో చేరతాడు. ఆతర్వాత ఒక నల్లదాన్నో తెల్లదాన్నో తీసుకొని ఇంటికొస్తాడు. అప్పుడుగూడా నీ ఇష్టమేనంటారా మీ ఇద్దరూ?” అసహనంగా అడిగాడు వెంకట్.

“మరి అలాంటి విషయాల్లో వాడిష్టం కాక మా ఇష్టం అంటే కుదురు తుందా?” అంతే అసహనంతో జవాబిచ్చాడు శేఖర్, తలెత్తి వెంకట్ ముఖంలోకి నేరుగా చూస్తూ.

వింటూ కూర్చోటం తప్ప ఉద్రేకంగా జవాబు చెప్పే అలవాటు లేని శేఖర్ సమాధానం వెంకట్‌ని ఆశ్చర్యపరిచింది.


"నీకు మరీ ఇంత ఉదార స్వభావం ఎప్పుడొచ్చిందిరా? చిన్నప్పట్నించీ వుందా? లేక వాడిలా తయారవటం వల్ల అబ్బిందా?"

ఆ ప్రశ్న శేఖర్ని ఆశ్చర్య పరిచింది. తొందరగా సమాధానం దొరుకుతుందేమో నని ఒక్కక్షణం ఆలోచించాడు. సమాధానం దొరక్క దూరంగా చూస్తూ ఉండి పోయాడు.

ఆదివారం ఆంధ్రజ్యోతి
25 ఫిబ్రవరి 2007

పై చదువు

క్లాసులోకొచ్చి చేతిలోని పుస్తకాలనూ పేపర్లనూ బల్ల మీద పెట్టి విద్యార్థుల వైపు చూసింది ప్రొఫెసర్ హైనెన్. కుశలప్రశ్నలు వేసింది. అప్పటిదాకా మాట్లాడుకుంటున్న విద్యార్థులు తమ సంభాషణలను ముగించారు. పదకొండుమందీ వున్నారు.



పోయిన వారం ఫ్లూ కారణంగా క్లాసుకి రాని ఇద్దరు విద్యార్థులను పరామ ర్శించింది హైనెన్.

"ఈరోజు మనం చర్చించబోతున్న పరిశోధనాపత్రం డాక్టర్ ఏంథోనీ ఫోచీ గారిది. ఈరోజు డిస్కషన్ లీడర్ ఎవరూ?" అని క్లాసు వైపు చూసింది హైనెన్. జెరెమీ చెయ్యెత్తాడు - తనేనంటూ. "ఓకే, మరి మొదలుపెడదామా?" అంది హైనెన్. జెరెమీ తన నోట్స్ తీసుకుని క్లాసు ముందుకొచ్చి నిల్చున్నాడు. ఈలోగా తను కరెక్ట్ చేసిన ఎసైన్‌మెంట్లను ఒక్కొక్కరి దగ్గరకు వెళ్ళి ఇచ్చేసింది హైనెన్.

ఫోచీ రాసిన పరిశోధనాపత్రం నేపథ్యం గురించి మాట్లాట్టం మొదలు పెట్టాడు జెరెమీ. "ప్రస్తుతం ఎయిడ్స్ చికిత్సకు మిశ్రమ ఔషధాలు వాడుతున్నారు. కాని వాడుకలో ఉన్న ఔషధాలకంటే శ్రేష్ఠమైన మందులు రావాలంటే వ్యాధి గురించి మనకు ఇంకా మంచి అవగాహన రావాలి. అందుకే ఫోచీ లాంటివారు ఈ వ్యాధి మూలకారణాల గురించి పరిశోధనలు జరుపుతున్నారు."

మూడో బెంచీలో కూర్చున్న రాధ హైనెన్ కరెక్ట్ చేసి ఇచ్చిన ఎసైన్‌మెంటుని ఒక్కో పేజీ తిరగేసి చూస్తోంది. దాన్నిండా ఎర్రసిరాతో రాసుంది. అక్కడక్కడా మాత్రం మంచి పరిశీలన అనీ, బాగుంది అనీ రాసి ఉంది. చివరి పేజీ చూసింది రాధ. గ్రేడ్ 3.0. బాగుంది అని రాసిన ప్రొఫెసర్ కనీసం బీ రేంజిలోనైనా మార్కులు ఇవ్వొచ్చుగా?

" హలో."

ఉలిక్కిపడి కుర్చీలో సరిగ్గా కూర్చుంది రాధ. హైనెన్ పక్కనే నుంచుని ఉంది. అటూ ఇటూ చూసింది రాధ. అందరూ తనవైపే చూస్తున్నారు.

"ఎక్కడున్నావ్?" తీక్షణంగా చూసింది ప్రొఫెసర్ హైనెన్.

"సారీ మేడమ్." క్లాసులో డిస్కషన్ జరుగుతుండగా పరధ్యానంగా ఉన్నందుకు సిగ్గుపడింది రాధ.

"నువ్వు చెప్పగలవా? ఎయిడ్స్ చికిత్సలో ఇంటర్లూకిన్-7 పనికొస్తుందని అనుకోవటానికి కారణం ఏంటి?"

తెల్లముఖం వేసి అలాగే హైనెన్ వైపు చూస్తూ కూర్చుంది రాధ.

"ఎవరైనా చెప్పగలరా?" విసుగ్గా క్లాస్ వైపు చూసింది హైనెన్.

★ ★ ★

మధ్యాన్నం నాలుగ్గంటలకు ప్రొఫెసర్ సమ్నర్‌గారి ఆఫీసు తలుపు మూసి వుంది. లోపలుంటే ఎప్పుడూ తలుపు వేసి ఉంచడు. ఇంకా మీటింగ్ నుంచి రాలేదేమో. తలుపు దగ్గిరే గోడకానుకుని చతికిలబడింది రాధ.

శరీరంలో ఏ అవయవం ఎలా పనిచేస్తుందో తను చెప్పగలదు. కోలెస్టరాల్ స్ట్రక్చర్ బోర్డు మీద రాయమంటే రాయగలదు. రక్తంలో హీమోగ్లోబిన్ ఎంత వుండాలి అంటే చెప్పగలదు. కాని ఫలానా పరిశోధన గురించి నీ అభిప్రాయం ఏంటీ అంటే తనేంచెప్తుంది? ఇండియాలో బిఎస్సీలో ఇలాంటి ప్రశ్నలు తన్నెవరూ అడగలేదు. ఇంతకుముందు ఇలాంటి అనుభవాలు లేకపోయినా ఒక పరిశోధనా పత్రం చదివి దాంట్లో ఎలాంటి ప్రయోగాలు చేశారో ఎందుకు చేశారో తను చెప్ప గలుగుతుంది. కాని ఆ చేసినవారి ఆలోచన సరిగ్గా ఉందో లేదో, ఎలాచేస్తే ఇంకా బాగుండేదో, ఎలా చేస్తే ఇంకా ప్రయోజనకరమైన ఫలితాలొచ్చేవో, ఇలాంటి ప్రశ్నలకు తనెలా సమాధానం చెప్తుంది? బట్టీబట్టి పరిక్షలు రాసిందేగాని బిఎస్సీలో తన అభిప్రాయాలను ఎవరూ అడగలేదు. క్లాసులో మిగతావారు బాగానే సమా ధానాలు చెప్తున్నారనిపిస్తోంది. కాని తను వాళ్ళలా ఆలోచించలేకపోతోంది. ఇండియాలో మాకు ఇలాంటి ప్రశ్నలు లేవు అని చెప్పినా ప్రొఫెసర్ హైనెన్ నమ్ము తున్నట్లులేదు. ఆ మలయాళీ అబ్బాయి సమీర్ బాగానే సమాధానాలు చెప్తూన్నాడు. ఎక్కడ చదివాడో మరి. బిఎస్సీ ఈ దేశంలోనే చదివాడేమో.

గడియారం చూసుకుంది. ఈ ప్రొఫెసర్ వస్తాడో రాడో. నాలుగ్గంటలకు రమ్మని చెప్పటం మర్చిపోయాడేమో.

నాలుగ్గంటలంటే ఇండియాలో రాత్రి రెండుగంటలయ్యుంటుంది. వూళ్ళో అందరూ నిద్రపోతూంటారు. ఆ రాత్రి తనొక్కతే మేలుకొని ఉంది. చుట్టూ అంతా చీకటి, నిశ్శబ్దం. అమ్మనెలా ఒప్పించటం? చదువుకోవటానికి చాలామంది అమెరికా వెళ్తున్నారు. ఆడపిల్లలు కూడా. పెళ్ళి చేసుకుంటే వెళ్ళటం వీలవుతుందా? అమ్మకా విషయం తెలియక్కాదు. ఒక్కదానివి ఎలా వెళ్తావంటుంది? అమ్మ దృష్టి లో పెళ్ళి కాని ఆడపిల్లలందరూ ఒంటరివాళ్ళే. నువ్వు పాతకాలపు మనిషివి అంటూ అమ్మని తనెంత ఎగతాళి చేసిందో! కాని నిన్నటి రాత్రి తొమ్మిది గంటలప్పుడు, చీకట్లో, మంచులో లైబ్రరీ నుంచి రూమ్‌కి వెళ్తుంటే ఎంత ఒంటరితనం! ఇండియా లో అయితే పల్లెటూళ్ళో కూడా తొమ్మిది గంటలప్పుడు రోడ్డు మీద మనుష లుంటారు. ఇక్కడ ఒక్కరూ కనిపించరేం! కారులేంది తనకొక్కదానికేనా? ఆ అరమైలు దూరం నడవటానికి ఎంతసేపుపట్టిందో! గడియారం మరోసారి చూసు కుంది రాధ.

“సారీ రాడా, మీటింగ్ కొంచెం ఆలస్యంగా ముగిసింది. చాలాసేపట్నుంచి కూర్చోనున్నావా?” అడుగుతూ తన ఆఫీస్ తలుపు తెరిచాడు ప్రొఫెసర్ సమ్నర్.

"రా, కూర్చో," అంటూ, తన కోటుతీసి హేంగర్ మీద వేసి గోడకు తగిలించి, "విషయం ఏంటో చెప్పు," అని అడిగాడు.

రాధకు కళ్ళనీళ్ళు ఆపుకోవటం చాలా కష్టం అయ్యింది. రెండు నిముషాలు ప్రయత్నించి కంపోజ్ అయింతర్వాత, "ఇది నావల్ల అయ్యేట్టు లేదు సర్," అంది.

"అంటే? అసలేం జరిగిందో చెప్పు."

"నిన్న ప్రొఫెసర్ రెడ్డిగారి లాబ్‌లో పని అయిపోయేటప్పటికి తొమ్మిదిన్నర యింది. నడుచుకుంటూ రూమ్‌కెళ్ళేసరికి పదిదాటింది. మా రూమ్మేట్- ఆ అమ్మాయికి సరిగ్గా వంట చెయ్యటం చేతగాదు. అలసిపోయి ఉండటం, చల్లో అంత దూరం నడిచి రావటం, పైగా ఆకలి- నాకేడుపొచ్చింది. ఈ దేశం ఎందు కొచ్చాన్రా బాబూ అని నామీద నాకే కోపమొచ్చింది."

ఈసారి కళ్ళనీళ్ళు ఆపుకోవటం రాధ వల్ల కాలేదు.

"అయామ్ సారీ, రాడా, కంపోజ్ యువర్‌సెల్ఫ్. ఇప్పుడే వస్తాను," అని బయటికెళ్ళాడు సమ్నర్. ఐదు నిముషాల్లో రెండు కాఫీ కప్పుల్తో వచ్చాడు. ఒకటి రాధ చేతికిచ్చాడు.

"థాంక్స్ సర్. సారీ, నిన్నయితే నాకు ఎలాగో ఉండింది. అసలు చదువు మానుకోవాలనిపించింది. కాని మళ్ళా ఆలోచిస్తే ఇంత ఖర్చుపెట్టి, ఇంటి దగ్గర అమ్మానాన్నలను ఎంతో కష్టం మీద వొప్పించి ఇక్కడికొచ్చాను. ఇప్పుడు మూడు నెలల్లోనే తిరిగి వెళ్ళిపోతే ఎంత నామర్దా! ఆలోచిస్తుంటేనే భయం వేస్తుంది." కళ్ళు తుడుచుకుంది రాధ.

"రాడా, నేను నీకు చదువు గురించి మాత్రమే ఎడ్వైజర్ని. వ్యక్తిగత విషయాల మీద నేన్నీకెలాంటి సలహాలూ ఇవ్వలేను. ఇంతవరకూ నీ చదువు బాగానే సాగు తున్నట్లుంది. మిడ్‌టర్మ్స్‌లో 'బీ' లూ 'సీ' లూ వచ్చాయికదా. ఇంతలోనే దిగులు పడొద్దు. కొత్తదేశానికీ, పద్ధతులకూ అలవాటుపట్టానికి కొంతకాలం పడుతుంది. ఇది నీకు తెలియందేమీ కాదు. అంత తొందరగా నిరాశపడొద్దు."

తలొంచుకుని వింటూ కూర్చుంది రాధ.

"ప్రొఫెసర్ రెడ్డిగారి లాబ్‌లో రాత్రి తొమ్మిదిన్నరదాకా ఏంచేస్తున్నావు. ఎన్ని గంటలు పనిచేస్తున్నావు?"

"లెఖ్ఖకయితే వారానికి ఎనిమిది గంటలే సర్. కాని నిజానికి నేనెప్పుడూ అక్కడే ఉంటున్నాననిపిస్తుంది. కనీసం వారానికి ఇరవైగంటలకన్నా ఎక్కువే అక్క డుంటున్నాను. చదువుకోవటానికీ, లైబ్రరీ కెళ్ళటానికి టైమ్ చాలటం లేదు."

"ఏం పని చేస్తున్నావక్కడ?"

"రెడ్డిగారి టెక్నీషియన్, ఆమె పేరు మార్తా, మార్తా ఏ పనిచ్చినా చేస్తాను. పిసిఆర్ రియాక్షన్స్ క్లీనప్, ప్లాస్మిడ్ ప్యూరిఫికేషన్, డి ఎన్ ఏ జెల్స్- ఇలాంటివి."

"ఒక పని చెయ్. మార్తాతో ఒకరోజు చెప్పు. నాకు అంత సమయం లేదు, చదువుకోవటం వీలుకావటం లేదు. ఇలా పనిచెయ్యలేను అని చెప్పు."

"ఆమెకు కోపం వచ్చి ప్రొఫెసర్ రెడ్డిగారితో నామీద చాడీలు చెప్తుందేమో. ఆయన పని మానుకోమంటే? ఇంకొక అసిస్టెంట్‌షిప్ దొరకటం చాలా కష్టం. ఇదైతే నెలకు మూడొందల అరవై డాలర్లు వస్తున్నయ్. అదికూడా లేకపోతే చాలా కష్టం అవుతుంది."

"అలా భయపడాల్సిన అవసరం లేదు. ఎనిమిది గంటలకు డబ్బులిస్తూ ఇరవై గంటలు పనిచెయ్యమనటం సమంజసం కాదు. ప్రొఫెసర్ రెడ్డిగారు అర్థం చేసుకోగలరు. ఒక స్కెడూల్ వేసుకో. ఫలానారోజు ఈ సమయం నుంచి ఈ సమయం దాకా పనిచేస్తానని చెప్పు. ఆ స్కెడూల్ ప్రకారం పనిచెయ్."

మార్తాతో ఈ విషయం ఎలా ప్రస్తావించాలా అని ఆలోచించటం మొదలు పెట్టింది రాధ.

"ఇంకేమైనా ఉందా?"

"సర్"

"చెప్పు."

"మీ క్లాసులో నా ప్రజంటేషన్ ఇంకొక వారం రోజులు గడువిస్తారా సర్"? సన్నగా గొణిగింది రాధ.

"అలా వీలుకాదు రాడా. అందరూ ఇలాగే అడిగితే క్లాసులో స్కెడూల్ ప్రకారం ఏదీ చెయ్యలేం. ప్రాబ్లెం ఏంటీ?"

"ఏంటీబాడీ ప్రొడక్షన్ పద్ధతుల గురించి లైబ్రరీకెళ్ళి కొంత రిసర్చ్ చేశాను సర్. కాని లైబ్రరీలో కొన్ని పుస్తకాలూ, పత్రికలు దొరకలేదు. వాటిలో కొన్ని ఇంటర్నెట్లో దొరుకుతాయని క్లాస్‌మేట్స్ చెప్పారు. ఇలా రిసర్చ్ చెయ్యటానికి ఇంటర్నెట్ వాడటం నాకు అలవాటులేదు. నేర్చుకోవటానికి కొంత సమయం పడుతుంది. అదీగాక దొరికిన సమాచారంతో పవర్ పాయింట్ స్లైడ్లు తయారుచెయ్యటం నాకు కొత్త. ఇంతవరకు నేనెప్పుడూ క్లాస్ ముందు నుంచోని పవర్ పాయింట్ స్లైడ్లు వాడుతూ ప్రజంటేషన్ ఇవ్వలేదు. అసలు క్లాసు ముందు నుంచోని ఎపుడూ మాట్లాళ్ళేదు. కంప్యూటర్ ఉంటే కొంత సులభంగా ఉండేది. ప్రస్తుతం నాకు కంప్యూటర్ లేదు. వచ్చే సెమిస్టర్‌కి కొనుక్కుంటాను. ఫ్లాష్ డ్రైవ్ అంటే ఏంటో కూడా ఇక్కడకొచ్చిందాకా నాకు తెలియదు. పోయిన వారమే ఇరవై డాలర్లు పెట్టి ఒకటి కొనుక్కున్నాను. కంప్యూటర్ లేకుండా చాలా కష్టం."

“లైబ్రరీలో కంప్యూటర్ బేంక్స్ ఉన్నాయ్ కదా?”

“అవును సర్. ప్రస్తుతం వాటినే వాడుకుంటున్నాను. కాని క్లాసైపోయిం తర్వాత రూమ్‌కెళ్ళి భోజనం చేసి తిరిగి నడుచుకుంటూ లైబ్రరీకొచ్చి పనిచెయ్యటం అంటే సెప్టెంబర్‌లో అంత కష్టం అనిపించలేదు. ఇప్పుడు చల్లో, మంచులో రాత్రి పూట మైలు దూరం నడవటమంటే లైబ్రరీకొచ్చేసరికి చేతులు గడ్డకట్టుకు పోతున్నయ్. తర్వాత పెన్ను పట్టుకోవాలన్నా చాలాసేపు వేళ్ళొంగటంలేదు.”

“నిజమే. సరే, నీకు వారం రోజులు గడువిస్తాను. అంతే. అంత కంటే ఎక్కువ ఇవ్వలేను.”

“థాంక్యూ సర్. థాంక్యూ వెరీమచ్. ఎంతో బరువు తగ్గినట్లనిపించింది రాధకు.

★ ★ ★

ప్రొఫెసర్ హైనెన్ చాలా స్ట్రిక్ట్ అని ఇదివరకే వింది రాధ. అయినా ఆమె తీసుకునే క్లాసులో తనకు మిడ్ టర్మ్‌లో 3.4 వచ్చింది. ఫరవాలేదనిపించింది. కాని ఈసారి తన వ్యాసానికి 3.0 మాత్రమే రావటం. ఫైనల్లో ఇంతకంటే తక్కువొస్తే.

ఒకరోజు ధైర్యం చేసుకుని ప్రొఫెసర్ హైనెన్తో మాట్లాట్టానికెళ్ళింది రాధ. ఆమె గారి ఆఫీసు తలుపు తీసే ఉంది.

“మే ఐ కమిన్ మేడమ్.”

“రాడా! నువ్వా, రా, నువ్వొస్తావని నాకు తెలుసు. రా, కూర్చో.”

కూర్చుంది రాధ. సంచిలోంచి పేపర్ తీసి, “మేడమ్, నా వ్యాసానికి 3.0 ఇచ్చారు. కాని అక్కడక్కడా బాగుంది అని రాశారు.”

“చూడు రాడా. నాకైతే నిన్ను ఫెయిల్ చెయ్యాలని గట్టిగా అనిపించింది. కాని, నీ సమాధానాలు, పరిశీలనలు నిజంగానే బాగున్నాయి. అంతేగాక సెప్టెంబర్‌తో పోలిస్తే నువ్వు చాలా ఇంప్రువ్ అయ్యావు. కాని నీ ఇంగ్లీష్ బాగాలేదు, అస్సలు బాగాలేదు. ఒక్క వాక్యమూ వ్యాకరణబద్ధంగా లేదు. నీ ఆలోచనల్ని సరైన భాషలో రాయలేకపోతే నేను మంచి మార్కులివ్వను. అది నా పద్ధతి. ఈ విషయం నేను మొదటి క్లాసులోనే చెప్పాను. గుర్తుందా?”

“యస్ మేడమ్.” గొణిగింది రాధ.

“నువ్వొకపన్చెయ్. ఒక ఇంగ్లీష్ కోర్స్ తీసుకో. రాయటం మెరుగు పడుతుంది.”

“యస్ మేడమ్,” అంది రాధ, మనసులోనే వచ్చే సెమిస్టర్ ఖర్చుకి మరొక వెయ్యి డాలర్ల కూడిక వేస్తూ.

"భాష బాగుంటే నీ వ్యాసానికి 3.8 ఇచ్చేదాన్ని."

రాధ తలొంచుకుని కూర్చుంది.

"మిగతా కోర్సుల్లో ఎలా వున్నాయి నీ గ్రేడ్స్?"

"3.3 - 3.4 వచ్చాయి మేడమ్." నేల వైపు చూస్తూనే సమాధానం చెప్పింది.

"చెప్పానుగదా. నీ ఇంగ్లీష్ బాగుంటే నీ వ్యాసానికి కనీసం 3.8 ఇచ్చేదాన్ని. నిజానికి నువ్వు ఇలా రాస్తావని తెలిస్తే ఎడ్మిషన్స్ కమిటీలోగనక నేనున్నట్లయితే, నీకసలు ఎమ్మెస్‌లో ఎడ్మిషన్ కూడా వచ్చేది కాదు."

దుఃఖం, కోపం ఒకేసారి బయటకు రావటానికి గొంతులో చోటులేక తన్ను కుంటున్నాయి. కళ్ళళ్ళో నీరు చేరకుండా గట్టి ప్రయత్నం చేసింది రాధ.

"ఇంకా ఏమైనా ఉందా?"

"లేదు మేడమ్," అని అలాగే కూర్చుంది.

"ఏంటో చెప్పు."

"గ్రేడ్స్ సరిగ్గా లేకపోతే వచ్చే సెమిస్టర్‌కి అసిస్టెంట్‌షిప్ దొరకటం కష్టం మేడమ్."

"అవును. నిజమే. దానికి నేనేంచేస్తాను?" కుర్చీలోంచి ముందుకి వొంగుతూ రాధ ముఖంలోకి చూసింది ప్రొఫెసర్ హైనెన్.

ఇక ఈమెతో ఏం మాట్లాడతాం అనుకుంది రాధ.

"యూనియన్ బిల్డింగ్‌లో రాయటంలో కోచింగ్ ఇస్తారు, తెలుసుగదా?"

"యస్ మేడమ్."

"వచ్చే సెమిస్టర్ తప్పకుండా కోచింగ్ తీసుకుంటానని మాటిస్తావా?"

రాధకు కొంచెం వెలుతురు కనిపించినట్లయింది. "తప్పకుండా మేడమ్." అలవాటుగా తలమీద కుడి చెయ్యి పెట్టుకుని 'అమ్మ తోడు,' అని గొణిగింది రాధ.

చిరునవ్వు నవ్వి, రాధ చేతులోంచి పేపర్ తీసుకొని గ్రేడ్ ని 3.0 నుంచి 3.3గా మార్చింది ప్రొఫెసర్ హైనెన్.

★ ★ ★

క్లాస్‌కెళ్తుంటే దోవలో సమీర్ కలిశాడు.

అతని గ్రేడ్స్ గురించి అడగటం మర్యాదకాదని తెలిసినా అడగాలని ఉబ లాటంగా ఉంది రాధకి.

"సమీర్. వచ్చే సెమిస్టర్‌కి నీకు అసిస్టెంట్‌షిప్ దొరికిందా?"

“నాకు అసిస్టెంట్‌షిప్ ఎందుకూ. ఫుల్‌టైమ్ ఉద్యోగం ఉందికదా. నేను పార్ట్‌టైమ్ స్టూడెంట్‌ని.”

“అలాగా. నాకు డిసెంబర్ దాకా ప్రొఫెసర్ రెడ్డిగారి లాబ్‌లో ఒక చిన్న ఉద్యోగం ఉంది. కాని వచ్చే సెమిస్టర్‌కి ఇంకా ఏమీ దొరకలేదు. ఈ సెమిస్టర్లో మంచి గ్రేడ్స్ రాకపోతే ఎవర్నయినా అసిస్టెంట్‌షిప్ ఇవ్వమని అడగటంగూడా కష్టమే. ప్రస్తుతం నాకు క్యుములెటివ్‌గా 3.3 ఉంది. అది సరిపోతుందంటావా?” సమీర్ వైపు చూసింది రాధ.

“నువ్వు ఈ సంవత్సరమే గదా వచ్చావు. రాగానే చాలా కష్టమైన కోర్సులు తీసుకున్నావు. అయినా 3.3 వస్తుందంటే నువ్వు బాగానే చదువుతున్నావన్నమాట.”

సమీర్ మాటలు రాధకు కొంచెం ఊరట కలిగించాయి. “ఏదో, నా ప్రయత్నం నేను చేస్తున్నాను. అయినా ప్రొఫెసర్ హైనెన్‌గారి క్లాసు ఈ సెమిస్టర్లో తీసుకోకుండా ఉంటే బాగుండేదనిపిస్తుంది. నువ్వు క్లాసులో బాగానే మాట్లాడు తున్నావు. ఇక్కడే చదువుకున్నావా నువ్వు?”

“అవును,” అని చిన్నగా నవ్వాడు సమీర్. “నేను హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో మావాళ్ళు అమెరికా వచ్చారు. నాకారోజుల్లో బుక్ రిపోర్ట్ అంటే ఏంటో తెలిసేదికాదు. నీకిష్టమైన పుస్తకం చదివి దానిమీద క్లాసులో మాట్లాడమన్నాడు మా ఇంగ్లీష్ టీచర్. నువ్వింకా నయం రాధా, ఆరోజు నాకసలు నోట్లోంచి మాట రాలేదు.” పాత జ్ఞాపకాలతో చిరునవ్వు నవ్వాడు సమీర్.

రాధ కూడా నవ్వింది. “నాక్కూడా క్లాసు ముందు నుంచోని మాట్లాడాలంటే భయంగానే ఉంటుంది. అలవాటులేకనే.”

“కొత్తగా వచ్చిన వాళ్ళందరూ ఇలాగే చెప్తూంటారు రాధా. ఎవరికైనా మొదటి సెమిస్టర్ కొంచెం కష్టంగానే ఉంటుంది. తర్వాత అదే అలవాటవుతుంది.'”

సమీర్ మాటలతో రాధ మనసు కొంచెం కుదుట పడింది. భుజాల మీది నుంచి పెద్ద బరువు దించినట్లనిపించింది.

ఆదివారం ఆంధ్రజ్యోతి
10 ఫిబ్రవరి 2008

పరివర్తన

2008 జూన్ 11వ తేదీన అమెరికాలోని ఒక స్థానిక పత్రికలో వచ్చిన వార్త-

“మిచిగన్ పెరోల్ బోర్డ్ వారి ప్రకటన ప్రకారం ఖైదీ 83729463 దీపికారావు మీద అక్టోబర్ 25వ తేదీన విచారణ



జరుగుతుంది. హత్యానేరం పై ఓక్‌లాండ్ కోర్టు దీపికారావుకు 2002 ఫిబ్రవరి 18వ తేదీన పదిహేను సంవత్సరాల శిక్ష వేసింది. మిచిగన్ శిక్షాస్మృతి 791.244 ప్రకారం శిక్ష తగ్గించటమా లేదా అన్న నిర్ణయం తీసుకొనే క్రమంలో ఈ విచారణ జరగబోతోంది. రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీ కాన్ఫరెన్స్ రూమ్‌లో జరగబోయే ఈ విచారణకు మిచిగన్ పౌరులెవరైనా హాజరు కావచ్చు."

హత్య చేసిన మనిషినెవర్నీ నేనిదివరకు కలవలేదు. ఎలా వుంటారో? భయంకరంగా ఉంటారేమో? దేశం కాని దేశంలో ఆమెకు భర్తను చంపేటంత కోపం ఎందుకు వచ్చిందో? దీపికారావు గురించి తెలుసుకోవాలనిపించింది. ఇంటర్‌నెట్‌లో వెతికితే దీపికారావులు చాలామంది ఉన్నారు కాని, మిచిగన్‌లో జైల్లో వున్నామె గురించి ఎక్కువగా వివరాలు దొరకలేదు. తెలిసినంతలో డాక్టర్ రావు ఇండియా వెళ్ళి ఈమెను పెళ్ళి చేసుకుని డిట్రాయిట్‌కి తీసుకొచ్చాడు. ఇక్కడకొచ్చిన రెండు నెలల్లోనే హత్య జరిగింది. కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు ఆమెవైపు మాట్లాడిన ఒకరిద్దరు ఇప్పుడు డిట్రాయిట్‌లో లేరు. ఎక్కడున్నారో తెలియదు. దీపికారావును కలవటం ఎలా వీలవుతుందో తెలుసుకుందామని రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీకి ఫోన్ చేస్తే మొదట తెలిసిన విషయం కరెక్షన్ ఫెసిలిటీ అంటే జైలు అని. నేరాలు చేసిన వారిని సరిదిద్దటానికి ఉపయోగపడే వసతిగృహాలన్నమాట. జైల్లో ఆమెను చూడాలంటే అనుమతి ఉండాలన్నారు. అనుమతి కావాలంటే ఆమె నా పేరూ వివరాలూ జైలు వారికి ఇవ్వాలట. వారు నా గురించి విచారణ జరిపి, ఆమోదించి, నన్ను సందర్శకుల జాబితాలో చేర్చితే, అప్పుడు ఆమెను చూడటం వీలవుతుంది. ఈ తతంగం అంతా సవ్యంగా జరిగితే రెండు నెలలు పట్టవచ్చుట. పెరోల్ బోర్డ్ విచారణ ఇంకా దాదాపు నాలుగునెలలుంది కాబట్టి, సరే చూద్దాం అని దీపికారావు గారికి ఉత్తరం రాశాను.

★ ★ ★

ఊరికి రెండు మైళ్ళ దూరంగా ఉంది రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీ. చుట్టూ ఆరడుగుల ఎత్తు ఇనుపతీగె కంచె. దానిమీద ముళ్ళ తీగె. విజిటర్స్ లాట్‌లో కారు పార్క్ చేసి లోపలికెళ్ళాను.

రిసెప్షన్ ఏరియా ఒక పెద్ద గది. నిరాడంబరంగా, ఖాళీగా ఉంది. కుడివైపు రిసెప్షన్ డెస్క్. దాని వెనుక గోడ మీద రెండు ఫొటోలున్నాయి. ఒకటి గవర్నర్ జెన్నిఫర్ గ్రాన్‌హోం గారిది. రెండోది మిచిగన్ జైళ్ళ అధికారిణి పెట్రీషియా కారుసో గారిది. రిసెప్షన్ డెస్క్ వెనుక కంప్యూటర్ స్క్రీన్ ముందు కూర్చుని ఏదో నవల చదువుతున్న

నల్లతని ముందుకెళ్ళి నుంచున్నాను. అతను నన్ను గమనించేటట్లు లేదని, "క్షమించాలి, నేనొక ఖైదీని చూట్టానికొచ్చాను," అన్నాను. "మొదటిసారా?" అన్నాడతను విసుగ్గా తలెత్తి నన్ను చూస్తూ. "అవును," అన్నాను. రెండు కాగితాలను నిర్లక్ష్యంగా నా ముందుకు నెట్టి మళ్ళా తన నవల్లో తలదూర్చాడతను.

ఒక కాగితం మీద నా వివరాలు రాయాలి. పేరూ, చిరునామా, నేను నడుపుకొచ్చిన కారు వివరాలూ, ఖైదీకీ నాకూ ఉన్న సంబంధం... సంబంధం ఏమి రాయాలో తెలియలేదు. బంధువు కాదు. స్నేహితురాలు అని రాయటానికి జంకాను. పైగా హత్య చేసిన మనిషి. రెండో కాగితం చూశాను. అందులో ఆరోజు నాకంటే ముందు ఖైదీలను చూట్టానికి వచ్చిన ముగ్గురి వివరాలు ఉన్నాయి. సంబంధం విషయంలో అందరూ ఔట్రీచ్ అని రాశారు. అంటే ఏమిటో వెంటనే తోచకపోయినా నేనూ ఔట్రీచ్ అనే రాశాను.

రెండు కాగితాలూ అతనికి తిరిగి ఇస్తూ, దీపికారావును చూట్టానికి అనుమతిస్తూ పోస్టులో వచ్చిన ఉత్తరం అతనికి ఇచ్చాను. నా వివరాలు కంప్యూటర్లో చెక్ చేసినట్లున్నాడు. ఒక అనుమతి పత్రం ప్రింట్ చేసి ఇచ్చి, వెళ్ళి విజిటర్స్ ఏరియాలో కూర్చోమన్నాడు.

విజిటర్స్ ఏరియాలో రెండు వరుసల్లో కుర్చీలున్నాయి. ముగ్గురు తెల్ల ఆడవాళ్ళు కూర్చుని ఉన్నారు. నన్ను చూసి సన్నగా నవ్విందొకావిడ. వెళ్ళి ఆమె పక్కనున్న కుర్చీలో కూర్చున్నాను. "నా పేరు మిరియం. ఇదివరకు మిమ్మల్నెప్పుడూ చూడలేదే, ఎవర్ని చూట్టానికొచ్చారూ?" అందావిడ.

"అంటే మీకు ఇక్కడకొచ్చేవారందరూ తెలుసా?" అని అడిగాను.

మరో చిరునవ్వు నవ్వి, "వీళ్ళను చూట్టానికి ఎవరొస్తారు? కుటుంబాలు వీళ్ళను ఎప్పుడో వదిలేశాయి. చీకట్లో దీపం వెలిగించి జీసస్ దగ్గరకు చేర్చటానికి ప్రయత్నం చేసే ఔట్రీచ్ వాళ్ళేగదా వీళ్ళను చూట్టానికొచ్చేది. మీదే చర్చి?" అనడిగింది ఆవిడ.

"నేను ఊరికే చూట్టానికొచ్చాను. చర్చి సంబంధం కాదు," అన్నాను.

"అలాగా, ఎవర్ని చూట్టానికొచ్చారు," అంది.

"దీపికారావు," అన్నాను.

"మంచి అమ్మాయి. నేను దీపికను చాలాసార్లు కలిశాను. మంచి అమ్మాయి," అంది ఆవిడ.

విజిటర్స్ ఏరియా నుంచి అద్దాల తలుపు వెనుక ఇద్దరు గార్డ్స్ కనిపిస్తున్నారు. ఇద్దరూ నల్లవాళ్ళే. డెస్క్ వెనుక కంప్యూటర్ ముందు కూర్చుని ఉన్న ఆమెతో

మాట్లాడుతూ అప్పుడప్పుడూ నవ్వుతూ ఉన్నాడు అతను. నేను గడియారం చూసుకున్నాను. మూడున్నర. అప్పటికే నేనొచ్చి దాదాపు ఒక అరగంట అయింది.

"మనం చాలా ఓర్పుగా ఉండాలి. గవర్మెంట్ ఉద్యోగులు కదా, ఏదీ అంత తొందరగా చెయ్యరు, పైగా మనం ఏమైనా అంటే లేనిపోని ఇబ్బందులు పెడతారు," అంది నా పక్కన కూర్చోనున్న మిరియం.

పదినిముషాల తర్వాత అద్దాల తలుపు తెరిచి, మిరియం పేరు పిల్చాడు గార్డ్. ఆమె నా దగ్గర సెలవు తీసుకోని లోపలికి వెళ్ళింది. అద్దాల వెనుక ఆమెను చెక్ చేశాడు గార్డ్. ఎయిర్ పోర్ట్‌లో సెక్యూరిటీ చెకింగ్ లాగా ఉంది. మెటల్ డిటెక్టర్ గుండా నడవమన్నాడు. కుర్చీలో కూర్చోని బూట్లు తీసెయ్యమన్నాడు. సాక్స్ కూడా తీసేయించాడు. కంప్యూటర్లో ఏదో రాశాడు. మొత్తానికి ఆమెను చెక్ చెయ్యటానికి ఐదు నిముషాలు పట్టింది. తర్వాత గార్డులకు వెనుక వున్న తలుపు తీసి ఆమెను లోపలికి పంపించాడు. దాదాపు నాలుగున్నరకు నా పేరు పిలిచాడు గార్డ్. అనుమతి పత్రం అతనికి ఇచ్చాను. నన్ను చెక్ చేసి సెక్యూరిటీ ప్రాంతానికి వెనుక ఉన్న తలుపు తీసి నన్ను లోపలికి పంపించాడు.

ఆ చిన్నగదిలో తలుపు దగ్గరే ఉన్న బల్లవెనుక ఒక నల్లగార్డ్ కూర్చునుంది. జైల్లో ఉద్యోగు లందరూ నల్ల వాళ్ళేలాగుంది. నా అనుమతి పత్రం అమెకు ఇచ్చాను. నా డ్రైవర్స్ లైసెన్స్ తనదగ్గర ఉంచుకుని లోపలికెళ్ళొచ్చని తల ఊపిందావిడ.

విజిటర్స్ రూం విశాలంగా ఉంది. అక్కడక్కడా కుర్చీలున్నాయి. గదికి ఒక వైపు గోడకు రెండు పెద్ద కిటికీలున్నాయి. బాగా వెలుతురొస్తోంది. బయట నాతో మాట్లాడిన మిరియం, మరో ఇద్దరు ఔట్రీచ్ స్త్రీలు వేరు వేరుగా కూర్చుని ఖైదీలతో మాట్లాడుతున్నారు. ఖైదీలు ముగ్గురూ నల్లవాళ్ళే. పాతిక ముప్పైయ్యేళ్ళవాళ్ళు.

ఒంటరిగా కూర్చున్న స్త్రీ దీపికారావు అని ముఖం చూస్తూనే గ్రహించాను. ఆమెకు దాదాపు ముప్పైయ్యైదేళ్ళుండవచ్చు. సన్నగా ఉంది. కళ్ళజోడు. టీ షర్ట్, పాంట్ వేసుకోనుంది. నేను ఊహించిన భయంకర స్వరూపం కాదు. ప్రశాంతంగా, సాధారణంగా కనిపించిందామె.

పరిచయాల తర్వాత ఇద్దరం మౌనంగా కూర్చున్నాము. తనున్న పరిస్థితిలో సాటి తెలుగువారిని ఎవర్ని చూసినా వెంటనే ఏడుపొస్తుందనిపించింది నాకైతే. కాని ఆమె ముఖంలో ఎలాంటి క్షోభా కనపడలేదు. ఆరు సంవత్సరాల జైలు జీవితం మనిషిని అలా గట్టిగా తయారుచేసిందేమో.

ఆమెను ఏమి అడగాలో, సంభాషణ ఎలా మొదలుపెట్టాలో నేను ముందుగా ఆలోచించలేదు, ఇప్పుడు తోచలేదు. ఇంతలో మిరియం తన క్లయింట్ దగ్గర

సెలవు తీసుకుని వెళ్ళిపోతూ మా పక్కగా వెళ్తూ దీపిక వైపు చెయ్యి ఊపింది. దీపిక కూడా ఆమెను గుర్తిస్తూ చిన్నగా నవ్వింది.

"మీతో సంబంధం ఏంటో రాయాల్సిన చోట నేను కూడా ఔట్రీచ్ అని రాశాను," అన్నాను. ఆమె సన్నగా నవ్వింది కాని, ఏమీ అనలేదు. "మిరియం మీతో చాలాసార్లు మాట్లాడిందా?" అని అడిగాను.

"మిరియమే కాదు, అక్కడ కూర్చోనున్న డోరొతీ, పౌలా కూడా చాలాసార్లు మాట్లాడారు, మొదట వచ్చినప్పుడు. ఇప్పుడు అంతగా నాకోసం రావటం లేదు."

"మీరు మతం మార్చుకోరని అనుకుని ఉంటారు. మీకు దేవుడి మీద నమ్మకం ఉందా?"

"నమ్మకం ఉంది. నమ్మినా నమ్మకపోయినా దేవుడితో ఏ చిక్కూ లేదు. ఈ దేవుడి దళారు లున్నారే, వీళ్ళతోనే గొడవ."

"అంటే, మతం మార్చుకోకపోతే ఇబ్బంది పెడతారా?"

"లేదులేండి," అని, కొంచెం తటపటాయించి, తర్వాత చెప్పిందామె. ఔట్రీచ్ వాళ్ళు మతం మార్చుకోమని సూటిగా బలవంతం చెయ్యరట. కాని, పరోక్షంగా చేస్తారట. ఇతర ఖైదీల చేత చెప్పిస్తారట. మతం మార్చుకుంటే, ఖైదీలో మంచి పరివర్తన వచ్చిందనీ, శిక్ష తగ్గించవచ్చుననీ పెరోల్ బోర్డ్ వారికి సిఫార్స్ చేస్తారట.

మళ్ళా మా సంభాషణ ఆగిపోయింది. ఇంతలో సెక్యూరిటీ గార్డ్ దీపిక పేరు పిల్చాడు. ఆమె వెళ్ళి గార్డ్‌తో మాట్లాడొచ్చి కూర్చుంది.

కొంచెం జంకుతూ, "నన్ను చూట్టానికి నెలకొక విజిటర్ వస్తారేమో మహా అయితే, ఇప్పుడు ఇంకొకరెవరో వచ్చారట. ఎవరో తెలియదు. ఇక్కడి నియమాల ప్రకారం ఇద్దరు విజిటర్స్‌ని ఒకేసారి లోపలకు రానివ్వరు," అని ఆగిపోయిందామె. నాకు విషయం అర్థమయింది. వచ్చిందెవరైనా నేను వెళ్తేగాని వారిని లోపలికి రానివ్వరు.

ఫరవాలేదు, మళ్ళా మరోసారి వచ్చి కలుస్తానని చెప్పి నేను వచ్చేశాను.

★ ★ ★

ఆ తర్వాత వెంటనే మళ్ళా ఆవిడను చూట్టానికి వెళ్ళటం కుదర్లేదు. ఈలోగా పెరోల్ బోర్డ్ విచారణ రోజు రానే వచ్చింది.

రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీలో 300 నంబర్ గది విశాలంగా ఉంది. తలుపు దగ్గర ఇద్దరు గార్డ్స్ నిలబడి లోపలికి వస్తున్న వారి గుర్తింపు పత్రాలను తనిఖీ చేస్తున్నారు. సెల్ ఫోన్లూ కెమేరాలూ లోపలికి తీసుకుపోవటానికి వీల్లేదనీ వాటిని

కార్లలోనే వదిలేసి రమ్మనీ కొందరిని వెనక్కు పంపుతున్నారు. లోపలికి వచ్చినవారు ముందే వచ్చిన వారిలో తెలిసిన ముఖాలకోసం వెతుకుతూన్నారు.

గదిలో ఒకవైపు పది వరుసల్లో దాదాపు వందకు పైగా కుర్చీలు వేసి ఉన్నాయి. కాని, గదిలో మొత్తం ముప్ఫైమంది కంటే ఎక్కువ లేరు. అందరూ ముందువరసల్లో కూర్చుని ఉన్నారు. వీరికి ఎదురుగా గదిలో అటువైపు ఒక పొడుగాటి బల్ల వెనుక తొమ్మిదిమంది అధికారులు కూర్చుని ఉన్నారు. సభాధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న పెరోల్ బోర్డ్ ప్రెసిడెంట్‌తో సహా ఏడుగురు నల్లవారు. అటార్నీ జనరల్‌కు ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ న్యాయవాదీ, పెరోల్ బోర్డ్ సభ్యుల్లో ఒకరూ తెల్లవాళ్ళు. వారికెదురుగా బల్లకు ఇటువైపు ఒక కుర్చీ వేసి ఉంది.

తొమ్మిది గంటలు కాగానే బల్ల మీద అరచేత్తో రెండు మూడుసార్లు గట్టిగా కొడుతూ, "గుడ్ మోర్నింగ్," అన్నాడు సభాధ్యక్షుడు. సంభాషణలు కట్టేసి అతనివైపు తిరిగారు అందరూ. "గుడ్ మోర్నింగ్, కొంచెం సేపట్లో విచారణ మొదలవుతుంది. భటులు దీపికారావును ఈ వెనక ద్వారం నుంచి లోపలికి తీసుకొస్తారు. ఆమె ఇక్కడ మా ముందున్న కుర్చీలో కూర్చుంటుంది. ఆమెను లోపలికి తీసుకొచ్చేటప్పుడు మీరు ఎవ్వరూ ఉన్న చోటు నుంచి కదలకూడదు," అని మాతో చెప్పి, ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడాడు.

ఇద్దరు గార్డ్స్ వెనక తలుపు తోసుకుంటూ లోపలికొచ్చారు. వారి వెనుక దీపిక, ఆమె వెనుక మరో ఇద్దరు గార్డ్స్ లోపలికొచ్చారు. దీపిక చేతులకూ కాళ్ళకూ సంకెళ్ళు వేసి ఉన్నాయి. అడుగులో అడుగేసుకుంటూ వస్తున్న దీపిక ఒక్కక్షణం అధికారుల బల్లవైపూ తర్వాత ఇటువైపు కూర్చున్న జనం వైపూ చూసింది. ఆమెను కుర్చీదాక నడిపించి గార్డ్స్ తిరిగి తలుపు దగ్గర నిల్చున్నారు.

సభాధ్యక్షుడు మళ్ళా జనాన్ని ఉద్దేశించి, "ఇప్పుడు విచారణ మొదలవుతుంది. మొదట ప్రభుత్వ న్యాయవాదీ, తర్వాత పెరోల్ బోర్డ్ సభ్యులూ దీపికారావును ప్రశ్నిస్తారు. ఆ తర్వాత మీరు దీపికారావు శిక్ష తగ్గించటం గురించి అనుకూలంగాగాని వ్యతిరేకంగాగాని మాట్లాడవచ్చు. కాని మిమ్మల్ని మాట్లాడమని అడిగేంతవరకు ఎవ్వరూ మాట్లాడకూడదు. అలా మాట్లాడిన వారిని బయటకు పంపించవలసి వస్తుంది," అని హెచ్చరించాడు.

తల వంచుకుని కూర్చున్న దీపిక వైపు చూస్తూ, "పద్ధతి ప్రకారం నిన్ను కొన్ని ప్రశ్నలడగాలి. నీ పేరు దీపికారావ్, అవునా?" అన్నాడు. దీపిక తల వూపింది. "అలా కాదు. దయచేసి నిన్నడిగే ప్రశ్నలన్నిటికీ మాటల్లో సమాధానం చెప్పాలి. నీ పేరు?"

"దీపిక. దీపికారావు."

"ఆరు సంవత్సరాల క్రితం నువ్వు నీ భర్తను హత్య చేశావన్న నేరం మీద అరెస్టయ్యావు. అవునా?"

"అవును."

"విచారణలో హత్య చేసింది నువ్వేనని తేలింది. అవునా?"

"అవును."

"నీకు పదిహేను సంవత్సరాల జైలుశిక్ష పడింది. ఇప్పటికి ఆరున్నర సంవత్స రాలుగా నువ్వు జైల్లో ఉన్నావు. ఇన్నాళ్ళూ నీ ప్రవర్తన చాలా బాగా ఉందని జైలు అధికారుల వాఙ్మూలం. మిచిగన్ పౌరులు కూడా కొందరు నీ సత్ప్రవర్తన గురించి పెరోల్ బోర్డుకు ఉత్తరాలు రాశారు. అందువల్ల నిన్ను గడువుకు ముందే విడుదల చేయటం తగునా కాదా అన్న విషయం మీద విచారణ జరపటానికి ఈరోజు మనం ఇక్కడ సమావేశం అయ్యాము. మొదట అటార్నీ జనరల్‌గారి ప్రతినిధిగా వచ్చిన ప్రభుత్వ న్యాయవాది నిన్ను ప్రశ్నిస్తారు," అని అతను పక్కనే కూర్చొని ఉన్న న్యాయవాది వైపు చూశాడు.

న్యాయవాది ఎలాంటి పరిచయ వాక్యాలు లేకుండానే ప్రశ్నలడగటం మొదలుపెట్టాడు.

"మిజ్ రావ్, అమెరికా వచ్చిన రెండు నెలల్లోనే నువ్వు నీ భర్తని చంపేశావు. నీ భర్త నిన్ను కొట్టినట్టుగానీ, శారీరకంగాగానీ మానసికంగాగానీ హింసించినట్లుగానీ ఎలాంటి అధారాలు లేవు," తన ముందున్న నోట్‌బుక్‌లో పేజీ తిరగేస్తూ, "హత్య చెయ్యటానికి కారణం మనసు చెదరటం అని మీ లాయర్ వాదించాడు, కాని ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయాడు, అవునా?" అని తీవ్రమైన స్వరంలో అడిగాడు.

దీపిక మౌనంగా ఉండిపోయింది.

"నువ్వు కావాలనే, ఉద్దేశపూర్వకంగానే భర్తను చంపావు, అవునా?"

ఆమె మాట్లాడలేదు.

"సమాధానం చెప్పాలి. భర్తను కావాలనే చంపావు, అవునా?"

"కాదు," అంది దీపిక, తల వంచుకునే.

"మరెందుకు చంపినట్లు?"

"హింస భరించలేక."

"ఎలాంటి హింస?"

"లైంగిక హింస."

"డాక్టర్ రావ్ నిన్ను లైంగికంగా హింసించాడనటానికి ఎలాంటి ఆధారాలు లేవు. మీ లాయర్ దీనికి సాక్ష్యాధారాలు చూపించలేదు. లైంగిక హింస జరగలేదు. నిజాన్ని నువ్వు ఒప్పుకోక తప్పదు. ఆరు సంవత్సరాల్లో నీలో ఎలాంటి పరివర్తనా రాలేదు. పశ్చాత్తాపం అన్నది నీలో ఏ కోశానా కనిపించటం లేదు. ఇంకా కట్టుకథలు చెప్పటం వల్ల నీకెలాంటి ప్రయోజనం లేదు," కఠినంగా ఆమెవైపు చూశాడు న్యాయవాది.

"వీడియోలు చూపించి అందులో తెల్లమ్మాయిలు చేసినట్లు..." తలెత్తి అతని వైపు చూసి, తల దించుకుని, "...అమ్మాయిలు చేసినట్లు నన్ను చెయ్యమనేవాడు. అలాంటి అసహజమైన పనులు నేను చెయ్యలేకపోయేదాన్ని," మెల్లగా సమాధానం చెప్పింది దీపిక.

"అసహజం అంటే భార్యాభర్తల మధ్య లైంగిక సంబంధంలో ఏది సహజమో ఏది అసహజమో నీకు ఇదివరకే తెలుసా?" విజయం సాధించినట్లు వికసించింది అతని ముఖం.

ఆమె సమాధానం చెప్పలేదు.

"తెలుసా?" స్వరం పెంచి గదిమినట్లు అడిగాడతను.

"అలాంటి పనులు చెయ్యవలసి వస్తుందని నేను ఊహించలేదు."

"ఎలాంటి పనులూ?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"ఎలాంటి పనులూ?" ఒక్కొక్క అక్షరం ఒత్తి పలుకుతూ అడిగాడతను.

"నాకు తెలియదు."

"మిజ్ రావ్, నువ్వు ఎంత అమాయకురాలిగా నటించినా ప్రయోజనం లేదు. జైల్లో పడ్డ వెంటనే అబోర్షన్ చేయించుకున్నావు. అంటే అమెరికా వచ్చేనాటికే నువ్వు గర్భవతివి. అవునా కాదా?" కళ్ళు పెద్దవి చేస్తూ అడిగాడు ప్రభుత్వ న్యాయవాది.

ఆమె సమాధానం చెప్పలేదు.

"పెళ్ళి కాకముందే నీకు డాక్టర్ రావ్‌తో సంబంధం ఉండిందా?"

తల అడ్డంగా ఊపిందామె.

"సమాధానం మాటల్లో చెప్పాలి. వివాహానికి ముందు నీకు భర్తతో శారీరక సంబంధం ఉండిందా?"

“లేదు.”

“మరి అమెరికా వచ్చేటప్పటికి నువ్వు గర్భవతివి అయ్యావంటే నీకు భర్తతో కాక మరొకరితో సంబంధం ఉందనేగా? అవునా కాదా?”

“అవును.”

“నీకు నీ ఫస్ట్ కజిన్ అయిన ఒక అబ్బాయితో సంబంధం ఉండింది. అతనివల్లే నువ్వు గర్భవతివయ్యావు. అవునా?”

ఆమె తలవంచుకుంది. కళ్ళు తుడుచుకుని, అలాగే తలవంచుకుని వుండి పోయింది.

“నీ గర్భానికి కారణం ఫస్ట్ కజిన్తో... నీకంటే చిన్నవాడైన తమ్ముడిలాంటి సత్యం అనే అతనితో... శారీరక సంబంధం. అవునా కాదా?” అడిగాడు అతను, తమ్ముడి లాంటి వాడితో అన్న మాటలను ఒత్తి పలుకుతూ.

“అతను మా చిన్న మామయ్య కొడుకు. మా దేశంలో అతన్ని తమ్ముడు అనం,” తల వంచుకునే సమాధానం చెప్పిందామె, స్వరం కొంచెం పెంచుతూ.

“మీ దేశంలో దానికి ఎలాంటి ముద్దు పేరు పెట్టుకున్నా ఈ దేశంలో అది అక్రమ సంబంధమే,” అని తన ముందున్న నోట్‌బుక్‌లో ఏదో రాసుకున్నాడు న్యాయవాది.

న్యాయవాది సభాధ్యక్షుడికి సైగ చెయ్యటంతో, అతడు ప్రారంభించాడు.

“మిజ్ రావ్, హత్య చేసినందుకు నువ్వు విచారిస్తున్నావా?”

“అవును, ఆ రాత్రి అదంతా ఎలా జరిగిందో నేను ఇప్పుడు ఊహించలేను. అతని ప్రాణం పోయినందుకు నేనెంతగానో చింతిస్తున్నాను.”

“మరి నీ కేస్ ఫైల్‌లో నువ్వు నేరం ఒప్పుకున్నట్లు లేదే. అంటే అప్పుడు నువ్వు చేసింది తప్పు అనిపించలేదా?”

“అప్పుడు నాకు ఏమీ తెలియని పరిస్థితి. నా మనసు సరిగ్గా లేదు.”

“ఇప్పుడూ?”

“ఇప్పుడు బాగానే ఉన్నాను. అలాంటి తప్పు ఇక చెయ్యను. అలాంటి పరిస్థితి మళ్ళా వస్తే, అక్కడి నుంచి ఎలాగో పారిపోతాను కాని, ఎవ్వరికీ హాని చెయ్యను.”

సభాధ్యక్షుడు తన నోట్‌బుక్‌లో ఏదో రాసుకున్నాడు. సభకు ఒక గంట విరామం ప్రకటిస్తూ, తిరిగి సమావేశం అయినప్పుడు దీపిక శిక్ష తగ్గించటం గురించి సభికులు తమ అభిప్రాయాలను ప్రకటించవచ్చని చెప్పాడు.

పెరోల్ బోర్డ్ వారి విచారణ జరిగింతర్వాత రెండు వారాలకు మళ్ళా దీపిక గారిని చూడటానికి జైలుకి వెళ్ళాను. "శిక్ష తగ్గించి మిమ్మల్ని విడుదల చేస్తారా? విచారణ మీకు అనుకూలంగా జరిగిందనుకుంటున్నారా?" అని అడిగాను.

"విచారణ ఒక నాటకం. విడుదల చెయ్యటానికీ విచారణకూ ఎలాంటి సంబంధం లేదు," అంది ఆమె. "జైలు అధికారులందరూ నా గురించి మంచి మాటలే చెప్పారు. కాని పెరోల్ బోర్డ్ వారు నా ఫైల్ మీద ఊరికే 'ఖైదీలో సరైన పరివర్తన రాలేదు,' అని రాయొచ్చు. దాన్నింక ఎవరూ ఏమీ చెయ్యలేరు."

"అలా రాస్తే వాళ్ళకేంటి ప్రయోజనం? విడుదలచేసే ఉద్దేశం లేకపోతే అనవసరంగా ఇలా విచారణ ఎందుకు జరుపుతారూ?"

"మీకు ఇక్కడి పద్ధతులు తెలియవేమో. జైల్లో ఉన్నవారి మీద రెండు సంవత్సరాల కొకసారి పెరోల్ బోర్డ్ వారు విచారణ జరపాలి. అది మిచిగన్‌లో ఒక రూల్. కాని శిక్ష తగ్గించటమా లేదా అన్నది ముగ్గురి మీద ఆధారపడి ఉంటుంది. మొదట శిక్ష వేసిన జడ్జి. జడ్జి ఒప్పుకోకపోతే అసలు విచారణే రద్దు చేస్తారు. అది మామూలుగా జరగదు. తర్వాత అటార్నీ జనరల్. అటార్నీ జనరల్ వ్యతిరేకిస్తే శిక్ష తగ్గించటం జరగదు. ఆయన ఒప్పుకున్నా చివరి నిర్ణయం పెరోల్ బోర్డ్‌ది," వివరించింది ఆమె.

"మరి మీ శిక్ష తగ్గించరని మీకెందుకనిపిస్తోంది?"

"నాలో తగిన పరివర్తన రాలేదు కదా?" అందామె కొంచెం వెటకారంగా.

దానికి ఎలా సమాధానం చెప్పాలో నాకు అర్థంకాలేదు.

"అటార్నీ జనరల్ ని ఈ దేశంలో ఎన్నుకుంటారు, మీకు తెలుసో లేదో. అంటే నాలుగేళ్ళ కొకసారి ఆయన ఎన్నికల ప్రచారానికి దిగుతాడు. అందరు రాజకీయనాయకుల్లాగానే. ప్రచారానికి డబ్బులు కావాలిగదా? డబ్బులిచ్చిన వారు తిరిగి ఏదో ఆశిస్తారు గదా?"

"అంటే... మీ వ్యతిరేకులు... డాక్టర్ రావుగారి కుటుంబం... అటార్నీ జనరల్‌కి ఎన్నికల్లో సహాయం చేశారంటారా? మిమ్మల్ని విడుదల చెయ్యకుండా చూడమని?"

"అదే నా అనుమానం. శిక్ష తగ్గించటంలో జడ్జికీ, పెరోల్ బోర్డ్ వారికీ లేని అభ్యంతరం ఇతనికెందుకో మీరే చెప్పండి? రామారావు కుటుంబం అంతా బాగా ఉన్నవారు. ఇతనికి ఎలెక్షన్‌లో బాగా సహాయం చేశారని నా అభిప్రాయం. మొన్న నవంబర్లో గెలిచాడు గదా మళ్ళా."

ఆమె మాటల్లో వ్యవస్థ పట్ల నిరసన వ్యక్తమవుతున్నా, ఇందులో ఎంత నిజం ఉందో చెప్పటం కష్టం. అయినా ఎన్నికలున్నంత కాలం అవినీతి తప్పదేమో.

"పరివర్తన మాత్రం జైల్లో ఉన్నవారిలో రావాలంటారు ఈ నీతిమంతులు," అందామె, ఈసడిస్తూ.

ఇంకా పదేళ్ళు జైల్లో ఉండాల్సి వస్తుందంటే, దానికి కారణం అయిన వారి మీద ఎవరికైనా కోపం రాక మానదు. కానీ వ్యవస్థలో ఎన్ని లోపాలున్నా నేరస్తుల్లో పరివర్తన రావాలని ఆశించటంలో తప్పులేదనిపించింది నాకు.

నేను ముభావంగా ఉండటం ఆమె గమనించినట్లుంది. "చూడండి, మీరు పెరోల్ బోర్డ్ విచారణకు వచ్చారు కదా. ప్రభుత్వ న్యాయవాది అడిగిన ప్రశ్నల్లో ఏమైనా న్యాయం ఉందనిపించిందా మీకు?" అడిగిందామె.

అతను అడిగిన ప్రశ్నలు సబబుగానే ఉన్నాయనిపించింది నాకైతే.

"ఆరోజు జరగవలసింది పెరోల్ బోర్డ్ విచారణ. శిక్ష పడింతర్వాత ఈ ఆరు సంవత్సరాల్లో నా ప్రవర్తన ఎలా ఉంది? విడుదలచేస్తే నేను ఎవరికైనా హాని కలిగించే అవకాశం ఉందా? నేను మామూలు మనిషిగా తిరిగి సమాజంలో ఇమడగలనా లేదా? ఇవీ వాళ్ళు విచారించాల్సిన విషయాలు. న్యాయవాది అసలు వీటి జోలికే పోలేదు. నా కేసును తిరిగి వాదించాడు. అది ఒకసారి జరిగింది కదా? నాకు శిక్ష వేశారుకదా? మళ్ళా ఆ విషయాలన్నీ తోడి పైకి తీసుకురావటం ఎందుకూ?"

అవును. నేను ఇలా ఆలోచించలేదుగాని, ఇప్పుడు దీపికగారు చెప్తుంటే నిజమేననిపిస్తుంది. ఆరోజు నిజంగా పెరోల్ బోర్డ్ జరపాల్సిన విచారణ జరగలేదు. మొదటిసారిగా నాకు ఆమె మీద సానుభూతి కలిగింది.

"పైగా జైల్లో వేసినంత మాత్రాన మారతారా మనుషులు? బైట ఉన్న వక్రమార్గాలన్నీ ఇక్కడా ఉన్నాయి. వ్యభిచారం, డ్రగ్స్, వయలెన్స్. ఈ వ్యాపారాలన్నీ నడుపుతుందెవరూ? మరెలా వస్తుంది పరివర్తన? ఎవరు తీసుకురావాలి ఆ పరివర్తన?"

మా మాటలు ఎవరన్నా వింటున్నారేమోనని నేను అటూఇటూ చూశాను. విన్నా వారికి మనభాష అర్థం కాదుగదా అని సంతోషించాను.

"వీటన్నిటి మధ్యా మీరు ఆరు సంవత్సరాలెలా గడిపారూ? అయాం సారీ ఫర్ యు."

ఆమె నవ్వింది. "జాగ్రత్తగా ఉంటూ. లైబ్రరీ నుంచి పుస్తకాలు తెప్పించుకుని చదువు కుంటూ, టీవీ చూస్తూ, ఎవ్వరి విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఉంటూ. వీలైనంతవరకు ఒంటరిగా ఉంటూ."

అలాంటి పరిస్థితుల్లో తొందరగా జైల్లోంచి బయటపడాలనుకోవటం సహజమే కదా. పెరోల్ బోర్డ్ విచారణ మీద ఆశపెట్టుకుని, అది తనకు అను

కూలంగా జరగలేదనే అనుమానంతో ఆమె బాగా నిరాశపడింది. ఆమెను కొంచెం ఉత్సాహపరచాలన్న ఉద్దేశంతో, "పెరోల్ బోర్డ్ వారు మిమ్మల్నిప్పుడు విడుదల చేస్తే, మీరు ఇండియాలో మీ తల్లిదండ్రుల దగ్గరకెళ్తారా?" అని అడిగాను.

"అవును. అమ్మ నేను చేసిన పనికి దుఃఖంతో చనిపోయింది. మూడు సంవత్సరాలవుతుంది. నాన్న మాత్రం మిగిలాడు నాకు. నాన్న దగ్గిరకే వెళ్తాను."

"నాన్నగారు మీకు ఉత్తరాలు రాస్తుంటారా?"

"మా నాన్నకు రాయటం రాదు. సత్యం చేత రాయిస్తుంటాడు. వాడికి చదువు రావాలని నాన్నకు పెద్ద కోరిగ్గా ఉండేది. ఆ కోరిక తీరలేదని వాడి మీద ప్రేమ అంతా కోపంగా మారింది. ఊళ్ళో అంతా వాణ్ణి సత్యం అని పిలిస్తే నాన్న మాత్రం సన్నాసి అని పిల్చేవాడు. అత్తయ్య వాడికి ప్రేమగా సత్యనారాయణస్వామి అని పేరు పెట్టుకుంది పాపం," కొంచెం నవ్విందామె.

"మీరు అతన్ని పెళ్ళి చేసుకుంటారా ఇండియా వెళ్ళాక?"

"లేదు లేదు. వాడికి రెండేళ్ళ క్రితమే పెళ్ళయింది. ఒక కొడుకు కూడా."

"అలాగా. మరి ఇండియా వెళ్ళింతర్వాత ఏం చేద్దామనుకుంటున్నారు మీరు?"

"తెలీదండీ. ఎప్పుడు వెళ్తానో ఏమో. ఊళ్ళో పరిస్థితులెలా ఉంటాయో. అక్కడ ఉండటం వీలవుతుందో లేదో. నావల్ల నాన్నకు ఇంకా కష్టమవుతుందేమోనని నా భయం," మొదటిసారిగా ఆమె గొంతులో మెత్తదనం వివిపించింది.

"మీ నాన్నగారేమంటున్నారు?"

"నాన్నేమంటాడూ. నాన్న కాదనలేడు కదా? కూతుర్నికదా ఎంత చెడ్డదాన్న యినా," ఆమె కళ్ళు నిండాయి. "జైల్లో వేసింది నన్నే అయినా, మంచి పరివర్తన వచ్చింది మా నాన్నలో. నాన్న ఎప్పుడూ కొంచెం కఠినంగా ఉండేవాడు అందరితో, నాతో తప్ప. ఇప్పుడు చాలా మెత్తబడ్డాడు. పోగొట్టుకున్న వాళ్ళు మెత్తబడతారంటారు గదా. లోలోపల కుంగిపోతూ ఉంటాడనిపిస్తుంది. ఇప్పుడు ఎవరినీ చిన్నచూపు చూడటం లేదు. సత్యాన్ని కూడా. వాడికి దగ్గరుండి పెళ్ళి చేయించాడు. ఇక నాన్నకు కొడుకైనా అల్లుడైనా వాడే కదా," కిటికీ గుండా చాలా దూరంగా చూస్తూ అందామె.

★ ★ ★

హత్య చేసిన వారికి యావజ్జీవ శిక్ష పడుతుందని ఇదివరకే ఎక్కడో విన్నాను. కాని దీపికగారికి పదిహేను సంవత్సరాలు శిక్ష పడిందంటే ఆమె ఉద్దేశపూర్వకంగా హత్య చెయ్యలేదని జ్యూరీ నమ్మి ఉండాలి. పూర్తిగా ఆత్మరక్షణ ప్రయత్నంలో అతన్ని

చంపేసిందని తేలినట్లయితే అసలు శిక్ష పడేదికాదేమో. ఎంతో కొంత అతనిది కూడా తప్పు ఉందని జ్యూరీ నమ్మి ఉంటుంది. అందువల్లే పదిహేనేళ్ళు పడింది. లాయర్ మంచివాడైనట్లయితే ఇంకా తగ్గేదేమో. ఈ పెరోల్ బోర్డ్లూ, అటార్నీ జనరల్, వీళ్ళతో గొడవలు లేకుండా ఈపాటికి ఇంటికి వెళ్ళిపోయి ఉండేది దీపిక. డిసెంబర్ లో ఆమెను చూడటానికి వెళ్ళినప్పుడు, "మీ లాయర్ బాగా అనుభవం ఉన్నవాడు కాదేమో," అన్నాను.

"అనుభవం ఉంటే చాలదు. అసలు కావాల్సింది డబ్బు. డబ్బుల్లేని వారికి ప్రభుత్వమే ఒక లాయర్నిస్తుందని ఒక నాటకం ఆడతారు ఇక్కడ. ఒక్క కేసుకి ఆ లాయర్‌కి మూడొందల డాలర్లిస్తారు. గంటకు కాదు, కేసుకి. ఆ లాయర్‌కి గిట్టాలంటే కేసుని ఎంత త్వరగా ముగించటానికి వీలైతే అంత త్వరగా ముగించాలి కదా. అందువల్ల ప్రాసిక్యూటర్తో ఏదో ఒక ఒప్పందానికి వచ్చి జ్యూరీదాకా పోకుండా కేసుని ముగిస్తాడు. నా విషయంలో, ఆ సమయంలో మతి చలించిందని నిరూపించాలంటే ఒక మానసిక విషయాల నిపుణుడి అభిప్రాయం లిఖిత పూర్వకంగా తీసుకోవాలి. అతన్ని కోర్టుకు తీసుకువచ్చి అతని అభిప్రాయం చెప్పించాలి. దానికి కనీసం ఎనిమిది వందల డాలర్ల ఖర్చవుతుంది. ఆ డబ్బులెవరిస్తారు? నా లాయర్ తన జేబులోంచి ఖర్చుపెట్టి ఇవన్నీ చేయిస్తాడా? ఇదీ ఇక్కడ జరిగే న్యాయాన్యాయాల తమాషా.

"పైగా, 'మీ లాయర్ హింస జరిగిందని ఎలాంటి ఆధారాలు చూపించలేక పోయాడు' అన్నాడు ఆరోజు ప్రభుత్వ న్యాయవాది. ఎట్లా చూపిస్తాడు? ప్రభుత్వం తరపున్న లాయరు ఎంతైనా ఖర్చుపెట్టొచ్చు. నా లాయర్‌కేమో మూడొందల డాలర్ల పరిమితి. అందులోంచే అతని జీతం రావాలి, కేసుకి కావాల్సిన ఖర్చులూ రావాలి. ఇదీ వీళ్ళ న్యాయం.

"పెరోల్ బోర్డ్ విచారణ రోజు నా విడుదలకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, 'ఆత్మరక్షణనీ, కుటుంబహింస అనీ ఏవేవో కట్టుకథలు చెప్పటానికి ప్రయత్నించాడు దాని లాయర్. అదంతా అబద్ధం అని తేల్చటానికి జడ్జీకి రెండురోజులు కూడా పట్టలేదు. కాకపోతే శిక్ష ముప్పైయ్యేళ్ళు వేసుంటే సంతోషించేవాణ్ణి,' అన్నాడు రామా రావు తండ్రి... కేసు రెండు రోజుల్లో ముగిసిందంటే దానికి కారణం జడ్జీగారి ప్రతిభా పాటవాలు కాదు. నా లాయర్‌కి ఎలాంటి వనరులూ లేకపోవటం. అప్పటికీ ఉన్నంతలో అతను బాగానే ప్రయత్నం చేశాడు. కాకపోతే విచారణ పొడిగించాలన్నా, నిపుణుల అభిప్రాయాలు కోర్టులో వినిపించాలన్నా డబ్బుల్లేక తొందరగానే ఒక ఒప్పందానికి రావాల్సొచ్చింది.

“అటార్నీ జనరల్‌కి నామీద అంత కోపం ఎందుకంటే నేను ఆ ఒప్పందంలో తప్పంతా నాదేనని ఒప్పుకోకపోవటం. తప్పు చెయ్యలేదని నేనెప్పుడూ అనలేదు. మొట్టమొదటిసారి జడ్జి ముందు నిల్చున్నప్పుడు, ‘నేరం చేశానని ఒప్పుకుంటున్నావా లేదా?’ అని అడిగాడు జడ్జీ. నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను. నావల్ల నేరం జరిగింది. కాని, తప్పంతా నాది కాదు. చనిపోయిన మనిషి చేసిన తప్పును ఎవరు ఒప్పుకోవాలి? ఎవరైనా అతను కూడా తప్పు చేశాడని ఒప్పుకుంటే గాని... ఆరోజైనా, ఈ రోజైనా దోషిని అని ఒప్పుకోవటానికి నేను సిద్ధంగా లేను.

“మీరు పెరోల్ బోర్డ్ హియరింగ్‌కు వచ్చారుగదా. అటువైపు వారు రామారావు గురించి ఎన్నో మంచి మాటలు చెప్పారు. స్థానిక దేవాలయం పూజారిని తీసుకొచ్చి అతని చేత చెప్పించారు... రామారావుకు విపరీతమైన దైవభక్తి అని. అతనితో ఉన్న రెండునెలల్లో నాకైతే దైవభక్తేమీ కనపళ్ళేదు. నన్ను వ్యభిచారిననీ, ఇంకా ఏవేవో అన్నాడు రామారావు తండ్రి. పైగా మా అమ్మను కూడా తిరుగుబోతు మనిషి అన్నాడు ఆ పెద్దమనిషి. అమ్మ పోయి కూడా మూడు సంవత్సరాలవుతుంది. ఆమె గురించి అలా మాట్లాడే మనిషిలో ఎలాంటి పరివర్తన రావాలో ఎవరు చెప్పాలి? పరివర్తన రావాల్సింది నాలోనేనా? జైల్లో ఉన్న వాళ్ళలోనేనా పరివర్తన రావాల్సింది?” ఆమె ముఖం ఎర్రబడింది. నా దగ్గర ఎలాంటి సమాధానాలూ లేక నేను అలాగే వింటూ కూర్చున్నాను.

★ ★ ★

జనవరిలో ఆమెను కలిసినప్పుడు అమెరికాలో ఆమె అనుభవాల గురించి అడిగాను. ఆమె నవ్వింది. “జైలుకి రాకముందు అమెరికా గురించి నాకు అంతగా తెలియదు. బయట ఉంది రెండు నెల్లేగా! అదీ ఎప్పుడూ ఇంట్లోనే ఉండేదాన్ని. ఇల్లొక ప్రైవేట్ జైలు. కాకపోతే ఇప్పటి నా జైలుగది కంటే విశాలమైంది. మంచి వసతులున్న జైలు. పగలంతా వండుకోవటం, తినటం. టీవీ చూట్టం. సాయంత్రం అతను రావటం, భోజనాల తర్వాత అతనికిష్టమైన వీడియోలు చూట్టం, అందులో అమ్మాయిలు చేసిన పనులన్నీ నన్ను చెయ్యమనటం. ...తప్పు నాదే. కాదన్ను. అదీ చనిపోయిన వాడి గురించి చెడ్డ మాటలు చెప్పటం ఎందుకులెండి. కాని... సెక్సువాలిటీ గురించి అప్పటికి నాకు సరైన జ్ఞానం లేదు. నాకెవ్వరూ ఏమీ చెప్పలేదు. పైగా అతను డాక్టర్. మరీ అంత అడవి మృగంలా ప్రవర్తిస్తాడని నేననుకోలేదు. నాక్కొంచెం జ్ఞానం ఉండి ఉన్నట్లయితే... భర్త అలాగ కూడా ప్రవర్తించవచ్చని ముందుగా తెలిసున్నట్లయితే... ఏమయ్యేదో,” కిటికీలోంచి దూరంగా చూస్తూ ఆగిపోయిందామె. కళ్ళు తుడుచుకుంటూ, “సారీ,” అంది.

దీపికగారి మాటల్లో నాకు పొంతన కనిపించలేదు. పెరోల్ బోర్డ్ విచారణ ఇంకా నాకు కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది.

"దీపికగారూ, మీరేమీ అనుకోకపోతే... ఇది అడగటం అంత సులభం కాదు. మీకు సెక్సువాలిటీ గురించి అప్పటికేమీ తెలీదంటున్నారు. కాని పెరోల్ బోర్డ్ విచారణలో మీకు మీ కజిన్‌తో సంబంధం ఉందని ఒప్పుకున్నారు..." అని మెల్లగా జ్ఞాపకం చేశాను.

కిటికీలోంచి దూరంగా చూస్తూనే మళ్ళా మాట్లాడింది దీపిక. "వాడు నాకంటే ఒక సంవత్సరం చిన్నవాడు. మా ఇళ్ళు ఒకే వీధిలో దగ్గరదగ్గరగా ఉండేవి. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ వాడితో క్లోజ్‌గా ఉండేదాన్ని. చిన్నప్పుడు కలిసి ఆడుకున్నాం. కలిసే స్కూలుకు వెళ్ళేవాళ్ళం. కాని వాడికి చదువు రాలేదు. మా నాన్నకు వ్యవసాయంలో తోడుగా ఉండేవాడు. వాళ్ళకు పొలాల్లేవు. ఒకప్పుడు ఉండేవట. నేను కాలేజీలో చదువుతున్న రోజుల్లో సెలవులకు ఊరికి వచ్చినప్పుడల్లా ప్రతిరోజూ వాడిని కలిసేదాన్ని. కాలేజీ విషయాలన్నీ వినేవాడు. ఇంట్లో అమ్మతో ఏదో విషయం మీద తగువుపడినప్పుడల్లా వాడే నన్ను ఓదార్చేవాడు. వాడితో నా సంబంధానికి ఏం పేరో నాకు తెలియదు. వాడి స్పర్శ ఎంతో సుఖంగా ఉండేది. రామారావు తాకినప్పుడు ముళ్ళు గుచ్చుకున్నట్లుండేది," రెండు క్షణాలు ఆగిందామె. "సత్యం నన్నెప్పుడూ తన సుఖం కోసం తాకలేదు. రామారావు నన్నెప్పుడూ నా సుఖం కోసం తాకలేదు. ...ఎప్పుడూ ఏదో అడవిమృగం తాకినట్లుండేది అతని స్పర్శ."

ఒక్కక్షణం ఆగి నావైపు చూసి మళ్ళా కిటికీ గుండా దూరంగా చూస్తూ మాట్లాడిందామె. "ఇప్పుడతని విషయం ఎందుకులెండి. నా పెళ్ళి కుదిరిన రోజుల్లో ఒకరోజు మామయ్యగారింటికి వెళ్ళాను. 23 సంవత్సరాలకే పెళ్ళిచేసుకోవటం అంటే నాకు భయం వేసింది. ఇంకా ఇల్లు వదలి వెళ్ళాలనే కోరిక నాకు కలగలేదు. తెలిసిన ప్రాంతం, పరిచయస్తులు, సత్యం- అన్నీ వదిలేసి వెళ్ళాలంటే ఏదో తెలియని భయం. ఆరోజు వాడితో మాట్లాడుతూ ఉంటే... అనుకోకుండానే... సహజంగానే జరిగిపోయింది. ఎంతో సుఖం అనిపించింది. ఊరట కలిగింది. ఆ తర్వాత పెళ్ళికి ముందు రెండు మూడుసార్లు వాడితో కలిశాను. అది తప్పో కాదో తెలియని అమాయకపు రోజులు. ఆ రోజుల్లోనే ఎప్పుడో గర్భం అయి ఉంటుంది. ఏమైనా, ఇది మాత్రం నిజం. సత్యం నన్నెప్పుడూ బలవంతం చెయ్యలేదు. రామారావు నన్ను ప్రతి రాత్రీ బలవంతం చేశాడు. కాని అటార్నీ జనరల్ దృష్టిలో రామారావుకి నామీద అధికారం ఉంది. సత్యానికి లేదు. నేను సత్యంతో చేసింది తప్పు."

★ ★ ★

తర్వాత మళ్ళా వెంటనే దీపికగార్ని కలవటం వీలుకాలేదు. వాష్టెనా కౌంటీ కమ్యూనిటీ కాలేజీలో చిన్న ఉద్యోగం రావటంతో నేను కొంచెం దూరంగా వెళ్ళి పోవటం జరిగింది. కాని ఆమెకు శిక్ష తగ్గించలేదని ఫిబ్రవరి 11 వ తేదీ స్థానిక పత్రికలో చదివాను.

''ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖర్చు తగ్గించటానికి మిచిగన్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా కొందరు విదేశీ ఖైదీలను గడువుకు ముందే విడుదల చెయ్యనున్నారు. పెరోల్ బోర్డ్ వారి సిఫార్స్ మీద విడుదల చెయ్యనున్న 11 మంది ఖైదీల పేర్లు గవర్నర్ గ్రాన్‌హోంగారి ఆఫీస్ ప్రకటించింది. వీరిలో నలుగురు మెక్సికన్ పౌరులు, ముగ్గురు కొలంబియా దేశస్తులు, ఇద్దరు గోటమెలాకు చెందినవారూ ఉన్నారు. ఇండియాకు చెందిన ఒక్క ఖైదీని విడుదల చెయ్యటానికి పెరోల్ బోర్డ్ నిరాకరించింది.

''ఒక్కొక్క ఖైదీని జైల్లో ఉంచటానికి ప్రభుత్వం సంవత్సరానికి 30,500 డాలర్లు ఖర్చుపెడుతుంది. ఇప్పుడు చేస్తున్న విడుదలల కారణంగా వచ్చే ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం ఖర్చు దాదాపు మిలియన్ డాలర్ల వరకూ తగ్గుతుందని అంచనా.''

ఆదివారం ఆంధ్రజ్యోతి
16 ఆగస్ట్ 2009

పచ్చ సంచి

"అదేం లేదు, నేనేమీ ఇబ్బంది పడటంలేదు," అతన్ని నమ్మించటానికి ప్రయత్నించింది లియా. "ఆఫీసు పని అయిం తర్వాత సాయంత్రం ఒక డాక్టర్ దగ్గర పని చేస్తున్నాను. ఒక్కోసారి ప్రైవేటు రోగుల్ని చూసుకునే అవకాశం కూడా ఉంటుంది."



"అలాగా, అయితే బాగా అలసిపోతూ ఉంటావు," అని ప్రేమగా చూశాడు బావా.

"ఫరవాలేదు, ఏదోవిధంగా నీకు సహాయం చెయ్యగలిగితే..."

వారి మునివేళ్ళు తాకాయి. ఇద్దరి మధ్యా బంగారు వంతెన వేశాయి చూపులు.

"నేను పంపించే వస్తువులు ఎక్కడ పెట్టుకుంటున్నావు?" బావా అడిగాడు.

"నా మంచానికి ఎదురుగా గోడకు తగిలించాను. పడుకుని వాటిని చూస్తూ ఉంటాను. అన్నట్టు, నువ్విప్పుడు చెక్కబొమ్మలు చెయ్యటం నేర్చుకుంటున్నావా?"

తల ఊపాడు బావా. "నీకోసం అయితే ఏ పనైనా చెయ్యగలను అని పిస్తుంది. మరి నేను చెక్కిన బొమ్మలు బాగున్నాయా?"

తల ఊపింది లియా.

ఇద్దరూ నవ్వుకున్నారు. కొన్నాళ్ళ క్రితం లియాకి కొబ్బరి పెంకులతో చెక్కిన బొమ్మలు కొన్ని పంపించాడు బావా. వాటిలో ఒకదాంట్లో రెండు పక్షులున్నాయి. పంజరంలో ఒకటి. బయట ఒకటి.

★ ★ ★

ఆ తర్వాత చానాళ్ళు లియా రాలేదు. కాని పచ్చసంచిలో బావాకు కావాల్సిన వస్తువులను ఎవరితోనైనా పంపిస్తూనే ఉంది. అవి అతనికి చేరుతూనే ఉన్నాయి. ప్రతిసారీ పంపించే వస్తువులే. పంపించటంలో ఏమీ తక్కువ చెయ్యదు లియా. కానీ తనెందుకు రావటం లేదూ? పని దగ్గర ఇంకో షిఫ్టుకు మారిందేమో? ఇలా ఆలోచిస్తుండగా ఒకరోజు లియా వచ్చింది. బాగా సన్నబడి ఉంది. ముఖంలో ఇదివరకటి రంగులేదు. జబ్బు చేసిందట. కాని నవ్వుతూ తన కష్టాలను దాచి పెట్టటానికి ప్రయత్నం చేసింది.

"అబ్బే, నాకేం కష్టం లేదు. ఇప్పుడు పూర్తిగా బాగయ్యింది. మునుపటిలాగే చక్కగా ఆరోగ్యంగా ఉన్నాను," అంది ఆమె.

"నేను మరీ అంత మూర్ఖుణ్ణి కాదులే లియా. చూస్తుంటే తెలియటంలేదూ నువ్వెలా ఉంది. నీ ఆరోగ్యం గురించి కొంచెం జాగ్రత్తగా ఉంటూండు. ప్రతిసారీ నాకీ వస్తువులు పంపించకపోయినా ఫరవాలేదు."

లియా మౌనంగా ఉండిపోయింది.

"ఇదంతా నీకొక పెద్ద భారమని నాకు తెలుసు. నీ భవిష్యత్తు గురించి నువ్వే ఆలోచించుకో. నీకేది మంచిదనిపిస్తే అలా చెయ్యి."

"పిచ్చిపిచ్చి ఆలోచనలు చెయ్యకు," అంది లియా అతని ముఖంలోకి చూస్తూ. ఆమె కళ్ళు వానకు తడిచిన కిటికీల్లా ఉన్నాయి. తల వంచుకుని చేతి రుమాలుతో కళ్ళు తుడుచుకుంది ఆమె.

"నీమీద నాకు నమ్మకం ఉంది, లియా. కాని నీకేది మంచిదో కూడా ఆలో చించాలి కదా. నీ వయసులో... నన్నెప్పుడు విడుదల చేస్తారో కూడా తెలియక పోయె."

లియాకి కూడా ఒక పరిమితి అంటూ ఉంటుంది కదా. ఎంతకాలం ఇలా ప్రయాసపడుతుంది? ఈ పరిస్థితిలో ఆమెకు తను చెయ్యగల సహాయం ఇంకే ముంది?

బావాకు చాలా విచారంగా ఉంది ఆరోజు. లియా పీక్కుపోయినట్లు కనబడుతుంది. రక్తహీనంగా ఉంది. జుట్టు బాగా పైకి ముడివేసింది. మెడ సన్నగా కనిపిస్తుంది.

"నీకసలు ఏమయింది లియా? ఉన్నదున్నట్లు చెప్పు. నువ్వేదో ఇబ్బందిలో ఉన్నావనిపిస్తుంది. నిజం చెప్పు."

"ఇబ్బంది అని కాదు," చెప్పటం మొదలెట్టింది ఆమె.

ఇంతలో గంట మోగింది. గడువు ముగిసింది. ఆమె నుదిటిమీద ముద్దు పెట్టాలనుకున్నాడు బావా. కాని కిటికీకి అటువైపు ఆమె, ఇటువైపు తనూ. మధ్యలో గోడలా ఇనుపతీగ.

ఆమె చేతి వేళ్ళు మృదువుగా నొక్కాడు బావా. అంతకంటే ఏం చెయ్య గలడు. పోతూపోతూ అతనివైపు మరోసారి చూసింది లియా. ఆమె కళ్ళ లోతుల్లో ఎక్కడో మిణుగుమిణుగుమంటున్న జ్యోతి కనిపించిందతనికి. ఇద్దరూ చిరు నవ్వుతో వీడ్కోలు చెప్పుకుంటూ ఉండగా బావా భుజం తట్టాడు గార్డ్, లోపలికి నడవమని.

★ ★ ★

ఇలా చూట్టానికి ఎవరైనా వచ్చినప్పుడు వాళ్ళ గురించి తోటి ఖైదీలకు చెప్పటం ఆనవాయితీ. చుట్టూ చేరిన స్నేహితులకు లియా గురించి చెప్పాడు బావా.

"ఎలా ఉంది? ఇంతకు ముందుకంటే అందంగా ఉందా?" అడిగాడు దిగ్డో.

"ఏంటీ సంగతులు?" అడిగాడు ఇమామ్.

''జబ్బునపడి ఇప్పుడే కోలుకుంది. చాలా సన్నబడింది. పాపం అనిపించింది. పైగా ఆమెకి నేనొక భారం.''

''అయితే నువ్వేమన్నావు?''

''బాగా ఆలోచించి నీకు మేలు జరిగే మార్గాన్ని ఎంచుకో, అని చెప్పాను.''

''అంటే, ఇంకెవర్నన్నా పెళ్ళిచేసుకోమనా?'' నమ్మలేనట్లు అడిగాడు ఇమామ్.

బావా సమాధానం చెప్పేలోపలే మరొకరు, ''నీకేమన్నా పిచ్చిబట్టిందా? అలాంటి నమ్మకమైన అమ్మాయిలు దొరకటం ఎంత కష్టమో తెలుసా? నిజంగానే ఇంకెవర్నన్నా చేసుకోమని చెప్పావా? మరి నీకు తిండెవరు పంపిస్తారిక బయ ట్నించి?'' అని అడిగాడు.

''ఇదిగో చూడు, విషయం పూర్తిగా విని అప్పుడు మాట్లాడు,'' అన్నాడు బావా. లియాకి తనకీ మధ్య జరిగిన సంభాషణ అంతా వివరంగా వినిపించాడు.

''నువ్వొక వింత మనిషివి,'' అని మొదలుపెట్టి గుక్కతిప్పకుండా మాట్లా డాడు ఇమామ్. ''తిండికి ఆమె మీద ఆధారపడుతున్నవాడికి మరీ ఇంత స్వాభి మానం పనికిరాదు. రేపు ఆ అమ్మాయి నిజంగా ఇంకొకడ్ని చేసుకుందనుకో, నీకు మళ్ళా జైలు రేషన్ తినటం తప్పదు. లేక తిండి పంపించేవాళ్ళింకెవరైనా ఉన్నారా నీకు? నీ పరిస్థితి చూసి జాలిపడి మాలోనే ఎవరో ఒకరి బంధువులు నీక్కూడా తిండి పంపించటానికి నానా అవస్థలు పడితే అప్పుడు నీకు సంతోషంగా వుంటుందా? మనకి తిండి పంపించేవాళ్ళు ఎంతమంది ఉంటే అంత మంచిది. ఒద్దని చెప్పటం తలతిక్క వ్యవహారం. నువ్వేంటో నీ ఆలోచనేంటో నాకసలు అర్థమవ్వటంలేదు.''

''ఒద్దన లేదు, ఇంకొకడ్ని చేసుకొమ్మని కూడా అన్లేదు. తనకేది మంచిదో ఆలోచించుకొమ్మన్నాను. అంతే. ''

''బావా, నువ్వు మరీ గుడ్డోడిలాగున్నావు. మేం బయటపడిందాకా ఓపిగ్గా ఉండమని వాళ్ళ కుటుంబాలను అడుగుతున్నారు మనవాళ్ళందరూ. పార్సెళ్ళు పంపిస్తూ ఉండమని బతిమాల్తున్నారు. నువ్వేమో ఇట్లా తలతిక్కగా మాట్లాడు తున్నావు. 'లియా, నాకోసం చూస్తూ ఉండు. నువ్వు పంపిస్తూ వున్న వస్తువులు నాకు చాలా అవసరం. దయచేసి నన్ను వదిలెయ్యకు,' అని కాళ్ళావేళ్ళా పడాల్సింది నువ్వు. ఇంకోవిషయం. నీకు తెలుసోలేదో గాని ఇక్కడి వాళ్ళందరూ ఆశ్చర్య పడుతున్నారు నీకిలాంటి స్నేహితురాలుందని. అదీ ఈ గడుసురోజుల్లో. రోజులు

బాగున్నప్పుడు ఆడది విశ్వాసంగా ఉందంటే అది సహజమైన విషయం. ఈ అమ్మాయేమో నీ భార్య కూడా కాదు. అయినా ఇంత విశ్వాసంగా నిన్ను కనిపెట్టు కొని ఉంటుంది. ముందు ముందు ఇంకా బాగా చూసుకుంటుంది నిన్ను. నాకైతే చాలా అసూయగా ఉంది. నీకవసరం లేకపోతే బయటపడింతర్వాత నాకు పరి చయం చెయ్యి. ఏమంటావ్?''

అందరూ నవ్వారు. బావా సమాధానం చెప్పలేదు. ఇమామ్ మంచి స్నేహితుడు. కాని కొంచెం సంకుచిత స్వభావి.

కొంచెం సేపయింతర్వాత ఇమామ్‌తో అన్నాడు బావా. ''చూడూ, లియాకు తన బతుకుబాటను తనే నిర్ణయించుకునే అధికారం ఉందంటావా లేదంటావా? జైల్లో కూర్చొని స్వేచ్ఛ గురించి మాట్లాడుకునే మనం మనల్ని ప్రేమించేవారి మీద నిరంకుశంగా ప్రవర్తిస్తే న్యాయంగా ఉంటుందా? ప్రేమంటే ఇవ్వటం, అడగటం కాదు. ప్రేమంటే బాధ్యత, ఒట్టి తేలికమాటలు చెప్పటం కాదు. అదీ ప్రేమంటే. నీ ఇష్టమొచ్చినప్పుడు వొదిలించుకునే బాధ్యత కాదు. స్నాయం చెయ్యదల్చినప్పుడు తడవటానికి సిద్ధంగా ఉండాలి.''

''నువ్విప్పుడు ఉపదేశం చెయ్యటం మొదలెట్టావు. కొంచెం నేలమీదికి దిగొచ్చి ఆలోచించు. లియా నీ సలహాని నిజంగా పాటించి రేపటినించీ నీకేమీ పంపలేదనుకో, నష్టం ఎవడికీ? చుట్టూ చూడు, మా పెళ్ళాలు వాళ్ళ దోవవాళ్ళు చూసుకోబట్టే మేమిలా మిగిలాం. రేపు నీకూ ఈ గతే పడుతుంది.''

''ఇమామ్, పరిస్థితి తారుమారైతే నువ్వేం చేసేవాడివో ఎప్పుడైనా ఆలోచిం చావా? నీ భార్య జైల్లో ఉండి నువ్వు బయట ఉంటే నువ్వేం చేసేవాడివి?'' అడిగాడు బావా.

అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. ''మనకు అహంకారం ఎక్కువ. అందరూ మన బరువు మొయ్యాలనుకుంటుంటాం. ప్రతి విషయాన్ని మన అవసరాలను దృష్టిలో ఉంచుకొనే చూస్తాం. ఇతరుల అవసరాలను పట్టించుకోం. ప్రతిరాత్రీ నీతో పడుకునే పెళ్ళాం విషయంలో కూడా అంతే. లియా కూడా మనిషే కదా. ఆమెక్కూడా అందరికిలాగే పరిమితులుంటాయి కదా. కోరికలూ ఉంటాయి కదా! ఆమె పంపించే పచ్చసంచి మా ఆత్మలను కలిపే బంధం. కాని దాన్ని తప్ప కుండా పంపించాలి అని అడిగే అధికారం నాకెవరిచ్చారు?'' తీవ్రంగా ప్రశ్నించాడు బావా.

''ఇట్లాంటి చర్చల్లో నీతో నేను పోటీపడలేనులే. అయినా మాట్లాడ్డం సులభం, తినటంలాగే. అది బయటికి పోయేటప్పుడే కష్టం,'' అని నసిగాడు ఇమామ్.

★ ★ ★

ఈ సంభాషణ జరిగింతర్వాత కొన్నాళ్ళ వరకూ ఎప్పటిలాగే లియా పచ్చ సంచిలో వస్తువులు పంపించింది. ఆ తర్వాత ఒక నెలరోజులు సంచి రాలేదు. మొదట ఇమామ్ బావాతో హాస్యాలాడినా కొన్నాళ్ళు పోయింతర్వాత అతను కూడా విచారించసాగాడు.

నూలుకండె నుంచి అంతులేకుండా సాగుతున్న దారంలా కాలం గడిచి పోతూ ఉంది. నిశ్శబ్దంగా ఉన్న గదిలో వాద్య సంగీతం వినపడినట్లు బావా చెవుల్లో అప్పుడెప్పుడో లియా చెప్పిన మాటలు పదేపదే స్పష్టంగా వినపడసాగాయి.

''నాన్నకు మన స్నేహం ఇష్టం లేదు.''

''నాకు తెలుసు. అది నేనెప్పుడో ఊహించాను. నా కళ్ళు నీ కళ్ళలా ఏట వాలుగా లేవనేమో. కాని మన ఇద్దరిదీ దాదాపు ఒకే రంగు. అదీకాక మా అమ్మది మీ జాతే.''

''మా అన్నయ్య మనవైపే. వాడు ఉత్తరాల్లో నాన్నకు మన గురించి చెప్తూనే ఉన్నాడు.''

''ఇది అన్యాయం లియా. నువ్వేగనక మగవాడివైతే చైనాజాతి అమ్మాయినే చేసుకోవాలని పట్టుబట్టేవాడు కాదు మీ నాన్న. ఆడదానివి కాబట్టే ఈ గొడవంతా. మరి నువ్వు మీ నాన్నకి ఏం చెప్పావు?''

''ఆయన ఇంకా పాతకాలంలో ఉన్నాడని చెప్పాను.''

''నిజంగా అలా అన్నావా?''

''ఏం? అనకూడదా? ఆయనకు అర్థమయినట్లే ఉంది. మౌనంగా ఉండి పోయాడు.''

''మౌనంగా ఉన్నంత మాత్రాన ఒప్పుకున్నాడనుకోకూడదు. నీ మంచిచెడ్డలు నువ్వే చూసుకోగలవని చెప్పు ఆయనకు.''

''సరే, ఈసారి మళ్ళా ఈ విషయం మీద గొడవచేస్తే తప్పకుండా అలాగే చెప్తాను.''

★ ★ ★

ఒకరాత్రి బావాకు నిద్ర పట్టలేదు. లియాకు ఏమయి ఉంటుంది? పెళ్ళి చేసుకుందేమో. లేక జబ్బు చేసిందో. ఆమెను కూడా ప్రభుత్వం నిర్బంధించిందా? ఇలాంటి ఆలోచనలు వస్తున్నా, మరుసటి రోజు విజిటింగ్ డే అవటంతో ఆమె వస్తుందేమోనని ఆశపడ్డాడు బావా. ఉదయం అంతా వ్యాకులపడుతూ గడిపాడు. ఒకసారి పచ్చసంచితో వస్తున్న జైలు అధికారిని చూసి ప్రాణం లేచొచ్చింది. కాని అది తనక్కాదు. బావాకు పిచ్చిపట్టినట్లనిపించింది. అటూ ఇటూ నడిచాడు గదిలో. మధ్యాన్నానికి విజిటింగ్ సమయం అయిపోయిందని గంట కొట్టారు. లియా రాలేదు. ఆ చేదు నిజం మింగుడు పడక మానసికంగా శారీరకంగా నీరసపడి పోయాడు.

బయట నుంచి చాలా పుకార్లు వస్తున్నాయి. పరిస్థితులు మరీ విషమిస్తున్నా యనీ, దేశ ఆర్థికవ్యవస్థ రోజురోజుకూ క్షీణిస్తుందనీ చెప్పుకుంటున్నారు. ఒకరోజు బావా ఆదుర్దాపడటం చూసి ఇమామ్ అతనితో మాట్లాడాడు, లియా గురించి.

"ఆమె విషయంలో నా ప్రవర్తన దుస్సాహసమే కావచ్చు. ఏమవుతుందో చూద్దాం," అన్నాడు బావా పొడిగా.

తల ఊపాడు ఇమామ్. "ధైర్యంగా ఉండు. నా భార్య నన్నొదిలేసి ఇంకొకణ్ణి చేసుకుంది. నీకూ ఆ గతి పట్టలేదని ఆశిద్దాం. జబ్బు చేసిందనుకుందాం. లేక వూరికెళ్ళిందేమో. ఆశ వదులుకోవద్దు. మంచే జరుగుతుందనుకుందాం."

మౌనంగా ఉండిపోయాడు బావా.

లియాకి ఏమయిందో తెలుసుకోవటానికి ఇద్దరూ గట్టిగా ప్రయత్నించారు. లియా పనిచేసేచోటికి దగ్గరగా ఒక పాత మిత్రుడున్న విషయం గుర్తొచ్చింది ఇమామ్‌కు. ఆ మిత్రుడి భార్యను పంపించి లియా విషయం కనుక్కోమని అడుగు తానన్నాడు ఇమామ్.

కొన్ని వారాలు గడిచింతర్వాత ఒక రోజు బావా దగ్గరకొచ్చి, "అధైర్య పడొద్దు," అంటూ మొదలుపెట్టాడు ఇమామ్.

"ఏమయింది? లియా పెళ్ళి చేసుకుందా? చెప్పు, ఫరవాలేదు చెప్పు," ఆత్రంగా అడిగాడు బావా.

"చెప్తాను. నువ్వు అదృష్టవంతుడివి. ఆమె ఇంకా నీ మనిషే. ఆమెను నువ్వింకా పోగొట్టుకోలేదు."

"సరిగ్గా చెప్పు, ఈ సస్పెన్స్ వొద్దు. అసలేం జరిగిందో చెప్పు."

“లియా ఏదో దేశం వెళ్ళిందట ఉద్యోగం దిరికితే. ఎక్కడికెళ్ళిందో ఎవరికీ తెలియదు.”

“అలాగా. మనిషి మాయం కావటంలో మొదటి ఘట్టం ఇలాగే మొదలవుతుంది. సరే, చూద్దాం. నీ మంచిచెడ్డలు నువ్వే ఆలోచించుకోమని నేను లియాతో ఎప్పుడో చెప్పాను.”

“మరీ అంత నిరాశపడకు. పచ్చసంచి గురించి ఆలోచిస్తూ ధైర్యంగా వుండు.”

“సరే చూద్దాం. లియా పచ్చసంచిలో నాక్కావాల్సిన ముఖ్యమైన వస్తువు ఏదో ఒకటి ఎప్పుడూ ఉంటుంది.”

“అంటే? నాకర్థం కాలా నువ్వేమంటున్నావో.”

బావా ఏమీ సమాధానం చెప్పలేదు. మౌనంగా కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

1965లో ఇండొనేషియాలో సుకర్ణో ప్రభుత్వాన్ని తొలగించి సైనిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు జనరల్ సుహార్తో. ఆ సందర్భంగా జరిగిన మారణకాండలో ఎనిమిది లక్షలమంది ప్రాణాలు కోల్పోయారు. మరో పది లక్షలమందిని సుహార్తో ప్రభుత్వం అకారణంగా జైల్లో వేసింది. అలా జైల్లో పడిన వారిలో ఒకరు బాలి నివాసి పుతు ఓక సుకాంత. పది సంవత్సరాల పాటు జైల్లో ఉండి 1976లో విడుదలయిన సుకాంత 1977-90 మధ్య చాలా కథలు రాశాడు. వాటిలో ఒకటి 1985లో రాసిన ఈ కథ. మొదట ఇండొనేషియా భాషలో వచ్చిన కథకు వెర్న్‌కార్క్ చేసిన ఆంగ్లానువాదం ఈ తెలుగు సేతకు ఆధారం.

ప్రాణహిత
జనవరి 2010

టెస్ట్

నిద్రపట్టక మెల్లగా లేచింది సుజాత. శ్రీధర్, చిన్నా మంచి నిద్రలో ఉన్నారు. శబ్దం చెయ్యకుండా అడుగులో అడుగు వేసుకుంటూ పడకగది బయటకు వచ్చి, తలుపు దగ్గరకు లాగి హాల్లో కొచ్చిందామె. డైనింగ్ టేబుల్ మీద లైట్ వేసి కొంచెం



సేపు చదువుదామని కూర్చుంది. నాలుగు రోజుల్లో ఫిజియాలజీ టెస్ట్ ఉంది. ఇంత వరకూ మంచి గ్రేడ్ సంపాదించింది. సెమిస్టర్ చివరిదాకా ఇలాగే గ్రేడ్ నిలబెట్టుకో గలిగితే ఎప్పుడైనా రెకమండేషన్ లెటర్ కావాలంటే తప్పకుండా ఇస్తానన్నాడు ప్రొఫెసర్ రేమన్.

పుస్తకం తీసి చదువుతుంటే ఆవలింత వచ్చింది. మనసు ఫిజియాలజీ మీద లేదు.

మెల్లగా బాత్‌రూంలోకి వెళ్ళి తలుపు దగ్గరకు లాగి లైట్ వేసింది. అద్దం ముందు నిలబడి పమిటను సింక్‌లో పడేసిందామె. ఒక్కొక్కటిగా జాకెట్ హుక్‌లు తొలగించి, బ్రా తీసేసి అద్దంలో చూసుకుంది. పన్నెండు పదమూడేళ్ళ వయసులో ఎవ్వరికీ తెలియకుండా చాలీచాలని అద్దం మూందు నిలబడి పెరుగుతున్న వక్షాన్ని చూసి సంబరపడిన రోజులు జ్ఞాపకమొచ్చి నవ్వుకుంది. కుడి రొమ్ముకూ ఎడం రొమ్ముకూ ఏమీ తేడా కనపడలేదు. అరచేత్తో కుడిరొమ్మును పైకెత్తి చూసింది. కొంచెం నొప్పి అనిపించింది. చూపుడువేలితో చనుమొన చుట్టూ వొత్తి చూసింది. ఎడంవైపు గట్టిగా తగిలింది. ఎడమ రొమ్ము చుట్టూ అలాగే వొత్తి చూసింది.

రొమ్ములు లేకపోతే తనెలా ఉంటుందో? ఆలోచన రాగానే వొళ్ళు జలదరించింది. సర్జరీ ద్వారా రొమ్ములు ఏర్పాటు చెయ్యొచ్చన్నాడు డాక్టర్. ఇష్టం లేకపోతే పేడెడ్ బ్రా వేసుకోవచ్చు. చూపుడువేలితో కుడి మొనను మళ్ళా తాకింది సుజాత. చుట్టూ మెల్లిగా వొత్తింది. తన స్పర్శ వేరు, అతని స్పర్శ వేరు. ఇవి లేకపోతే ఆ అనుభూతి ఇక ఉండదు. బలంగా పట్టుకున్నప్పుడు కలిగే నొప్పి కూడా ఇక వుండదు కదా.

పిల్లవాడికి వీటితో అవసరం తీరిపోయి చాన్నాళ్ళయింది. మరో బిడ్డను కనే ఆలోచన తనకెటూ లేదు. శ్రీధర్‌కీ లేదు. కాని రొమ్ములు లేని భార్యతో అతను బతగ్గలడా?

కాన్సర్ సైజ్‌ను బట్టి ఒక్కోసారి రొమ్మంతా తీసెయ్యాల్సిన అవసరం ఉండదు అన్నాడు డాక్టర్. రెండు వైపులా సర్జరీ అవసరమా కాదా అని నిర్ణయించటానికి బయాప్సీ చెయ్యాలన్నాడు. తన రూపం ఎలా మారబోతుందో!

★ ★ ★

క్లాస్ నుంచి తిరిగొచ్చేసరికి ఎనిమిదిన్నర దాటింది. శ్రీధర్ చిన్నాకి అన్నం పెట్టాడో లేదో, తనింకా తిన్నాడో లేదో అనుకుంటూ, కారు పార్క్ చేసి అపార్ట్‌మెంట్ బిల్డింగ్ వైపు నడుస్తుంటే కవితా వాళ్ళ అపార్ట్‌మెంట్ కిటికీ నుంచి చిన్నా, కవిత

కొడుకు సాయీ, టీవీ చూస్తూ కనిపించారు. రావటం ఆలశ్యం అయినందుకు కవితకు క్షమాపణలు చెప్పి, చిన్నాను తీసుకుని మూడో ఫ్లోర్‌లో ఉన్న తన అపార్ట్ మెంట్‌కు వెళ్ళి తలుపు తీసింది సుజాత.

అపార్ట్‌మెంట్ చీకటిగా ఉంది. సోఫాలో కూర్చుని టీవీలో సియెన్నెన్ వార్తలు చూస్తున్నాడు శ్రీధర్. "ఎందుకూ చీకట్లో కూర్చున్నారు," అని అడుగుతూ లైట్ వేసింది సుజాత. "భోజనం చేశారా?"

"తిన్నాను," అన్నాడు శ్రీధర్. లేచి తలుపు దగ్గరకు వస్తూ పిల్లవాడికి చూపుడు వేలు అందించాడు. వాడు తల్లి చేతిని వదిలేసి శ్రీధర్ దగ్గిరకొచ్చాడు.

"ఎనిమిదింటికి వచ్చి తీసుకెళ్తానని చెప్పాను కవితకి. రావటం ఆలస్యం అయింది. మీరు రాగానే చిన్నాను తీసుకొచ్చుంటే బాగుండేది," అందామె సరళం గా, తప్పుపడుతున్నట్లు వినపడకుండా ఉండాలనే ప్రయత్నంలో. శ్రీధర్ సమాధానం చెప్పలేదు. పిల్లవాడితో వెళ్ళి సోఫా మీద కూర్చున్నాడు.

వంటగదిలోకెళ్ళి రైస్ కుక్కర్‌లోంచి కొంచెం అన్నం ఒక గిన్నెలోకి తీసుకుని, డైనింగ్ టేబుల్ మీద ఉన్న వంకాయ కూరతో కలిపి ఓ నిమిషం పాటు మైక్రోవేవ్‌లో వేడి చేసుకుని వచ్చి శ్రీధర్ పక్కనే కూర్చుంది సుజాత.

"సరిగ్గా భోంచేశారా?"

"ఊఁ," అన్నాడతను, టీవీ చూస్తూనే.

తినటం ముగించి, సింక్‌లో పడున్న గిన్నెల్ని, ప్లేట్‌నూ కడిగేసి, అప్పటికే నిద్రపోయిన చిన్నాను సోఫా మీద నుంచి తీసుకెళ్ళి బెడ్‌రూంలో పడుకోబెట్టి, బట్టలు మార్చుకుని వచ్చి శ్రీధర్ పక్కన కూర్చుంది సుజాత.

"ఆఫీస్‌లో పని బాగా సాగుతుందా?" అడిగిందామె.

"మామూలే," అన్నాడు శ్రీధర్.

ఇద్దరూ టీవీ చూస్తూ కూర్చున్నారు.

"సుజాతా, నువ్వింక ఈ క్లాస్ మానుకోరాదూ?" అడిగాడతను, కొంచెం విసుగ్గా.

"అంటే? ఎటూ ఎక్కువ రోజులుండవుగదా, ఈ చదువెందుకు నీకు అనా?" దుడుగ్గానే అడిగిందామె.

శ్రీధర్ సమాధానం చెప్పలేదు. తన మనసులో ఉన్న మాటే ఆమె నోటి నుంచి విన్నప్పుడు చాలా కటువుగా వినిపించింది. నిజానికి కాన్సర్ మూడో స్టేజీలో ఉందనీ, ఏయే అవయవాలకు సోకిందో టెస్ట్‌లు చెయ్యాలనీ చెప్పాడు డాక్టర్.

ఈ స్టేజ్ వరకూ వచ్చిన పేషంట్లు చాలాకాలం బతకరని ఆఫీస్ కొలీగ్ శేషాచలం అన్నాడు. అతని మేనత్త రొమ్ము క్యాన్సర్‌తోనే పోయిందట. ఆమె కూతురుక్కూడా అదే కాన్సర్ రావచ్చనే భయంతో తలిదండ్రులు అతనికి వేరే సంబంధం చూశారట.

అంత తెలివి తనవారికి లేకపోయింది. ప్రతిచోటా తులాలూ, ఎకరాలూ, లక్షల గురించే వివరాలు కనుక్కున్నారుగాని వాళ్ల వంశంలో జబ్బులేమన్నా ఉన్నాయేమోనన్న విషయం అసలు పట్టించుకోలేదు.

"అలా కాదు, ఉన్న సమయంలో నీకు ఇష్టమైన పన్లు చేసుకోవచ్చు కదా అని. కాన్సర్ వచ్చినవాళ్ళు వాళ్ళ పిల్లల్తో ఎక్కువ కాలం గడుపుతారట. నువ్వా చిన్నాతో ఇంట్లో ఉండొచ్చు కదా? ఈ కోర్స్ తీసుకుంటే వచ్చే ప్రయోజనం ఏమిటీ?" ఆమె వైపు తిరిగి అడిగాడు శ్రీధర్.

"చూడండీ, వారానికి ఒక్కరోజు శుక్రవారం మాత్రం చిన్నాను కవితా వాళ్ళింట్లో వదిలేస్తున్నాను. అదీ నాలుగ్గంటలు. సోమవారం సాయంత్రం మీరు ఇంటికి వచ్చింతర్వాతే క్లాసుకెళ్తున్నాను. మీకుగానీ చిన్నాకుగానీ ఎలాంటి లోటూ రానివ్వటం లేదు.

"మూడో స్టేజ్ కాన్సర్ ఉన్న వాళ్ళల్లో చాలామంది సర్జరీ తరవాత కనీసం ఐదు సంవత్సరాలన్నా బతుకుతారని చెప్పాడు కదా డాక్టర్. ఎటూ ఇంతవరకూ వచ్చింది. ఇంకో రెండు కోర్సులు తీసుకుంటే మాస్టర్స్ అయిపోతుంది. ఇప్పుడు చదువు మానుకుంటే చేసిన పనంతా వృధా అయిపోదూ?"

"సరే నీ ఇష్టం," అని లేచి వెళ్ళి క్లోజెట్‌లోంచి జాకట్ తీసుకున్నాడు శ్రీధర్.

"ఇప్పుడెక్కడికెళ్తున్నారు, పది కావస్తుంది."

స్లిప్పర్స్ వేసుకుంటూ, "కిందికేలే, మూర్తితో మాట్లాడాలి," అన్నాడు శ్రీధర్.

"ఇప్పుడా, రేపు మాట్లాడరాదూ?"

"ఫరవాలేదులే, రేపెటూ సెలవేగా. తొందరగా వస్తాలే."

"బయట చాలా చలిగా వుంది. షూస్ వేసుకొని వెళ్ళండి."

అలాగే వెళ్ళిపోయాడు శ్రీధర్.

★ ★ ★

మూర్తితోనే కాదు, ఎవ్వరితోనూ మాట్లాడాలనిపించలేదు శ్రీధర్‌కి. కారులో రెండు నిముషాలు కూర్చున్నాడు. బాగా చలిగా ఉంది. కారు స్టార్ట్ చేసి హీటింగ్ పెట్టాడు. ఎపార్టెమెంట్ కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చి గ్రాండ్ రివర్ రోడ్డు మీద కుడివైపుకి మళ్ళించాడు కారును, ఎలాంటి గమ్యం లేకుండానే.

సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారి పిడుగులాగా పడిందీ రొమ్ము కాన్సర్. తొందరలోనే సర్జరీ జరుగుతుంది. ఆ తర్వాత కీమోథెరపీ. ఆ తర్వాతే మౌతుందో. అంతా చేస్తే నాలుగైదు సంవత్సరాలు బతుకుతుందేమో సుజాత. అప్పటికి చిన్నా ఏడెనిమిదేళ్ళవాడవుతాడు. తను ఒక్కడే వాడిని పెంచగలడా? అందరూ పిల్లల్తో హాయిగా బతుకుతుంటే తనకెందుకొచ్చిందీ ఖర్మ? పిల్లవాడి కోసమైనా మళ్ళీ పెళ్ళిచేసుకోవాల్సి వస్తుందేమో. అందరూ హాయిగా స్థిరపడే వయసులో తన బతుకు మళ్ళీ మొదటికొస్తుంది.

★ ★ ★

శ్రీధర్ పార్కింగ్ లాట్‌లో కెళ్ళటం, కార్లో వెళ్ళిపోవటం కిటికీలోంచి చూసింది సుజాత. ఇంత రాత్రప్పుడు ఎక్కడికెళ్తున్నాడో.

అలాగే కిటికీలోంచి చూస్తూ నిలబడిందామె. నవంబర్ ఇప్పుడే మొదలయినా అప్పుడే బాగా చలిగా ఉంది. అదీ స్లిప్పర్స్‌తో వెళ్ళాడు శ్రీధర్. ఈమధ్య చాలా మూడీగా ఉంటున్నాడు. తను ఎక్కువ కాలం బతకదని భయపడుతున్నాడు. ఎంత కాలం బతుకుతుందో ఎవరికి తెలుసు? డాక్టర్లకు మాత్రం తెలుసా? కాని ఎంత కాలం బతికినా రేపోమాపో చస్తాననే మనస్తత్వంతో బతకటం కష్టం. అది చావుకి ఎదురుచూడటంలాగా ఉంటుంది. ఉన్న నాలుగురోజులు తను మామూలుగా బతకాలి. వీలైనంతవరకు కష్టపడి మంచి జీపియేతో మాస్టర్స్ ముగించాలి. అప్పటికి దేశంలో పరిస్థితులు బాగుపడితే ఏదో ఫార్మసూటికల్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాలి.

తనకంటే ముందు ఇంటికి వచ్చికూడా చిన్నాను తీసుకురాని శ్రీధర్ పిల్లవాడితో నువ్వు ఎక్కువ సమయం గడపవచ్చు కదా అనటం- ఒళ్ళు జలదరించింది సుజాతకు. పిల్లవాడి విషయంలో- ఆ విషయంలోనే కాదు, చాలా విషయాల్లో- ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి శ్రీధర్‌కు. ఇల్లు చూడటం, చిన్నాను పెంచటం తన పని. ఉద్యోగం చెయ్యటం, తననీ చిన్నాను పోషించటం, డబ్బులు మిగల్చటం అతని పని. తను లేకపోతే ఇల్లు చూట్టానికీ, పిల్లవాణ్ణి పెంచటానికీ మరొకర్ని తీసుకొచ్చుకోగలడు శ్రీధర్.

నాన్నకు హార్ట్ అటాక్ వచ్చినప్పుడు అమ్మ ఎంత నిబ్బరంగా ప్రవర్తించిందో. నువ్వెన్నాళ్ళుంటావో, నీ కోరికలేంటో చెప్పు, తీరుస్తాను అనలేదు. నాన్న లేకపోతే తన పరిస్థితి ఎలా వుంటుందోనని భయపడలేదు. లోపల్లోపల విచారించే ఉండవచ్చు, కాని బయటకు అలా కనపడలేదు. నీకేం భయం లేదు, ఈ గుండె జబ్బు

తగ్గిపోతుంది, నువ్వు పూర్తిగా కోలుకుంటావు, అని పదేపదే నాన్నకు ధైర్యం చెప్పింది. అమ్మా నాన్నా ఎప్పుడూ ఒక్కటిగా ఉండేవారు. ఇది నీపని అది నాపని అనే భేదం ఉండేది కాదు ఇంట్లో. ప్రతిపనీ కలిసే చేస్తున్నట్లు కనపడేది. తనకీ శ్రీధర్‌కీ మధ్య అలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పింది ఈ కాన్సర్.

ఇప్పుడు పడుకున్నా నిద్రరాదు. బెడ్‌రూం తలుపు మెల్లిగా తెరిచి చూసింది సుజాత. చిన్నా నిద్రలో ఉన్నాడు. తలుపు దగ్గరకులాగి డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చుందామె. తొందరలో పోతావు కాబట్టి నీకిష్టమైన పనులు చేసుకోరాదా అని కాకుండా, నీకిష్టమైన పనులేంటో చెప్పు, మనం కలిసి చేద్దాం అని ఉంటే ఎంత సంతోషించేదో! అది బహుశా తీరని కోరిగ్గా మిగిలిపోతుందేమో ఎంతకాలం బతికినా.

ఫిజియాలజీ పుస్తకం తెరిచింది సుజాత.

ఆదివారం ఆంధ్రజ్యోతి
6 జూన్ 2010

అలనాటి ఆర్జ నర్తకి

ఆ ఉదయం లుంబుంగ్ (ధాన్యం కొట్టు)ను తీరిగ్గా చూస్తూ కూర్చుంది లూ గలూ. తూర్పు వైపు ఇనపరేకుల కప్పు సూర్య కాంతిలో బాగా తుప్పు పట్టినట్టు కనబడుతుంది. తన ముఖంలో కూడా మునుపటి మృదుత్వం, ప్రాయంలో ఉన్నప్పటి నూత



నత్వం, మెరుపుగొలిపే అందం ఇప్పుడు లేవు. వాటి స్థానంలో మచ్చలూ ముడతలూ వచ్చాయి. ఇంటి ముందు మెట్ల మీద కూర్చుని ఆ రోజు పొట్టపోసు కోవటం ఎలాగా అని ఆలోచిస్తున్న ఆమె దృష్టి క్షీణిస్తున్న లుంబుంగ్ మీదికెళ్ళింది. చెక్కతో కట్టిన గోడలు పగిలిపోయాయి. కొన్నిచోట్ల చెదలు పట్టింది. లుంబుంగ్ కిందగా నడిచినప్పుడల్లా బుగిలిన చెక్క పొడి తలమీద రాలుతుంది.

చిన్నప్పటి జ్ఞాపకాలతో ఆమె నిట్టూర్పు విడిచింది. లుంబుంగ్ కింద నాలుగు గుంజల మధ్య కట్టిన మండపం మీద తనూ తన స్నేహితులూ కిరాణా కొట్టు ఆట ఆడేవారు. ఆ మండపం మీదే వెదురాకులతో అల్లిన చక్కటి చాపల మీద దేవుళ్ళకు సమర్పణలు అమర్చేవారు. పండుగ రోజుల్లో నాన్న ఆ మండపం మీదే లావార్ మాంసం ముక్కలు ముక్కలుగా కోసేవాడు. ఆ మండపం మీదే చీట్లపేక ఆడేవారు. తోలుబొమ్మలాట వేసినప్పుడల్లా తెర లుంబుంగ్ ముందు గుంజలకే కట్టేవారు. ఇప్పుడు ఆ చాపలు చిరిగిపోయి ఉన్నాయి. వాటిని బాగు చేసేదెవరూ? మండపం అంతా మట్టిగొట్టుకుని ఉంది. ఎక్కడ చూసినా కోడిపెంట. లుంబుంగ్ గుంజలు మాత్రం పురుగులు పట్టకుండా గట్టిగానే ఉన్నాయి.

లుంబుంగ్ కింది మండపం ఒక వేదికలాంటిది. ఆ రోజుల్లో ఇంటినిండా బంధువులున్నప్పుడు అమ్మ తనని ఆ మండపం మీదే పడుకోమనేది. ఇంట్లో వున్న గదులన్నీ బంధువులతో, పూజసామగ్రితో నిండిపోయేవి. మండపం మీద పక్కేసుకు పడుకుని తను నిద్రపోవాలని చూస్తుంటే దాని కింద నేలమీద దొర్లుతూ రాత్రంతా పందులు కీచులాడుతుండేవి.

వడ్లకోసం అమ్మ ఎప్పుడన్నా లుంబుంగ్ ఎక్కితే తనక్కూడా ఎక్కాలని పించేది. కాని తనను ఎక్కనిచ్చేవారుకాదు. పడతానేమోనని భయం. కాని అంత కంటే లుంబుంగ్‌ను కాపాడే దేవిశ్రీకి కోపమొస్తుందేమోనని అసలు భయం. ఆ రోజులు పోయి చాలాకాలం అవుతుంది. ఎప్పటి మాటలో!

ఇప్పుడు లుంబుంగ్ శిథిలావస్థలో ఉంది. ఎలుకలు చేసిన కన్నాలతో ఎందుకూ పనికిరాని స్థితిలో ఉంది; తనలాగే. ఆర్జ నర్తకిగా తనకు అప్పుడున్న పేరూ ప్రతిష్ఠలు ఇప్పుడేవి?

తల్లిదండ్రులు తనకు వృథాగా నామకరణం చేశారేమో అనిపిస్తూ వుంటుంది, అప్పుడప్పుడూ. సెకార్వతి అని పేరు పెట్టారు వాళ్ళు. నిజానికి సెకార్ (పువ్వు) అని పేరు పెట్టమని చెప్పింది అమ్మమ్మ. గుండ్రటి ముఖం, మెరిసిపోయే కళ్ళూ, నిండు తలా, చక్కటి కనుబొమ్మలూ, బంగారంలాంటి రంగూ 'తను అప్పుడే

పూసిన పువ్వులా ఉండేదట. కానీ అంతా చేస్తే సెకార్వతి అన్న పేరు స్కూల్లో రిపోర్ట్ కార్డ్ మీద ఆర్నెల్లకంటే ఎక్కువ వాడలేదు. తర్వాత తను అందరికీ ఇష్టమైన ఆర్జ నృత్యనాటకంలో గలూ పాత్ర వెయ్యటం, దాంతో అందరి మనసుల్లో తను గలూగా నిలిచిపోవటం జరిగింది. అందరూ తనను గలూ అని పిలుస్తుంటే తనకెంతో గర్వంగా ఉండేది. ఇక తనకు ఆ పేరే నిలబడిపోయింది. కాని పేరు విషయంలోలాగానే తన జీవితం కూడా తన చేతుల్లో లేకుండా పోయింది.

లోపల ఏదో కొరుకుతున్నట్లు అనిపించిందామెకు. ఎడంచేత్తో కుడిభుజం కింది శరీరాన్ని తమిడింది. వెదురుచాపలో ఆకుల మధ్య ఖాళీలాగా తగిలింది ఎముకల మధ్య తన చర్మం. ఎంత గోకినా దురద తగ్గలేదు. చీమగానీ పురుగ్గానీ కుట్టినట్టులేదు. దురద కాలిపిక్క దాకా పాకింది. వడలి ముడతలు పడ్డ చర్మం కింద ఎముకనుంచి వేళ్ళాడుతున్న పిక్కను గోకింది. మోకాలి నుంచి చీలమండ దాకా గోకిన ప్రతి చోటా చర్మం మీద తెల్లగా చారలు పడ్డాయి. చేతుల్లో వుమ్మేసి చారల మీద రుద్దింది. కాని అవి పోలేదు. కాళ్ళకు నీరుపట్టి ఉంది. ఏంచేసినా తగ్గటంలేదు. రోజూ పొద్దుటే కాళ్ళకు అన్నం జిగురు రుద్దుతుంది. అది ఎండిపోయి బీటలువారి చర్మం కనపడకుండా పోతుందేగాని ప్రయోజనం ఉండటం లేదు. తన మీద తనకే జాలేసింది ఆమెకు. ఈ కాళ్ళు వాచినప్పటి నుంచి కాలుతీసి కాలెయ్యటమే కష్టంగా ఉంది. బతుకుదెరువు కోసం చేసే చిన్న చిన్న పనులు కూడా ఇప్పుడు చాలా కష్టం అవుతున్నాయి. పైగా ఇప్పుడొచ్చిన విదేశీ యంత్రాల పుణ్యమా అని ఆ చిన్న చిన్న పనులు గూడా హరించుకుపోయాయి.

లుంబుంగ్‌ను చూస్తూ ఉండి పోయిందామె. వడ్లు దంచిన రోకళ్ళను చూస్తుంటే సముద్రపుటొడ్డున చెల్లాచెదరుగా పడున్న విరిగిపోయిన పడవలు గుర్తుకొచ్చాయి. ఒకప్పుడు వడ్లు దంచుతుంటే రోకళ్ళు వడ్లకు పాట వినిపిస్తున్నాయేమో అన్నట్లుండేది. ఇప్పుడు వాటికి కాలం చెల్లింది. జీవితావశేషాల్లా మిగిలాయి. తనకు శరీరంలో శక్తి ఉన్న రోజుల్లో ఈ రోకళ్ళే తనకు జీవితాధారంగా ఉండేవి. వడ్లు దంచినందుకు బియ్యంలో కొంత తనకిచ్చేవారు. కొంచెం బియ్యప్పిండి కూడా దొరికేది. నిజాయితీగా ఉండే మనిషని ఊళ్ళో అందరికీ తనమీద మంచి గురి వుండేది. ఆసామి దగ్గర్నుంచి వొడ్లు తెచ్చి తన రోట్లోనే దంచినా ఎలాంటి దొంగతనమూ లేకుండా బియ్యం పూర్తిగా తెచ్చిస్తుందని తనకు మంచి పేరుండేది.

వరికోత సీజన్‌లో తను కూలిపనిక్కూడా పోయేది. ఇప్పుడు ఆ పని కూడా లేకుండాపోయింది. పంటపొలాలను పెద్దపెద్ద భవనాలుగా, టెన్నిస్ కోర్టులుగా,

బస్‌డిపోలుగా మార్చేశారు. ఇప్పుడు పొట్టపోసుకునే మార్గమే లేకుండాపోయింది. కొన్నాళ్ళు తన స్నేహితురాలు మాదె సితి లాగా తను కూడా ఈ నిర్మాణాలు జరుగుతున్న చోట్లలో కూలిపని చేసింది. కాని అదీ ఎక్కువరోజులు సాగలేదు. అందంగా బలంగా ఉన్నవాళ్ళతో తనెక్కడ పోటీపడగలదూ.

ఊళ్ళో ఇన్ని మార్పులొచ్చినా ఇంకా కొందరికి పొలాలున్నాయి. వడ్లు పండిస్తూనే ఉన్నారు. వడ్లు దంచుకుంటూ బతికే అవకాశం ఉండింది. కాని ఈ మిల్లు రావటంతో అదీపోయింది. ఇప్పుడందరూ వడ్లు మిల్లుకే పంపిస్తున్నారు. మిల్లయితే తొందరగా పని అయిపోతుందనీ, బియ్యం శుభ్రంగా ఉంటాయనీ, చవక గూడా అనీ అంటున్నారు. ఇప్పుడు లూ గలూ లాంటి వారికి మిగిలిందల్లా ఆసామి ఇంటి నుంచి వడ్లు మిల్లుకు తీసుకెళ్ళటం, అక్కడ్నుంచి బియ్యం ఆసామి ఇంటికి తీసుకురావటం. దీనిమీద మాత్రం ఎన్నాళ్ళు ఆశ పెట్టుకుంటుంది? ఒకసారి ధైర్యంచేసి మేనల్లుడి దగ్గర అప్పు తీసుకుని ఇంటిముందు కూరగాయలు అమ్మటం మొదలుపెట్టింది. ఊళ్ళో చాలామంది తన దగ్గరే కొనేవారు, కాని డబ్బులైతే రాలేదు. తర్వాత ఇస్తాం అనేవారు. ఆ వ్యాపారం మూణ్ణెల్లకంటే ఎక్కువ సాగలేదు. ఉన్న డబ్బులు అయిపోయాయి. కూరగాయలు కొనటానికి డబ్బుల్లేవు. మేనల్లుడి బాకీ తీరలేదు. అప్పట్నుంచీ అతను మాట్లాట్టం మానేశాడు.

ఆమెకు ముగ్గురన్నదమ్ములూ పదిమంది మేనల్లుళ్ళూ ఉన్నారు. అందరూ ఏదో ఒక పని చేస్తున్నారు. ఒకతను జావాలో డాక్టర్. కొందరు ఇతరదేశాల కెళ్ళారు. కొందరికి దగ్గరలోనే ఉద్యోగాలు దొరికాయి. కానీ వాళ్ళల్లో ఎవ్వరైనా తనకు సహాయం చేస్తారనే ఆశ ఇప్పుడు పూర్తిగాపోయింది.

తన కాళ్ళమీదే తను బ్రతకాలనే ప్రయత్నంలో లూ గలూ కొన్నాళ్ళు పని మనిషిగా పనిచేసింది. ఒకప్పుడు ఆమెకు భర్త ఉండేవాడు. అయితే ఒకరోజు పత్తాలేకుండా వెళ్ళిపోయాడు. రాజకీయంగా తప్పుదారి పట్టారనుకున్న వాళ్ళను ఏదో పూనకంలో ఉన్నట్లు ఊచకోత కోసిన రోజులవి. విధవరాలయిన ఆమెను తల్లిదండ్రులు కనికరించి తిరిగి ఇంటికి రానిచ్చారు.

తల్లిదండ్రులు పోయింతర్వాత వాళ్ళ పొలాలూ ఆస్తులూ అన్నదమ్ములు పంచుకున్నారు. ఆమె మళ్ళా ఒంటరి అయ్యింది. స్త్రీగా పుట్టటం అంటే ఏమిటో అర్థమయినప్పటినుంచీ తనకు ఎలాంటి హక్కులూ లేవని ఆమె గ్రహించింది. ఇప్పుడు పుట్టింటికి ఎప్పుడైనా వెళ్తే చుట్టపుచూపుగా మాత్రమే.

జకార్తాలో ఉంటున్న అన్న తన కొడుక్కి మతాతా చేయిస్తున్న (పళ్ళు సాన బెట్టించే వేడుక) సందర్భంగా ఆమెను రమ్మని పిలిచాడు. అక్కడకు వెళ్ళొచ్చినప్ప

ట్నుంచీ ఆమెకు కాళ్ళు వాయటం మొదలుపెట్టాయి. మతాతాకి కావలసిన సామగ్రి నంతా తయారుచెయ్యటానికి ఆమెకు దాదాపు పదిరోజులు పట్టింది. అదీ పగలూ రాత్రీ తీరికలేకుండా పనిచేస్తే. ఇలాంటి సందర్భాల్లో బంధువులందరూ ఆమెను పిలుస్తారు. బంధువర్గంలో ఆమె కంటే ఎక్కువగా కష్టపడి పనిచేసేవారు మరొకరు లేరు. అదీగాక ఏ శుభకార్యానికి ఎలాంటి పూజ చెయ్యాలో, దానికి ఏమేమి సమకూర్చాలో ఆమెకు తెలిసినంత వివరంగా బంధువుల్లో మరెవ్వరికీ తెలియదు. ఇలాంటి సందర్భాల్లో అందరూ ఆమెను పొగిడేవారు. ఆమెక్కూడా తన జీవితానికి ఒక అర్థం అంటూ ఉందనిపించేది. కాని పనంతా పూర్తయింతర్వాత తిరిగి తన ఇంటికి చేరేసరికి నడుం నొప్పిపుట్టేది. కాళ్ళు పీక్కుపోయేవి. తను చేసిన పనికి ప్రతిఫలంగా తనకు బస్సు చార్జీలిచ్చేవారు. రెండుమూడు రోజులకు సరిపోయే బియ్యం, మిగిలిపోయిన తిండి పదార్థాలూ ఇచ్చేవారు. మేనల్లుడి మతాతా సందర్భంగా తనకొక బతిక్ గుడ్డా, ఒక మాసిపోయిన పట్టుచొక్కా ఇచ్చారు. ఆ ఇచ్చిన బట్టలను కనీసం వుతికించి ఇస్త్రీ చేయించి ఇవ్వొచ్చుకదా. పైగా తన కష్టానికి ప్రతిఫలంగా ఇచ్చిన వస్తువులే అయినా, ఇలాంటి బహుమతులకు తను వాళ్ళకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

లూ గలూ లాంటి వారి కనీసావసరాల గురించి పట్టించుకునేవారు ఎవ్వరూ లేరు. రోజులు మారతాయని ఆశ పెట్టుకోవటమేగాని, ఆ ఆశలు తీరే సూచనలేవీ కనపట్టంలేదు. తనంటే ఎవ్వరికీ లెక్కలేదు.

కూర్చున్న చోటునుంచి మెల్లగా లేచింది లూ గలూ. వంటగదిలోకెళ్ళి ఒక గంపని తీసుకుని బయటకొచ్చింది. పొద్దుటినుంచి పొయ్యి రాజెయ్యలేదు. వరండా నుంచి మెట్లు దిగుతూ సరుంగ్‌ను మోకాళ్ళ దాకా పైకి లాగింది. కుడిచేత్తో గుంజను పట్టుకుని ఎడంచేత్తో తలమీదున్న గంపను ఒరక్కుండా పట్టుకుంది. గుంజను వదిలేసి కుడిచేతిని మెల్లగా వొణుకుతున్న మోకాలి మీద వేసింది. ఎడంకాలు కింద పెట్టి నిలువుగా నిలబడేసరికి వీపంతా నొప్పి పుట్టింది. వీపు రుద్దుకుంటూ కాలు తీసి కాలు వేసుకుంటూ మెల్లగా ఇంటి గేటు దాకా వెళ్ళిందామె.

ఇంటి ముందు రోడ్డుమీద రెండు వైపులా కార్లూ మోటర్ సైకిళ్ళూ వేగంగా దూసుకుపోతున్నాయి. ఇదొక కొత్త పరిణామం. ఈ వాహనాల వల్ల ఈమధ్య ఎంత మంది ప్రాణాలు పోయాయో. కాని వీటివల్ల చాలా సౌకర్యాలు కూడా ఏర్పడ్డాయి. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రతీరానికి వెళ్ళాలంటే ఇప్పుడు నడవ నవసరం లేదు. ఐదు నిముషాలకొక బెమో ఉంది. నదికెళ్ళాలన్నా, బజారుకెళ్ళా

లన్నా ఏదన్నా గవర్మెంట్ ఆఫీసుకెళ్ళాలన్నా యాభై రుపియాలకు వూళ్ళో ఎక్కడికైనా పోవచ్చు.

ఈ బెమోల వల్ల గుర్రబ్బండి వాళ్ళకు బతుకుదెరువు కష్టమయింది. ఇప్పుడు గుర్రబ్బళ్ళు ఎప్పుడోగాని కనపడవు. కొండదాకా వెళ్ళాలన్నా ఇప్పుడు నడవాల్సిన పనిలేదు. ఇప్పుడసలు ఎవరు నడుస్తున్నారూ? ఎక్కడచూసినా వాహనాలే. రాత్రి పూట దోవ కనపట్టానికి టార్చ్ లైటు అవసరంలేదు. అన్ని ఇళ్ళల్లో కరెంట్ దీపా లున్నయ్. ఒకప్పుడు బురద బురదగా ఉండే రోడ్లు ఇప్పుడు తారుతో నిగనిగ లాడుతున్నయ్. అయినా వీటిమీద తొందరలోనే గుంటలు పడతాయి. సరుకులు రవాణా చెయ్యటానికి వాడే నెట్టుడుబండ్లు ఇప్పుడు మూలబడ్డాయి. యజమానుల ఇళ్ళ పక్కన కుళ్ళిపోతూ పడున్నాయి. నగర పరిసరాల్లో పల్లెటూరి వాళ్ళు పెట్టుకున్న చిన్నచిన్న దుకాణాలు మాయమైపోతున్నాయి. ఇప్పుడు పికప్ ట్రక్కులమీద వచ్చి రకరకాల వస్తువులు, లిప్‌స్టిక్ కాణ్ణించి చాపల దాకా, ఇంటికే తెచ్చి అమ్ముతున్నారు. అప్పు గూడా ఇస్తున్నారు. పళ్ళు తోముకోవటం కంటే ఆడవాళ్ళకు లిప్‌స్టిక్ వాడటం మీద ఎక్కువ మోజుగా ఉన్నట్లుంది ఈ రోజుల్లో.

ఇంటి గేటు దగ్గరే కదలకుండా నిలబడింది లూ గలూ. ఈ వూరు ఎంత మారిపోయిందీ!

రోడ్డుకి రెండువైపులా ఉండే చెట్లు ఇప్పుడులేవు. నీటికుళాయి దగ్గర గుమి కూడే స్త్రీలూ పిల్లలూ, ఇరుగుపొరుగు కమ్యూనిటీ హాళ్ళలో గామెలాన్ వాయించే వాళ్ళూ ఇప్పుడు కనబడరు. స్నేహభావానికి కొరత ఏర్పడింది. నీడ దొరకటం కష్టం అయింది.

ఏటి కాడ పనుంటుందని న్యోమన్ మాద్రి చెప్పిన విషయం గుర్తొచ్చి ఇన్ని రవాణా సౌకర్యాలున్నా మెల్లగా కాలుతీసి కాలేసుకుంటూ నడవసాగింది లూ గలూ. బెమోలో వెళ్ళటానికి తన దగ్గర డబ్బుల్లేవు. మెయిన్ రోడ్డు మీద నడిచేటంత ధైర్యం లేక కాలువగట్టు రాళ్ళబాట మీద నడవసాగింది. ఎడతెరిపి లేకుండా రోడ్డంతా తమదేనన్నట్టు పోతుంటాయి బెమోలు. నడిచిపోయేవాళ్ళు కాలువకట్ట మీద రాళ్ళబాట మీదగా పోవాల్సిందే. అదీగాక చాలీచాలని ఈ రోడ్డు మీద రెండు లారీలు ఎదురెదురుగా వచ్చాయంటే గట్టుమీద నడుస్తున్న వాళ్ళు గూడా ప్రాణాలు చేతుల్లో పట్టుకుని కాలువ అవతలి వొడ్డుకు దూకాల్సిందే.

నడుస్తూ నడుస్తూనే న్యోమన్ మాద్రిని ఈరోజే కలవటమా వద్దా అని అలో చించింది ఆమె. కాలువ నుంచి మెయిన్ రోడ్డుకు ఇసుక మోసే కూలిపని చేస్తూ

పొట్ట పోసుకుంటుంది న్యోమన్. అది బలహీనంగా ఉన్న తను చెయ్యగల పని గాదు. కాని ఏం చేస్తుంది? మరో మార్గమేదీ?

సంకోచిస్తూనే ముందుకు సాగుతున్న ఆమెకు తనవైపే వస్తున్న ఇద్దరు మగవాళ్ళు కనపడ్డారు. రోడ్డు దాటి తనవైపే వస్తున్నారు. క్షణంలో ముందుకొచ్చి నిలబడ్డారు.

"లూ అత్తా, ఇతనికి నీ ఫొటో కావాలట," అన్నాడు బాలి అబ్బాయి, పక్క నున్న తెల్లవాణ్ణి చూపిస్తూ.

"నా ఫొటోనా. నేను ముసల్దాన్ని. శరీరం అంతా ముడతలు పడ్డదాన్ని," భుజంమీద వేలాడుతున్న తుండుగుడ్డతో ముఖాన్ని కప్పుకుంటూ, ఇబ్బందిపడుతూ అంది ఆమె.

ఈలోగానే, ఆమె అనుమతి లేకుండానే, దగ్గరనుంచి కొన్నీ కొంచెం దూరం నుంచి కొన్నీ ఫొటోలు తీసుకున్నాడు పర్యాటకుడు.

"తిడా ఆపా ఆపా (ఫరవాలేదు)," అన్నాడతను, వచ్చీరాని ఇండొనేషియా భాషలో.

"నాకు సిగ్గుగా ఉంది," అని గొణిగిందామె. కాని ముఖం మీద నుంచి తుండుగుడ్డ తీసేసి, అతన్ని ఫొటోలు తీసుకోనిచ్చింది.

"అబ్బాయ్. నువ్వెవరో నాకు గుర్తు రావటంలేదు," అని బాలి అబ్బాయిని అడిగిందామె.

"కతు మంద్రా పతి కొడుకుని."

"అలాగా. పెద్దవాడివైపోయావే," అని ప్రేమగా అతని చెయ్యి తాకిందామె.

కతు మంద్రా పతి చిన్ననాటి స్నేహితుడు. తను వేషం వేసిన ఆర్జ నృత్య నాటకంలో అతను కూడా వేషం వేశాడు. పతి అంటే మంత్రి అని అర్థం. నాటకంలో మంత్రి పాత్ర వేసినప్పటినుంచి అతనికి పతి అని పేరుబడింది.

బాలి యువకుడు ఆ పర్యాటకుడికి లూ గలూ జీవితం గురించీ యౌవనం లో ఆమె చేసిన పనుల గురించీ క్లుప్తంగా చెప్పాడు. అతను బియ్యం వేస్తే తల ఊపుకుంటూ వచ్చే కోడిలాగా తల ఊపాడు.

మరుసటిరోజు లూ గలూను ఇంటర్వ్యూ చెయ్యటం వీలవుతుందేమో కనుక్కోమని బాలి అబ్బాయిని ఇంగ్లీషులో అడిగాడు పర్యాటకుడు. విషయం తెలిసిన లూ గలూ సరేనంటూ సిగ్గుగా తలవూపింది. చాలా కాలంగా కాంతివిహీనం గా వున్న ఆమె కళ్ళు నల్లటిమబ్బుల చాటునుంచి బయటకొచ్చిన సూర్యకిరణాల్లా మెరిశాయి.

"నాక్కొంచెం డబ్బివ్వమని చెప్పు అతనికి," అని అతని ముఖంలోకే సూటిగా చూసిందామె. గొంతులో ఏదో అడ్డంపడ్డట్టు ముగ్గురూ ఒక్కక్షణం మౌనంగా వుండిపోయారు. వెంటనే తేరుకుని జేబులు తడుముకుని ఒక ఐదువందల రుపియాల నోటు లూ గలూ కిచ్చాడు పర్యాటకుడు.

ఆమె కృతజ్ఞతలు చెప్పుకుంది.

'రేపటి విషయం మర్చిపోకు,'' గుర్తుచేశాడతను.

లూ గలూ ముందుకు సాగింది. ఇప్పుడు మనసు కొంచెం కుదుటపడింది. కళ్ల ముందు ఆ పర్యాటకుడి ముఖం తేలుతున్నట్లు కనబడింది. రేపు తెల్లవారేటప్పటికల్లా తను అతనికోసం తయారుగా ఉంటుంది; తనకున్న వాటిల్లో మంచి బట్టలు వేసుకుంటుంది.

ఇంతకీ లూ గలూ మీద అంత ఆసక్తి చూపించిన ఆ పర్యాటకుడెవరూ? అతనికైతే తనక్కావాల్సిన వస్తువు దొరికినట్లే వుంది. ఒక్కక్షణం వృథా చెయ్యకుండా అప్పుడే కొన్ని ఫొటోలు తీసుకున్నాడు. అవి పత్రికలో ఎంత బాగా వస్తాయో ఊహించుకుంటున్నాడు. 'తలమీద బుట్టతో, మోకాళ్ళదాకా పైకి లాగిన సరుంగ్‌తో, వొంగిపోయిన కాళ్ళతో, భూతలస్వర్గం అని చాతీ మీద రాసున్న టీషర్ట్ తో, వొళ్ళంతా మట్టిగొట్టుకోనున్న ఈ స్త్రీ అలనాటి ప్రముఖ బాలి నర్తకి. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా, దృఢ సంకల్పంతో జీవితసమరంలో ముందుకు సాగుతుంది.'

నడక సాగించింది లూ గలూ. మనసంతా గందరగోళంగా ఉంది. చికాకు, సిగ్గు, గర్వం, భయం, అనిశ్చిత కలగలిసిన భావం. వెనక్కు తిరిగి చూసింది. ఆ ఇద్దరు మగవాళ్ళు ఒక బెమో ఎక్కుతున్నారు. చూస్తుండగానే కల్మషవాయువును వెనక్కి వదుల్తూ బెమో దూసుకుపోయింది. లూ గలూ తనబాటన నడక సాగించింది.

★ ★ ★

మూలం: బాలి నివాసి పుతు ఓక సుకాంత ఇండొనేసియా భాషలో రాసిన కథకు ఆస్ట్రేలియా నివాసి వెర్న్ కార్క్ చేసిన అంగ్లానువాదం.

విపుల మాసపత్రిక
జులై 2010

పెద్దా చిన్నా

విమానం ఇంకొక అరగంటలో డిట్రాయట్లో దిగుతుంది. రామ్మూర్తి మనసులో రకరకాల ఆలోచనలు. అమెరికాలో కొడుకూ కోడళ్ళ సంసారం చూడాలని శాంతకు ఎంతో ఆశగా ఉండేది. పాపం ఆ కోరిక తీరకుండానే పోయింది. కోడలు



గారాబంగా పెరిగిన అమ్మాయి. కొంచెం దుడుకుమనిషి అనీ, పెద్దా చిన్నా లేకుండా మాట్లాడు తుందనీ పెళ్ళిచూపులకు ముందే తెలిసింది. పెళ్ళయిన తర్వాత రమణ వెంటనే తిరిగి అమెరికా వెళ్ళిపోవటం, తనకు వీసా వచ్చిందాకా అమ్మాయి తన తల్లిదండ్రుల తోనే ఉండటం వల్ల ఆ అమ్మాయి ప్రవర్తన ఎలా వుంటుందో గమనించే అవకాశం తనకు దొరకలేదు. తన ఇంటికి కోడలు రావటం కాదు, తనే కోడలు ఇంటికి వెళుతున్నాడు, మొదటిసారిగా. ఆ అమ్మాయి ఎలాంటి మనిషో? రమణ ఫోన్లో మాట్లాడే టప్పుడు వాళ్ళ కాపురం గురించి ఏమీ మాట్లాడ్డు. అమ్మాయి బాగుందా అంటే ఆ అంటాడు.

రమణ వచ్చాడు రిసీవ్ చేసుకోవటానికి. లగేజ్ తీసుకుని టెర్మినల్ నుంచి బయటికి రాగానే బాగా చలిబుట్టింది రామ్మూర్తికి. రమణ తీసుకొచ్చిన స్వెట్టర్ వేసు కున్నాడు. నవంబర్లోనే ఇంత చలిగా ఉంటే ఇక జనవరీ ఫిబ్రవరుల్లో తను ఇక్కడి చలికి తట్టుకోగలడో లేడో.

పాసెంజర్ సీట్లో కూర్చున్న రామ్మూర్తికి రోడ్డు మీద ట్రాఫిక్ అంతా వింతగా కనిపించింది. ఆరు లేన్లలో, ఏ లేన్లో కారు ఆ లేన్లో బుద్ధిగా చెప్పిన మాట వినే బడిపిల్లల్లా పోతున్నాయి. ఇన్ని కార్లు పోతున్నా ఒక్క కారు కూడా హార్న్ కొట్టటం లేదు. ఈ దేశంలో కార్లకు హార్న్ ఉండదేమో.

ఇండియాలో బంధువుల గురించి అడిగాడు రమణ. అందరూ బాగానే ఉన్నారని ఆయన అంటున్నా, ఎవరితోనూ ఆయనకు పెద్దగా సంబంధం ఉన్నట్లు లేదనిపించింది రమణకు. అమ్మ పోయింతర్వాత ఆయన వొంటరివాడయ్యాడు. అక్క చెన్నై రమ్మని అడిగినా వెళ్ళలేదు. తను మూడు నాలుగు నెల్లపాటైనా ఇక్కడకు రమ్మని పదే పదే అడిగితే చివరకు సరేనన్నాడు. మళ్ళా ఎండాకాలం దాకా ఆగితే మనసు మార్చుకుంటాడేమోనని చలికాలం వస్తున్నా ఇప్పుడే రమ్మన్నాడు రమణ.

రామ్మూర్తి మనసంతా తను హైదరాబాద్లో వదిలివచ్చిన ఫ్లాట్ మీదే వుంది. తిరిగి వెళ్ళింతర్వాత మళ్ళా వెంటనే మంచి పనిమనిషీ వంటమనిషీ దొరకటం కష్టం. దొరికిందాకా ఇబ్బంది పడాల్సొస్తుంది.

ఎయిర్పోర్ట్ నుంచి ఫార్మింగ్టన్లో వాళ్ళ ఎపార్ట్మెంట్కి రావటానికి దాదాపు అరగంట పట్టింది. అప్పటికింకా ఏడుగంటలు కాకపోయినా కొద్దికొద్దిగా మసక పడుతుంది.

నవ్వుతూ స్వాగతం పలికింది కోడలు రాధ. కుశలప్రశ్నల తర్వాత, "రోజంతా విమానాల్లో కూర్చుని బాగా అలసిపోయి ఉంటారు, స్నానం చేసి రండి, భోజనం చేసి పడుకుంటే రేపటికి బాగుంటుంది," అంది. భోజనం తయారుగా

చేసిపెట్టింది. బడలికగా ఉండటంవల్ల స్నానం చేసి భోజనం చెయ్యగానే నిద్రొచ్చింది రామ్మూర్తికి.

వేకువఝామున మూడు గంటలప్పుడు మెలుకువ వచ్చి, తర్వాత నిద్ర పట్టక, మెల్లగా శబ్దం చెయ్యకుండా కిటికీ దగ్గరకు వెళ్ళి కర్టెన్ తొలగించి బయటకు చూస్తూ నిలబడ్డాడు రామ్మూర్తి. ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ వెనకనే పెద్ద రోడ్డు. వీధి దీపాల కాంతిలో నిర్మానుష్యంగా ఉంది. అప్పుడప్పుడూ ఒక కారు పోతుంది. రోడ్డు పక్కన ఉన్న చెట్ల మీద ఒక్క ఆకు కూడా లేదు. తన జీవితంలాగే ఉన్నాయి ఈ చెట్లూ అనిపించింది ఆయనకు.

మళ్ళా పడుకుని కళ్ళు మూసుకున్నాడు. అయినా నిద్ర రాలేదు. కొడుకునూ కోడల్నీ చూసి శాంత ఎంత సంతోషించేదో అనుకున్నాడు.

చదువుకోవటానికి ఏదైనా పుస్తకం తెచ్చుకుంటే బాగుండేది. విమానంలో కూడా కూర్చుని కూర్చుని బోర్ కొట్టింది. అంతసేపు కూర్చుంటే కాళ్ళు వాచిపోతాయని భయపడ్డాడుగాని బోర్ కొడుతుందన్న విషయం ఆలోచించలేదు. హాల్లో టేబుల్ మీద టైమ్ మాగజైన్ ఉన్నట్లుంది. కాని ఇప్పుడు హాల్లోకెళ్తే శబ్దానికి పక్కగదిలో నిద్రపోతున్న కొడుకూ కోడలూ నిద్ర లేస్తారేమోనని అలాగే పడుకున్నాడు. ఒక కప్పు కాఫీ తాగితే బాగుంటుందనిపించింది.

★ ★ ★

పక్కగదిలో నీళ్ళ శబ్దం విని తనుకూడా స్నానం చేసి తయారై బయట కొచ్చాడు రామ్మూర్తి. కోడలు వంట గదిలో ఉంది.

"రాండి మామయ్యగారూ, కూర్చోండి," అని బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర కుర్చీ చూపించి, "మీరు కాఫీలో చక్కెర వేసుకుంటారా?" అని అడిగింది.

"అవునమ్మా." అన్నాడాయన.

ఇడ్లీపాత్రను ప్రెజర్ కుక్కర్‌లో పెట్టి, స్టౌ పక్కనున్న కప్‌బోర్డ్‌లోంచి కాఫీ డబ్బా తీసింది రాధ. ఐదు స్పూన్లు కాఫీ పౌడర్ ఫిల్టర్లో వేసి, ఐదు కప్పుల నీళ్ళు మెషిన్లో పోసి ఆన్ చేసింది. కాఫీ ఫిల్టరవుతూ మంచి వాసన వస్తుండగా, "రాత్రి బాగా నిద్రపట్టిందా మీకు?" అని అడిగింది.

"ఫరవాలేదమ్మా, బాగానే నిద్రపోయాను," అన్నాడాయన నవ్వుతూ.

"జెట్‌లాగ్ నాలుగైదు రోజులుంటుందిలెండి, అదీగాక పక్కనే పెద్ద రోడ్డు ఉండటం వల్ల రాత్రంతా ట్రాఫిక్ శబ్దాలు తప్పవు. ఈ కాంప్లెక్స్‌లో ప్రస్తుతానికి రెండు బెడ్‌రూమ్‌లు ఉన్న ఎపార్ట్‌మెంట్ ఇదొక్కటే ఖాళీగా ఉంది. అటువైపు ఇంకొకటి ఉంది కాని ఎటాచ్డ్ బాత్రూం లేదు. కొంచెం రోడ్డుకి లోపలగా ఉన్నది దొరికినప్పుడు మారదాం," అంది ఆమె.

"ఫరవాలేదమ్మా, నా కోసం మీరు అంత ఇబ్బంది పడొద్దు, మూణ్ణెల్లే కదా, దానికోసం ఇన్నిసార్లు ఇల్లు మారటం, ఇబ్బంది పడటం ఎందుకూ?" అన్నాడు రామ్మూర్తి.

రమణ స్నానం చేసి తయారై బయటికి రాగానే ఇద్దరికీ ఇడ్లీ, కాఫీ ఇచ్చి, తను తయారుకావటానికి లోపలికెళ్ళింది రాధ. ఇండియాలో తెలిసిన వారి గురించీ, డిట్రాయట్లో చలి గురించీ మాట్లాడుకున్నారిద్దరూ. రమణ మామూలుగా ఎనిమిదిన్నరకు ఆఫీసుకెళ్తాడట. సాయంత్రం దాదాపు ఏడుగంటలకు వస్తాడట. రాధ ఈరోజు కొంచెం ఆలశ్యంగా వస్తానని చెప్పిందట కాని, రోజూ ఏడున్నరకే స్కూల్లో ఉండాలట. నాలుగున్నరకు ఇంటికి వస్తుందట. శనాదివారాల్లో తప్ప బయటకు వెళ్ళటానికి తీరిక దొరకదన్నాడు రమణ.

ఉద్యోగ విరమణ చేసినా రోజుకొక్కసారైనా కొంచెం బజారుదాకా పోయి రావటం, ఏదో పుస్తకం చదవటం అలవాటున్న మనిషి రామ్మూర్తి. డిట్రాయట్ వచ్చిన తర్వాత రెండు మూడురోజులు ఎలాగో గడిచిపోయాయి. ఆ తర్వాత మాత్రం ఏ పనీ లేకుండా రోజంతా ఊరికే ఇంట్లో కూర్చోవటం చాలా కష్టం అయింది ఆయనకు. రోడ్డు మీద పోతున్న కార్లను చూస్తూ కిటికీ దగ్గర చాలాసేపు కూర్చున్నాడు.

ఒక ఆదివారంనాడు తమ వూరి గ్రంథాలయానికి తీసుకెళ్ళాడు రమణ. డెబ్బైతొమ్మిది వేలమంది జనాభా అట ఆవూరిది. అంత చిన్న వూరికే ఇంత పెద్ద గ్రంథాలయం ఉంటుందని ఊహించలేకపోయాడు రామ్మూర్తి. హైదరాబాద్‌లో గ్రంథాలయం కూడా ఇంత పెద్దది కాదేమో. పెద్దవాళ్ళకొక విభాగం, పిల్లలకొక విభాగం, సంగీతానికి, డీవీడీలకి ఒక విభాగం, కంప్యూటర్లు వాడుకొనేవారికి ఒక విభాగం, కాన్ఫరెన్స్ రూమ్‌లూ, ఎన్ని సౌకర్యాలో. పైగా ఈ మారుమూల గ్రామం గ్రంథాలయంలో తెలుగు పుస్తకాలూ, డీవీడీలూ!

కానీ పుస్తకాలతో ఎంతసేపని కాలం గడుపుతాడూ. బయటకెక్కడికీ వెళ్ళ టానికి వీల్లేదు. కారులేంది ఎక్కడికీ వెళ్ళలేడు. ఇక్కడేమో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ అన్నదే లేదట. అయినా ఎపార్ట్మెంట్‌కి ఒక తాళాం చెవి కాపీ చేయించి ఇచ్చాడు రమణ. ఎప్పుడైనా కొంచెంసేపు బయట తిరిగిరావచ్చని.

మొదటిసారిగా మంచు పడినప్పుడు ఎంతో వింతగా సంతోషంగా చూస్తూ కూర్చున్నాడు రామ్మూర్తి. బయటకెళ్ళేటట్లయితే నడిచేటప్పుడు జారిపడతారేమో జాగ్రత్తగా నిదానంగా నడవండి అని చెప్పింది రాధ, చిన్న పిల్లవాడికి చెప్పినట్లు. మరి ప్రీ స్కూల్ టీచర్ కదా!

★ ★ ★

“రమణా, సోషల్ సెక్యూరిటీ అని ఏదో ఉందటగదా? వాళ్ళు తలిదండ్రులకు నెలకు 674 డాలర్లు ఇస్తారటగదా? దాని గురించి నీకేమైనా తెలుసా?” అని అడిగాడు రామ్మూర్తి ఒకరోజు ఉదయం కాఫీ తాగుతూ ఉండగా.

“ఎవరు చెప్పారు నాన్నా నీకు?” ఆశ్చర్యంగా అడిగాడు రమణ.

“నిన్న ఈ రోడ్డుమీదే, కొంచెం దూరంలో కుడిపక్కన ఉందే, ఇండియన్ గ్రోసరీ స్టోర్, అక్కడ కనిపించాడొకాయన. పేరు వెంకటేశ్వర్రావు. నెల్లూరట. కొడుకూ కోడల్తో ఈ ఎపార్ట్మెంట్ కాంప్లెక్స్‌లోనే ఉంటున్నారట, మీరు తెలుసన్నాడాయన.”

“ఆ దరిద్రుడా,” ఇటు తిరిగి అంది కిచెన్లో పని చేసుకుంటున్న రాధ. ఆమె వైపు చూసి ఏదో సైగ చేశాడు రమణ. తను గమనించకపోలేదు. తను వచ్చింతర్వాత ఈ మూడు వారాల్లో కోడలు ఎప్పుడూ మృదువుగానే మాట్లాడింది. ఈ మాట షాక్ లాగా వచ్చి తగిలింది రామ్మూర్తికి.

కొంచెం తేరుకుని, “ఆయనకీ ఆయన భార్యకీ చెరొక 674 డాలర్లిస్తుందట ప్రభుత్వం. ఆరోగ్య భీమా కూడా ఉచితంగా ఇస్తోందట. ఇంటి అద్దెకూ, తిండి ఖర్చులకు కూడా అవేవో స్టాంపులు ఇస్తాందటకదా?” అడిగాడు రామ్మూర్తి.

“ఏమో నాన్నా, వాటి గురించి అంతగా తెలియదు నాకు. అయినా ఇప్పుడు మనకు ప్రభుత్వం ముందు చెయ్యి చాపాల్సినంత అవసరం ఏమొచ్చిందీ? మీకేమైనా కావాల్సొస్తే నన్నడగండి,” అన్నాడు రమణ.

కొడుకుని డబ్బులడగటం ఊహించలేకపోయాడు రామ్మూర్తి. చిన్నప్పుడు ఏదో కొనుక్కోవటానికీ, కాలేజీ ఫీజులకీ, సెలవుల్లో మేనమామగారి ఇంటికి బెంగళూరు వెళ్ళటానికీ తన దగ్గర డబ్బులడిగిన కొడుకుని తను ఎలా అడుగుతాడూ?

“మామయ్యగారూ, మీకు ఇక్కడ బోర్ కొడుతుందేమో. హైదరాబాద్‌లో అయితే ఏదో ఒక పని చేసుకుంటూనో, పుస్తకాలు చదువుకుంటూనో కాలక్షేపం చేసేవారు. ఇక్కడ మీకు ఏమీ తోచకుండా ఉండి ఉంటుంది. ఒక పని చేద్దాం. వారానికి ఒకటీ రెండుసార్లు మనిద్దరం మెయిన్ లైబ్రరీకి వెళ్ళొద్దాం. నేను సాయంత్రం రాగానే టీ తాగింతర్వాత వెళదాం. రమణ ఇంటికొచ్చేలోగా వచ్చేద్దాం. మీకూ కాలక్షేపంగా ఉంటుంది, పుస్తకాలూ డీవీడీలూ తెచ్చుకోవచ్చు,” అంది రాధ. చిన్నప్పుడు చెడు స్నేహాలు చెయ్యకుండా ఉంటాడని రమణతో ఎక్కువ కాలం గడపటానికి చేసిన ప్రయత్నాలు గుర్తొచ్చి నవ్వుకున్నాడు రామ్మూర్తి.

“పాపం, నువ్వు రోజంతా పనిచేసి అలసిపోయి వస్తావు కదమ్మా, మళ్ళీ ఇంటికి రాగానే లైబ్రరీకెళ్ళటం అంటే కష్టం కదా?”

"వీలయినప్పుడే పోదాం. గ్రోసరీ షాపింగ్‌కి కూడా, మీరు ఇదివరకు చూసిన చోటే అనుకోండీ, అయినా, ముగ్గురం వెళ్తే బాగుంటుంది. ఏం రమణా?" అడిగింది రాధ.

రమణ ఎప్పటిలాగే ఊ అన్నాడు.

★ ★ ★

మరుసటిరోజు మామూలుగానే నాలుగున్నరకు ఇంటికొచ్చింది రాధ. ఇంట్లోకి రాగానే రామ్మూర్తి వంటగదిలో ఉండటం చూసింది. "మామయ్య గారూ, ఏం వెతుకుతున్నారు. నాకు చెప్పండి, నేను చూపిస్తాను." అడిగింది రాధ.

"ఏం వెతకటం లేదులేమ్మా, రా, కూర్చో," అని కుర్చీ చూపించి, కెటిల్ లోంచి రెండు కప్పుల్లో టీ పోశాడు రామ్మూర్తి. ఒక కప్పు కోడలికిస్తూ, "తాగి చూసి చెప్పమ్మా ఎలా వుందో, నువ్వు చేసిన టీ అంత బాగా ఉండకపోవచ్చుగానీ, నీలాగే అల్లం ముక్కలు తరిగివేశాను, ఎలా వుందో చెప్పు?" అన్నాడు, పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ.

రాధకు నమ్మశక్యం కాలేదు. "మీకెందుకండీ ఇంత శ్రమ, నేనున్నానుగా. ఈరోజు రావటం కొంచెం ఆలశ్యమయిందేమో. మీకు టీ తాగాలనిపించి ఉంటుంది. రేపటినుంచీ స్కూలుకు పోబోయేముందే ఒక ఫ్లాస్క్‌లో టీ పోసి పెడతాను," అంది.

"అబ్బే, ఎందుకమ్మా, నేను రోజంతా ఊరికే ఉంటున్నానుగా. ఒక కప్పు టీ చేసిపెడితే నేనేమన్నా అరిగిపోతానా? ఇకనుంచీ నువ్వు ఇంటికొచ్చేసరికి నేను టీ చేసిపెడతాను. ఇద్దరం కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ టీ తాగుదాం. వంట ఏమీ చెయ్యన్లే, నువ్వేం భయపడొద్దు," అన్నాడు నవ్వుతూ.

రాధకూ నవ్వూ వచ్చిందీ, కళ్ళూ నిండాయి. చూడనట్టుగా అటు తిరిగి కిటికీ లోంచి బయటకు చూశాడు రామ్మూర్తి.

ఇద్దరూ మౌనంగా టీ తాగుతూ కూర్చున్నారు. "మామయ్యా, మా నాన్న కూడా మీలాంటివాడే. అమ్మ ఎప్పుడన్నా బజారుకెళ్ళి రావటం ఆలశ్యం అయితే అన్నం వండిపెట్టటం, కూరగాయలు తరగటం అలాంటి పనులు చేసిపెట్టేవాడు. నాన్న స్నేహితులు బాగా జోకులేసేవాళ్ళు. ఏంటమ్మా, మీనాన్న కనిపించటం లేదేంటి? వంటింట్లో ఉన్నాడా? అనేవారు ఇంట్లోకొస్తూనే. మీవైపు ఎలా ఉంటారో తెలియదుగాని, మామయ్యా, మా బంధువుల్లో మగవాళ్ళు అక్కడున్న వస్తువు తీసి ఇక్కడ పెట్టరు. మంచినీళ్ళు కూడా చేతికివ్వాల్సిందే ఆడవాళ్ళు. అన్నం తిన్న తర్వాత చేతులు పళ్ళాల్లోనే కడుగుతారు."

"రమణ ఎప్పుడన్నా," అడగబోయాడు, రామ్మూర్తి.

"లేదులెండి, రమణ అలా చేస్తే నేను చంపెయ్యనూ," అని నవ్వేసింది రాధ. "మీ అబ్బాయి కదా, అచ్చం మీలాంటివాడే. మీ పెంపకం కదా మరి," అంది, కళ్ళతోనే కృతజ్ఞతలు తెలుపుకుంటూ.

టీ తాగింతర్వాత ఇద్దరూ లైబ్రరీకి వెళ్ళారు. దోవలో రామ్మూర్తి సోషల్ సెక్యూరిటీ గురించి అడిగాడు.

"ఈ దేశంలో కూడా చాలామంది ఏదో విధంగా ప్రభుత్వాన్ని మోసం చేస్తుంటారు మామయ్యా," అని మొదలుపెట్టింది రాధ. "ఇండియా నుంచి తల్లిదండ్రుల్ని తీసుకొస్తారు. వాళ్ళు పిల్లల్ని చూసుకుంటారు కాబట్టి బేబీ సిట్టింగ్ ఖర్చులుండవు. ఐదు సంవత్సరాలు వాళ్ళు వస్తూపోతూ ఉంటారు. ఆ తర్వాత తమకు ఏ సంపాదనా లేదనీ, మరే దిక్కూ లేదనీ వాళ్ళచేత దరఖాస్తులు పెట్టిస్తారు పుత్రరత్నాలు. ప్రభుత్వం వాళ్ళకు నెలకు ఇంత అని డబ్బిస్తుంది, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేస్తుంది, తిండి ఖర్చులకు కూడా కొంత ఇస్తుంది. వాళ్ళేమో కొడుకుల దగ్గరే వుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ఉంటారు." రెండు క్షణాలు ఆగి, "మీరు ఆ వెంకటేశ్వర్రావుతో అస్సలు మాట్లాడొద్దు మామయ్యా, అతనూ అతని పెళ్ళాం ఇద్దరూ పరమ దుర్మార్గులు," అంది చాలా కోపంగా.

వాళ్ళ గురించి ఇంకా తెలుసుకోవాలనిపించినా లైబ్రరీకి రావటంతో ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

ఇదివరకు తెచ్చుకున్న పుస్తకాలు ఇంకా చదవలేదు కాబట్టి ఈసారి సరాసరి వరల్డ్ సినిమా సెక్షన్‌కి వెళ్ళాడు రామ్మూర్తి. తను పిల్లల పుస్తకాల సెక్షన్‌కి వెళుతూ "మీరు డివీడీలు సెలెక్ట్ చేసుకోండి, నేను అరగంటలో వస్తాను," అని చెప్పి వెళ్ళింది రాధ. కాలేజీ రోజుల్నుండి ఫ్రాన్స్, ఇటలీ దేశాల సినిమాలు అంటే ఇష్టం రామ్మూర్తికి. మొదటిసారిగా ఆ దేశాల సినిమాల డీవీడీలు దాదాపు వంద డీవీడీలు ఒక్కచోట కనపడేసరికి మహా సంతోషించాడాయన.

ఆరున్నరకు లైబ్రరీనుండి బయటకొచ్చారు. తిరిగి వస్తున్నప్పుడు ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నట్లనిపించింది రామ్మూర్తికి. ఆ వెంకటేశ్వర్రావు గురించి అడగాలనిపించినా ఇది సమయం కాదేమోనని మౌనంగా ఉండిపోయాడు.

భోజనాలయింతర్వాత ముగ్గురూ లివింగ్ రూంలో కూర్చొనుండగా రాధే మొదలుపెట్టింది. "ఈ వెంకటేశ్వర్రావుకు ఈ దేశంలో ఇద్దరు కొడుకులున్నారు, మామయ్యా. పెద్దకొడుకు కాలిఫోర్నియాలో ఉంటాడు. అతనూ అతని భార్యా వాళ్ళకేదో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. వీళ్ళ వెధవచేష్టలు అక్కడ పనికిరావు. పెద్ద కోడలు తన్ని పంపించి ఉంటుంది. ఇక్కడ ఉంటుంటారు ఇద్దరూ రెండో కొడుకు

దగ్గర. వాడొక దరిద్రుడు. అమ్మకు ముద్దుబిడ్డంట. గారాబం చేసి గాడిదని తయారు చేసింది ఆ మహాతల్లి," అంది రుసరుస లాడుతూ.

"ఎందుకు రాధా, మరీ అట్లా మాట్లాడతావూ," అన్నాడు బ్రతిమాలు తున్నట్లుగా రమణ.

"వాళ్ళు వెధవపన్లు చేస్తే తప్పుగాదుగాని నేను చెప్తే తప్పా? అమ్మ చేసే ప్రతి పనీ అంత ఇష్టం అయిన వాడు మరి పెళ్ళెందుకూ చేసుకోవటం? చేసుకున్న దాన్ని తల్లీ కొడుకూ కలిసి రాచి రంపాన పెట్టటానికా? ప్రతిదానికీ 'ఇది మా అమ్మ చేసినట్లుగా లేదు,' అంటాడట వాడు, ఈమేమో మురిసిపోయి ఇంకా వంకలు చూపిస్తుందట ఆ అమ్మాయి చేసే ప్రతిపన్లో. ఇక ఆ పిచ్చిదేమో నోరు లేనిది. ఈ పెద్దాయనేమో వాళ్ళు కోడల్ని ఏడిపిస్తుంటే ఏమీ తెలియనట్టు బయట తిరిగొస్తుం టాడు. బొత్తిగా బుద్ధిలేని వాళ్ళు."

రామ్మూర్తికి విషయం అర్థమయింది.

"ఆ అమ్మాయి రాధకి బాగా తెలుసు నాన్నా. కొంచెం మెత్తటి మనిషి. మన రాధ లాగా కాదు," అన్నాడు రాధను చూస్తూ కనుసైగ చేస్తూ. రాధ చల్లబడింది.

"ఆ అమ్మాయి ఒకటీ రెండుసార్లు ఇంట్లో గొడవ భరించలేక రాధ దగ్గిర కొచ్చింది నాన్నా. రాధేమో పోలీస్ కంప్లైంట్ ఇద్దామంది. ఆ అమ్మాయికేమో భయం- మళ్ళా భర్తమీద కేసుపెడతారేమో, అతని ఉద్యోగం పోతుందేమో- ఇలాంటి భయాలు. ఏం చేస్తాం?"

"ఆ అమ్మాయికి చదువేమీ లేదామ్మా?" అడిగాడు రామ్మూర్తి.

"ఎందుకులేదు మామయ్యా, రెండు మూడేళ్ళ క్రితం ఏదో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కూడా చేస్తుండేది. అదిపోయింది. ఉద్యోగం చేస్తున్న రోజుల్లో కొడుకుని మా ప్రీ స్కూల్లోనే చేర్చింది. అప్పుడే పరిచయం అయ్యింది నాకు.

"వాడు నాలుగేళ్ళ పిల్లాడు అప్పుడు. ఒకటి రెండుసార్లు వాళ్ళింటిక్కూడా వెళ్ళాను నేను. అస్సలు డిసిప్లిన్ లేదు ఆ పిల్లాడికి. అమ్మ అంటే మహా అలుసు. వాడికి ఇష్టం లేని పని ఏదైనా చెయ్యమంటే, టాయ్స్ సర్దమంటేనో, పుస్తకంలో బొమ్మలకు రంగులు వెయ్యమంటేనో, 'కొడతా' అంటూ చెయ్యి ఆడించేవాడు వాళ్ళమ్మ మీద. అప్పుడే అనిపించింది నాకు వీడు తండ్రిని చూసి నేర్చుకుంటున్నా డని."

"ఈ దేశంలో ఇలాంటివి ఎక్కువ అని చెప్తుంటారమ్మా ఇండియాలో. ఉద్యోగాల్లో టెన్షన్ ఎక్కువనీ, అందువల్ల ఆ ఫ్రస్ట్రేషన్ అంతా ఆడవాళ్ళ మీద చూపిస్తుంటారనీ అంటుంటారు."

"అదంతా బూటకం మామయ్యా. గాడిదల్ని పెంచి అమెరికా పంపించినా బెంగళూరు పంపించినా వాళ్ళు గాడిదల్లాగానే ప్రవర్తిస్తారు. ఈ జబ్బుకీ అమెరికాకీ ఏమీ సంబంధం లేదు. అయినా ఫ్రస్ట్రేషన్ మగవాళ్ళకేనా? ఆడవాళ్ళకుండదా? ఇప్పుడు ఈ అమ్మాయి ఉంది చూడండి. ప్రస్తుతం ఉద్యోగం లేదనుకోండి. ఉద్యోగం చేసినరోజుల్లో ఇంట్లో పనులన్నీ చేసుకుని, పిల్లవాణ్ణి మా స్కూలో వదిలేసి అప్పుడు ఆఫీసుకెళ్ళేది. వాణ్ణి నాతో ఇంటికి తీసుకొచ్చేదాన్ని. ఆఫీసు నుంచి ఇంటి కొచ్చింతర్వాత తీసుకుపోయేది. అతను కొంచెం కూడా హెల్ప్ చేసేవాడు కాదు. తండ్రి అన్న వాడికి కొంచెం కూడా బాధ్యతుండదా? వొంట్లో బాగాలేని రోజు కూడా ఆ అమ్మాయే లేచి పన్లన్నీ చేసుకోవాలి, ఆ గాడిద ఒక్క పనీ చేసేవాడు కాదు. ఆ అమ్మాయిని మనిషిలాగా కూడా చూసేవాడు కాదు. ఇప్పుడు ఉద్యోగం లేకపోవటంతో ఇంకా చులకనై పోయినట్లుంది పాపం."

ఆవేశం గొంతుకు అడ్డంపడి, ఒక్కక్షణం ఆగింది రాధ. "అసలు తప్పు మగవాళ్ళది కాదులే మామయ్యా. ఆడవాళ్ళకు అసలు తమ మీద తమకే గౌరవం లేదు. కొడుకుల్ని మహారాజుల్లాగా పెంచుతారు. ఆ గాడిదలు పెద్దయిం తర్వాత పెళ్ళాలను పనిమనుషుల్లాగా చూస్తారు. ఆడవాళ్ళకు బుద్ధి లేనంతకాలం ఇది మారదు."

అంత ఆవేశం ఒక్క క్షణంలో నిరుత్సాహంగా మారింది.

"మరి ఆ అమ్మాయికి మళ్ళా ఉద్యోగం దొరికే అవకాశం లేదామ్మా?" అడిగాడు రామ్మూర్తి.

"ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు దొరకటం కష్టంగానే ఉన్నట్లుంది మామయ్యా. కాని ఆ అమ్మాయి ఊరికే ఉండదు, ఇంట్లో చపాతీలు చేసీ, ఏవేవో శ్నాక్స్ చేసీ ఈరోడ్డు మీదే ఉన్న మూడునాలుగు ఇండియన్ గ్రోసరీ స్టోర్స్‌కు సప్లై చేస్తుంటుంది. వాళ్ళ దగ్గర డబ్బులు కలెక్ట్ చెయ్యటానికే ఆ పెద్దమనిషి స్టోర్స్‌కు వెళ్తుంటాడు. ఆ సంగతి మీకు చెప్పి ఉండడు."

"అలాగా," అన్నాడు రామ్మూర్తి ఏదో జ్ఞాపకం వచ్చినట్లు.

★ ★ ★

అప్పుడప్పుడూ పగటిపూట తలుపు తట్టేవాడు వెంకటేశ్వర్రావు. "బోర్ కొట్టటంలా? కాసేపు బయటికెళ్ళొద్దామా?" అని అంటూ. అతనితో మాట్లాడ్డం రాధకు ఇష్టంలేదని తెలిసి కూడా ముఖమాటంకొద్దీ కొంచెంసేపు వెళ్ళివస్తుండేవాడు రామ్మూర్తి. వెళ్ళినప్పుడల్లా ఎక్కువగా ఆ గ్రోసరీ స్టోర్స్ వైపే వెళ్ళేవాళ్ళు ఇద్దరూ.

★ ★ ★

జనవరి చివర్లో ఒకరోజు బాగా మంచు పడుతుందని టీవీ వార్తల్లో చెప్పారు. దాదాపు పది అంగుళాలు పడుతుందట. రోజంతా అదే వార్త టీవీలో. మరుసటి రోజు ఎక్కడెక్కడ స్కూళ్ళు తెరవరో చెప్తున్నారు. రాధ పనిచేసే ప్రీస్కూలు కూడా తెరవరట. రమణకు మాత్రం ఎంత మంచు పడినా ఆఫీసుకు వెళ్ళాల్సిందేనట.

రోజంతా రాత్రంతా మంచు పడుతూనే ఉంది. తెల్లవారేసరికి ఒక అడుగెత్తు పడింది లాగుంది. ఉదయానికి రోజూ రద్దీగా ఉండే ఎపార్ట్‌మెంట్ పక్కనున్న రోడ్డు మీద పెద్దగా ట్రాఫిక్ లేదు ఆరోజు. రమణ కూడా బద్ధకించి ఇంట్లోనే ఉండి పోయాడు. కానీ పది నిముషాలకొకసారి కిటికీ దగ్గరకెళ్ళి రోడ్డు వైపు చూసొస్తూనే ఉన్నాడు.

రాధ ఉదయం అంతా వంటగదిలోనే ఉంది. తన కొలీగ్ ఎవరో కొత్త రెసిపీ ఇచ్చిందట.

రామ్మూర్తి టీవీలో వార్తలు చూస్తూ కూర్చున్నాడు. వాళ్ళు చెప్పిందే చెప్తున్నారు. ఎంత మంచు పడిందీ, ఎక్కడెక్కడ కారు యాక్సిడెంట్లు జరిగిందీ, ఏయే ఆఫీసులు మూసేసిందీ. రమణ ఇంకా కిటికీ దాకా వెళ్ళివస్తూనే ఉన్నాడు. ఆఫీసుకి వెళ్తే పోయేదేమో ఇంట్లో వుండి బాధపడటం కంటే.

★ ★ ★

ఒకరోజు మధ్యాన్నం రెండుగంటలప్పుడు వచ్చాడు వెంకటేశ్వర్రావు. విసుక్కుంటున్నట్లు కనబడ్డాడు. లోపలికి రమ్మని లివింగ్ రూంలోకి దారితీశాడు రామ్మూర్తి. కూర్చుంటూనే, ''రామ్మూర్తిగారూ, మీ అబ్బాయీ కోడలూ బాగానే వుంటారా?'' అని అడిగాడు.

అనుకోకుండా వచ్చిన ప్రశ్నకు రామ్మూర్తి కొంచెం ఆశ్చర్యపడ్డాడు. అంత చొరవ తీసుకుని తన కుటుంబం గురించి అడిగినందుకు కొంచెం కోపం కూడా వచ్చింది. ''ఏం? బాగానే ఉంటారు. ఎందుకూ అలా అడిగారూ?''

''అబ్బే, ఏంలేదు, పెళ్ళై చానాళ్ళయిందికదా, మీకు ఇంకా మనమలూ మనమరాళ్ళూ లేరు కదా అని.''

'అదా. అంటే పిల్లలున్న వాళ్ళు బాగున్నట్లూ, లేనివారు సఖ్యంగా లేనట్లా మీరనుకునేదీ?'' సూటిగా వెంకటేశ్వర్రావు కళ్ళలోకి చూస్తూ అడిగాడు రామ్మూర్తి.

''అలా అని కాదులెండి,'' అని, ఒక్క క్షణం ఆగి, ''మీకు తెలియందేముంది, మీ అబ్బాయి చెప్పే ఉంటాడు. మావాడికీ కోడలికీ సరిగ్గా కుదరటంలేదు. నాకైతే మా వూరు వెళ్ళిపోదామనిపిస్తుంది. మా ఆవిడేమో చూస్తూ చూస్తూ ఆ గవర్మెంటు వాళ్ళు ప్రతినెలా ఇచ్చే ఎనభైవేలూ వొదులుకోవటం ఎందుకూ అంటుంది. ఏం చెయ్యాలో తోచటంలేదు,'' అన్నాడు వెంకటేశ్వర్రావు.

రామ్మూర్తికి ఏం చెప్పాలో తెలియలేదు.

“మీరు ఇక్కడే ఉండాలనుకుంటున్నారా? తిరిగి ఇండియా వెళ్ళిపోతారా?” అడిగాడు వెంకటేశ్రావు.

“వెళ్తున్నాను. ఫిబ్రవరి 19 నా ప్రయాణం.”

“అలాగా. అదే మంచిదిలెండి. అమెరికా అట్లుంటుంది, ఇట్లుంటుంది, ఇంద్రలోకం, చంద్రలోకం అంటారుగాని ఏముంది ఇక్కడ బూడిద. రోజంతా ఇంట్లో కూర్చోటం, విసుగు పుట్టటం తప్ప. అదీగాక మా కోడలికి మేం ఇక్కడ ఉండటం పెద్దగా ఇష్టంలేదు. మీ కోడలు బాగానే మాట్లాడుతుందా మీతోటి?”

“అవునండీ, మా అమ్మాయి బాగానే మాట్లాడుతుంది,” అన్నాడు రామ్మూర్తి. తనకు వాళ్ళ గురించి ఎంత తెలుసో, తెలిసినట్లు ప్రవర్తించాలో లేదో నిర్ణయించుకోలేక మరేమీ అనలేదు.

‘నిన్న సాయంత్రం చూడండీ, ఎవర్దో పిల్లవాడిది బర్త్‌డే అట వచ్చే ఆదివారం. ఆ పిల్లాడికి ఏదన్నా గిఫ్ట్ కొనక్కొస్తామని మావాడూ కోడలూ బయల్దేరారు. ‘మేం కూడా వస్తాం,’ అని బయల్దేరింది మా ఆవిడ. ‘నాకు తలనొప్పిగా ఉంది, మీరే ఏదైనా కొనుక్కురండి,’ అని చెప్పి ఆ అమ్మాయి మానుకుంది. మా ఇంట్లో ఎప్పుడూ ఇంతే. ఈమేమో ప్రతిదాంట్లో వేలుపెడుతుంది. ఆ అమ్మాయికేమో అది ఇష్టం ఉండదు.”

రామ్మూర్తి వింటూ కూర్చున్నాడు కాని ఏంచెప్పాలో అర్థంకాలేదు. తను కూడా ఎప్పుడూ పిల్లలతో బయటకు వెళ్ళకూడదేమో షాపింగ్‌కీ వాటికీ వీటికీ. వాళ్ళిద్దరే వెళ్తే బాగుంటుందేమో. ‘మీరు వెళ్ళిరాండిలేమ్మా,’ అని అన్నప్పుడల్లా రాధ ఒప్పుకోదు. ‘అందరం వెళ్తే సరదాగా ఉంటుంది,’ అంటుంది. ఏమో. మర్యాదకి అంటుందేమో.

“ఈకాలం ఆడపిల్లలకి నలుగురితో కలిసి ఉండటం చాతకాదండీ. అదీగాక పెద్దవాళ్ళు మంచీచెడ్డా గురించి చెప్తే వినాలి కదా, అదీలేదు. ఏంటో, నాకేం తోచటం లేదు. ఈమెకేమో నోరు మూసుకొని ఉండటం చాతకాదు. మీ కోడలు మీ మాట వింటుందాండీ అసలు?” అడిగాడు వెంకటేశ్వర్రావు.

“ఏముందండీ చెప్పటానికీ, వినటానికీ? ఇంత దూరం వచ్చి వాళ్ళ కాళ్ళ మీద నిలబడి వాళ్ళు బతుకుతున్నారు. వాళ్ళకు చెప్పేటంత జ్ఞానం నాకు లేదు. ఇక్కడి ప్రపంచం గురించి నాకేం తెలుసూ, వాళ్ళకు చెప్పటానికి?”

“అవుననుకోండీ, అయినా అనుభవం ఉన్నవారూ, పెద్దవారూ, మంచీచెడ్డా మీరు చెప్పకపోతే వాళ్ళకి ఇంకెవరు చెప్తారు?”

“ఏదైనా విషయం గురించి నా అభిప్రాయం అడిగితే నాకు తెలిసింది చెప్తా ననుకోండీ. కాని అలాంటి సందర్భం ఇంతవరకూ రాలేదు. అయినా ముప్పైయ్యేళ్ళ పిల్లలకి మంచీచెడ్డల గురించి మనం చెప్పాలా? ఈపాటికి వాళ్ళకి తెలిసే వుంటుంది. తెలియకపోతే వాళ్ళే తెలుసుకుంటారు. మనం ఎంతకాలం వాళ్ళకు చిన్నపిల్లలకు చెప్పినట్లు చెప్తాం చెప్పండీ?”

“అంతేనంటారా? మీరొకసారి మా ఇంటికొచ్చి ఆమాట మా ఆవిడకి చెప్తారా,” అన్నాడు వెంకటేశ్వర్రావు, నవ్వుతూ.

“నేను చెప్పటం ఎందుకూ, మీరే చెప్పండి,” అన్నాడు రామ్మూర్తి.

★ ★ ★

ఫిబ్రవరిలో మొదటి ఆదివారం. పదిరోజుల్లో రామ్మూర్తి తిరుగు ప్రయాణం. హైదరాబాద్‌లో కింద ఫ్లోర్‌లో ఉంటున్న బంధువుల అబ్బాయిని అప్పుడప్పుడూ తన ఫ్లాట్ చూసిపోతుండమని అడిగాడు. అతను చూస్తున్నాడో లేదో. తిరిగి వెళ్ళిం తర్వాత పనిమనిషి మళ్ళా ఎన్నాళ్ళకు దొరుకుతుందో?

భోజనాలయింతర్వాత, ‘రమణా, నా రిజర్వేషన్ గురించి ఒకసారి కనుక్కో బాబూ,” అని అడిగాడు రామ్మూర్తి టిక్కెట్ ప్రింటవుట్ ఇస్తూ.

“అప్పుడే ఎందుకు నాన్నా, మీకు వెంటనే వెళ్ళాల్సిన అవసరం లేదుకదా, ప్రయాణం తేదీ మార్చుకోవచ్చు, కాకపోతే కొంచెం ఫైన్ కట్టమంటారు, మార్చు కోవటం పెద్ద కష్టం కాదు,” అన్నాడు రమణ, సమాధానం కోసం ఎదురుచూస్తూ.

“ఇక్కడ ఉండి ఏంచేస్తాను రమణా, మళ్ళా వస్తాన్లే ఎప్పుడన్నా,” అన్నా డాయన.

“ఏం మామయ్యా, మాతో ఉండటం కష్టంగా ఉందా మీకు? బోర్ కొడు తుందా? లేక కోడలు మిమ్మల్ని సరిగ్గా చూసుకోవటం లేదా?” అంది రాధ. నవ్వు తూనే అడిగింది. సీరియస్‌గానూ అడిగింది.

“అబ్బే, అదేం లేదమ్మా. కోడలు మంచమ్మాయే,” అని నవ్వాడు రామ్మూర్తి. “కాలక్షేపం కూడా బాగానే జరుగుతుంది.”


“మరి మీరు వెళ్ళటం ఎందుకు మామయ్యా? మీరెళ్ళిపోతే ఇంటికొచ్చేసరికి నాకు టీ ఎవరు చేసిపెడతారూ? గ్రోసరీ షాపింగ్‌కి వెళ్ళినప్పుడు సంచులు ఎవరు మోస్తారూ?” అడిగింది రాధ చాలా సీరియస్‌గా ముఖం పెట్టి.

నవ్వొచ్చింది రామ్మూర్తికి.

ఆదివారం ఆంధ్రజ్యోతి
29 మే 2011

లైఫ్ సైన్స్

డోర్ బెల్ మోగటంతో రిస్ట్ వాచీ చూసుకుంది జానకి. ఇది అప్పుడే వచ్చేసిందా! నలభైమైళ్ళు అరగంటలోనా! వయసు ముదిరినా స్పీడింగ్ అలవాటు పోలేదన్న మాట. అంత స్పీడులో ఏక్సిడెంట్ జరిగితే? ప్రాణంపోదూ. ప్రాణంపోతే ఫరవాలేదు కాని,



దెబ్బలు తగిలి మంచంలో పడి బాధ పడాల్సొస్తే? దీన్ని బాగా తిట్టాలను కుంటూ తలుపు తీసింది జానకి.

ఫ్యూనరల్ హోమ్ అబ్బాయి. ముప్పైయ్యేళ్ళుంటాయేమో. తెల్లటి కార్డ్‌బోర్డ్ బాక్స్‌ని రెండు చేతుల్లో పట్టుకుని నిలబడ్డాడు. వినయంగా, మర్యాదగా, "గుడ్ ఆఫ్టర్‌నూన్, మిసెస్ రావ్," అని కొంచెం తల వంచాడు.

"గుడ్ ఆఫ్టర్‌నూన్," అని, పక్కకు తొలిగి, అతన్ని లోపలికి రమ్మని అడిగింది జానకి.

స్లిప్ ఆన్ షూస్ బయట వదిలేసి లోపలికి వచ్చాడతను, బాక్స్‌ని జాగ్రత్తగా రెండు చేతుల్లో పట్టుకుని.

లివింగ్‌రూమ్‌లో కాఫీ టేబుల్ మీద పెట్టమంది బాక్స్‌ని. జాగ్రత్తగా టేబుల్ మీద పెట్టి, "మిసెస్ రావ్, అయామ్ సారీ ఫర్ యువర్ లాస్," అని తల వంచాడతను.

థాంక్స్ చెప్పిందామె. అతను సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. తలుపు వేసివచ్చి సోఫాలో కూర్చుంది జానకి కార్డ్‌బోర్డ్ బాక్స్‌ని చూస్తూ.

మళ్ళా డోర్ బెల్ మోగటంతో తలుపు తీసింది.

రజని. ఎప్పటిలాగే ఉంది.

మాటల్లేకుండా ఒకరినొకరు కౌగలించుకుని నిలబడ్డారు రెండు నిమిషాలు. జానకి భుజం చుట్టూ చెయ్యివేసి లోపలికి తీసుకొచ్చి సోఫాలో తన పక్కన కూర్చో బెట్టుకుని కౌగలించుకుంది రజని. జానకి కళ్ళవెంట నీళ్ళొచ్చాయి.

కన్నీళ్ళు తుడిచి నుదిటి మీద ముద్దుపెట్టింది రజని. రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుంటూ, "సుబ్బూ పోయినందుకు నాకు విచారంగానూ ఉంది, ఒక విధంగా సంతోషంగానూ ఉంది. పాపం ఎంత బాధపడ్డాడో. నువ్వెంత కష్ట పడ్డావో," అంది.

జానకి కళ్ళు నిండాయి. "అదుగో చూడు, పెద్ద పెట్టెలో తీసుకెళ్ళి చిన్న డబ్బాలో తీసుకొచ్చి ఇచ్చిపోయారు," అంది.

కన్నీళ్ళు తుడిచి ఆమెను దగ్గరకు తీసుకుంది రజని.

కొంచెం తేరుకుని, "నువ్వు అలసిపోయి ఉంటావు, స్నానం చేసిరా, నేను కాఫీ కలుపుతాను," అని తన స్నేహితురాలి చెంపలు తాకింది జానకి.

"ఇప్పుడొద్దులే. స్నానం చేసే బయలుదేరాను."

"సరే. కాఫీ కలుపుతాను ఉండు. నువ్వు ఫోన్ చేసినప్పుడే పెట్టాను."

జానకి వెంట రజని కూడా వంటగదిలోకి వచ్చింది. ఐలెండ్ దగ్గర స్టూల్ మీద కూర్చుంది. జానకి అరవైయ్యేదేళ్ళకంటే ఎక్కువగా కనబడుతుంది. ఈ రెండేళ్ళలో దీని వయసు పదేళ్ళు పెరిగినట్లుంది అనుకుంటూ, "జానకీ, నువ్వు కొన్నాళ్ళు సెయింట్ లూయిస్ రావే, నా దగ్గిరుండు," అంది.

కాఫీ మగ్ రజనీకిస్తూ, "ఏం, నన్ను పెంచుకుంటావా?" అంది జానకి. మొదటిసారిగా ఆమె ముఖంలో కొంచెం కళ కనిపించింది.

ఏదో అనబోయి ఒక్కక్షణం ఆగింది రజని, పాతరోజుల్లోలాగా మాట్లాడుకోవటానికి ఇది సందర్భం కాదేమోనని. "తమాషాక్కాదే, నిజంగా, కొన్నాళ్ళు మనం హాస్టల్లో ఉన్నట్లే కలిసుందాం. కాకపోతే ఆరుగంటలకు లేపటానికి సిస్టర్లెవరూ రారు, నీ ఇష్టం వచ్చినంతసేపు పడుకోవచ్చు, రాత్రి ఇష్టం అయినంతసేపు కబుర్లు చెప్పుకోవచ్చు," అంది.

"ఒక్కొక్కసారి నాక్కూడా మళ్ళీ ఆ రోజుల్లోకి పోగలిగితే ఎంత బాగుంటుందో అనిపిస్తుందే. ఎంత అల్లరి చేసేవాళ్ళమోగదా!" జానకి మనసు నలభై సంవత్సరాలు వెనక్కెళ్ళింది. "ఇద్దరం డాక్టర్లం అవ్వాలనుకునే వాళ్ళం. నువ్వయ్యావనుకో, నేనొక పనికిమాలినదాన్నయ్యాను."

"ఛా, ఎందుకే అలా అంటావు, నువ్వూ సుబ్బూ హాయిగా బతికారు, ఇద్దరు బంగారంలాంటి పిల్లల్ని పెంచారు, అంతకంటే ఏం సాధిస్తారు ఎవరైనా?"

"ఏమోలే, ఈ నాలుగైదు రోజులూ ఒంటరిగా ఉండటం వల్లేమో, చాలా చాలా ఆలోచించాను. నేనేం చేశాను నా జీవితంలో అనిపిస్తుంది. ఇల్లు శుభ్రం చెయ్యటం, వొండిపెట్టటం, అంతేగదా నేను చేసింది, పాపం ఎంత కష్టపడి చదివించాడో నాన్న, అంతా వృధా అయిపోయిందిగదా?"

"చదువెప్పుడూ వృధాకాదే. ఇప్పుడైనా మించి పోయిందేముందీ, ఏదైనా చెయ్యాలనిపిస్తే ఇప్పుడైనా చెయ్యొచ్చుగదా?"

"ఇప్పుడా? ఇప్పుడు ఎముకల్లో అంత శక్తిలేదు. ఇప్పుడేం చేస్తాన్లే. సరే పోనీలే, నీ సంగతులు చెప్పు."

"ఏముందీ చెప్పటానికి. నలభై సంవత్సరాలుగా స్నేహితులం, కానీ నీకు అవసరం అయినప్పుడు మాత్రం అంత దూరంగా ఉండిపోయాను. సారీనే," అని జానకి చేతులు తన చేతుల్లోకి తీసుకుంది రజని.

"ఫరవాలేదులే. నిజానికి నువ్వు ఇప్పుడు రావటమే బాగుంది. సుబ్బూ పోయిన రోజూ, మరుసటి రోజూ ఎవరెవరో వచ్చారు, అందరూ సారీ ఫర్ యువర్ లాస్ అన్నారు. నాకైతే మనసు స్థంభించిపోయినట్లైంది. దాదాపు రెండు సంవత్సరా లుగా కుటుంబం నేనే నడుపుకొచ్చానా, కానీ సుబ్బూ పోయిన రోజు నేనొక్కదాన్నీ ఎలా బతుకుతానా అనిపించింది. అంతమంది చుట్టూ ఉన్నా అంత గందర గోళంలో నేను వొంటరిదాన్ననిపించింది. ఎవ్వరితోనూ సరిగ్గా మాట్లాడలేక పోయాను. పిల్లలే అన్నీ చూసుకున్నారు."

"మరి పిల్లలు వెంటనే వెళ్ళిపోయారా?"

"అవును. మంగళవారం పోయాడు సుబ్బూ. బుధవారం ఒంటిగంటకల్లా అంతా అయిపోయింది. పిల్లలిద్దరూ మరుసటిరోజే వెళ్ళిపోయారు. ఈ రోజుల్లో అందరికీ పనివొత్తిళ్ళు కదా. నాకేమనిపించిందో చెప్పనా? సుబ్బూ శుక్రవారం పోయి నట్లయితే పిల్లలు సంతోషించేవాళ్ళేమో, సెలవు తీసుకోకుండా వీకెండ్ కలిసొచ్చిం దని," అంది జానకి నిరాశపడుతూ.

ప్రతిమా, వినయ్ ఇద్దరూ మంచి పిల్లలు. తల్లిదండ్రులకు చాలా దగ్గర అని తెలుసు రజనీకి. కానీ వాళ్ళ పనుల్లో వాళ్ళుంటూ సుబ్బూకి జబ్బుగా ఉన్నా ఎక్కువసార్లు ఇంటికి రాలేకపోయారు. అది జానకికి పెద్ద కొరవగా ఉండిందని తనకు తెలుసు. నిజానికి తనుమాత్రం, జానకికంటే మంచి స్నేహితులు తనకెవ రున్నారూ, అయినా తను ఎన్నిసార్లు వచ్చిందీ సుబ్బూని చూసిపోవటానికి?

"పిల్లలు ఇటువైపు వస్తారేమో అడిగావా?" అడిగింది రజని.

"నేను అడగలేదు. అయినా ఇప్పుడు మిషిగన్లో ఎవ్వరికీ ఉద్యోగాలు రావటం లేదు. ఫరవాలేదులే. కొన్నాళ్ళుపోతే వొంటరిగా ఉండటం అలవాటవు తుంది," ఖాళీ కాఫీ మగ్‌లోకి చూస్తూ అంది జానకి.

"నిజంగా నా దగ్గరకు రావే. రెండుమూడు నెల్లుండు. ఇష్టం లేకపోతే తిరిగి వచ్చేసెయ్," అంది రజని.

"చూద్దాంలే. ఇక్కడుంటే అప్పుడప్పుడూ పిల్లలు రావటానికి వీలుంటుంది."

"వాళ్ళొచ్చే ఒకటీ రెండురోజులు నేరుగా సెయింట్ లూయిసే రావొచ్చు. ఇక్కడికంటే దగ్గిరే కదా ఇద్దరికీ. నేనేమన్నా కొత్త మనిషినా వాళ్ళకి?"

"కాదనుకో, చూద్దాంలే."

"ఇక్కడ చెయ్యాల్సిన పనులేమైనా ఉన్నాయా?"

"పన్లేం లేవులే. అన్ని ఏర్పాట్లూ సుబ్బూనే చేసిపోయాడు. క్రిమేషన్ ఏర్పాట్ల తో సహా. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా."

"చివరిదాకా మెదడు బాగానే ఉందన్నమాట."

"అవును. నొప్పితో బాధపడ్డాడుగాని మెదడు బాగానే ఉండింది."

"ఇండియా నుంచి మీ అన్నయ్యగానీ, సుబ్బూ తరఫునగానీ ఎవ్వరూ రాలేదా?"

"రాలేదు. ఫరవాలేదులే. వాళ్ళు ఎవరి పనుల్లో వాళ్ళు ఉంటారు. పైగా అర్జంటుగా పాస్‌పోర్టులు, వీసాలు రావాలంటే అంత సులభంకాదు కదా. పోనీలే."

"జానకీ, నీకు అవసరం అయినప్పుడు నేను కూడా దగ్గర ఉండలేక పోయాను, సారీనే."

"ఫరవాలేదులే, ఎన్నిసార్లు చెప్తావు, నువ్వు జర్మనీ వెళ్ళావని తెలుసుకదా. అందుకే నీకు ఫోన్ చెయ్యలేదు. కాని తను చేశానని చెప్పింది ప్రతిమ."

"అవును. మొన్న ఇంటికి వచ్చి మెసేజెస్ చెక్ చేస్తే దాని వాయిస్ మెయిల్ ఉంది."

★ ★ ★

జానకి ఇంట్లో గెస్ట్ బెడ్‌రూమ్ తనకి కొత్తకాదు. స్నానంచేసి కింద కెళ్ళింది రజని. టేబుల్ రెడీగా అమర్చిపెట్టింది జానకి. భోజనం తర్వాత ఇద్దరూ ఫామిలీ రూంలో సెటిలయ్యారు. తమతో మేరీస్టెల్లా కాలేజీలో చదువుకున్న అమ్మాయిల గురించీ, వాళ్ళలో అమెరికాలో సెటిలయిన వారి గురించీ మాట్లాడుకున్నారు.

మేరీస్టెల్లాలో చదువుకున్న రోజుల్లో ఎన్నోసార్లు జానకివాళ్ళ ఇంటికి వెళ్ళేది రజని సెలవులకూ, ఆదివారాలకూ. జానకి వాళ్ళ అన్నయ్యకి రజని అంటే ఇష్టంగా ఉండేది. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నాడు. కానీ రజనీకి ఆ రోజుల్లో మెడిసిన్ చెయ్యాలనీ, పెళ్ళికి తొందరలేదనీ ఉండేది. అతనకి మంచి సంబంధం రావటంతో పెళ్ళి చేసుకున్నాడు.

"మీ అన్నయ్య శేఖర్ నీకు బాగా దగ్గర కదా, వస్తాడేమో అనుకున్నాను." అంది రజని.

"ఒకప్పుడు దగ్గరే అనుకో. నీకు తెలియందేముందీ. చిన్నప్పుడుండే సంబంధాలు వేరు. సంసారాలూ, బాధ్యతలూ, సంపాదించాలనే తాపత్రయం అన్నీ మార్చేస్తాయి." ఒక్క క్షణం ఆగి, "నాకేమనిపిస్తుందో తెలుసా, ఆస్తులు కూడబెట్టా లనే ఆలోచన ఈ దేశంలో కంటే ఇండియాలోనే ఎక్కువ అనిపిస్తుంది."

కుతూహలంగా ఆమెవైపు తిరిగి కూర్చుంది రజని.

"ఇప్పుడు మా అన్నయ్య ఉన్నాడు చూడు. నాన్న ఆస్తిలో రెండెకరాలు సుబ్బుకి కట్నం కింద ఇచ్చారు. మిగతాదంతా దాదాపు పన్నెండెకరాలు వాడికిందనే ఉంది. విజయవాడలో ఎలక్ట్రానిక్ షాప్ పెట్టాడు. బాగానే సంపాదించాడు. ఇద్దరు మగపిల్లలు. కట్నాలివ్వటంలాంటి ఖర్చేంలేదు. మా పెళ్ళయిన కొత్తల్లో ప్రతి సంవత్సరం నాకిచ్చిన రెండెకరాలూ వాడుకుంటున్నందుకు మా మామగారికి కొంత డబ్బు పంపించేవాడు. తర్వాత ఒక సంవత్సరం పొలంలో నష్టం వచ్చిందని సుబ్బుతో అంటే సరే కౌలుకింద ఏమీ పంపించనవసరం లేదులే అన్నాడు సుబ్బు. అప్పటి నుంచీ ఇప్పటివరకూ, దాదాపు పాతికేళ్ళు, మళ్ళా ఆ పొలం గురించి ఏమీ చెప్ప లేదు. అడగటం ఇష్టంలేక సుబ్బు ఏమీ అనలేదు. ఇప్పుడైనా, పొలం నాదికదా, దాని గురించి ఒక్క మాటాలేదు. వాడి పెద్దకొడుకు ఇక్కడ అలబామాలో చదువు కున్నప్పుడు సుబ్బునే వాడి అవసరాలన్నీ చూసుకుంటుండేవాడు." అక్కడ ఆగింది జానకి.

"జానకీ, నీకు ఆర్థికంగా ఏమైనా ఇబ్బంది ఉంటే నాకు చెప్పవే."

"ఛా, అదేంలేదు. సుబ్బు అలాంటి ఇబ్బందులు రాకుండా అన్నీ చేసిపెట్టి పోయాడు. అవసరం ఉండికాదు. కానీ వాడికి ఎంత సంపాదిస్తే తృప్తి ఉంటుందీ?"

"నీకు ఆ రెండెకరాలూ కావాలనిపిస్తుందా? ఏంచేస్తావు దాంతో? ఇండియా వెళ్ళే ఆలోచన ఏమైనా ఉందా?"

"లేదులే. అలాకాదు. ఒక్కొకసారి నాన్నకూ నాకు ఉన్న సంబంధం ఆ రెండు ఎకరాలు అనిపిస్తుంది. ఏంటో నాకూ అర్థంకాదు. అది లేకపోయినా నేను బతగ్గలను. కానీ అది నాది కాదు, వాడిదే అన్నట్లు ప్రవర్తిస్తాడు వాడు. నన్నడిగి తీసుకుంటే ఇంత కష్టంగా ఉండదేమో అనిపిస్తుంది."

చిన్న నవ్వు నవ్వింది రజని.

జానకికి అర్థంకాలేదు.

"ఎందుకూ నవ్వుతావు. నేను గ్రీడీగా కనిపిస్తున్నానా? అది నాన్న నాకు ఇచ్చిన ఆస్తి కదా?"

"అందుక్కాదే నవ్వింది. నువ్వు శేఖర్ గురించే ఇలా అంటే నేను నా తమ్ముడి గురించి ఏం చెప్పాలి? మా తమ్ముడి కొడుకు వసంత్ బాంబేలో కెమికల్ ఇంజి నీర్‌గా పని చేస్తున్నాడు. వాడు ఎంత మంచివాడో! నీకు ఎప్పుడూ పరిచయం

చెయ్యలేదేమో. ఒకటి రెండుసార్లు యుఎస్ కూడా వచ్చాడు. మంచి మనిషి, చాలా తెలివికలవాడు, సున్నితమైన మనసు. మా తమ్ముడి ఇంట్లో వాడెలా పుట్టాడా అనిపిస్తుంది నాకు. నేను బెర్లిన్ నుంచి తిరిగివచ్చినరోజు, మొన్నటిరాత్రి, పదీ పదకొండు గంటలకు ఫోన్ చేశాడు మా తమ్ముడు. రెండుమూడు రోజులుగా ప్రతిరోజూ పిలుస్తున్నాడట. ఆన్సరింగ్ మెషిన్ వస్తుందట. ఎక్కడికెళ్ళావు అన్నాడు. జర్మనీ వెళ్ళానులే అన్నాను. ఎందుకూ అన్నాడు. పెద్దగా సమాధానం చెప్పటం ఇష్టంలేక ఊరికేలే అన్నాను. ఊరికేనా అన్నాడు ఆశ్చర్యంగా. వెనక మా తమ్ముడి భార్య ఏమందో చెప్పనా? నాకు శుభ్రంగా అంతా వినపడుతూనే ఉంది ఫోన్లో. అట్లా వృధాగా డబ్బులు తగలెయ్యకపోతే ఏమంట? అంది. వాడికి తగిన భార్య దొరికింది. ఇద్దరూ ఇద్దరే. అయినా అప్పుడప్పుడూ వాడికి నేనే సహాయం చేశాను. వాడి దగ్గర నేనెప్పుడూ పైసా కూడా తీసుకోలేదు. పైగా వసంత్‌కి తెలిస్తే బాధపడ తాడని వాడికి ఈ విషయాలు ఎప్పుడూ చెప్పలేదు. మా తమ్ముడికీ మరదలికీ ఆలోచన ఏంటో చెప్పనా? రజనికెలాగూ పిల్లల్లేరు కదా, దానికి ఉన్నదంతా మనదే కదా అని. నా దాంట్లో నేను ఖర్చుపెట్టుకున్నా అయ్యో మాకు రాబోయేదంతా ఖర్చయిపోతుందే అని బాధపడతారు వాళ్ళు. వీళ్ళకంటే మీ అన్నయ్య కొంచెం నయమేమో.''

''ఏమో, తోడబుట్టినవాళ్ళే ఇలా ఎందుకు తయారవుతారో,'' అని నిట్టూర్చింది జానకి.

''నాకేమనిపిస్తుందో చెప్పనా. ఇట్లా పిల్లల కోసం ఆస్తులు సంపాయించటం వ్యవసాయం చేసేవాళ్ళలో ఎక్కువ అనిపిస్తుంది. ఇంకా నాలుగెకరాలు సంపాయించి కొడుకులకిస్తే వాళ్ళు ఇంకా బాగా బతుకుతారనే ఆశ. ఉద్యోగాలు చేసే వాళ్ళల్లో ఇది తక్కువ అనిపిస్తుంది నాకైతే. నీ ఉద్యోగం కొడుకులకు ఇవ్వలేవు కదా, వాళ్ల తెలివితేటల్తో వాళ్ళ ఉద్యోగాలు వాళ్ళు సంపాయించుకోవాల్సిందే. కూడబెట్టి వాళ్ళకి ఎంత ఇచ్చినా ఉద్యోగం లేకపోతే అది తొందరలోనే హరించుకుపోతుంది. అందువల్ల పిల్లలు ఎవరి బతుకులు వాళ్ళు స్వశక్తితో బతకాల్సిందే. అందువల్ల కూడబెట్టాలనే తాపత్రయం వ్యవసాయం చేసే వాళ్ళల్లో కంటే తక్కువ అనిపిస్తుంది నాకు.''

శ్రద్ధగా వింది జానకి. ఎమ్మెస్ చేసినప్పటి నుంచీ ముప్పై సంవత్సరాలు ఉద్యోగం చేశాడు సుబ్బూ. పిల్లలను పూర్తిగా తన ఖర్చుతోనే చదివించాడు.

ప్రతిమా వినయ్‌లు చాలాసార్లు నాన్నకు థాంక్స్ చెప్పారు. తమ క్లాస్‌మేట్స్ ఎందరో లోన్లు తీసుకుంటున్నారు కాలేజీ ఫీజులకూ ఖర్చులకూ; డబ్బున్న వాళ్ళ పిల్లలు కూడా. తమకు అలాంటి అవసరం రాకుండా చదివించినందుకు తల్లిదండ్రుల మీద కృతజ్ఞతాభావంతో మాట్లాడినప్పుడల్లా తను వాళ్ళకు ఇవ్వగలిగిందేమీ లేదనీ, చది వించటమే తను ఇవ్వగలిగిన ఆస్తి అనీ విచారంగా మాట్లాడేవాడు సుబ్బు.''

"పోనీలే, ఇప్పుడు ఆ రెండెకరాలూ ఉంటే మాత్రం వినయ్‌గానీ ప్రతిమగానీ వ్యవసాయం చెయ్యబోతున్నారా అని సర్దేసుకుంటాను మనసులోనే,'' అంది జానకి అసంతృప్తిగానే.

ఆ ఆలోచనతో ఏకీభవిస్తున్నట్లు ఓ చిన్న నవ్వు నవ్వింది రజని.

★ ★ ★

ఆ రాత్రి ఇద్దరూ గెస్ట్ బెడ్రూమ్‌లో పడుకున్నారు. ఒంటిగంట దాకా కబుర్లు చెప్పుకున్నారు. కాలేజీ రోజుల గురించీ, లెక్చరర్ల గురించీ, సెలవుల గురించీ.

సుబ్బు చివరి రోజుల గురించి చెప్పింది జానకి. అంత బాధలోఉండి కూడా జానకికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చేసిపోయాడు సుబ్బూ. అంత్యక్రియల ఏర్పాటు కూడా తనే చేసుకున్నాడు. వీలునామా రాసిపెట్టిపోయాడు. ఆర్థికంగా తనకెలాంటి ఇబ్బందులూ లేకపొయినా సుబ్బు లేకపోవడంతో తన జీవితం తాడూ బొంగరం లేనిదిగా అనిపిస్తుంది జానకికి. తను ఇప్పుడేం చెయ్యాలి. చావుకు ఎదురుచూస్తూ బతకటం తప్ప మరోదారి కనబడటంలేదు.

"ప్రతిమ దగ్గర ఉండరాదూ కొన్నాళ్ళు. దానికీ తోడుగా ఉంటుంది, నీకూ పొద్దుపోతుంది,'' అంది రజని.

"ప్రతిమ రమ్మంది, వినయ్ కూడా రమ్మన్నాడు. కానీ ఇప్పుడు పిల్లల దగ్గర కెళ్ళి ఉండటం కుదరదేమో అనిపిస్తుంది. నా అలవాట్లూ వాళ్ళ అలవాట్లూ కలవక పోతే. నేను ఈ వయసులో మారటం కష్టం. వాళ్ళను నాకోసం మారమనటం న్యాయం కాదు. నేనిక్కడ ఉండటమే మంచిదనిపిస్తుంది.''

"మరి వచ్చి నాదగ్గరుండరాదంటే. మనిద్దరం కాలేజీలో రెండేళ్ళు కలిసున్నాం కదా? ఎప్పుడూ మన మధ్య తేడాలు రాలేదు కదా?''

"అవుననుకో. వచ్చి ఏంచెయ్యనూ? అసలు నేనెందుకు బతుకున్నాను. నేను లేకపోతే ఏంటీ నష్టం అనిపిస్తుంది.''

“ఛా. అలా అంటావేంటే పిచ్చమ్మా. ఇద్దరు బంగారం లాంటి పిల్లలున్నారు. వాళ్ళకు నువ్వంటే ఇష్టం. వాళ్ళకోసం బతకాలి నువ్వు. నామాట వింటానంటే నాతో వచ్చి యూనివర్సిటీలో చేరు. నీకు ఇష్టమైన సబ్జెక్ట్‌లో కోర్సులు తీసుకో. పిల్లల మధ్య ఉంటే ఉత్సాహంగా ఉంటుంది. ఏదైనా చెయ్యాలనిపిస్తుంది.”

“యూనివర్సిటీలో ఇక్కడైనా చేరొచ్చనుకో, కానీ మళ్ళా చదవటం అంటే నేను చెయ్యగలనా? నాకంత ఓపిక ఉందో లేదో,” అని ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్లుండి పోయి, “మనం చదువుకున్న రోజుల గురించి ఆలోచిస్తే ఎంత బాగుంటుందో. ఎంత సంతోషంగా ఉండేవాళ్ళమో కదా? నువ్వు యూనివర్సిటీ ఉద్యోగంలో చేరినప్పుడు తెలివితక్కువ పని చేశావనుకున్నాను. కానీ ఇప్పుడనిపిస్తుంది నువ్వు మంచిపని చేశావని. పిల్లలకు చదువు చెప్తున్నావు. రెండు పుస్తకాలు రాశావు. నువ్వంటే ఎంతోమందికి గౌరవం. మీటింగులకు రమ్మని పిలుస్తుంటారు నిన్ను. నువ్వంటే అసూయగా ఉంటుందే నాకు అప్పుడప్పుడూ,” స్నేహితురాలి చెయ్యి మీద చెయ్యి వేస్తూ అంది జానకి.

“అసూయ పడాల్సినంత సీన్ లేదులే. ఈమధ్య రిసర్చ్ సరిగ్గా జరగటం లేదు. సోమరితనం కొంచెం ఎక్కువైనట్లుంది. ఆంగెలికా అని నాకొక స్నేహితురాలుంది బెర్లిన్‌లో. ఫ్రీ యూనివర్సిటీలో మోలిక్యులార్ బయాలజీ ప్రొఫెసర్. కానీ, ఫిలసోఫికల్ గా మాట్లాడుతూ ఉంటుంది. మొన్న బెర్లిన్ మీటింగ్‌లో కలిసినప్పుడు ఏమందో తెలుసా, వెనక్కి తిరిగి చేసిన పనుల గురించి ఆలోచించటం, సంతృప్తి పడటం, చావటంలాంటిదట; చెయ్యబోయే పనుల గురించి ఆలోచించటం బతకటం అట. ఒక్కోసారి ఆ అమ్మాయి మాటలు వింటుంటే భయంవేస్తుంది. కానీ నిజమేకదా ఆ అమ్మాయి చెప్పింది అనిపిస్తుంది. నువ్వూ నేనూ బతకాలంటే ముందు చూపు అలవాటు చేసుకోవాలి. లేకపోతే మనిద్దరం తొందరగానే పెద్ద బాక్సుల్లోకి వెళ్ళి పోతాం,” అని నవ్వింది రజని.

”ఛా, అట్లా అనకు. నువ్వు చిన్నదానివి,” అని, “పెద్ద బాక్స్ అంటే గుర్తొచ్చిందే. సుబ్బు క్రిమేషన్ రోజు దగ్గర్లో ఒక చర్చ్‌లో జరిగింది కార్యక్రమం. సుబ్బు శవాన్ని ఒక పైన్‌బాక్స్‌లో పెట్టారు. నేనూ పిల్లలూ ముందు వరసలో కూర్చుని ఉన్నాం. దాదాపు ఒక వందమంది వచ్చార్లే ఆరోజు సుబ్బుని చూట్టానికి. పరిచయం ఉన్న వాళ్ళు సుబ్బు గురించి మాట్లాడారు. ఒకతను మైక్ దగ్గరకొచ్చి నుంచుని, ‘గుడ్ మార్నింగ్ లేడీస్ అండ్ జెంటిల్మెన్,’ అని మొదలుపెట్టి, తలెత్తి

కూర్చున్న వాళ్ళందరినీ చూసి, తప్పుచేసిన వాడిలాగా రెండు క్షణాలు తల వంచు కుని ఉండి, మళ్ళా మాట్లాట్టం మొదలుపెట్టాడు. పాపం అతని అవస్థ చూస్తుంటే నాకు నవ్వొచ్చింది. నవ్వలేదనుకో,'' అని నవ్వింది జానకి.

''ఫరవాలేదే. ఆ పరిస్థితిలో ఉండి కూడా నువ్వు నవ్వగలిగావంటే నీలో ఇంకా స్పార్క్ ఉంది. వెరీ గుడ్,'' అని భుజంతట్టి ప్రేమగా జానకి వైపు చూసింది రజని.

ఆదివారం ఆంధ్రజ్యోతి
22 జనవరి 2012

లక్ష్మమ్మ

పూర్ణమ్మ చనిపోయిందట.

ఆమె మనవడు ఒకబ్బాయి చెప్పిపోవటానికొచ్చాడు. వూళ్ళో బంధువులందరికీ చెప్పిరమ్మన్నారట.

పోనీలే మంచిదే అనుకుంది లక్ష్మమ్మ.



రెండు నెల్లుగా పొట్టలో కాన్సర్‌తో బాధపడిందట. తను వెళ్ళి చూసిరాలేక పోయినా విషయాలు తెలుసుకుంటూనే వుంది లక్ష్మమ్మ. ఆళ్లగడ్డ తీసుకెళ్ళారంట డాక్టర్‌కి చూపిద్దామని. కాని ఎనభైయైదేళ్ళ మనిషికి ఆపరేషన్ చెయ్యటం వీలుగా దన్నాడట ఆయన. ఇంటికి తీసుకొచ్చింతర్వాత పదిరోజులకే పోయిందట.

చిన్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి లక్ష్మమ్మకి. లక్ష్మమ్మా పూర్ణమ్మా అక్కజెల్లెళ్ళ బిడ్డలు. ఆరోజుల్లో అందరూ పక్కపక్క వూళ్ళల్లోనే ఉండేవాళ్ళు. చదువూ అదీ లేకపోయినా పూర్ణమ్మని చాలాచురుకైన అమ్మాయి అనేవాళ్ళందరూ.

పూర్ణమ్మను పదమూడేళ్ళప్పుడు వూళ్ళోనే బంధువులబ్బాయికిచ్చి పెళ్ళి జేశారు. అప్పటినుంచి ఇప్పటిదాకా అందరిచేతా మంచిమనిషి అనిపించుకుంది ఆమె. పూర్ణమ్మ భర్త వెంకయ్య యాభైయ్యేళ్ళ క్రితం ఆళ్ళగడ్డ దగ్గర పొలాలు కొనుక్కుని అక్కడకు చేరాడు. బంధువర్గంలో చాలామంది ఆయన మార్గాన్నే వెళ్ళారు. అందరూ అర్థికంగా బాగుపడ్డారు. లక్ష్మమ్మ భర్త మాత్రం పోలేదు. వూళ్ళో సంబంధాలన్నీ తెంచుకుని అంతదూరం పోవటం ఆయనకు ఇష్టం కాలేదు.

కొత్తగా ఆళ్ళగడ్డ పోయినప్పుడు పూర్ణమ్మా వెంకయ్యా పడిన కష్టాల గురించి ఇక్కడ వూళ్ళల్లో కథలు కథలుగా చెప్పుకొనేవాళ్ళు. అయినా వాళ్ళు వెనక్కు తిరిగి చూళ్ళేదు. స్వయంగా నిలదొక్కుకోవటమే గాకుండా, వాళ్ళతోబాటు వచ్చిన బంధువులందరికీ చేదోడువాదోడుగా ఉండేవాళ్ళనీ, అందరూ బాగుపడాలని ఎంతో తంటాలుబడ్డారనీ చెప్పుకునేవాళ్ళు ఆ రోజుల్లో.

★ ★ ★

పదకొండో రోజున పెద్దకర్మ చేశారు. ఎంతగానో పోయొద్దామనుకున్నా నడువుల నొప్పితో తను అంత దూరం పోలేకపోయింది లక్ష్మమ్మ. కాస్తాకూస్తా దూరం అయితేగా? నూట ఇరవైమైళ్ళు. బస్సులు ఎక్కటం దిగటం తనవల్ల కాదులే అని, ఢిల్లీలో వుంటున్న కొడుకు చైతన్యని పోయిరమ్మంది లక్ష్మమ్మ. అతను ఒక వారం రోజులు సెలవుబెట్టి ఆళ్ళగడ్డ పోయి, అక్కడ్నించి అదేదో పనుందని బెంగళూరు పోయి, అప్పుడొచ్చాడు ఇంటికి.

భర్త పోయినప్పట్నుంచీ ఒక్కతే ఉంటుంది లక్ష్మమ్మ. వూళ్ళోనే ఉంటున్న పినతల్లి మనవరాలు మాలతి అప్పుడప్పుడూ వచ్చి మంచీచెడ్డా చూసిపోతుంటుంది. ఎప్పుడో ఆర్నెల్లకొకసారిగాని రాడు కొడుకు. హైదరాబాదులో ఉన్నప్పుడు నయం రొణ్ణెల్లకొకసారన్నా వచ్చేవాడు. ఢిల్లీ చేరింతర్వాత ఇంటికి రావటం తగ్గిపోయింది.

అన్నయ్య వచ్చాడని విని వంటా అదీ చేసిపెట్టిపోయింది మాలతి. కొడుకు స్నానం, భోజనం చేసింతర్వాత కోడలు గురించీ మనవరాలు గురించీ అడిగింది లక్ష్మమ్మ. కోడలు గూడా ఢిల్లీలో ఉద్యోగం చేస్తుంది. మనవరాలు అక్కడే ఒక ఉత్తరదేశం అబ్బాయిని పెళ్ళి చేసుకుంది. అందరూ బాగానే ఉన్నారని చెప్పాడు చైతన్య.

"అబ్బాయ్, చలికాలం మొదులయ్యిందా ఆ దేశంలో?" అని అడిగింది లక్ష్మమ్మ.

"మొదలయ్యి చానాళ్ళయింది, ఇప్పుడు జనవరిగదా, బాగా చలిగానే వుంటుంది," అన్నాడు చైతన్య.

లక్ష్మమ్మగూడా ఇరవైయ్యేళ్ళ క్రితం ఒకసారి ఢిల్లీ వెళ్ళొచ్చింది. కాని అక్కడ రోజంతా ఇంట్లో ఒక్కతే ఉండలేకా, చుట్టుపక్కల మన భాష మాట్టాడేవాళ్ళెవరూ లేక, అక్కడ చలి భరించలేక తిరిగి వచ్చేసింది.

చైతన్య రాకముందే కర్మకి వెళ్ళొచ్చిన బంధువులు చెప్పుకుంటుంటే విషయాలన్నీ తెలుసుకుంది లక్ష్మమ్మ.

"అబ్బాయ్, కర్మ గనంగా జరిగిందంటగా?" అని అడిగింది లక్ష్మమ్మ.

"ఆ," అన్నాడు చైతన్య. అరవైయ్యేళ్ళ కొడుకుని ఇంకా అబ్బాయ్ అనే పిలుస్తుంది లక్ష్మమ్మ.

"వూళ్ళో మనోళ్ళిళ్ళల్లో వాళ్ళనే గాకుండా అందర్నీ బిల్చారంటగా? ఇంటి కొకర్ని బిల్చారంటలే," అంది.

"ఏమోమరి, చాలామందొచ్చారు," అన్నాడతను.

"వొచ్చినోళ్ళందరికీ తలావొక స్టీలుప్లేటు ఇచ్చారంటగా?" అందామె. తన సూట్ కేస్ తీసి అందులోఉన్న ప్లేటు ఆమె చేతికిచ్చాడతను. దాదాపు పదంగుళాల పొడుగున్న ప్లేటు. అంచు చుట్టూ పువ్వుల డిజైను వేసి ఉంది. వెనక్కు తిప్పి చూసింది లక్ష్మమ్మ.

"అబ్బాయ్, ఇదేం రాసుందో చెప్పు," అని చైతన్యకిచ్చింది ప్లేటు.

ప్లేటు వెనక చెక్కి ఉన్న అక్షరాలు చదివాడు చైతన్య, 'కడియాల పూర్ణమ్మ జ్ఞాపకార్థం.'

"ఈ ప్లేట్లుకే యాభైయ్యేలయిందంట," అంది లక్ష్మమ్మ చైతన్యని చూస్తూ.

"అంతాగలిపి రెండు లచ్చలయిందని చెప్పుకుంటన్నార్లే వూళ్ళో," అంది.

"అలాగా," అన్నాడు చైతన్య ఆరోజు తెలుగు పేపర్ చూస్తూ.

"నీక్కూడా ఆమాత్రం అయిద్దిలే మనూళ్ళో గూడా," అందామె.

పేపర్ పక్కన పడేసి ఆమెను చూశాడు చైతన్య. "ఇప్పుడయ్యన్నీ ఎందుకమ్మా, నువ్వు ఆరోగ్యంగానే ఉన్నావు కదా?" అని అడిగాడు.

"ఎంత ఆరోగ్గెంగా వుండా నేనూ పూర్ణమ్మ వొయొసు మడిసినేగా? ఏదోవొక రోజు పోక తప్పిద్దా?" అందామె.

అందరూ ఏదో ఒకరోజు పోతారని అతనికీ తెలిసినా, ఆమె లేకుండా వుండే రోజుని అతనెప్పుడూ ఊహించలేదు. అమ్మ వూళ్ళో ఉంది, ఉంటుంది, అని తప్ప దూరం ఆలోచించలేదు.

చావు గురించి లక్ష్మమ్మ ఎప్పుడూ భయపడలేదు. ఎవ్వరికీ ఇబ్బంది కలక్కుండా పోవాలనే ఆమె ఆశ. కాని పోయిన తర్వాత ఏం జరుగుతుందో, ఎలా జరుగుతుందో అని మాత్రం చాలా ఆందోళన ఉంది ఆమె మనసులో. 'పూర్ణమ్మకు లాగా తనక్కూడా జరగాలనుకోవటం అత్యాశపడటమే అవుతుంది. ఆమె దర్జాగా బతికిన మనిషి, పన్నెండెకరాలిచ్చిపోయింది బిడ్డలకి. అందులో రెండు లచ్చలు కర్చు బెట్టినా బిడ్డలకి చానా మిగల్లా? ఆమెతో పోటీ బట్టం తనకెక్కడ కుదిరిద్దిలే. ఎవురి అదృష్టంకొద్దీ వాళ్ళకు జరుగుద్ది,' అనుకుంది.

నాలుగేళ్ళ క్రితం ఇల్లు బాగుచేయించుకున్నప్పుడు, "నువ్వూ కోడలూ వచ్చి సత్యనారాయణ పూజ చెయ్యబ్బాయ్," అని అడిగిందామె. అలాంటి వాటిమీద అతనికి నమ్మకాలు లేవని తెలిసి, కోడలిక్కూడా చెప్పింది. ఆ అమ్మాయి, 'నేను చెప్తాలే అత్తయ్యా, పూజ చేస్తాంలే,' అని మాటిచ్చింది. కాని అది ఇంతవరకూ జరగలేదు. పూజ్జేస్తే కనీసం యాభైయ్యేలన్నా కర్సవుద్ది. అందుకేనేమో సెయ్యంది అనే అనుమానం ఉందామెకి.

"ప్లేట్లు గాకపోయినా గ్లాసులైనా ఇయ్యాలగా?" అందామె.

వెంటనే ఏంచెప్పాలో తోచలేదు చైతన్యకి. ఆమె చావు గురించి మాట్లాడటం అతనికి ఇబ్బందిగా అనిపించింది. "గ్లాసులెందుకూ, మంచి ప్లేట్లే ఇద్దాంలే," అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ. ఆమెకు నమ్మకం కలిగినట్లుగా లేదు.

★ ★ ★

కొడుకు మీద ఆధారపడటం లక్ష్మమ్మకు ఇష్టంలేదు. కొడుకు మీదే కాదు, ఎవ్వరిమీదైనా సరే. ఎవ్వరికీ ఏవిధంగానూ బాకీ లేకుండా ఉండాలని ఆమె ఆశ.

పూర్ణమ్మ అంత గౌరవంగా బతకటం, చివరికి అంత ఘనంగా పోవటం ఎవ్వరి మీదా ఆధారపడకపోవటం వల్లే అని లక్ష్మమ్మ నమ్మకం. పూర్ణమ్మకు ఇద్దరు

కొడుకులూ ఇద్దరు కూతుళ్ళూ. అయినా ఆమె చివరిదాకా ఎవ్వరి దగ్గరా ఉండ లేదు. తనింట్లోనే ఉండింది. బిడ్డలు తనని చూట్టానికి వచ్చారేగాని, తను వెళ్ళి ఎవ్వరి ఇంట్లోనూ ఉండలేదు. చివరిదశలో నలుగురు బిడ్డలకూ తలా మూడెకరా లిచ్చి పోయింది ఆడామగా తేడాలేకుండా. అందుకే ఆమె గురించి అందరూ అంత గొప్పగా చెప్పుకుంటారని లక్షమ్మ నమ్మకం.

ఈరోజుల్లో ఆస్తుల్లేని వాళ్ళను బిడ్డలు గూడా సరిగ్గా చూట్టంలేదు. చెరుకూ రోళ్ళ రంగయ్య పెళ్ళాన్ని కొడుకు అసలు పట్టిచ్చుకున్నాడా? పాపం చివరిదాకా ఎన్ని అవస్తలు పడి పోయిందో. అదే నాలుగెకరాలు ఉన్నట్టయితే దానికోసమైనా బాగానే సూసుకునేవోడు కొడుకు, అని అమె గట్టి నమ్మకం.

అందుకే తను ప్రస్తుతం కొడుకు మీద ఆధారపడాల్సి వచ్చినా, తనకున్న ఎకరం పొలం నీకే ఇచ్చిపోతాన్లే అని ఆమె చాలాసార్లు చెప్పింది చైతన్యకి. కాని ఉద్యోగం చేసుకుంటా ఇన్నాళ్ళూ గడిపిన కొడుక్కి పొలం మీదా ఆస్తి మీదా అంత శ్రద్ధ లేదేమో, ఆ ఎకరం పొలం ఎవరికైనా ఇచ్చేస్తాడేమో అని కూడా ఆమెకు భయం ఉంది. పాతిక సంవత్సరాల క్రితం పోయిన భర్త ఆస్తంతా ఉమ్మడికుటుంబంలో సభ్యులకు రాసిచ్చిపోయాడు, తనకేమీ మిగల్చకుండా. తనను అడక్కుండానే, తన సమ్మతి లేకుండానే తన భాగం కూడా రాసిచ్చిపోయాడు. గట్టిగా నిలబడి తనకు పూర్తి హక్కున్న అమ్మగారు బెట్టిన ఎకరాన్ని మాత్రం తనకే ఉండాలని గట్టిగా పట్టు బట్టి మిగుల్చుకుంది.

తండ్రి ఆస్తికోసం కొడుకు కోర్టులో కేసు బెడతాడని ఆశపడింది లక్షమ్మ.

కానీ కోర్టుల చుట్టూ తిరగటం తనకు ఇష్టం లేదన్నాడు చైతన్య. పైగా ఉద్యోగం ఉందిగా, నాకీ పొలం ఎందుకూ, పోతే పోనియ్‌లే అన్నాడు. తను మిగుల్చుకున్న ఎకరం గూడా అలాగే ఎవరికైనా వొదిలేస్తాడేమో అని లక్షమ్మ భయం.

"అబ్బాయ్, నీ ఆలోశన ఎట్టుందో, నా తర్వాత పొలం అమ్మేసి ఆ డబ్బులు మనవరాలికియ్యాల," అని చెప్పింది మరుసటిరోజు, అతను ఢిల్లీకి బయలుదేరు తుండగా. ఇది నీది కాదు, నీ కూతురుది అని అర్థమయ్యేట్లుగా.

"సరే," అన్నాడతను.

ఆలోచించే అన్నాడో, అన్నిటికీ తలూపినట్లే దీనిక్కూడా తలూపేడో ఆమెకు అర్థంకాలేదు.

★ ★ ★

ఈ మధ్య లక్షమ్మ ఆరోగ్యం ఫరవాలేదు, బాగానే ఉంటుంది. చిన్నగా ఇంట్లో అటూఇటూ తిరగ్గలుగుతుంది. తన పన్లు తను చేసుకోగలుగుతుంది. మెట్లు దిగి పక్క ఇళ్ళకు వెళ్ళటం కుదరదుగాని, అప్పుడప్పుడూ ఇరుగుపొరుగు వాళ్ళు వస్తూ పోతూనే ఉంటారు. కబుర్లు తెలుస్తూనే ఉంటాయి.

ఈమధ్య ఒకామె చెప్పింది, నీ కొడుకు నీ పొలం అమ్మెయ్యాలని చూస్తున్నాడని. లక్షమ్మకు కాళ్ళు మెత్తబడ్డట్లనిపించింది. రంగయ్య పెళ్ళాం ముందే ఆస్తంతా కొడుక్కి రాసిచ్చింది. ఆ పిల్లోడు మంచి ధరొస్తందని దాన్ని అమ్మేసి, తాగుడుకి అలవాటుపడి అంతా పోగొట్టుకుని, చివర్రోజుల్లో తల్లికి సరిగ్గా తిండిగూడా పెట్టలా. చైతన్య అలాంటోడుగాదులే అని అనుకుందిగాని, ఆదరువు ముందే పోగొట్టుకోవటం అంత తెలివైన పనిగాదని ఆమెకు అనిపించింది.

ఒకరోజు చూట్టానికొచ్చిన మాలతిని అడిగింది లక్షమ్మ, "మీ అన్నయ్య పొలం అమ్ముతున్నాడంటగా, నీతో ఏమన్నా అన్నాడా?" అని. లేదే అందామె.

ఆదివారం నాడు చైతన్య ఫోన్ చేస్తే ఆమే అడిగింది, "పొలం అమ్ముతున్నావా?" అని. ఆశ్చర్యపోయాడు చైతన్య.

"లేదే," అన్నాడు. "నీకు తెలియకుండా నేనెందుకు అమ్ముతాను నీ పొలం," అని ఎదురుప్రశ్న వేశాడు.

"ఇక్కడ అందరూ సెప్పుకుంటున్నార్లే," అందామె.

"ఈ పనికిమాలిన కబుర్లన్నీ ఎందుకు నీకు?" అన్నాడు చైతన్య గట్టిగా. "నువ్వే ఎవరితోనన్నా అన్నావేమో అమ్ముతానని. ఆ మధ్య ఎవరో మనూరి నుంచే ఫోన్ చేశాడు, 'పొలం అమ్ముతారంటగా, అమ్మేట్లయితే నాకే ఇయ్యండి, మంచి ధర ఇస్తాను,' అన్నాడు. లేదండీ అమ్మటం లేదు, కావాలంటే మా అమ్మని అడగండి అన్నాను, అతనే చెప్పాడేమో నీకు," అన్నాడు. లక్షమ్మకు అలాంటి వాళ్ళెవరూ గుర్తుకు రాలేదు.

పోనీలే పొలం ఇంకా ఎవ్వరికీ అమ్మలేదుకదా, అని ఆమె మనసు కుదుటబడింది.

★ ★ ★

ఆగస్టులో మళ్ళా వచ్చాడు చైతన్య. రావినూతల్లో స్నేహితుడి కొడుక్కి పెళ్ళి. రెండు రోజులు ముందే హైదరాబాదొచ్చి అక్కడేదో పని చూసుకుని ఇంటికొచ్చాడు.

మంచిచెడ్డలు పొడిపొడిగానే అడిగింది లక్షమ్మ. భార్యా కూతురూ బాగానే ఉన్నారని చెప్పాడు చైతన్య. అన్నయ్యొచ్చాడని విని మాలతి వచ్చింది. మంచి

చెడ్డలు అడిగి, మళ్ళా లక్షమ్మ ఇబ్బందిపడుతుందేమో అని వంటా అదీ చేసిపెట్టి పోయింది.

స్నానం చేసి వచ్చి తల్లి దగ్గర కూర్చుని ఆరోగ్యం గురించి అడిగాడు చైతన్య. "ఆరోగ్గెం బాగానే ఉందిలే," అందామె, అతని వైపు చూడకుండానే.

కొంచెంసేపు మౌనంగా ఉండి, "అబ్బాయ్, నువ్వు గూడా మీ నాయన లాగానే జేశావే," అందామె. గొంతులోంచి మాటలు పొడిగా బయటకొచ్చాయి.

"అంటే, ఏం జేశాన్నేను. అర్థమయ్యేట్టు చెప్పు," అన్నాడు చైతన్య, విసుగ్గా.

"అర్థమయ్యేట్టంటే, నీకు దెలియకపోతేగా నేంజెప్పేది?" అందామె. వివరంగా చెప్పటం ఇష్టం లేనట్లు.

"నాకేం అర్థంగావటంలా. అడిగేదేదో సరిగ్గా అడగరాదూ?" అన్నాడతను కోపంగా.

"పొలం రాసిచ్చావని చెప్పుకుంటన్నార్లే," అందామె.

"నీ పొలమా?"

"ఆ."

"నీ పొలం నేను రాసివ్వటమేంటమ్మా? అసలు నేను రాసిస్తే ఎట్లా చెల్లుద్దీ? నాకేంటి అవసరం నీ పొలం అమ్మటానికి? ఎవురికిచ్చానంట? ఎవురు చెప్పారూ?" దురుసుగా అడిగాడు చైతన్య.

"ఏవోనయ్యా, వూళ్ళో జెప్పుకుంటున్నారు." కొంచెం మెత్తబడిందామె. ఏమో తను విన్న కబుర్లు నిజం కాదేమో.

"ఏం చెప్పుకుంటున్నారు."

"మాల్తికి రాసిచ్చావని చెప్పుకుంటున్నారు."

"మాలతికా? ఎందుకంట?"

"ఎందుకంటే? నీకే దెలియాల," అందామె ఇంకా నేలవైపు చూస్తూ.

ఒక్కక్షణం స్థంభించిపోయినట్లు ఉండిపోయాడు చైతన్య.

★ ★ ★

ఆ రోజు సాయంత్రం మాలతి వాళ్ళింట్లో భోజనం చేశాడు చైతన్య. భోజనం అయ్యింతర్వాత వ్యవసాయం గురించీ వూళ్ళో రాజకీయాల గురించీ మాట్లాడుకుంటూ కూర్చున్నారు చైతన్యా, మాలతి, మాలతి భర్త రాఘవరావూ.

అప్పుడప్పుడూ వెళ్ళి అమ్మ మంచిచెడ్డలు చూస్తున్నందుకు మాలతికి కృతజ్ఞతలు తెలియజేశాడు చైతన్య. మధ్యాన్నం అమ్మ అడిగిన మాట గురించి కూడా చెప్పాడు.

రాఘవరావు చైతన్యకి చిన్ననాటి స్నేహితుడు. మనసులో ఉన్న మాట చెప్ప టానికి జంకేవాడు కాదు. ''ఒరేయ్, నువ్వు చదువుకున్నావు గాని, లోకజ్ఞానం కొంచెంగూడా లేదురా నీకు. నువ్వేమో ఆమెను ఇక్కడ వొంటరిగా వదిలేసిపోతివి. ఆమె అవసరాలన్నీ చూస్తున్నావనుకో, కాని నీకేమైనా అయిందనుకో, అప్పుడామె కాధారం ఏంటీ? ఈ రోజుల్లో యాక్సిడెంట్లు జరగటం, మనుషులు అనుకోకుండా పోవటం అందరం చూస్తూనే ఉన్నాంగదా. అట్టాటిదేదో జరగ్గూడంది జరిగిందనుకో నీకు, అప్పుడు ఆమె గతేంటి? మీ నాన్న ఆమెకేమీ లేకుండా జేసిపోయాడు. నువ్వు ఆ ఉన్న ఎకరం గూడా అమ్మేశావనుకో, లేకపోతే ఎవరికైనా ఇచ్చేశావనుకో, ఆమె కాధారమేంటీ? నువ్వే కాస్త ఆలోచించు. ఇందులో ఆమె తప్పేమీ లేదు,'' అన్నాడు.

తనులేకుండా, తన ఆధారం లేకుండా ఉండాల్సిన పరిస్థితి ఆమెకు రావచ్చనే విషయం చైతన్య ఇదివరకెప్పుడూ ఆలోచించలేదు. అవును, ఆమె భయాలు నిజమైనవే అనిపించింది.

★ ★ ★

మరుసటిరోజు ఢిల్లీకి బయలుదేరేముందు తల్లితో చాలాసేపు కూర్చుని కబుర్లు చెప్పాడు చైతన్య. ఆమెకెలాంటి భయం అవసరం లేదనీ, ఆమె ఉన్నంత కాలం పొలం అమ్మే ప్రసక్తే లేదనీ, ఆమె తర్వాత పొలం అమ్మేసి ఆ డబ్బులు కూతురుకి అందజేస్తాననీ నమ్మకం కలిగేలా చెప్పాడు.

అంతేగాకుండా ఒకవేళ తనకు ఏదైనా అయినా, కోడలూ మనవరాలూ ఆమెకు ఎలాంటి లోటూ రాకుండా చూసుకుంటారని కూడా చెప్పాడు.

ఇదివరకు మాట్లాట్టానికి ఇష్టపడని విషయాల గురించి కూడా మాట్లాడాడు. ముఖ్యంగా పూర్ణమ్మకు జరిగినట్లుగానే వూళ్ళో అందరినీ పిల్చి కర్మ ఘనంగా చేయిస్తాననీ మాటిచ్చాడు.


★ ★ ★

ఆ రాత్రి లక్ష్మమ్మ ప్రశాంతంగా నిద్రపోయింది.

ఆదివారం ఆంధ్రజ్యోతి
27 మే 2012

విదేశీ-దేశీ

వీసా వచ్చినప్పుడు మేఘాలమీద తేలిపోతున్నట్లనిపించింది. ఇప్పుడేమో దిక్కు తెలియటం లేదు. కొత్తగా వచ్చిన స్టూడెంట్ కదా, కొంచెం ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడిందాకా గడు విద్దామనుకోరేంటీ ఎవ్వరూ? వొచ్చి ఇంకా పదిరోజులు కాలేదు.



అప్పుడే టేక్ హోం టెస్టట. అదీ చేత్తో రాస్తే కుదరదంట. ఈ సిస్టమేమో పన్జేసి చావట్లేదు. అస్సలు స్టార్టయితేగదా? ఎక్కడ చెడిపోయిందో ఏమో. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ వాళ్ళు స్కానింగ్ చెయ్యటంలో ఏమైనా చెడిపోయిందేమో.

అప్పుడే రొండున్నరయింది. స్టూడెంట్ సెంటర్లో అంత రద్దీగా లేదు. ఎక్కడో ఒక మూల కూర్చుని తినొచ్చు అనుకుంటూ నాలుగువైపులా చూశాడు అజిత్. కూల్ డ్రింక్స్ వెండింగ్ మెషిన్ పక్కనున్న టేబుల్ దగ్గర వొంటరిగా కూర్చున్న అమ్మాయి దేశీ లాగుంది. వెళ్ళి పరిచయం చేసుకుంటే? ఇండియా అమ్మాయో, ఇక్కడి అమ్మాయో. ఇక్కడి వాళ్ళు లూజ్ కేరక్టరని ఇండియాలో ఫ్రెండ్స్ అంతా అంటుండేవాళ్ళు. సులభంగా లైన్ వెయ్యొచ్చేమో. పడితే గ్రీన్‌కార్డ్ కొట్టేసినట్టే. ధైర్యంచేసి ఆ టేబుల్ దగ్గరకెళ్ళి ఆమె పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు అజిత్.

క్లాస్‌కి తయారవుదామని ఒంటరిగా కూర్చుని లంచ్ తింటూ చదువుకుంటున్న రాణికి వొళ్ళు మండింది. అడక్కుండానే తన టేబుల్ దగ్గరకొచ్చి కూర్చున్నవాణ్ణి ఈ జంతువు ఏ జూ నుంచి పారిపోయి వచ్చిందో అన్నట్లు చూసింది. చిన్నచిన్న మర్యాదలు కూడా తెలియవు లాగుంది ఇతనికి. చుట్టూ చూసింది. ఎక్కడా ఖాళీ టేబుల్స్ లేవు. ఇక చేసేదిలేక మళ్ళా తన పుస్తకంలోకి దృష్టి మళ్ళించింది.

ఈ అమ్మాయితో ఎలా మాట్లాడ్డం మొదలుపెట్టాలి అని ఆలోచిస్తూ అసలు ఆమెవైపే చూళ్ళేదు అజిత్. తన బాగ్‌లోంచి లంచ్‌బాక్స్ బైటకు తీసి టేబుల్ మీద పెట్టి, కౌంటర్ దగ్గరకెళ్ళి మంచినీళ్ళూ రెండు నాప్కిన్సూ తెచ్చుకున్నాడు. చపాతీ నములుతూ, సిస్టం గురించి మాట్లాడదాం అనుకున్నాడు. ఇక్కడి అమ్మాయయితే యూనివర్సిటీలో రిపేర్ చేసేవాళ్ళెవరైనా ఉన్నారేమో చెప్తుంది. కనీసం మాట్లాడ్డానికి ఒక దారి దొరుకుతుంది అనుకున్నాడతను.

ఆమె వైపు చూసి, "హాయ్," అన్నాడు.

పుస్తకంలోంచి తలెత్తి, "హాయ్," అందామె.

"అయాం హేవింగ్ ఎ సిస్టం," అన్నాడతను.

అతని లంచ్‌బాక్స్ వైపు చూసిందామె. చపాతి తింటున్నాడుగాని ఆ కూరేంటో గుర్తుపట్టలేకపోయింది రాణి. అలాంటి కూర అమ్మ ఎప్పుడూ చేసినట్టు లేదు. అతను అంటున్న పేరు ఇంతకు ముందెప్పుడూ విన్నట్టులేదు.

"అయాం హేవింగ్ ఎ శాండ్‌విచ్," అందామె, చేతిలో శాండ్‌విచ్ అతనికి చూపిస్తూ.

ఇదేంటి నేను సిస్టం గురించి మాట్లాడుతుంటే ఈ అమ్మాయి శాండ్‌విచ్ అంటుందేంటి? కొంచెం స్క్రూ లూజేమో, అనుకున్నాడు అజిత్.

తర్వాత ఎలా మాటలు పొడిగించాలా అని ఆలోచిస్తుండగానే ఆ అమ్మాయి లేచి వెళ్ళిపోయింది.

★ ★ ★

వారం రోజుల గడిచాయి. ఆరోజు ఆర్గానిక్ కెమిస్ట్రీ క్లాస్‌కి వెళ్ళటం ఆలశ్యం ఆయి తొందరతొందరగా క్లాస్‌రూంలోకొచ్చింది రాణి. అనవసరంగా పరుగెత్తు కుంటూ వచ్చింది. ప్రొఫెసర్ చెన్ ఇంకా రాలేదు. ఆయనెప్పుడూ అంతే. ఒక ఐదు నిముషాలు ఆలశ్యంగానే వస్తాడు. చైనీస్ పంక్చువాలిటీనేమో. అయినా ఈరోజు అప్పుడే పది నిముషాలు దాటింది. ఇంకా రాలేదేం అనుకుంటుండగానే ప్రొఫెసర్ చెన్ క్లాస్‌లోకొచ్చాడు. అతని వెనకాలే ఆ లంచ్‌బాక్స్ అతను కూడా వచ్చాడు. ప్రొఫెసర్ అతన్ని పరిచయం చేశాడు క్లాసుకి. ఇతని పేరు అజిట్ సేమడ్‌రాలా. కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో గ్రాడ్యువేట్ స్టూడెంట్. ఈ సెమిస్టర్ నా స్థానంలో ఇతనే ఆర్గానిక్ కెమిస్ట్రీ చెప్తాడు, అని చెప్పి వెళ్ళిపోయాడు.

క్లాస్‌లో అందరూ మాట్లాడ్డం మొదలుపెట్టారు. చెన్ మాటలు అంత సులభంగా అర్థం అయ్యేవి కాదు. ఆయనకి బాగా రిసర్చ్ గ్రాంట్స్ ఉన్నాయట. అందువల్లే ఈమధ్య అసోసియేట్ ప్రొఫెసర్‌గా ప్రమోట్ అయ్యాడట. ఆయన రిసర్చ్ ఎలా వున్నా క్లాస్‌లో మాత్రం మాట్లాడ్డం రాదు. కెమిస్ట్రీ నేర్పటం అస్సలు రాదు. ఈ లంచ్‌బాక్స్ అతను చెన్ కంటే కొంచెం నయమేమో చూద్దాం అనుకుంది రాణి.

అజిత్ మాటామంతీ లేకుండా బోర్డ్ వైపు తిరిగి ఏరోమేటిక్ రింగ్ స్ట్రక్చర్స్ గీశాడు. ఇటుతిరిగి చూశాడు. పెద్ద హాలు. నూటయాభైమంది స్టూడెంట్స్ ఉండుం టారు. చూట్టానికి అందరూ తన వయసు వాళ్ళలాగే ఉన్నారు. గొంతు ఎండిపో యింది అజిత్‌కి.

ఇదివరకు ఎప్పుడూ ఇలా ఇంతమంది ముందు నుంచోని మాట్లాళ్ళేదు. అసలు పబ్లిక్ స్పీకింగ్ అంటేనే దడబుడుతుంది. నావల్ల కాదు అని గట్టిగా చెప్తే ఆ టీచింగ్ అసిస్టెంట్‌షిప్ పోతుందేమోనని భయం. కాస్తా కూస్తా! తను తీసు కుంటున్న రెండు కోర్సులకు ఫీజు కట్టాల్సిన అవసరంలేదు. పైగా నెలకి ఎనిమి దొందల డాలర్లు ఇస్తారట. వచ్చీరాగానే అసిస్టెంట్‌షిప్ రావటం అంటే మాటలా. హైదరాబాద్‌లో తన ఫ్రెండ్స్ అంతా ఎంత అసూయపడుతున్నారు తన అదృష్టానికి?

అడ్మిషన్‌తోబాటే అసిస్టెంట్‌షిప్పా? ఇప్పుడు నావల్ల కాదని అది కాస్తా పోగొట్టుకుంటే ఎలా.

ఫీనాల్స్ గురించి మాట్లాడ్డం మొదలుపెట్టాడు అజిత్. పుస్తకంలో ఉన్న మాటలే చెప్తున్నాడు. పుస్తకాలు తెచ్చుకున్న స్టూడెంట్స్ అతన్ని ఫాలో కావటానికి ప్రయత్నిస్తున్నారు. మాటలు తడబడుతూ అతను ఏదో చెప్తున్నాడు. కొందరు స్టూడెంట్స్ లేచి వెళ్ళిపోతున్నారు. ఇంతలో అతనికి ధైర్యం చెబ్దామా అన్నట్లు క్లాసులో ఒక ఇండియన్ స్టూడెంట్ ఏదో ప్రశ్న వేశాడు. అది ఎవ్వరికీ అర్థం కాలేదు. అజిత్‌కి కూడా అర్థం కాలేదు. మలయాళీ లాగున్నాడు, అనుకున్నాడు అజిత్.

లెక్చర్ ముగిసేసరికి ముప్ఫైమందికంటే ఎక్కువలేరు క్లాస్‌లో.

★ ★ ★

సెమిస్టర్ మొదలయ్యి దాదాపు మూడు వారాలవుతుంది. కెమిస్ట్రీ మీదున్న ఉత్సాహం అంతా అణగారిపోయింది రాణీకి. హైస్కూల్లో ఉన్న రోజుల్లో ఏపీ కెమిస్ట్రీ టీచర్ ఎంత గొప్పగా చెప్పింది కెమిస్ట్రీ గురించి. కాన్సర్ ట్రీట్‌మెంట్‌కి కొత్త మందులు కనిపెట్టాలంటే ఆర్గానిక్ కెమిస్ట్రీ ఎంతో ముఖ్యమని చెప్పింది. నేరుగా శరీరంలో కాన్సర్ ఉన్న చోటికే వెళ్ళే మందులు కనిపెట్టాలంటే ఆర్గానిక్ కెమిస్ట్రీ చదవటం అవసరం అంది.

కానీ ఇప్పటివరకూ ఆ క్లాస్ తీసుకున్న ప్రొఫెసర్ చెన్‌గానీ, ఈ లంచ్‌బాక్స్ అతనుగానీ వీళ్ళకసలు పెద్దగా కెమిస్ట్రీ రాదు లాగుంది. వచ్చినా వాళ్ళేం చెప్తున్నారో అర్థం అయి చస్తేగా? ఫిజియాలజీ క్లాస్ చాలా బాగుందని చెప్తుంది తన ఫ్రెండ్ నజ్వాన్. ఇందులోంచి డ్రాప్ అయి అందులో చేరదలిస్తే ఇప్పుడే ఆ పని చెయ్యాలి. ఇంకా ఆలశ్యం అయితే ఆ క్లాసులో కూడా తను వెనకబడుతుంది.

★ ★ ★

ఆరోజు రాణి యూనివర్సిటీ నుంచి ఇంటికి వెళ్ళేసరికి ఎనిమిదిన్నర అయింది. ఇంట్లోనే వుంటూ యూనివర్సిటీకి వెళ్తుందామ్మాయి. డార్మ్స్‌లో ఉంటే కొంచెం ఫ్రీగా ఉండొచ్చు అనుకుందిగాని నాన్న ఒప్పుకోలేదు. ఎందుకూ అనవ సరంగా డబ్బు ఖర్చు, ఇంత దగ్గరున్న యూనివర్సిటీకి ఇంట్లో ఉంటూనే పోవచ్చు గదా అన్నాడు.

ఇంటికి చేరేసరికి అమ్మానాన్నా -లక్ష్మణరావూ, దమయంతీ- సోఫా మీద చెరొక వైపు పడుకుని ఏదో తెలుగు సినిమా చూస్తున్నారు. రాణి రావటం గమనించి,

“హాయ్,” అన్నారు. రాణి తన గదిలోకెళ్ళి, బాగ్ అక్కడ పడేసి, ముఖం కడుక్కుని వంటగదిలో కెళ్ళింది. “కూరలు వేడిచేసుకుని తిను, మేం తిన్నాం,” అంది దమయంతి. రోజూ అనే మాటలే.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని తింటుంటే వాళ్ళ దగ్గరకొచ్చి కూర్చోమంది దమయంతి. వాళ్ళు రోజూ అవే చెత్త సినిమాలు చూస్తుంటారు. మాట్లాడేటప్పుడు కూడా కాస్త సౌండ్ తగ్గించరు. అలాగే డైనింగ్‌టేబుల్ దగ్గరే కూర్చుని తినటం పూర్తిచేసింది రాణి.

తిరిగి తన రూంకి వెళ్తూ ఫామిలీ రూమ్‌లో ఆగి, “డాడ్, నేను కెమిస్ట్రీ డ్రాప్ చేసి ఫిజియాలజీ తీసుకుందామనుకుంటున్నాను,” అంది రాణి.

లక్ష్మణరావుకి షాక్ కొట్టినట్లనిపించింది. ఆయనొక కెమికల్ ఇంజినీర్. ఈ మధ్యదాకా ఏనార్బర్లో ఫైజర్‌లో పనిచేశాడు. ప్రస్తుతం డిట్రాయట్ వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్నాడు. చిన్నప్పట్నుంచీ కెమిస్ట్రీ గురించి చెప్తూ వచ్చాడు పిల్లలిద్దరికీ. కొడుకు ప్రీ-మెడ్‌లో చేరాడు సరే బాగానే ఉంది. ఈ అమ్మాయన్నా కెమిస్ట్ అవుతుందనుకున్నాడు. రాణీక్కూడా హైస్కూల్ నుంచీ కెమిస్ట్రీ మీదే ఉండేది మనసు. ఇప్పుడేమయింది సడేన్‌గా?

యూనివర్సిటీలో కెమిస్ట్రీ టీచింగ్ బాగాలేదనీ, ఫిజియాలజీ చాలా బాగుందని ఫ్రండ్స్ అంటున్నారనీ చెప్పింది రాణి. “ఈ సెమిస్టర్ ఎలాగో కానిచ్చి వచ్చే సెమిస్టర్ ఫిజియాలజీ తీసుకోవచ్చు గదా? ఎ రోలింగ్ స్టోన్ గేదర్స్ నో మాస్,” అన్నాడు లక్ష్మణరావు. సందర్భం ఉన్నా లేకపోయినా ఏదో ఒక సామెత వాడటం ఆయనకు అలవాటు. సోఫాలో పడుకుని రోజూ ఆ చెత్త తెలుగు సినిమాలు చూస్తూ నువ్వు గేదర్ చేస్తున్నావుగా మాస్, అందామనుకుంది రాణి. కాని నిగ్రహించింది.

సినిమాలో డాన్స్ సీక్వెన్స్ చూస్తూ కూడా తండ్రీకూతుళ్ళ సంభాషణ వింటూనే ఉంది దమయంతి. రాణీకి చిన్నప్పట్నుంచీ ఇండియన్ ఫ్రండ్స్ తక్కువే. ఏనార్బర్లో గ్రేడ్ స్కూల్లో ఉండగా ఇంటికి దగ్గరగా ఒక గుజరాతీ కుటుంబం వుండేది. వాళ్ళ పిల్లల్తో బాగానే ఆడుకునేది రాణి. కానీ లివోనియా వచ్చింతర్వాత దగ్గర్లో ఇండియన్ కుటుంబాలు లేకపోవటం వల్ల చుట్టుపక్కల ఉన్న అమెరికన్ పిల్లల్తోనే మాట్లాడేది. అయినా పెద్దగా కలిసేది కాదు వాళ్ళతోగూడా. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూ కూర్చునేది. ఏదైనా ఇండియన్ ఫంక్షన్‌కి వెళ్ళినప్పుడు స్నేహితుల పిల్లల్తో మాట్లాడమని ఎంతగానో పోరాడేది తను. కాస్త అలాంటి

స్నేహాలు చేసుంటే దేశీల యాసలు సులభంగా అర్థమయ్యేవేమో. రేపు ఈ అమ్మాయికి ఇండియాలో మంచి సంబంధం వస్తే అప్పుడేమంటుందో ఏమో?

"మరీ అంత విచిత్రమా? ఆ అబ్బాయి మాటలు అర్థంగాక నువ్వు చదివేది మానుకుంటావా? నువ్వేదో కాస్త ఎక్కువచేసి చెప్తున్నావు. మరీ మాట్లాడ్డం చేతగాక పోతే ఆ అబ్బాయికి యూనివర్సిటీవాళ్ళు అసిస్టెంట్‌షిప్ ఎందుకిస్తారూ?" అంది ఆమె.

ఆమెదెప్పుడూ ఒకే నస. ఇండియన్ పిల్లల్తో స్నేహాలు చెయ్యమనీ, చివరకు ఇండియన్ అబ్బాయినే పెళ్ళి చేసుకోవాలనీ. చేసుకుని నేను కూడా ఈమెలాగే తయారుకావాలనేమో. ఇప్పుడవన్నీ ఎందుకులే. ఏదో ఆమె భ్రమలో ఆమెనుండ నిస్తే పోలా. అయినా ఇంట్లో ఈమె మాట ఏ విషయంలోనూ చెల్లదు. నిర్ణయాలు తీసుకునేదెప్పుడూ తండ్రే. కాకపోతే నేను కూడా ఉన్నానన్నట్లు ఈమెగూడా ఆయన మాటకే వంత పలుకుతూ ఉంటుంది అప్పుడప్పుడూ. ఏమైనా చదువు విషయంలో ఏ క్లాసులు తీసుకునేదీ, చివరకు ఏ మేజర్ చేసేదీ తన నిర్ణయమే కదా. ఏదో, తండ్రితో మర్యాదకు చెప్తుందిగానీ, ఆయన వొద్దన్నా చివరి నిర్ణయం తనదే. తల్లి మాటలకు జవాబు చెప్పలేదు రాణి.

కూతురు సమాధానం చెప్పకపోవటంతో కొంచెం ఆగ్రహించినా లక్ష్మణరావు గ్రహించాడు ఇందులో తను చెయ్యగలిగిందేమీ లేదని. టీవీ వైపు తిరిగాడు.

సమాధానం లేకపోవటంతో దమయంతి చిటపటలాడింది. "రేపేదైనా మంచి సంబంధం వచ్చినా ఆ అబ్బాయి మాటలు నాకర్థం కావటం లేదంటావు. నీది మరీ విపరీతం," అందామె.

మంచి సంబంధం అంటే ఏంటో? వంటజెయ్యటం, ఇల్లు తుడవటం, చెత్త సినిమాలు చూస్తూ గడిపే మొగుడికి బీర్లందించటం, ఇదే గదా?ఆమె మాటలు పట్టించుకోకుండా తన రూమ్‌కి వెళ్ళిపోయింది రాణి.

★ ★ ★

అజిత్ ఇండియా నుంచి వచ్చి దాదాపు ఆరు వారాలవుతుంది. తిరిగి వెళ్ళి పోదామనే ఆలోచన చాలాసార్లు వచ్చింది. ఇండియాలో తనెప్పుడూ మంచి స్టూడెంటే.

ప్రొఫెసర్ చెన్ మాత్రం చాలా సపోర్టివ్ గా ఉన్నాడు. "నేను పాఠాలు సరిగ్గా చెప్పగలుగుతున్నానోలేదో, స్టూడెంట్స్ క్లాసుకి రావటం లేదు," అంటే, "వాళ్ళంతేలే, వాళ్ళకి నీ యాక్సెంట్ అర్థం కాకపోతే నువ్వేం చేస్తావు," అని భుజం తట్టాడు.

తన దగ్గరే ఎమ్మెస్ చెయ్యమని కూడా అడిగాడు. ఎడ్మిషన్‌కి అప్లై చేసినప్పుడు, "ఐ వుడ్ లైక్ టు వర్క్ ఇన్ యువర్ ఎస్టీమ్డ్ రిసర్చ్ గ్రూప్," అని అజిత్ పంపిన ఈ-మెయిల్ ఆయన్ను బాగా ఆకట్టుకుంది. చైనా నుంచి అలాంటి మెయిల్ రావటం మామూలే. కానీ ఇండియాలో గూడా తన ప్రతిభ విస్తరించిందేమోనని చాలా సంతోషించాడాయన. డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో ఫేకల్టీ లిస్ట్‌లో పేర్లున్న ప్రొఫెసర్లందరికీ అజిత్ అదే ఉత్తరం పంపించాడని ఊహించలేదాయన.

★ ★ ★

లైబ్రరీలో కూర్చుని చదువుతున్నాడు అజిత్. అలా కూర్చుని చదువుతూ కిటికీలోంచి బయటకు చూస్తుంటే అప్పుడప్పుడూ మనసు ఎక్కడెక్కడికో పోతుంటుంది. ఎమ్మెస్ పూర్తయి ట్రెయినింగ్ వీసా రావటం, ఎక్కడో మంచి కంపెనీలో ఉద్యోగం రావటం, లోకల్ ఫిగర్‌ని పడెయ్యటం, దాంతో గ్రీన్‌కార్డ్ రావటం, నాలుగైదు సంవత్సరాల్లో హైదరాబాద్‌లో మంచి ఫ్లాట్ కొనటం, తన సక్సెస్ చూసి తన ఫ్రెండ్స్ అంతా అసూయపడటం, ఆకాశంలో తేలిపోతున్నట్లనిపించింది అజిత్‌కి.

★ ★ ★

సెమిస్టర్ దాదాపు అయిపోవస్తుంది. ఫరవాలేదు, అజిత్ బాగానే స్థిరపడ్డాడు. పెద్దగా స్నేహాలేర్పడలేదుగాని రూమ్మేట్స్ ఐదుగురూ మంచివాళ్ళే. అందరూ ఎమ్మెస్ చెయ్యటానికి వచ్చినవాళ్ళే. ఎవ్వరికీ ఇంకా అసిస్టెంట్‌షిప్ దొరకలేదు. ముగ్గురు యూనివర్సిటీకి దగ్గరగా ఉన్న రెస్టారెంట్లలో దుకాణాల్లో చిన్నచిన్న పన్లు చేస్తున్నారు. ఇద్దరికీ అవీ దొరకలేదు. పాపం అనిపించినా తన అదృష్టానికి తనకే కొంచెం గర్వంగా ఉంటుంది. క్లాస్‌రూంలో కూడా ఇప్పుడు తను ధైర్యంగానే మాట్లాడగలుగుతున్నాడు. ఎనలిటికల్లో మంచి గ్రేడ్ వచ్చే అవకాశం లేదు. అయినా తను చెయ్యగలిగిందేమీ లేదని సరిపెట్టుకున్నాడు.

ఒకరోజు స్టూడెంట్ సెంటర్లో కూర్చుని లంచ్‌బాక్స్ తెరవబోతుంటే మరో టేబుల్ దగ్గర ఆ శాండ్‌విచ్ అమ్మాయి ఒంటరిగా కూర్చుని ఉండటం గమనించాడు. పలకరించాలనిపించింది. తన లంచ్ బాక్స్ తీసుకుని వెళ్ళి ఆమె టేబుల్ పక్కన నిలబడి, "ఇక్కడ కూర్చోవచ్చా," అని అడిగాడు.

ఫరవాలేదే కొంచెం మేనర్స్ నేర్చుకున్నట్లున్నాడే అనుకుంటూ, "యా," అందామె.

చాలా రోజులుగా క్లాస్‌లో కనపడలేదేమని అడిగాడు అతను.

అవును, డ్రాప్ అయ్యాను, అందామె. నీ మహాత్యమే అనాలి అనిపించినా, అనలేదు.

ఆమెతో మాటలు ఎలా పొడిగించాలో అర్థం కాలేదతనికి. ఉన్నట్లుండి, ''మై లాప్‌టాప్ ఈజ్ వర్కింగ్ నౌ,'' అన్నాడు.

అయితే? తనకెందుకు చెప్తున్నట్లూ? అర్థంకాక ప్రశ్నార్థకంగా చూసిందామె.

ఇక్కడివాళ్ళకు నేనేం మాట్లాడినా అర్థం అవదేంటీ? లోలోపలే నిట్టూర్చాడు అజిత్.

ఆదివారం ఆంధ్రజ్యోతి
3 మార్చి 2013

ముగింపు

"హలో."

"నేను, గాయత్రిని."

"నువ్వా, అస్సలు గుర్తుపట్టలేకపోయాను, జలుబు చేసిందా ఏంటి గొంతు అలా వుంది?"



“ఆ, జలుబు కాదులే, ఎలర్జీ. ఈ సంవత్సరం ఎలర్జీ విపరీతంగా ఉంది. ఎందుకోమరి.”

“అవును, ఇక్కడ కూడా కొలీగ్స్ అంటున్నారు. నేను అదృష్టవంతురాలిని. నాకవేమీ లేవు, ఇంతవరకూ.”

“నిజమే, ఇవి లేకుండా ఉండటం అదృష్టమే.”

“సరే, ఇంకా ఏంటీ సంగతులు?”

“ఏమున్నాయీ, మామూలే. నీకు సెమిస్టర్ అయిపోయిందా?”

“ఆ, పోయిన గురువారంతో. గ్రేడ్స్ పోస్ట్ చెయ్యటం కూడా అయిపోయింది. హమ్మయ్య, ఎంత హాయిగా ఉందో!”

“ఎండాకాలం టీచింగ్ ఉందా?”

“లేదు, ఈసారి ఆ బాధ్యత తీసుకోలేదు.”

“మరి ఖాళీగా ఉంటే ఇక్కడకు రారాదూ?”

“వస్తాన్లే. కాని వెంటనే కాదు. వచ్చే వారం ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్తున్నాను. నీకు తెలుసుగా నాకొక ఫ్రెండ్ ఉంది అక్కడ. మేమొక రిసర్చ్ ప్రాజెక్ట్ మీద పని చేస్తున్నాం. తిరిగి వచ్చింతర్వాత వస్తాను.”

“అంటే ఎప్పుడూ?”

“జూన్ మొదటివారం ప్రాంతంలో.”

“జూన్‌లోనా. సరే అయితే, ఉంటాను మరి.”

“ఉండుండు, ఏంటీ అంత నీరసంగా ఉన్నావు? ఆరోగ్యం బాగానే వుందా?”

“ఊ, బాగానే ఉంది.”

“మరెందుకూ అలా వినిపిస్తుంది గొంతు? విషయం ఏంటో చెప్పు.”

“ఏముంది చెప్పటానికి?”

“ఏం లేకపోతే అలా ఎందుకున్నావు? విషయం ఏంటో చెప్పు? లేకపోతే నేను వెంటనే వచ్చేస్తాను.”

“లేదు లేదు, అంత అర్జెంటేమీలేదు. నువ్వొచ్చినప్పుడు మాట్లాడు కుందాంలే.”

“అసలు విషయం ఏంటో చెప్పు.”

“చెప్పటానికేమీలేదే.”

“ఉఫ్, చెప్తావా లేదా?”

"ఏంలేదే. అప్పుడు, అదే, పోయిన్నెల షవర్లో పడినప్పుడు నాకు భయమేసింది. స్పృహతప్పిపోవటం, హాస్పిటల్లో పడి ఉండటం, వొంటినిండా ఆ గొట్టాలూ. నువ్వొచ్చినప్పుడు మాట్లాడుకుందాంలేవే."

"లేదమ్మా. నువ్వేదో ఇబ్బందిలో ఉన్నట్లునావు. పోనీ నేను బయలుదేరి రానా?"

"అబ్బే, వొద్దు. అంత అర్జంటైన విషయం ఏమీకాదు."

"సరేచెప్పు మరి."

"హాస్పిటల్నుంచి ఇంటికి వచ్చింతర్వాత రామూ ఉండగా రాయించిన వీలునామా చూశాను మళ్ళా ఒకసారి."

"ఊఁ."

"అందులో మా ఇద్దరి గురించీ ఉంది. ఒకరం పోతే ఇల్లూ బాంక్ అకౌంటూ రెండోవాళ్ళకూ, ఇద్దరంపోతే అవి పిల్లలిద్దరికీ చెరిసగం అని రాయించాడు."

"బాగానే ఉందికదా?"

"కానీ అందులో ఆరోగ్యం గురించి ఏమీలేదు. ఇప్పుడు నేను ఏదో ఏక్సిడెంట్ జరిగి హాస్పిటల్లో ఉన్నాననుకో. బ్రెయిన్ డెడ్ అంటారే అలా ఉన్నాననుకో. అప్పుడు నన్ను అలాగే ఉండనివ్వడమా, ఆ గొట్టాలన్నీ పీకేసి నన్ను పోనివ్వటమా, అని ఎవరో ఒకరు నిర్ణయం తీసుకోవాలికదా?"

"అవును."

"దాని గురించి ఆ వీలునామాలో ఏమీలేదు. దాన్ని రాయించిన అటార్నీతో మాట్లాడాను మొన్న. అతనన్నాడూ... పిల్లల్లో ఎవరికో ఒకరికి పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వాలట."

"అయితే, అందులో ప్రాబ్లెం ఏంటీ?"

"ఎవరికివ్వాలా అని?"

"దీని గురించా నువ్వంత మధనపడుతుంది? పిల్లల్లో ఎవరైతేనేం? ఎవరికో ఒకరికి ఇచ్చేసెయ్."

"అంత సులభంకాదే. సూర్యకిచ్చాననుకో, ఏదో తేడా వచ్చినరోజు, 'అమ్మను చంపేసింది నువ్వే,' అంటుంది మధూ. మధూకు ఇస్తే సూర్య కూడా దాన్నలాగే అంటాడు కదా?"

"అవునే, నేనలా ఆలోచించలేదు. మరేం చేద్దామనుకుంటున్నావు. ఎవరికో ఒకరికి ఇవ్వాలిగదా?"

“అవును, ఇంకొక భయం ఏంటంటే ఎటూ నిర్ణయం తీసుకోలేక నన్నులాగే శవంలాగా హాస్పిటల్లో ఉంచుతారేమోనని.”

కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

“ధైర్యంగా ఎవరు నిర్ణయం తీసుకోగలరంటావు?” అడిగింది పల్లవి.

“ఎవరికి నా అవసరం లేకపోతే వాళ్ళు.”

“అదేంటే అలా అన్నావు? పిల్లలిద్దరికీ నువ్వంటే ప్రాణం. ఇద్దరూ మంచి వాళ్ళు.”

“అవును. కానీ నీకు బయటకు కనిపించని కోణాలు కొన్నున్నాయి. మధూకి నేను దగ్గర, నాకు సూర్యం దగ్గర.”

“ఎలా అంటావూ?”

“మధూ చాలా ఎమోషనలే. దానికొక కుటుంబం ఉంది. స్వతంత్రంగా ఆలోచిస్తుంది. కానీ లోపలెక్కడో కొంచెం అభద్రత ఉంది. దానికి నేనొక సెక్యూరిటీ బ్లాంకెట్‌ని. అమ్మ ఉంది కదా అన్న ధైర్యం. ఏదైనా క్లిష్టమైన సమస్య వచ్చినప్పుడు నా దగ్గర కొస్తుంది నా అభిప్రాయం అడగటానికి.”

“అందులో తప్పేముందీ? అది మంచి విషయమే కదా?”

“పైకి అలాగే కనిపిస్తుంది, కానీ నేను లేకపోతే?”

“అలాగా? మరి సూర్య నీతో మాట్లాడ్డా?”

“మాట్లాడతాడు. కాని ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సొస్తే చర్చ నాదాకా రాదు. తనూ కోడలుపిల్లా మాట్లాడుకుని ఒక నిర్ణయం తీసుకుంటారు.”

“అదీ మంచిదే. పెద్దవాడయ్యాడు కదా, వాడి జీవితం వాడిది. స్వతంత్రంగా ఉండగలిగితే మంచిదేకదా?”

“అవునే, కాని నా మనసులో ఏదో గందరగోళం ఉందనిపిస్తుంది. లేక ఇది సహజమేమో మరి. మధూ పూర్తిగా స్వతంత్రంగా ఉండటం లేదనే అసంతృప్తి. సూర్య పూర్తిగా స్వతంతృడయిపోయాడనే అసంతృప్తి.”

“అవునా, ఈమధ్య నువ్వు చాలా లోతుగా ఆలోచిస్తున్నావులాగుంది.”

“ఏమో, అవసరం అయింది కాబట్టి ఇవన్నీ బయటకొస్తున్నాయేమో.”

“మరేం చెయ్యాలనుకుంటున్నావు పవర్ ఆఫ్ అటార్నీ గురించి?”

“అదే నిర్ణయించటం కష్టంగా ఉంది. సూర్య అయితే నన్ను పోనిస్తాడని అనిపిస్తుంది. మధూకి ఆ నిర్ణయం తీసుకోవటం కష్టం అవుతుందేమో. అమ్మ మళ్ళా కోలుకుంటుందనే ఆశ దానికి ఎక్కువగా ఉంటుందనుకుంటాను.”

"నువ్విప్పటికే దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లనిపిస్తుంది నాకు."

"అవును, సూర్యకే ఇద్దాం అనిపిస్తుంది లోలోపల."

"కానీ నా అభిప్రాయం అడుగుదామని పిల్చావు. మధూ నీ అభిప్రాయం కోసం వస్తుంది. అలాగే నువ్వు నా అభిప్రాయం అడుగుతున్నావు. అంతేకదా?"

గాయత్రి సమాధానం చెప్పలేదు. పల్లవికి సూర్యం కంటే మధూనే కొంచెం ఎక్కువ ఇష్టమేమో.

"మనమీద ఆధారపడేవాళ్ళంటే మనకు అంత గౌరవం ఉండదేమో. మనం ఆధారపడే వాళ్ళమీద మనకు ఎక్కువ గౌరవమేమో," అంది గాయత్రి.

"కావచ్చు. మధూ కూడా సూర్యలాగా పూర్తిగా స్వతంత్రంగా ఉంటే నీకు మానసికంగా ప్రశాంతంగా ఉంటుంది. ఇక నేను ఉన్నా లేకపోయినా ఈ అమ్మాయి బాగానే ఉంటుందనే ధైర్యం ఉంటుంది."

"అవునే, నన్ను సరిగ్గా అర్థంచేసుకున్నావు. అందుకేగదా నువ్వు ప్రొఫెసరు వయ్యావు, నేను ఇలా మిగిలిపోయాను."

"ఎందుకే లేనిపోని మాటలంటావు. నువ్వు పవర్ ఆఫ్ అటార్నీ ఎవరి కివ్వాలా అని ఆలోచిస్తునావు. నాకలాంటి సమస్యల్లేవుకదా? నేనెప్పుడో ఇచ్చేశాను పవర్ ఆఫ్ అటార్నీ."

"ఎవరికిచ్చావు?"

"ఇంకెవరికీ? యముడికి. యూనివర్సిటీ నుంచి ఇటు నుంచి ఇటే తీసు కెళ్ళరా బాబూ అని రాసిచ్చాను," నవ్వింది పల్లవి.

గాయత్రి సమాధానం చెప్పలేదు. నిజమేకదా. తనకు నిర్ణయాలు తీసుకునే మనుషులున్నారు. పల్లవికి ఎవ్వరూ లేరు.

"పిల్లలిద్దరికీ నేనెంతో నువ్వూ అంతే"

"అవుననుకో. అయినా వాళ్ళను నేను ఇబ్బందిపెట్టనులే. సరే, ఇప్పుడా సంగతులెందుక్కానీ," ఆ తర్వాత వాళ్ళ సంభాషణ ఇతర విషయాల మీద కెళ్ళింది.

★ ★ ★

కొన్నాళ్ళ తర్వాత,

"హలో..."

"ఆంటీ, నేను, మధూని."

"మధూ, బాగున్నావామ్మా? ఏంటీ సంగతులు? కిషోర్, భానూ బాగు న్నారా?"

“ఆ, బాగున్నారాంటీ.”

“అమ్మా?”

“అమ్మ గురించి మాట్లాడదామనే”

“ఏం అమ్మకి బాగాలేదా?” భయపడుతూ అడిగింది పల్లవి.

“ప్రస్తుతం బాగానే ఉంది. కానీ ఏంటో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతుంది.”

“అలాగా, ఏమయింది?”

“మొన్న ఒక్కదానివే రా, మాట్లాడుకుందాం అంది. వెళ్తే, ‘నాకు బాగా లేకపోతే వైద్యం చేయించొద్దు, హాస్పిటల్ వద్దు, నన్ను పోనివ్వండి,’ అని ఏంటేంటో అంది.”

“అలాగా, బాగాలేకపోతేనా, స్పృహలో లేకపోతేనా?” అడిగింది పల్లవి.

అమ్మా ఆంటీ ఈ విషయం గురించి ఇదివరకే మాట్లాడుకుని ఉంటారని గ్రహించింది మధూ.

“బాగాలేక, ఇక వైద్యం చేయించినా కోలుకుంటుందో లేదో అని అనుమానంగా ఉంటే, వైద్యం చేయించొద్దంటుంది.”

“మరి నీ అభిప్రాయం?”

“ఫిబ్రవరీలో ఇలాగే కదా జరిగిందాంటీ. బాత్‌రూంలో పడి స్పృహ తప్పిపోయింది. కానీ కొన్నాళ్ళు ట్రీట్‌మెంట్ ఇస్తే తగ్గి పోయింది. ఇప్పుడు అమ్మ బాగానే ఉంది కదా? మరి వైద్యం చేయించకుండా వదిలేస్తే ఇప్పుడు అమ్మ వుండదు కదా?”

“నిజమే మధూ? నీకు అమ్మ మీద ప్రేమకొద్దీ అమ్మ ఎప్పుడూ అలాగే వుండాలని ఆశ పడతావు. అమ్మక్కూడా నీతోనూ భానూతోనూ గడపాలని ఆశగానే ఉంటుంది. కానీ మనందరం ఎప్పుడో ఒకప్పుడు పోయేవాళ్ళమే కదమ్మా?”

“అవునాంటీ. కానీ ఆరోగ్యంగా ఉన్న మనిషికి ఇప్పుడెందుకా ఆలోచనలన్నీ?”

“చూడమ్మా మధూ, నువ్వు ఎమోషనల్ గా కాకుండా కొంచెం స్థిమితంగా ఆలోచించు. ఇలాంటి విషయాల గురించి ఏ నిర్ణయమూ తీసుకోకుండా వదిలేశాం అనుకో. రేపు షాపింగ్ నుంచి వస్తూనో, ఆఫీస్ నుంచి వస్తూనో, అమ్మకు ఏక్సిడెంట్ జరిగిందనుకో. చిన్న ఏక్సిడెంట్ అయితే ప్రమాదం లేదు. కానీ బ్రెయిన్ డామేజ్ అయ్యో, ఊపిరితిత్తులో, కిడ్నీలో డామేజ్ అయ్యాయనుకో. చిన్న వయసులో వున్న వారికి పూర్తిగా కోలుకునే అవకాశాలెక్కువ. అమ్మలాంటి వాళ్ళకీ, నాలాంటి వాళ్ళకీ

పూర్తిగా రికవర్ అయ్యే అవకాశం తక్కువ. కోలుకునే అవకాశం ఎంతుందో డాక్టర్లు మనకు చెప్తారనుకో. ఒకవేళ అలాంటి అవకాశం లేకపోతే? ఆ ట్యూబులూ, మనుషుల్ని గుర్తించలేని స్థితీ, తన పన్లు తను చేసుకోలేని స్థితీ, 'అలాంటి సమయం వస్తే నా జీవితం పొడిగించొద్దు, డిగ్నిటీతో ముగించనివ్వండి,' అంటుంది అమ్మ. అంతేగాని అస్సలు దేనికీ వైద్యం చేయించొద్దు అని కాదుగదా ఉంటుంది."

"అవున్లే ఆంటీ, అమ్మ చెప్తుంది అదే."

"అది నీకు సమంజసంగా కనిపిస్తుందా లేదా?"

"కనిపిస్తుంది, కాని అమ్మకు నామీద నమ్మకం లేదు ఆంటీ."

"ఏం, ఎందుకూ అలా అనుకుంటున్నావు?"

"మొన్న అమ్మతో మాట్లాడినప్పుడు చెప్పింది - వైద్యం చేయించేదీ లేందీ సూర్య ఇష్టమని వీలునామా రాయిస్తానంది."

"అలా ఎందుకట? మీ ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకోవచ్చు కదా?"

"అలా వీలుకాదట. లాయర్ ఒక్కరి పేరే రాయాలన్నాట్ట."

"అలాగా, మరి నీ అభిప్రాయం ఏంటీ? నీ పేరు మీద రాసినా సూర్య బాధ పడతాడు గదా? ఎలా చేస్తే బాగుంటుందనుకుంటున్నావు నువ్వు?"

"ఎవ్వరైనా ఒకటేలే ఆంటీ. కాని అమ్మ లేకపోతే ఎలా అనిపిస్తుంది నాకు."

"అమ్మ చెప్పిందా సూర్య పేరు ఎందుకు రాయిస్తుందో?"

"నేనడగలేదు, కానీ నాకు తెలుసాంటీ. వాడు న్యూయార్క్‌లో ఉంటాడు. సంవత్సరానికి ఒకటి రెండుసార్లు తప్ప ఇంటికి రాడు. నేను దగ్గర్లో బ్లూమ్‌ఫీల్డ్ హిల్స్‌లో ఉంటాను కాబట్టి అమ్మ దగ్గరకు వస్తూ పోతూ ఉంటాను. భానూ అయితే శుక్రవారం సాయంత్రమే అమ్మమ్మ దగ్గరకు పోతున్నానంటుంది. అమ్మ లేక పోవటం మేం ఊహించలేం. అందుకే అమ్మ పవర్ ఆఫ్ అటార్నీ అన్నయ్యకు ఇస్తానంటుంది."

"హమ్మయ్య, రక్షించావు. నాకు తెలుసు నువ్వర్థం చేసుకుంటావని. మనం ప్రేమ అనుకునే దాంట్లో కొంత ఆధారపడటం ఉంటుందమ్మా. ఏదో ఒకరోజు అమ్మ ఉండదు కాబట్టి కొంత డిటాచ్‌మెంట్ అలవాటు చేసుకుంటే, ఈ ఆధార పడటం కొంచెం తగ్గిపోయి, ప్రేమ మిగులుతుంది. అప్పుడు అమ్మను గౌరవంగా సాగనంపటం వీలవుతుంది. నీమీద ప్రేమ లేకపోవటంవల్ల కాదు సూర్య పేరు మీద రాయటం. సూర్యకి ఈ అటాచ్‌మెంట్ కొంచెం తక్కువనీ, వాడైతే ముగింపు గురించి కొంచెం రేషనల్‌గా ఆలోచిస్తాడనీ అమ్మ అలా రాస్తానంటుంది. మనం


ఎవరిమైనా ఎల్లకాలం ఉండం కదా. అమ్మ ఉన్నంత కాలం సంతోషంగా ఉండు మధూ. ఆ రోజు వచ్చినప్పుడు అమ్మను గౌరవంగా వెళ్ళిపోనివ్వు."

మౌనంగా వింటూ ఉండిపోయింది మధూ. అమ్మ లేని ప్రపంచంలో ఎలా ఉండాలో ఊహించుకుంటూ. మధూకి హితబోధ చేసినా దాదాపు యాభై సంవత్స రాలుగా సన్నిహితంగా ఉన్న ప్రియనేస్తం లేకుండా పోతే మిగిలే లోటు ఎలా వుంటుందో ఊహించసాగింది పల్లవి.

ఆదివారం ఆంధ్రజ్యోతి
22 సెప్టెంబర్ 2013

ప్రయాణం

ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్ట్ ఎప్పటిలాగే రద్దీగా ఉంది. నేను డి56 గేట్ దగ్గరకు వచ్చేసరికి నా చెన్నై వెళ్ళే ఫ్లైట్ ఎల్.హెచ్. 758 బోర్డింగ్‌కి ఇంకా ఇరవై నిముషాల టైమ్ ఉందని ఎనౌన్స్‌మెంట్ చేస్తున్నారు. న్యూస్‌పేపర్ స్టాండ్ నుంచి హెరాల్డ్ ట్రిబ్యూన్



తీసుకుని వెళ్ళి వెయిటింగ్ ఏరియాలో కూర్చున్నాను. నెల్సన్ మండేలాకి ఆరోగ్యం బాగాలేదట. రెండు కొరియాలు మళ్ళా మాట్లాడుకుంటాయట. పెద్ద ఆసక్తికరమైన వార్తలేమీలేవు. ఇంతలో పెద్దగా తెలుగు మాటలు వినపడ్డాయి. నాకు ఎదురుగా ఉన్న వరసలో కాకుండా ఆపై వరసలో కూర్చున్న ఒకతను మొబైల్ ఫోన్లో మాట్లాడు తున్నాడు. ముఖం అటువైపు ఉండటం వల్ల కనపడలేదు. పెద్దగా మాట్లాడు తున్నాడు. ఫోన్ లేకపోయినా ఆంధ్రాదాకా వినపడేలాగా ఉంది అతని గొంతు. మొబైల్ ఫోన్లో ఇట్లా మాట్లాడేవాళ్ళకు చుట్టుపక్కల మనుషులున్నారనే స్పృహ ఎందుకుండదో. అతని గొడవ మనకెందుకులే అని అతని మాటలు వినకుండా ఉండాలని ప్రయత్నం చేశాను. కాని వీలుకాలేదు.

"కాదాంటీ, అసలు వాళ్ళకి కొంచెం మెంటలేమోననుకుంటా. పెళ్ళప్పుడే చెప్పాన్నేను, అడ్జస్ట్ అవగానే ఆ అమ్మాయిని తీసుకొచ్చుకుంటానని. మొదట నేను మూడునెల్లకే గదా వచ్చాను. ఆ అమ్మాయిని తీసుకొచ్చి ఎక్కడ పెడతాను? మీరే చెప్పండి. ఆ తర్వాత ఇప్పుడు నాలుగేళ్ళయింది, కాని ఈ ఉద్యోగం పర్మనెంట్ కాదుగదా, ప్రతి సంవత్సరం వస్తూపోతూనే ఉన్నానుకదా?"

"... ... ..."

"నిజమే ఆంటీ, నాలుగేళ్ళంటే చాలా టైమ్ అనిపిస్తుంది. కానీ ఇక్కడ అడ్జస్ట్ కావటం అంత సులభం కాదు. ఇది అమెరికా కాదు. అందరూ డోయిచ్, అదే జర్మన్, మాట్లాడతారు ఇక్కడ. నాకేమో టైమ్ అంతా ఆఫీస్‌లో సరిపోతుంది. బయట సమాజంతో అడ్జస్ట్ కావాలంటే బాగా డోయిచ్ రావాలికదా? వస్తుంది, ఇప్పుడు కొంచెం ఫరవాలేదు, ఒకటీ రెండేళ్ళలో తీసుకొస్తానని చెప్పానుగదా?"

"... ... ..."

"నాకేం భయం లేదాంటీ, ఆడపిల్లకి వాళ్ళు రెండో పెళ్ళి చెయ్యగలిగితే, నేనేనా చేసుకోలేనివాణ్ణి. చేసుకోమనండి. నాకేం భయం లేదు."

"... ... ..."

అటువైపు నుంచి ఆంటీ ఏం సమాధానం చెప్పిందో, ఇంతలో బోర్డింగ్ మొదలుపెడుతున్నట్లు అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఆ శబ్దంలో నాకు ఇతను చెప్తున్న మాటలు కొంతసేపు వినపడలేదు. అనౌన్స్‌మెంట్ అయిపోయేసరికి,

"నేను ఎల్లుండి ఉదయానికల్లా హైదరాబాద్ వస్తానాంటీ. రాగానే వచ్చి కలుస్తాను," అన్నాడు.

"... ... ..."

"బై ఆంటీ," అని ఫోన్ కట్టేశాడు.

కొంచెం సర్దుకుని, అటూ ఇటూ జరిగి, తన బోర్డింగ్ కార్డ్ చూసుకుని, మళ్ళా సీట్లో సెటిలయ్యాడతను. నాలాగే ముందు వరసల్లో సీట్ అయివుంటుంది.

"మీరు జర్మనీలో పనిచేస్తున్నారా?" అతని పక్కన ఇప్పుడు ఖాళీగా ఉన్న సీటుకి అవతల కూర్చున్న ఒకతను అడిగాడితన్ని, ఇంగ్లీషులో.

"యస్."

"ఐటీనా?"

"యస్."

వాళ్ళ మధ్య సంభాషణ ఇంగ్లీషులో జరిగింది. నేను మీకు తెలుగులో చెప్తాను.

"ఏ కంపెనీ? "

"కాగ్నిజాంట్."

"లోకల్ క్లయంటా?"

"యస్, మీరూ? మీరెక్కడ పని చేస్తున్నారూ?"

"యు.ఎస్."

"యు.ఎస్.లోనా, ఎక్కడ?"

"చికాగో."

"చికాగోనా, అక్కడ వివేకానంద చాలా ఫేమస్ కదా?"

"వివేకానంద అంటే అక్కడ ఎవ్వరికీ తెలియదు."

"రియల్లీ, మీరు ఐటీనా?"

"యస్."

"ఏ కంపెనీ?"

"ఏసీ నీల్సన్."

"యు ఆర్ హేవింగ్ హెచ్వన్నా?"

"కాదు, యల్ వన్."

"అంటే మేనేజర్ కేడర్ అన్నమాట. కానీ కంపెనీ రెస్ట్రిక్టెడ్."

“అవును. హెచ్ వన్‌కి ట్రై చేస్తున్నాను. హెచ్ వన్ నుంచి గ్రీన్ కార్డ్‌కి ట్రై చెయ్యొచ్చు. యల్ వన్ నుంచి కష్టం.”

“ఎప్పుడెళ్ళారు చికాగో?”

“నాలుగేళ్ళయింది.”

“చికాగోలో భయం ఉండదా? అక్కడ నల్లవాళ్ళుంటారని, మగ్గింగ్ చేస్తారని అంటారు.”

“ఉన్నారు, కాని మా ఆఫీస్ గెట్టోలకి చాలా దూరం కదా, ఏం ప్రాబ్లెం లేదు.”

“అమెరికాలో గెట్టోలు కూడా ఉంటాయా?”

“ఎందుకుండవూ, చాలా ఉన్నయ్.”

“నల్లోళ్ళు పొడుగ్గా లావుగా ఉంటారుగదా?”

“అవును.”

“కాస్ట్ ఆఫ్ లివింగ్ ఎట్లుంటుంది?”

“చికాగోలో కాస్ట్ ఆఫ్ లివింగ్ ఎక్కువే.”

“పే కూడా ఎక్కువిస్తారా మరి?”

“లేదు.”

“సేవింగ్ బాగుంటుందా?”

“ఆ. బాగానే ఉంటుంది.”

“రెంట్ ఎంతుంటుంది?”

“మేం నలుగురుం ఉంటాం ఒక రూంలో. రెండొందల అరవై నెలకి.”

“అంటే మంచి సేవింగన్నమాట.”

“ఫరవాలేదు. కాని సౌత్ లో అయితే, అర్కన్సా, అలబామా అలాంటిచోటైతే కాస్ట్ ఆఫ్ లివింగ్ చాలా తక్కువ, సేవింగ్ బాగుంటుంది.”

“అలాగా. మీరు మారీడా?”

“ఆ.”

“ఎన్నాళ్ళయింది మేరేజై.”

“రెండేళ్ళయింది.”

"ఇట్ ఈజ్ నాట్ ఫెయిర్ యార్, టూ యియర్స్ అయినా మిసెస్‌ని తీసుకురాలేదా?"

"తీసుకురావటానికే పోతున్నాను."

"ఇల్లు తీసుకున్నారా మరి?"

"లేదు. వేస్ట్ కదా. వచ్చింతర్వాత ఫ్రండ్ ఇంట్లో ఉండి అపార్ట్‌మెంట్ చూసు కుంటాం. ఇక ఆ తర్వాత అంత సేవింగుండదు."

"ఏం?"

"రెంట్ కట్టాలి గదా? అదే దాదాపు పన్నెండొందలు ఉంటుంది. జీతంలో నలభై పర్సెంట్. పైగా లివింగ్ ఎక్స్పెన్సెస్. ఇంకేం సేవింగుంటుంది?"

"టాక్సుంటుందా చికాగోలో?"

"ఉంటుందా? అమ్మో, చాలా ఎక్కువ. ముప్పైయ్యైదు పర్సెంట్."

"అంతేనా. దట్స్ నథింగ్ యార్. ఇక్కడ నలభైయ్యైదు-యాభై పర్సెంట్ దాకా ఉంటుంది."

"అయితే జర్మనీలో అంత సేవింగుండదా?"

"అమెరికాలో అంత ఉండదు."

"మీరు అమెరికాలో కూడా పనిచేశారా?"

"లేదు. కాని ఫ్రండ్స్ చెప్తుంటారు కదా."

"ఇక్కడ కాస్ట్ ఆఫ్ లివింగ్ ఎట్లుంటుంది?"

"కాస్ట్ ఆఫ్ లివింగ్ చాలా ఎక్కువ. అమెరికాతో కంపేర్ జేస్తే జర్మనీ చాలా ఎడ్వాన్స్‌డ్."

"అమెరికా కంటేనా?"

"అవును. జర్మనీనేకాదు, యూరప్ అంతా అమెరికా కంటే ఫార్వర్డే. క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇక్కడ చాలా బెటర్‌గా ఉంటుంది."

"మీరు యూరప్‌లో కూడా పనిచేశారా?"

"యూరప్ అంటే జర్మనీ యూరప్‌లోదేకదా? మాకు షెంగెన్ కార్డ్ ఇస్తారు. అంటే యూరప్‌లో ఎక్కడికైనా పోవచ్చు. కాకపోతే ఎక్కడబడితే అక్కడ ఉద్యోగం చెయ్యనివ్వరు, కాని ఎక్కడికైనా పోవచ్చు."

“అలాగా. మీకు ఫామిలీ ఉందా?” అంతకు ముందు జరిగిన మొబైల్ ఫోన్ సంభాషణ అస్సలు విననట్లు అడిగాడతను.

ఇతను ఓ అర సెకండ్ తటపటాయించాడు. కానీ ఎలాంటి సంకోచం లేకుండా సమాధానం చెప్పాడు, “అవునండీ, తీసుకురావటానికే ఇండియా వెళుతున్నాను.”

“పిల్లలున్నారా?”

“ఒక బాబు, రెండేళ్ళు.”

“మీరు జర్మనీలో ఎన్నేళ్ళనుంచి ఉంటున్నారు?”

“టు యియర్స్.“

“అయితే మీకు జర్మన్ వచ్చా? ఆఫీస్‌లో ఏం మాట్లాడతారూ? జర్మనా? ఇంగ్లీషా?”

“ఇక్కడ ఎవ్వరూ ఇంగ్లీషు మాట్లాడరు. 99 శాతం డొయెచ్. అదే, జర్మన్ మాట్లాడతారు. కానీ నాతో మాట్లాడేటప్పుడు ఇంగ్లీషు మాట్లాడతారు. తప్పదు కదా! వీళ్లు బావిలో కప్పల్లా ఉంటారు భాష విషయంలో, తమిళియన్స్‌లాగా.”

ఆ మాట అన్న తర్వాత అవతలి అతను తమిళియనేమో అన్న ఆలోచన వచ్చినట్లుంది.

“యు ఆర్ ఫ్రమ్?”

“అయాం ఫ్రం చెన్నై ఓన్లీ,” అన్నాడు చికాగో అతను.

జర్మనీ అతను కొంచెం ఇబ్బందిగా సమర్థించుకోవటం మొదలుపెట్టాడు. “అయితే మీకు తెలుసుగదా, ఇప్పుడు కరుణానిధి విషయం చూడండి, వాడి బిడ్డలకు హిందీ ఇంగ్లీషూ బాగానే వచ్చు, కానీ మిగతావాళ్ళకు మాత్రం రాకూడదు, వాళ్ళు ముందుకుపోవటం ఇష్టం ఉండదు వీడికి. అందరూ తమిళ్ మాత్రమే నేర్చుకోవాలంటాడు.”

“కరుణానిధి కంటే జయలలితే నయం,” అన్నాడు చికాగో అతను. దాంతో జర్మనీ అతను ఆ చిక్కులోంచి బయటపడ్డాడు.

“మరి మీ బాబును ఇక్కడకు తీసుకొస్తే చదువు విషయం ఏం చేస్తారు? ఇక్కడ అంతా జర్మన్లోనే అంటున్నారుగా?”

“అవును ప్రాబ్లెమే.”

"ఇంగ్లీషు స్కూల్స్ అస్సలు లేవా?"

"ఎక్కడో ఒకటీ అరా ఉన్నయ్. కాని చాలా కాస్ట్లీ. మనం అఫర్డ్ చెయ్యలేం."

"కంపెనీ సబ్సిడీలు ఏమీ ఉండవా?"

"లేవు."

"మరి మీరు ఇక్కడే జర్మనీలోఉండాలనుకుంటున్నారా? ఇండియా వెళ్ళిపోతారా?"

"ఇక్కడ ఉండం, గుడ్ ఆర్ బేడ్, ఇండియా ఈజ్ మై కంట్రీ, ఒక ఐదారేళ్ళుండి వెళ్ళిపోతాం."

"అంటే మీ వీసా ఐదారేళ్ళుందా?"

"అబ్బే. అలాఅని కాదు. ఎక్స్టెండ్ చేసుకోవచ్చు. కానీ కొంత సేవ్ అయినప్పుడు వెళ్ళిపోతాం. మీరూ?"

"నేనూ సేవింగ్ అయింతర్వాత వెళ్ళిపోతాను."

ఇంతలో మొదటి ఇరవై రోస్ బోర్డ్ చేస్తున్నట్లు ఎనౌన్స్మెంట్ వచ్చింది. నేను వీళ్ళ సంభాషణ నుంచి వెళ్ళటం ఇష్టం లేకుండానే లేచి వెళ్ళిపోవాల్సొచ్చింది. వాళ్ళిద్దరూ కూడా లేచారు.

★ ★ ★

మా ప్లేన్ ఎయిర్ బస్ 320. నాది 18వ వరుస. రెండువైపులా కిటికీలకు దగ్గిరగా రెండు సీట్లు, మధ్యలో మూడు సీట్లూ. నాది ఐల్ సీటు. నాపక్కనే ఐల్కి అటువైపు సీట్లో కూర్చున్నాడు జర్మనీ అతను.

మళ్ళా అంటీతో ఫోన్లో మాట్లాడుతున్నాడు. ఈ అంటీ ఆ ఆంటీ నో ఇంకొక ఆంటీనో మరి.

దాదాపు పదిగంటల ఫ్లైట్. సినిమా సెలెక్షన్ ఏముందో చూద్దామని నేనతని సంభాషణ పట్టించుకోలేదు. సెల్ ఫోన్లూ మొబైల్ డివైసెస్ అన్నీ ఆఫ్ చెయ్యాలని చెప్తున్నారు పబ్లిక్ అనౌన్స్మెంట్లో.

జర్మనీ అతను పెద్దగా మాట్లాడుతున్నాడు యధావిధిగా. "ఇక్కడ అదేం కష్టం కాదు అంటీ. నలభై యాభైయ్యేళ్ళొచ్చేసరికి ఇద్దరు ముగ్గుర్ని మార్చేస్తుంటారు ఇక్కడి ఆడవాళ్ళు. యాభైయ్యేళ్ళ ముసలమ్మలు కూడా పెళ్ళిళ్ళు చేసుకుంటుం

టారు. నాలుగైదేళ్ళు జర్మన్ గర్ల్ ఫ్రెండ్‌తో ఉంటే పేపర్లు వచ్చేస్తయ్. ఇక ఆ తర్వాత ఇండియా వెళ్ళి పెళ్ళిచేసుకోవచ్చు, లేకపోతే గర్ల్ ఫ్రెండ్‌తోనే ఉండొచ్చు."

"... ... ..."

"అబ్బే, లేదు ఆంటీ, నేను నిజంగానే ఒక్కణ్ణే ఉంటున్నాను. ఊరికే ఇక్కడ ఎలా జరుగుతుందో చెప్తున్నానంతే."

ఇంతలో ఎయిర్‌హోస్టెస్ మా వరసదాకా వచ్చి, ఫోన్‌లో మాట్లాడుతున్న జర్మనీ అబ్బాయిని భుజం మెల్లగా తట్టి, ఫోన్ ఆఫ్ చెయ్యమని అడిగింది.

నవ్య దీపావళి సంచిక
2013


గింజలు

అక్కా, చెల్లెలూ.

గూటిలోంచి దూకి కొమ్మ మీద వాలాయి.

ఇంకా పొద్దు పొడవలేదు.

చెట్టు చుట్టూ నిశ్శబ్దం.



తూర్పున ఎరుపు ముసుగు లేస్తుంది.

ఆకలిగా ఉందక్కా అంది చెల్లెలు.

నేనెళ్ళి గింజలు వెతుక్కొస్తానంది అక్క.

"ఒద్దు, పోవొద్దు, అమ్మ లేస్తే, నువ్వు లేకపోతే అమ్మ భయపడుతుంది," అంది చెల్లెలు.

"తొందరగా వస్తాగా, గింజలు తెస్తాను. అమ్మకు పని తప్పుతుంది," అంది అక్క.

చిన్ని రెక్కలు విప్పుకుని ఎగిరిపోయింది, పడమటిగా.

ఎండుపొలాలు దాటి,

వాగులు దాటి,

పెద్ద వనభూమికి చేరింది అక్క.

అబ్బా, ఎన్ని గడ్డిమొక్కలో!

ఎన్ని గింజలో!

ఆకలి తీరా తిన్నది అక్క.

చెల్లికీ అమ్మకూ గింజలు తీసుకెళ్ళాలి.

పెద్ద కంకి నోట గరిచి కొమ్మెక్కింది.

ఇది రెండురోజులకు సరిపోతుందేమో.

మళ్ళా గింజల కోసం బతుకాట.

కొమ్మ మీద గూడు కట్టింది అక్క.

ఒక్కొక్క కంకి తెచ్చి గూట్లో దాచింది.

అమ్మ ఎంత గర్వపడుతుందో నా బిడ్డ ఇన్ని కంకులు పోగుచేసిందని.

గింజలు పోగుచేస్తూ వచ్చిన కారణం మర్చిపొయింది అక్క.

రోజులు గడిచాయి.

అక్క ఒంటరైంది.

చుట్టూ ఎన్నో పక్షులున్నా,

వాటి పలుకు వేరు.

రూపాలు వేరు.

తమ చెట్టు పక్షి ఒక్కటీ లేదిక్కడ.

ఒంటరైపోయింది అక్క.

అయ్యో, గింజల గోల్లో పడి ఇలా అయిపోయానే అనుకుంది.

అప్పుడప్పుడూ తూర్పువైపు చూస్తుంటుంది.

వెళ్ళిపోదామనుకుంది చాలాసార్లు.

కానీ, ఇన్ని గింజలు వదిలేశా? మనసొప్పలేదు.

వీటికోసమే కదా అమ్మ వెతికేది రోజూ?

మరోరోజు ఆగిపోయింది అక్క.

అమ్మను కనిపెట్టుకుని ఉంది చెల్లెలు.

ఒక్కోరోజు ఆకలిగానే పడుకుంటుంది.

కాని అమ్మను వదిలేసి వెళ్లలేకపోయింది.

తను కూడా గింజలకోసం వెళ్తే?

కానీ, భయం.

పాపం ఒక్కతే అయిపోతుంది అమ్మ.

పైగా ఈ వయసులో.

అక్క తప్పకుండా వస్తుంది.

మళ్ళా అందరూ బాగుండే రోజు వస్తుంది.

ఆశగా పడమటి వైపు చూస్తూ ఉంటుంది చెల్లెలు అప్పుడప్పుడూ.

రోజులు గడుస్తునాయి.

అక్క ఇంకా రాలేదు.

అమ్మేమో రేపో మాపో అంటుంది.

చుట్టుపక్కల పక్షులు వచ్చిపోతున్నాయి అమ్మను చూట్టానికి.

తల్లికి గింజలు సంపాయించి పెట్టలేని పనికిమాలిన దానివి అంటున్నాయి కొన్ని పక్షులు.

దద్దమ్మను చూసినట్లు చూస్తున్నాయి.

"పెద్ద కూతురే ఉంటేనా ఆమెకీ కష్టాలొచ్చేయి కాదు," అందొక పక్షి.

ఇప్పటికీ ఏదో ఒక బంధువు పక్షి ఆ మాటలు అంటూనే ఉంటుంది.

విన్నప్పుడల్లా చెల్లి చూపుల్లో ఓ నవ్వు తళుక్కుమంటుంది.

కానీ నవ్వులా ఉండదు.

అది సంతోషమో,
విషాదమో,
అసూయో,
ఉన్మాదమో
ఎవరికి తెలుసూ?
కొమ్మ మీద కూర్చుని దూరంగా చూస్తూ ఉంటుంది చెల్లెలు.

సారంగ అంతర్జాల పత్రిక
మార్చి, 2014

కేన్యా టు కేన్యా

ఇద్దరూ పక్కపక్కనే ఉన్న సీట్లలో కూర్చున్నారు. అతని ఎడమ చేతిని తన కుడిచేతిలోకి తీసుకుందామె.

యాభై సంవత్సరాల స్నేహం, అనురాగం, అనుబంధం, సుఖదుఃఖాల్లో తోడుగా చేసిన ప్రయాణం. మరోగంటలో



జీవితం కొత్తమలుపు తిరుగబోతుంది. ఇదివరకు ఎప్పుడూ ఊహించని, ఊహించలేని మార్పు రాబోతుంది. ఒక విధంగా ఇది ఇద్దరూ దీర్ఘంగా ఆలోచించి స్వయంగా తీసుకున్న నిర్ణయమే. మరోవిధంగా చూస్తే ఇంతకంటే మరో మార్గం లేదు. ప్రపంచంలో ఇంతకంటే గొప్పదేశం మరొకటి లేదని ప్రతిరోజూ గుర్తుచేసే ఈ దేశంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని వాళ్ళిద్దరూ ఎప్పుడూ ఊహించలేదు.

★ ★ ★

మూడు సంవత్సరాల క్రితం 2011 మేలో, స్టీవెన్, ఆయేషా ఇద్దరూ పదవీ విరమణ చేశారు. నిజానికి స్టీవెన్ వాళ్ళ యూనివర్సిటీలో వయసు పరిమితి అంటూ లేదు. ఓపిక ఉన్నంత కాలం పని చెయ్యొచ్చు. కానీ దాదాపు నలభై సంవత్సరాల పాటు ప్రొఫెసర్‌గా పనిచేసిన స్టీవెన్ ఇదివరకు ఉన్నంత ఉత్సాహంగా ఉండటం లేదు. దక్షిణాఫ్రికా చరిత్ర మీద నాలుగు సంవత్సరాలుగా రాస్తున్న పుస్తకం తుది రూపానికి చేరుకుంది. పదవీ విరమణ చేసేలోగా గత రెండు వందల సంవత్సరాల కేన్యా చరిత్రలో వలసవచ్చిన భారతీయుల పాత్ర గురించి ఒక పరిశోధనా గ్రంథం రాయాలనే కోరిక ఉన్నా దానికి కావాల్సినంత ఓపిక ఇప్పుడు లేదేమో అనిపించింది. అదీగాక ఓపిక ఉన్నంత కాలం పనిచేస్తూ వుంటే ఇక పదవీ విరమణ చేసిన తర్వాత ప్రయాణాలు చెయ్యటానికి ఓపిక వుండదేమో కదా? మరి అప్పుడు ఊరికే ఇంట్లో కూర్చోవాల్సొస్తుందేమోనని ఆదుర్దా. ఇద్దరికీ ఇతర దేశాలూ ప్రాంతాలూ చూడటం అంటే ఇష్టం. నువ్వు ఉద్యోగం విరమిస్తే నేను కూడా నీతోపాటే ఉద్యోగం మానేస్తాను అంది ఆయేషా. నలభై సంవత్సరాలుగా హెన్రీఫోర్డ్ హాస్పిటల్లో సోషల్ వర్కర్‌గా పనిచేసిందామె. చాలా కష్టమైన ఉద్యోగం. రోజూ ఏదో ఒక కుటుంబంలో ఏదో ఒక సమస్యకు పరిష్కారం వెతకాలి. స్టీవెన్ సరేనంటే తను కూడా ఉద్యోగ విరమణ చెయ్యటానికి తయారుగా ఉందామె. 2011 మేలో ఇద్దరూ ఒకేసారిగా ఉద్యోగాలు మానేశారు.

కమల్, అమీనా, ఇద్దరూ సంతోషించారు. ముఖ్యంగా అమ్మ ఇక ఇంటిదగ్గరే ఉంటుంది. ఏదో పనిమీదనో, సెలవు తీసుకునో రెండు రోజులు ఇంటికి డిట్రాయట్ వెళ్తే తమకు ఇష్టమైన వంటకాలన్నీ చేసిపెడుతుంది. గ్రేట్ లేక్స్ మాల్లో తీరిగ్గా షాపింగ్‌కి వెళ్ళొచ్చు. నాన్నకి సినిమాలు చూట్టం అంటే ఇష్టం. చక్కగా లివింగ్ రూంలో సోఫాల మీద పడుకుని నెట్ ఫ్లిక్స్‌లో సినిమాలు చూడొచ్చు. వాటి గురించి తీరిగ్గా వాదించుకోవచ్చు. మరుసటిరోజు తొందరగా లేచి ఆఫీసుకి వెళ్ళాల్సిన పని ఉండదు.

కమల్‌కీ అమీనాకీ, ఇద్దరికీ ఇంకా పిల్లల్లేరు. ఒక్కోసారి ఆ విషయం గుర్తు చేస్తుంటుంది ఆయేషా. ఇద్దరూ విసుక్కుంటారు. అలాంటి విషయాల్లో పెద్ద వాళ్ళు జోక్యం చేసుకోగూడదని చెప్తుంటారు. ఇన్ని సంవత్సరాలు అమెరికాలో ఉండీ ఈ మాత్రం కూడా నేర్చుకోలేదా అని నిర్మొహమాటంగా అంటుంది అమీనా అయితే. నువ్వెంత అదృష్టవంతురాలివో నీకు తెలియదు. మీరు కేన్యాలో పుట్టిపెరిగి ఉంటే ఎంతమంది ఎన్ని ప్రశ్నలు అడిగేవాళ్ళో తెలుసా? అసలు తల్లిదండ్రులు మాలాగా ఇంత స్వేచ్ఛగా పెంచుతారనుకుంటున్నావా పిల్లల్ని? అని కోపం అభినయించేది ఆయేషా. వెంటనే అమ్మను బుజ్జగించేది అమీనా.

★ ★ ★

మొంబాసాలో పుట్టి పెరిగింది ఆయేషా. మొంబాసా కేన్యా దక్షిణ భాగంలో సముద్రపు ఒడ్డున ఉన్న ఒక చిన్న నగరం. పందొమ్మిదో శతాబ్దం చివరికాలంలో గుజరాత్ నుంచి కేన్యాకు వలస వెళ్ళారు ఆమె పూర్వీకులు. రకరకాల వ్యాపారాలు చేశారు. బాగా సంపాదించారు. మిగతా ఇస్మాయిలీ కుటుంబాల్లోని పిల్లల్లాగే ఆగాఖాన్ స్కూల్లో చదువుకున్నారు ఆయేషా, ఆమె అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములూ. వ్యాపారరీత్యా చాలాసార్లు లండన్ వెళ్ళివస్తుండేవాడు ఆయేషా నాన్న. పెద్దక్క ఫరీదాను చదువుకోటానికి లండన్ పంపించారు కూడా. ఆయేషాకు చిన్నప్పటి నుంచీ అమెరికాలో చదువుకోవాలనే కోరిక ఉండేది. లండన్ వెళ్ళరాదా అని కొంచెం వత్తిడి చేసినా చివరకు తల్లిదండ్రులు ఆమెను అమెరికా పంపించడానికి ఒప్పుకున్నారు. కాలిఫోర్నియాలో బర్క్‌లీ యూనివర్సిటీలో చేరింది ఆయేషా, సోషియాలజీ చదవటానికి.

నైరోబీకి వాయువ్యంగా నాలుగువందల కిలోమీటర్ల దూరంలో దాదాపు ఉగాండా సరిహద్దుల్లో ఉన్న ఒక చిన్న పల్లెటూరు నసియండా. స్టీవెన్ పుట్టి పెరిగిన కుటుంబంలో సభ్యులు తండ్రీ, తల్లీ, అక్కా, తమ్ముడూ, చెల్లీ. తండ్రి గొర్రెల కాపరి. తల్లి పొలాల్లో కూలిపని చేసేది. మూడుతరాల క్రితం క్రైస్తవమతం స్వీకరించారు స్టీవెన్ పూర్వీకులు. స్టీవెన్ పుట్టినప్పటికి కేన్యా ఇంకా ఇంగ్లీషువారి పరిపాలన లోనే ఉంది. వూళ్ళో ఉన్న క్రిస్టియన్ స్కూల్లో చదువుకున్నాడు స్టీవెన్. ఒక ఇంగ్లీష్ క్రిస్టియన్ మిషనరీ ఆ స్కూల్ నడిపేవాడు.

స్టీవెన్ చిన్నప్పట్నుంచీ కొంచెం రెబెల్‌గానే ఉండేవాడు. లూహ్యా జాతివారు పిల్లలకు వాళ్ళ సాంప్రదాయం ప్రకారం ఒక పేరూ, ఇంకొక క్రిస్టియన్ పేరూ పెట్టే వారు. స్టీవెన్‌కు పెట్టిన లూహ్యా పేరు బరాసా మసిండే (సోమవారం నాడు పుట్టిన వాడు). స్కూల్లో ఉన్నంతసేపూ పిల్లలందరూ తమ క్రిస్టియన్ పేర్లే వాడుకునేవారు. స్టీవెన్ మాత్రం తనను బరాసా అని పిలవమని అడిగేవాడు అందరినీ, టీచర్లను

కూడా. చిన్న వయసులోనే కేన్యా ఇంగ్లీషువారి పాలనలో ఉందనీ, తమ దేశానికీ ప్రజలకీ స్వేచ్ఛ లేదనీ గ్రహించాడు స్టీవెన్. ఇంగ్లీషు వారి పరిపాలనను వ్యతిరేకించి స్వతంత్ర దేశంగా బలమైన దేశంగా స్థిరపడిన అమెరికా మీద మోజు పెరిగింది అతనికి. ఒక హైస్కూల్ టీచర్ ప్రోత్సాహంతో, సహాయంతో, అమెరికాలో చదువు కోవటానికి ఒక స్కాలర్‌షిప్ సంపాదించాడు. బర్కిలీ యూనివర్సిటీలో ఆఫ్రికాచరిత్ర అధ్యయనం చెయ్యటం మొదలుపెట్టాడు.

★ ★ ★

యూనివర్సిటీలో అంతర్జాతీయ విద్యార్థి సంఘాలు జరుపుకునే సాంస్కృతిక కార్యక్రమాల్లో కలిశారు స్టీవెన్, ఆయేషా. ఆఫ్రికన్ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు స్టీవెన్. ఏ దేశం విద్యార్థుల కార్యక్రమం జరిగినా ఇద్దరూ వెళ్ళేవారు. పాటలు వినటం, వాళ్ళు చేసే నాట్యాలు చూడటం, రకరకాల వంటకాలు రుచి చూడటం ఇద్దరికీ ఇష్టంగా ఉండేది.

కేన్యాలో పుట్టి పెరిగినా చుట్టూ ఉన్న ముస్లిం కుటుంబాలతో తప్ప బయట ఉన్న నల్లవారితో ఎలాంటి సంబంధం లేని ఆయేషాకి స్టీవెన్ కనువిప్పయ్యాడు. అందరికంటే తెలివికలవారు తెల్లవారనీ, తర్వాత తనలాంటి భారతీయ సంతతి వారనీ, ఆ తర్వాతే నల్లవారనీ గట్టిగా నమ్మే వర్గంలో పుట్టి పెరిగిన ఆయేషా స్టీవెన్ తెలివితేటలకీ, అతని విశాల దృక్పథానికీ ఆశ్చర్యపడింది. క్రమంగా ఇద్దరి మధ్యా గాఢమైన స్నేహం ఏర్పడింది.

అతడు నలుపు, ఆమె మంచి రంగుగల స్త్రీ. అతడు ఆఫ్రికావాడు, ఆమెది ఇండియా పరంపర. అతడి భాష లూహ్యా, ఆమెది ఉర్దూ. అతడి మతం క్రైస్తవం, ఆమెది ఇస్లాం. కానీ వాళ్ళు కలుసుకున్నప్పుడు ఈ తేడాలు ముఖ్యమైనవి కావు అనిపించేది.

తన పూర్వీకులది ఇండియా అయినా, తన దేశం కేన్యా అనే ఆమె భావించేది. అప్పటికి కేన్యాకు స్వాతంత్రంవచ్చినా, చాలామంది ఆఫ్రికా విద్యార్థుల్లాగే స్టీవెన్ ఆయేషాల దృష్టి కూడా దక్షిణాఫ్రికా మీదే ఉండేది. అక్కడ తెల్లవారి పాలనలో బాహాటంగా కనిపిస్తున్న దురహంకారం కోపం తెచ్చేది. అది వారిద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడటానికి కారణం అయ్యింది కూడా.

★ ★ ★

స్టీవెన్‌ని వివాహం చేసుకోవాలనే ఉద్దేశం అక్కతో చెప్పింది ఆయేషా. అప్పటికి అక్క ఫరీదా పెళ్ళి చేసుకుని భర్తతో డల్లాస్‌లో ఉంటోంది. ఆమె ఆ విషయం తల్లిదండ్రులతో మాట్లాడింది. వెంటనే ఆయేషాను కేన్యా తిరిగి రమ్మని ఆదేశించారు తల్లిదండ్రులు. ఆమె నిరాకరించింది. స్టీవెన్ తల్లిదండ్రులు కూడా వారి

వివాహానికి సమ్మతించలేదు. మంచి కేన్యా అమ్మాయిని చేసుకోక ఈ దుకాణాల (భారతీయుల) దొరల అమ్మాయిని చేసుకోవటం ఏంటీ అని వ్యతిరేకత వ్యక్త పరిచారు. కాని స్టీవెన్ ఆయేషా వెనుకాడలేదు. ఇద్దరికీ ఒకరి మీద ఒకరికి గట్టి నమ్మకం, కలిసి బ్రతకాలనే బలమైన కోరికా ఉండటం వల్ల, స్నేహితుల సమక్షంలో దండలు మార్చుకుని పెళ్ళి రెజిస్టర్ చేసుకున్నారు.

ఆతర్వాత ఈరోజు వరకూ ఆయేషాకి అక్క ఫరీదాతో తప్ప మరే కుటుంబ సభ్యులతోనూ సంబంధం లేదు. ఎవ్వరూ ఆమెతో మాట్లాడరు. స్టీవెన్ విషయం వేరు. పెళ్ళి తర్వాత స్టీవెన్‌కి డిట్రాయట్లో వెయిన్ స్టేట్ విశ్వవిద్యాలయంలో చరిత్ర విభాగంలో ఉద్యోగం దొరికింది. ఇద్దరూ కాలిఫోర్నియా నుంచి డిట్రాయట్ చేరారు. యూనివర్సిటీకి దగ్గరగానే ఇల్లు కొనుక్కున్నారు. ఆయేషాకి వెంటనే హెన్రీఫోర్డ్‌లో సోషల్‌వర్కర్‌గా ఉద్యోగం దొరికింది. ఇద్దరూ ఉద్యోగం చేస్తుండటం వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తలేదు. పైగా తల్లిదండ్రులు స్టీవెన్ వివాహాన్ని వ్యతిరేకించినా అతని అక్కా, తమ్ముడూ, చెల్లీ అతనికి ఉత్తరాలు రాస్తూనే ఉండేవారు. ముఖ్యంగా అక్క టీచర్ ట్రెనింగ్ కాలేజీలో ఫీజు కట్టటానికి సహాయం అడిగింది. స్టీవెన్ ఫీజు కట్టాడు. తమ్ముడు నైరోబీలో చిన్న సైకిల్‌షాప్ పెట్టుకోవటానికి సహాయం అడిగాడు. అతనికీ సహాయం చేశాడు స్టీవెన్. బంధువర్గంలో స్టీవెన్ తన కుటుంబానికి సహాయం చేస్తున్నాడన్న వార్త అందరికీ తెలియడంతో ఆర్థిక సహాయం కోసం ఉత్తరాలు రావటం పెరిగింది. గత ముప్పై ముప్పైయ్యేదు సంవత్సరాలుగా తనకు ఉన్న దాంట్లోనే వీలైనంతమందికి సహాయం చేశాడు స్టీవెన్. ఆయేషా స్టీవెన్‌కి అండగా నిలబడింది. తమకు ఆఫ్రికా నుంచి బయటకు రావటం చదువు వల్లనే సాధ్యమైందని ఇద్దరికీ తెలుసు కాబట్టి చదువుకోవటానికి సహాయం అడిగిన ఎవ్వరినీ నిరాకరించలేదు ఇద్దరూ.

క్రమంగా కేన్యాలో స్టీవెన్ కుటుంబంలో, బంధువర్గంలో ఆయేషా మీద సదభిప్రాయం ఏర్పడింది. ఆఫ్రికా అమ్మాయి కాకపోయినా, ఆమె తమకు సహాయం చెయ్యటాన్ని వ్యతిరేకించకపోవటం, చదువుకోవటానికి అమెరికా వచ్చిన స్టీవెన్ వైపు బంధువుల బిడ్డలను ఎంతో ప్రేమగా ఇంటికి ఆహ్వానించటం ఎంతగానో హర్షించారు అందరూ.

గత ముప్పై నలభైయ్యేళ్ళలో స్టీవెన్, ఆయేషా చాలాసార్లు కేన్యా వెళ్ళొచ్చారు. వెళ్ళినప్పుడల్లా నైరోబీలో ఒక హోటల్లో ఉండేవాళ్ళు. కారులో నసియెండా వెళ్ళి స్టీవెన్ తల్లిదండ్రులనూ బంధువర్గంలో అందరినీ పలకరించి వచ్చేవారు. ఎలాంటి సౌకర్యాలూ లేని స్టీవెన్ తల్లిదండ్రుల ఇంట్లో ఉండటం సులభంకాదు. అందువల్ల సాయంత్రానికల్లా దగ్గర్లోఉన్న పట్టణం ఎల్డొరేకి చేరుకునేవారు.

పది సంవత్సరాల క్రితం తండ్రి చనిపోయినప్పుడు తల్లిని తన దగ్గరకు రమ్మన్నాడు నైరోబీలో ఉంటున్న స్టీవెన్ తమ్ముడు. కాని ఆమె గ్రామం వదలి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళిన మనిషి కాదు. తను నైరోబీలో ఉండలేదు. తను పుట్టి పెరిగిన, తెలిసిన గ్రామంలోనే చివరిదాకా ఉండాలని ఆమె కోరిక. గ్రామంలోనే మంచి ఇల్లు కట్టిస్తానని అన్నాడు స్టీవెన్. మంచి ఇల్లంటే సిమెంట్‌తో కట్టే డాబా. దానికి ఆమె సమ్మతించలేదు. అలాంటి డబ్బాలు డబ్బాలుగా విభజించి కట్టిన ఇంట్లో తను ఉండలేనంది. తమ పాడుబడిన ఇల్లు పడగొట్టి, చుట్టుపక్కల ఎలాంటి ఇళ్ళు ఉన్నయ్యో అలాంటి ఇల్లే కట్టించమని అడిగింది. గుండ్రటి మట్టిగోడలతో, ఎండుగడ్డి కప్పుతో ఇల్లు కట్టించాడు స్టీవెన్. కాని ఆ ఇంట్లో తమకు తగిన సౌకర్యాలు లేకపోవటంవల్ల స్టీవెన్ ఆయేషాలు గాని, వారి బిడ్డలుగానీ, ఎప్పుడూ ఒక్క రాత్రి కూడా ఆ ఇంట్లో ఉండలేదు.

★ ★ ★

2011 మే 7 వ తేదీ. స్టీవెన్ సహోద్యోగులూ, ఆయేషా సహోద్యోగులూ, స్నేహితులూ కలిసి ఇద్దరికీ పెద్ద పార్టీ ఇచ్చారు అక్బర్ ఇండియన్ రెస్టారెంట్‌లో. ఆ సాయంత్రం చాలా సంతోషంగా గడిచింది. చాలామంది స్టీవెన్ గురించీ, ఆయేషా గురించీ మాట్లాడారు. ఇద్దరూ మృదుస్వభావులనీ, మితభాషులనీ, సెల్ఫ్ ఎఫేసింగ్ అనీ, పదవీవిరమణ ఇద్దరికీ ప్రశాంతంగా ఉండటానికీ, ప్రయాణాలు చెయ్యటానికీ వీలు కల్పిస్తుందని అకాంక్షించారు. ఇద్దరికీ ఇష్టమైన రెడ్ వైన్‌తో టోస్ట్ చేశారు.

★ ★ ★

ఉద్యోగం మానేసిన రెండు నెల్ల తర్వాత ఒక సాయంత్రం భోజనం చేస్తుండగా స్టీవెన్ ఎడమచెయ్యి అతని ప్రయత్నంలేకుండానే కదలటం గమనించింది ఆయేషా. స్పూన్ గానీ, గ్లాస్ గానీ ఏదైనా వస్తువు పట్టుకుంటే చెయ్యి వణకటం ఆగిపోతుంది. ఇంతకుముందు ఇలా ఎప్పుడైనా జరిగిందా అని అడిగితే రెండు మూడు నెలలుగా తను గమనించాననీ, అదే పోతుందిలే అని దాన్ని పెద్దగా పట్టించుకోలేదనీ అన్నాడు స్టీవెన్. హాస్పిటల్లో పార్కిన్సన్ కేసులు చాలా చూసిన ఆమె వెంటనే హెన్రీఫోర్డ్ హాస్పిటల్లో ఒక న్యూరాలజిస్ట్‌తో అపాయింట్ మెంట్ తీసుకుంది.

రెండూ వారాల్లో స్టీవెన్‌కి పార్కిన్సన్ వ్యాధి ఉందని నిర్ధారించాడు డాక్టర్. దానికి ప్రస్తుతం చికిత్స లేదనీ, వ్యాధిని అదుపులో పెట్టటానికి ప్రయత్నం చెయ్యొచ్చునీ చెప్పాడు.

ఆ తర్వాత గత సంవత్సరం-సంవత్సరమున్నరలో స్టీవెన్ పరిస్థితి చాలా వేగంగా క్షీణించింది. మాట్లాడేటప్పుడు కష్టం అవుతుంది. ఒక్కోసారి అతని మాటలు ఎదటి వారికి అర్థంకావు. మధ్య మధ్యలో మాటలు వినబడనంత మృదువుగా మాట్లాడు తాడు. తల కూడా కుడి ఎడమలవైపు ఎగరేసినట్లు కదులుతుంది. చేతులు రెండూ వొణుకుతాయి. కూర్చుని లేవటం కష్టం అవుతుంది.

బాత్‌రూంలో పడిపోతాడేమో అని అతను బయటకొచ్చిందాకా చూస్తూ కూర్చుం టుంది ఆయేషా. అతను కారు నడపటం మానేసి దాదాపు ఒక సంవత్సరం అవు తుంది. ఇప్పుడు ఎక్కడికెళ్ళినా ఆయేషానే కారు నడుపుతుంది. ఇంతకాలం ఇంట్లో పనులన్నిట్లోనూ చేదోడువాదోడుగా ఉన్న స్టీవెన్ ఇప్పుడు తన పనులు తానే చేసుకో లేని స్థితికి వచ్చాడు. కొంచెంసేపు బయటకెళ్ళి నడిచి వద్దామన్నా అతనికి పాంట్ వెయ్యటం, చొక్కా గుండీలు పెట్టడం కూడా ఆయేషానే చేస్తుంది.

★ ★ ★

ఆయేషా, కమల్, అమీనా తప్ప స్టీవెన్‌కి మరెవ్వరూ బంధువులు లేరు అమెరికా లో. స్నేహితులూ శ్రేయోభిలాషులూ చాలామంది ఉన్నారు. అతని ఆరోగ్యం చాలా వేగంగా క్షీణిస్తుంది. ఇంకా కొన్నాళ్ళలో ఆయేషా ఒక్కతే అతన్ని చూడలేకపోవచ్చు. మరొక మనిషి సహాయం లేనిది అతని కదలికల్ని కంట్రోల్ చెయ్యటం ఆమెకు సాధ్యంకాకపోవచ్చు. అప్పుడేం చెయ్యాలి?

కమల్ బోస్టన్‌లో ఫిడెలిటీలో పని చేస్తున్నాడు. అమీనా కనెక్టికట్‌లో ఫైజర్లో పనిచేస్తుంది. వాళ్ళలో ఒకరిని ఉద్యోగం మానేసి ఇంటికి రమ్మని పిలవటమా? అవసరం అయితే కొంతకాలం సెలవు పెట్టో, ఉద్యోగానికి రాజీనామా చేసో వస్తా నని ఇద్దరూ అన్నారు. కానీ మన అవసరాలకు పిల్లలను అలా చెయ్యమని అడ క్కూడదు అని స్టీవెన్, ఆయేషా చాలాకాలం క్రితమే, స్టీవెన్ ఆరోగ్యంగా ఉన్న రోజుల్లోనే, నిర్ణయించుకున్నారు. అనారోగ్యంగా ఉంటే ఒకరినొకరు చూసుకుంటా మని ఊహించుకున్నారు. ఒకరు పోయిన తర్వాత రెండోవారిని ఎవరు చూస్తారూ? దీనికి వారి దగ్గర సమాధానంలేదు. మరొకటి ఆర్థికసమస్య. ఉద్యోగాలు మానేశారు కాబట్టీ, పూర్వీకుల ఆస్తిపాస్తులకు దూరం అయ్యారు కాబట్టీ, ఉద్యోగాలు చేస్తు న్నప్పుడు వెనకేసుకున్న డబ్బే ఇద్దరికీ ఆధారం. ఆ సేవింగ్స్‌తో, ప్రతినెలా ప్రభుత్వం నుంచి ఇద్దరికీ వచ్చే సోషల్ సెక్యూరిటీ డబ్బుతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా బతగ్గలరు- ఆరోగ్యంగా ఉన్నంతకాలం. కానీ, స్టీవెన్‌కి ఏదైనా దీర్ఘకాల వైద్యవసతి గృహంలో ఉండటం అవసరం అయితే- దాని ఖర్చు వాళ్ళు భరించలేరు. మంచి గృహంలో సంవత్సరానికి ఎనభై-తొంభై వేలు కట్టాల్సొస్తుంది. అంటే తమ సేవింగ్స్ అంతా ఆరేడు సంవత్సరాల్లో తుడుచుకుపోతుందన్నమాట. ఎంతకాలం అలాంటి

చోట ఉండాల్సొస్తుందో ఎవ్వరూ చెప్పలేరు కదా? స్టీవెన్ ఇంకా ఇరవై సంవత్సరాలు బతకొచ్చు. అలా జరిగితే తమ సేవింగ్స్ పూర్తిగా అయిపోయిం తర్వాత ప్రభుత్వం అతన్ని ఏదో ఒక చవకబారు గృహంలో చేర్చుతుంది. కానీ, ఆ తర్వాత ఆయేషా బ్రతుకు దెరువు ఎలా? పిల్లల మీద ఆధారపడటమా? అలా చెయ్యకూడదని ఇద్దరూ చాలా కాలంక్రితమే నిర్ణయించుకున్నారు. మన తల్లిదండ్రులు మనకు ఎలాంటి ఆస్తిపాస్తులూ ఇవ్వలేదు. మనం అలా చెయ్యకూడదు, మనకు మిగిలిందేదో పిల్లలకు ఇచ్చి పోవాలి అనుకున్నారుగాని, పిల్లల మీద ఆధారపడటం మాత్రం జరక్కూడదని ఇద్దరి గట్టి అభిప్రాయం. మరి ఇప్పుడేం చెయ్యాలి?

వెంటనే ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరంలేదు కదా? స్టీవెన్ పరిస్థితి క్షీణిస్తే అప్పుడు చూసుకోవచ్చుగదా? అన్నారు కొందరు మిత్రులు. అలాంటి అవసరం రాకపోవచ్చు. వచ్చినా ఉన్న డబ్బంతా అయిపోయిందాకా స్టీవెన్ బతక్కపోవచ్చు. కానీ, ఈ జబ్బుతో అతను చాలాకాలం బతికితే అప్పుడేమవుతుందీ? ఆయేషాకి స్వతంత్రంగా బతకడానికి ఆర్థిక స్థోమత లేకుండా పోతుంది. అలా జరగటం ఇద్దరికీ ఇష్టంలేదు. తనవల్ల ఆయేషాకి అలాంటి పరిస్థితి రాకూడదని స్టీవెన్ అభిమతం. ఇప్పటికే తనను చేసుకోవటం వల్ల ఆమె చాలా కోల్పోయింది. బంధు వర్గానికీ తల్లిదండ్రులకూ దూరం అయింది. తల్లిదండ్రులు ధనవంతులు. వారి ఆస్తి పూర్తిగా వదులుకుంది. గత రెండు సంవత్సరాలుగా తనను కంటికి రెప్పలా కాపాడుతూ, ఒక్కోరోజు, జబ్బు అధికంగా ఉన్నరోజు, చిన్న పిల్లవాడిని సాకినట్లు సాకుతుంది. ఆమెకు తనవల్ల, ఈ జబ్బువల్ల, ఎలాంటి ఇబ్బందులూ రాకూడదు. మరి మార్గం ఏంటీ?

ఒక వీకెండ్ పిల్లలిద్దరినీ ఇంటికి రమ్మని అడిగారు స్టీవెన్, ఆయేషా. విషయం వివరంగా చెప్పారు. తర్జన భర్జనల తర్వాత రెండు మార్గాలు కనబడ్డాయి. పిల్లల మీద ఆధారపడటం, అంటే ఇద్దరూ వెళ్ళి ఎవరి దగ్గరో ఒకరి దగ్గర ఉండటం, లేక ఇద్దరూ వెళ్ళి కేన్యాలో ఉండటం.

పిల్లల దగ్గరకెళ్ళి ఉండటానికి ఇద్దరూ వ్యతిరేకించారు. పిల్లలిద్దరూ మంచి వాళ్ళు. నిజానికి పిల్లలు తమకు స్నేహితులుగా ఉంటారు. అన్ని విషయాల గురించీ నిర్మొహమాటంగా మాట్లాడతారు. ఎప్పుడైనా వీకెండ్‌కి ఇంటికి రాగలిగితే చాలా సంతోషిస్తారు. అమ్మానాన్నలతో ఇంత సంతోషంగా స్నేహంగా ఉండటం ఎలా కుదురుతుంది అని వాళ్ళ స్నేహితులు ఆశ్చర్యంగా అడిగిన సందర్భాలు ఉన్నాయి కూడా. కాని వెళ్ళి పిల్లల దగ్గర ఉండటం అంటే ఇద్దరికీ ఇష్టంలేదు. అమ్మా నాన్నా తమని వదిలేసి దూరంగా కేన్యా వెళ్ళి ఉండటం పిల్లలకు ఇష్టం లేదు. తమకు అమ్మానాన్నా తప్ప మరెవ్వరూ లేరు ఈ దేశంలో. వాళ్ళిక్కడ

లేకపోవటం, ఇంటికి వెళ్ళి అప్పుడప్పుడూ వాళ్ళను చూసి రావటం వీలుకాక పోవటం, పిల్లలిద్దరూ ఊహించలేని విషయం. మీ జీవితాలు ఎలా గడప దలిచినా అది మీ ఇష్టం. కానీ మీరు వెళ్ళిపోతే ఇక మాకెవరున్నారిక్కడ అన్నారిద్దరూ.

ఇక కేన్యా వెళ్ళే ఆలోచన. అమెరికాలో చదువుకోవాలనీ, అక్కడి విశ్వవిద్యాలయాల్లో మంచి అవకాశాలు ఉంటాయని వచ్చిన స్టీవెన్‌కి, సోషల్ వర్క్ గురించి కేన్యాలో ఉండగా పెద్దగా అవగాహన లేకపోయినా అమెరికాలో సోషల్ వర్క్ పద్ధతులూ, ఆచరణా ఎంతో అభివృద్ధి చెందాయని గట్టిగా నమ్మిన ఆయేషాకీ, ఇప్పుడు అమెరికాకీ తమకీ ఉన్న సంబంధం ఏంటో సరిగ్గా తెలియని పరిస్థితి. ఇంగ్లాండ్‌లోనో మరో ఐరోపా దేశంలోనో ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. ఆ దేశాల్లో జబ్బు చేసినంత మాత్రాన కుటుంబాలు దివాలా తీసే ప్రమాదంలేదు. నిజానికి స్టీవెన్‌కి ఇంగ్లాండ్‌లో ఈస్ట్ ఏంగ్లియా విశ్వవిద్యాలయంలో ఓ ఉద్యోగావకాశం వచ్చింది ఒకప్పుడు. కాని ఆ రోజుల్లో అమెరికా వదిలి ఇంగ్లాండ్ పోవాలనే అభిప్రాయంలేదు. కేన్యాను పరిపాలించిన ఇంగ్లాండ్ మీద స్టీవెన్‌కి ఎప్పుడూ సదభిప్రాయంలేదు. అమెరికాలో తమ జీవితాలు సార్థకం అయ్యాయనే ఇద్దరి నమ్మకాలు. కాని ప్రస్తుతం ఇక్కడ ఉండిపోతే వారు ఆర్థికంగా పతనం అయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడ నుంచి వెళ్ళిపోతే బిడ్డలిద్దరినీ ఇక్కడ వదిలేసి పోయిన వాళ్ళవుతారు. ఒకప్పుడు తమకు ఎవ్వరూ లేని రోజుల్లో ఇక్కడ ఒంటరిగా బ్రతగ్గలిగారు కదా? తమ బిడ్డలు కూడా అలాగే బ్రతగ్గలరు కదా? కాని ఎవ్వరూ లేక ఒంటరిగా ఉండటం వేరు, ఉండికూడా లేకుండా చేసి వెళ్ళటం వేరు. అందువల్ల ఇక్కడ నుండి వెళ్ళిపోవటం అసాధ్యం. ఇక్కడ ఉండిపోవటం కూడా అసాధ్యమే. మరేది మార్గం?

ప్రస్తుత పరిస్థితికి కారణం తన అనారోగ్యమే అయినా, తనకున్న అవకాశాలు ఆయేషాకి లేవని స్టీవెన్‌కి తెలుసు. తన బంధువర్గంలో చాలామంది, ముఖ్యంగా తోబుట్టువులు, నైరోబీ వచ్చి అక్కడ ఒక ఎపార్ట్‌మెంట్ కొనుక్కుని ఉండమని చాలాకాలంగా అడుగుతున్నారు. అందరికీ ఆయేషా అంటే ఇష్టమే. మరో జాతి, మరో మతం, మరో భాష మనిషైనా, స్టీవెన్‌వైపు వారికి సహాయంచెయ్యటంలో ఆమె ఎప్పుడూ వ్యతిరేకించక పోవటంవల్ల వాళ్ళందరూ ఆమెను గౌరవిస్తారు. వాళ్ళిద్దరికీ కేన్యా వెళ్ళి స్థిరపడితే ఎలాంటి లోటూ ఉండదు.

ఆర్థికంగా కూడా తమకున్న సేవింగ్స్ అలాగే ఉంచి సోషల్ సెక్యూరిటీ డబ్బుతో నైరోబీలో చాలా హాయిగా బ్రతకొచ్చు. వంటచేసిపెట్టటానికీ ఒక మనిషిని కుదుర్చుకోవచ్చు. కానీ ఒకేసారిగా పిల్లల కోసం అమెరికాలో, స్టీవెన్ కోసరం నైరోబీలో వుండటం ఎలా సాధ్యం?

ఈ విషయం గురించి ఆలోచించేకొద్దీ స్టీవెన్ ఒక అభిప్రాయానికొచ్చాడు. గత రెండు సంవత్సరాలుగా ఆయేషాలో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడు ఆమె ఇదివరకులాగా ఉత్సాహంగా ఉండటంలేదు. పాపం, ఉదయం నుంచి సాయంత్రం దాకా తనకు కాపలా కాయటమే తప్ప ఆమెకు మరొక ధ్యాసలేదు. ఇలా ఎంత కాలం ఉండగలదు? తనకు ఏదో ఒకరోజు ఓల్డ్ ఏజ్ హోమ్‌కు చేరటం తప్పదు. ఆరోజు కోసం ఎదురుచూస్తూ ఆయేషాను ఇంకా ఇబ్బంది పెట్టటం కంటే తను తొందరలోనే కేన్యా వెళ్ళటం మంచిది అనిపించిందతనికి.

తన జీవితం చాలా మలుపులు తిరిగింది. తను చాలా దూరం వచ్చాడు. చిన్న గ్రామంలో మతానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా నిలబడిన పిల్లవాడు, పై చదువుకు అమెరికా వెళ్ళి అక్కడే అమెరికా వాళ్ళకు ఆఫ్రికా చరిత్ర బోధించే ప్రొఫెసర్‌గా ఎదిగిన యువకుడు, తనకు ఇష్టమైన అమ్మాయిని పెళ్ళిచేసుకోవటం కోసం తనవారినందరినీ వ్యతిరేకించిన ప్రేమికుడు, మతాన్నీ, జాతినీ, భాషనీ, అన్నిటినీ దూరంగా ఉంచి మరో జాతి, మరో మత, మరో భాష స్త్రీతో అన్యోన్యంగా, గౌరవంగా బ్రతికిన మనిషి, చివరి దశలో తిరిగి తన మాతృభూమికే వెళ్ళిపోబోతున్నాడు. ఈసారి ప్రయాణం ఒంటరిగానే. ఇక ముందు జీవితం కూడా ఒంటరిగానే.

ఆయేషా అమెరికాలో ఉంటుంది. పిల్లల దగ్గర కాదు. తమ ఇంట్లోనే. ఇక నుంచీ పిల్లలిద్దరికీ తల్లీతండ్రీ ఆమే. వాళ్ళకు అండగా ఉంటుంది. తన జీవితం తను గడుపుతుంది. ఆమె ఆరోగ్యంగా ఉన్నన్నాళ్ళూ ఎలాంటి సమస్యా ఉండదు. ఆరోగ్యం క్షీణిస్తే? తనకు ఉన్న వెసులుబాటు కూడా ఆమెకు ఉండదు. కేన్యా వెళ్ళి తన బంధువులతో కాలం గడిపే అవకాశం ఆమెకు లేదు. వారందరూ ఆమెను వదిలేశారు. ఆమెకు ఇప్పుడు ఉన్నవారు ఇద్దరు బిడ్డలూ, దూరంగా ఉండబోతున్న భర్త. ఎప్పుడో ఒకసారి పలకరించే అక్కా. ఆయేషా భవిష్యత్తు గురించి ఆలోచిస్తుంటే పాపం అనిపించింది స్టీవెన్‌కి.

★ ★ ★

తన అభిప్రాయం ఆయేషాకు చెప్పాడు స్టీవెన్. వేరువేరుగా ఉండటం అనగానే ప్రతికూలంగా స్పందించినా, మరోమార్గం లేదని ఆమె కూడా గ్రహించింది. ఈ దేశంలో ఉంటే తొందరలోనే ఏదో ఒకరోజు స్టీవెన్‌ని దీర్ఘకాల వైద్య వసతిగృహంలో చేర్చటం తప్పదు. కాకపోతే ఇక్కడే అయితే రోజూ వెళ్ళి చూసిరావచ్చు. కేన్యా పంపిస్తే రోజూ చూడటం వీలుకాదు. కాని స్టీవెన్ ఇక్కడ కంటే అక్కడే ఇంకా సౌకర్యంగా ఉండగలుగుతాడేమో. ఇక్కడ హోమ్‌లో అయితే ముక్కూమొహం తెలియని వారిమధ్య ఉండాల్సొస్తుంది. నైరోబీలో అయితే బాల్యస్నేహితులో,

చరిత్ర ఔత్సాహికులో, బంధువులో ఎవరో ఒకరు అప్పు డప్పుడూ కనబడతారు. వచ్చిపోతుంటారు.

★ ★ ★

స్టీవెన్ ఇలా ఆలోచిస్తున్నాడు అని అక్క ఫరీదాతో ఫోన్‌లో చెప్పింది ఆయేషా. ఆమె ఆశ్చర్యపడింది. భర్తను చివరిదాకా చూసుకోవటం భార్య ధర్మం, నీకు ఆ మాత్రం తెలివితేటలు కూడా లేవా? ప్రేమించి చేసుకున్నావుకదా? ప్రేమ అంటే ఆరోగ్యంగా ఉన్నంతకాలం కలిసుండటమేనా? అతన్ని కేన్యా పంపించి నువ్వు ఇక్కడుంటే చుట్టుపక్కల వాళ్ళు నవ్వుకోరా? అని కోప్పడింది. తమ నిర్ణయం మీద ఇంకా దృఢమైన అభిప్రాయం లేకపోయినా అక్క అడిగిన ప్రశ్నతో అసం కల్పితంగా డిఫెన్సివ్‌గా ఆవేశపూరితంగా ప్రతిస్పందించింది ఆయేషా. “భార్యలకు బాగా లేక పోతే చివరిదాకా సేవలు చేసే బాధ్యత భర్తలకు ఉందా? అంతదాకా ఎందుకు, నీ సంగతి చెప్పు. నీకు జబ్బుచేసి మంచానపడితే నీ భర్త నీకు చివరిదాకా సేవలు చేస్తాడా?” అని అడిగింది

అకస్మాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకు కొంచెంసేపు స్థంభించిపోయింది ఫరీదా. తేరు కుని, “పన్లన్నీ వదిలేసి ఎదురుగా కూర్చుంటారా ఏంటి?” అని, “తను కాకపోతే ఎవరిచేతైనా చేయిస్తాడు,” అని, “లేకపోతే హోమ్‌లో చేర్పిస్తాడు,” అని గొణిగింది. ఆ తర్వాత ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు.

★ ★ ★

బయటివాళ్ళు ఎలా ఆలోచిస్తారో అని ఆయేషా ఎప్పుడూ విచారించలేదు. ముఖ్యంగా ఆలోచించాల్సింది స్టీవెన్‌కి చివరిదాకా సౌకర్యంగా ఉండే విధం ఎలాగా అని. గత నలభైయైదు సంవత్సరాలుగా తన మనుషులందరికీ దూరం అయినా, తనెప్పుడూ ఒంటరితనం అనుభవించలేదు ఆయేషా. స్టీవెన్ మంచి స్నేహితుడు. ప్రతి విషయంలోనూ తోడుగా నిలబడ్డాడు. గత రెండు సంవత్సరాలుగా అతని పరిస్థితి బాగాలేదు. ఆరోగ్యం ఎంత తొందరగా క్షీణిస్తుందో ఎవ్వరూ చెప్పలేరు. ఈమధ్య కొంచెం మానసికవైకల్యం కూడా కనిపిస్తుంది. పరిస్థితి ఇంకా క్షీణించేదాకా ఉంటే అతన్ని ఇక్కడే ఒక నర్సింగ్‌హోమ్‌లో చేర్చాల్సి వస్తుంది. అప్పటిదాకా వుండ కుండా, ఆరోగ్యం పూర్తిగా క్షీణించక ముందే అతన్ని కేన్యా చేర్చటం, బంధువర్గంలో అతనికి ఒక చోటు ఏర్పాటుచెయ్యటం ముఖ్యం.

స్టీవెన్, ఆయేషా పోయిన డిసెంబర్‌లో నైరోబీ వెళ్ళొచ్చారు. స్టీవెన్ తమ్ముడి ఇంటికి దగ్గరలోనే ఒక అపార్ట్‌మెంట్ కొన్నారు. కావలసిన ఫర్నిచర్ కొన్నారు. స్టీవెన్ తోబుట్టువులు సంతోషించారు. స్టీవెన్‌కి ఎలాంటి ఇబ్బందీ ఉండదని, అవసరం

అయినప్పుడు అతన్ని చూడటానికి మనుషుల్ని ఏర్పాటుచేస్తామనీ ఆయేషాకి మాటిచ్చారు. దాదాపు మూడునెలలు అక్కడ ఉండి, పరిసరాలకు అలవాటుపడిన తర్వాత తిరిగివచ్చారు.

★ ★ ★

స్టీవెన్ కేన్యా వెళ్ళే రోజు అది. రెండు రోజుల క్రితం స్నేహితులకందరికీ వీడ్కోలు చెప్పాడు స్టీవెన్. ఒక్కొక్కరే వచ్చి చూసి వెళ్ళిపోయారు. పిల్లలు వచ్చారు నిన్న. తండ్రి తిరిగి అమెరికా రాడనీ, వాళ్ళే అప్పుడప్పుడూ కేన్యా వెళ్ళి అతన్ని చూసి వస్తుంటారనీ వారికి తెలుసు. వాళ్ళు రావాల్సిందేగాని తను ఇక అమెరికా వచ్చి వారిని చూసే అవకాశం ఉండదని స్టీవెన్‌కి తెలుసు. వాళ్లది ప్రేమమయ, స్నేహమయ కుటుంబం. ఆరోజు ఎవ్వరికీ కన్నీరు ఆగలేదు. సాయంత్రానికి పిల్లలిద్దరు తండ్రికి ధైర్యం చెప్పి వెళ్ళిపోయారు. మరుసటిరోజు స్టీవెన్ కేన్యా వెళ్ళేరోజు. స్టీవెన్, ఆయేషా ఇద్దరే ఉన్నారు ఇంట్లో. ఇద్దరూ పెద్దగా మాట్లాడలేదు. తను తన వాళ్ళ దగ్గిరకెళ్తూ ఇంతకాలం తనకు తోడుగా నీడగా ఉన్న నేస్తాన్ని వదలి వెళ్తున్నానని అతని బాధ. ఇంతకాలం తోడుగా ఉండి, అన్ని విషయాల్లో ఒకటిగా ఉన్న వాళ్ళు విడిపోబోతున్నారనీ, అతను ఎలాంటి ఇబ్బందులు పడతాడోనని భయపడుతుంది ఆమె. మాటల్లేకుండా మౌనంగానే ఒకరి గురించి ఒకరు, ఒకరికొకరు.

★ ★ ★

ఇంకొంచెంసేపట్లో విమానం ఎక్కుతాడు స్టీవెన్. అతని ఎడంచేతిని తన చేతిలోకి తీసుకుని ఒత్తింది ఆయేషా. ఈరోజు వస్తుందని వాళ్ళెప్పుడూ ఊహించలేదు.

దూరంగా ఉన్నా మనసుల్లో దగ్గరగానే ఉంటారు. ప్రతిరోజూ ఫోన్లో మాట్లాడుకుంటారు. అప్పుడప్పుడూ ఆయేషా కేన్యా వెళ్ళి వస్తుంది. అయినా ఇద్దరి జీవితాలూ ఈరోజు కొత్త మలుపు తిరుగుతున్నాయని ఇద్దరికీ తెలుసు.

వాళ్ళు అపురూపమైన స్నేహితులు. స్నేహితుల్లాగానే ఒకరినొకరు దగ్గిరకు తీసుకున్నారు. మెల్లగా నడుస్తూ గేట్ వైపు వెళ్ళిపోయాడు స్టీవెన్ .

ఆదివారం ఆంధ్రజ్యోతి
8 జూన్ 2014

మీరు కథ చెప్పే విధానం, ముఖ్యంగా కథలో ప్రత్యక్ష్యంగా జోక్యం చేసుకోక పోవటం నాకు నచ్చింది. అంతేకాకుండా కథను ఓపెన్ ఎండెడ్‌గా వదిలేస్తారు. అలాంటి ముగింపు పాఠకులను ఆలోచించేట్టు చేస్తుంది.

–శాంతసుందరి

మీ కథ రోటీన్‌గా ప్రేమా స్నేహం మీద వస్తున్న కథల కంటే భిన్నంగా ఉంది.

–ఆనంద్ ముసునూరు

నాతో ఉండటం కష్టంగా ఉంటే నువ్వు వెళ్ళిపోవచ్చు అని చెప్పగలిగిందంటే అది సుచిత్రకి ఉన్న ధైర్యం, ఆత్మగౌరవం వల్లే సాధ్యం. అతను కూడా ఆమె మీద ఉన్న గౌరవంతో ఆమెతో అన్నివిధాలా సహకరిస్తాడు. పరస్పర గౌరవం, నమ్మకం ఉన్నచోట నామమాత్రంగా పెళ్ళి చేసుకున్నా చేసుకోకపోయినా ఒకటే.

–రజని చెన్నుపాటి

కథ చాలా బాగుంది. సటిల్గా, ప్రశాంతంగా, ఒక నిర్మలమైన సరస్సు ముందు కూర్చున్నట్లు ఉంది.

–నారాయణస్వామి వెంకటయోగి

ఎన్నారైలకే కాదు, ఇండియాలో కూడా పిల్లల నిర్ణయాలను గౌరవించి వాళ్ళ జీవితాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం అంత సులభం కాదు.

–భార్గవీరావు

Parivartana... It is one of the best stories I have read in a long time... also it is my favorite of all your stories. I liked the fact that you did not concentrate on the crime itself... but addressed the issues that arise after the sentence. I think that is what made the story so strong.

-Vijaya Kanumilli

$6.95
ISBN 978-0-9766514-6-8
50695>
9 780976 651468

kenya to kenya

ari sitaramayya

